Estd. 1938
ఆంధ్రప్రభ
71 INDEPENDENCE DAY
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 125 • మంగళవారం 15 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ అష్టమి, మ. 3.50 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: కృత్తిక రా. 1.46 వరకు, అనంతరం రోహిణి; అమృతకాలం: రా. 11.35 నుండి 1.05 వరకు; వర్జ్యం: మ. 2.30 నుండి 4.00 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు, రా. 11.00 నుండి 11.45 వరకు ; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు



వివరాలు స్పోర్ట్స్‌లో...

వహ్వా... భారత్!

విదేశీ గడ్డపై టీమిండియా ఫస్ట్ వైట్‌వాష్

టెస్టు సిరీస్‌లో లంకేయుల్ని ఊడ్చేసిన భారత క్రికెట్ జట్టు

85 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలో విరాట్ సేన సరికొత్త రికార్డు

కోహ్లి నేతృత్వంలోని టీమిండియాకిది వరుసగా 8వ విజయం



71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రభ పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు

- ముత్తా గౌతమ్, మేనేజింగ్ డైరెక్టర్

కేసీఆర్ కొత్త గేమ్ ప్లాన్

ప్రజాక్షేత్రం లోనే విపక్షాలకు చెక్



ప్రతిపక్ష నేతల నియోజకవర్గాలపై గులాబీ జెండా

సీనియర్ నాయకులను ఓడించేందుకు వ్యూహాలు

సొంత ప్రాంతాలను వీడకుండా దిగ్బంధం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీఆర్ఎస్ అధినేత, గులాబీదళపతి కేసీఆర్ సరికొత్త గేమ్ ప్లాన్‌కు తెరతీశారు. రాష్ట్రంలోని ప్రధాన పక్షాలు.. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా గెలుపు వ్యూహాలు రచిస్తుండగా, ఎన్నికల వ్యూహాల్లో ఆరితేరిన సీఎం విపక్షనేతలకు చెక్ పెట్టేందుకు మరో ప్లాన్ రెడీ చేశారు. సీనియర్ నేతలను వారి సొంత 5వ పేజీలో...

ప్రజా నేతలు... విభిన్న వ్యాఖ్యలు

రాజకీయ నాయకులు ప్రజా సేవకులమని చెప్పుకుంటుంటారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని తమకు తాము అభివర్ణించుకుంటుంటారు. అదే నిజమైతే.. ప్రజలకు ఇక్కట్లు వచ్చినప్పుడు ఎలా స్పందించాలి? ప్రజల సమస్యే తమ సమస్యగా భావించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. అందుకు స్వతహాగా కారుణ్య స్వభావం వారిలో ఉండాలి. కాఠిన్య భావన మచ్చుకైనా కానరాకూడదు. కాని ఆచరణలో అలా జరుగుతున్నదా? ఓ ఇద్దరు రాజకీయ నాయకుల స్పందనలు ఈ ప్రశ్నలకు అంకురార్పణగా నిలిచాయి. ఇందులోనే సమాధానాలూ ఉన్నాయి!

నితీశ్ కారుణ్యం!



వరద పరిస్థితిని సమీక్షించా. అధికారులను తక్షణమే రంగంలోకి దింపా. సహాయక, పునరావాస చర్యలకు శ్రీకారం చుట్టాం. వడివడిగా నడుస్తున్నాయ్. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్లు అడిగాం. వాటితో ఆహార పొట్లాలు సరఫరా చేస్తాం. ప్రకృతి వైపరీత్యాల సంస్థ చీఫ్ సెక్రటరీని, రోడ్ల నిర్మాణ శాఖ, పబ్లిక్ వర్క్స్, తదితర శాఖల అధికారుల్ని, డీఎంలను వరద ప్రాంతాలకు పంపిస్తున్నాం. వారంతా అక్కడికక్కడ కావాల్సిన చర్యలు తీసుకుంటారు. సహాయక, ఆహార శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. సీతామఢి, మధుబని, చంపారణ్ ప్రాంతాలకు కేంద్ర, రాష్ట్ర సహాయక ప్రత్యేక బృందాలు తరలి వెళ్లాయి. ప్రధాని మోడీ ఫోన్ చేశారు. బీహార్‌కు అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

- బీహార్‌లో వరద పరిస్థితిపై సీఎం స్పందన

అమిత్ షా కాఠిన్యం!



భారతదేశంలాంటి పెద్ద దేశంలో గోరఖ్‌పూర్ సంఘటనల్లాంటివి సర్వసాధారణం. ఇదే మొదటిది కాదు. గతంలోనూ జరిగాయి. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ కోరడంలో వింతేమీ లేదు. కాంగ్రెస్ హయాంలోనూ ఇలాంటివి చాలా జరిగాయి. ఏదేమైనా అదొక విషాదం. ఒక పొరపాటు. విచారణ జరిపిస్తున్నాం. నిర్దిష్ట గడువులోగా నివేదిక ఇవ్వాలని అడిగాం. ఎక్కడ తప్పు జరిగిందో తెలుస్తుంది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా జరపాలంటూ సీఎం యోగి ఆదిత్యానాథ్ పోలీసు శాఖకు ఆదేశాలివ్వడం గురించి చెప్పేదేముంటుంది? అది ఎవరి ఇష్టం వారిది. ప్రజల వ్యక్తిగత విశ్వాసాలకు సంబంధించినది. అదేమీ ప్రభుత్వ వేడుక కాదు.

- గోరఖ్‌పూర్ ఘటనపై బీజేపీ అధ్యక్షుడి ప్రతిస్పందన

15-08-1947 నాటి " ఆంధ్రప్రభ దిన పత్రిక " మద్రాస్ నుండి వెలువడినది . వెల : అణా (6 పైసలు)



70 ఏళ్ల మార్పులకు

దర్పణం ఆంధ్రప్రభ

1938 ఆగస్టు 15న ఆవిర్భావం

నాటికీ, నేటికీ విశ్వసనీయతే ఆభరణం

నిరంతర అక్షర యజ్ఞానికి మరో సంకల్పం

(ముత్తా గోపాలకృష్ణ, చైర్మన్, చీఫ్ ఎడిటర్)

ప్రపంచంలోనే అత్యున్నత సంస్కృతికి, నాగరికతలకు పుట్టినిల్లయిన మహోన్నత భారతదేశం దీర్ఘకాలిక పరదాస్య శృంఖలాల నుంచి స్వాతంత్ర్యం సముపార్జించుకుని స్వేచ్ఛావాయువుల్ని పీల్చడం మొదలెట్టిన రోజు ఇది. కాకతాళీయమే అయినా స్వతంత్ర్య సంగ్రామ సమాచారాన్ని తెలుగు ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ వారిని కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు వీలుగా సంగ్రామ నేతల పిలుపులు, ఉపదేశాలు, ఆదేశాల్ని తెలుగు ప్రజలకు అందించే సమోన్నత లక్ష్యంతో ఆవిర్భవించిన ఆంధ్రప్రభ కూడా ఈ రోజే తన పుట్టినరోజు జరుపుకుంటోంది. ఆంధ్రప్రభకు, భారత స్వతంత్ర సంగ్రామ చరిత్రకు మధ్య అవినాభావ సంబంధముంది. స్వతంత్రోద్యమంలో పాల్గొన్న ముఖ్యమైన నేతలంతా ప్రజల్లో సంగ్రామ కాంక్షను రగుల్కొలిపేందుకు పత్రికల్ని వినియోగించుకున్నారు. కొందరైతే నేరుగా పత్రికల్నే నిర్వహించారు. మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూ, బి.ఆర్. అంబేద్కర్, అనిబిసెంట్, ఎమ్ఎమ్ మాళవియ వంటి మహామహులెందరో స్వతంత్రోద్యమంలో భాగంగా ప్రజల్ని చైతన్యపర్చే రీతిలో పత్రికలు నడిపారు. ఈ కోవలోనే ప్రాంతీయ భాషల్లో స్వతంత్ర పోరాట సమాచారాన్ని అందించే లక్ష్యంతో ఏర్పడ్డదే ఆంధ్రప్రభ. ఈ రంగంలో లబ్ధప్రతిష్టులైన కాసా సుబ్బారావు, న్యాయపతి నారాయణ మూర్తి, నార్ల వెంకటేశ్వరరావు వంటి మహామహులు ఆంధ్రప్రభ తొలిరోజుల్లో దీని సంపాదకులుగా వ్యవహరించారు. అచ్చమైన తెలుగు భాషలో స్వచ్ఛమైన వార్తాంశాల్ని ప్రజలకు చేరవేశారు. దక్షిణాదిన విస్తరించిన తెలుగు వారందరినీ ఉద్యమంలో ఏకతాటిపైకి తేవడంలో ఆనాడు ఆంధ్రప్రభ కీలకపాత్ర పోషించింది. తెలుగు జర్నలిజంలో విప్లవాత్మక ఒరవడికి శ్రీకారం చుట్టింది. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో ప్రధాన పాత్ర నిర్వహించింది. బ్రిటీష్ ప్రభుత్వం మీడియాపై విధించిన సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసింది.

1938 ఆగస్టు 15న ఆవిర్భవించిన ఆంధ్రప్రభ ఉద్యమస్ఫూర్తిని రగల్చడంలో విజయవంతమైంది. అప్పట్లో చెన్నై నుంచి ఆంధ్రప్రభ వెలువడేది. అక్కడి నుంచి రైళ్ళలోనే సుదూర ప్రాంతాలకు వెళ్ళేది సాయంత్రం నాలుగ్గంటలకు కొచ్చినా, ఆరుగంటలకొచ్చినా సరే ఆ రైలు కోసం స్టేషన్‌లో గంటల కొద్దీ వేచిచూసి ఆంధ్రప్రభను చేతికి అందుకోవడం అప్పట్లో ఒక సంప్రదాయంగా ఉండేది. ఆంధ్రప్రభలో వెలువడ్డ వార్తకు ఒక విశ్వసనీయత. తమ నేతల పిలుపులు, మార్గదర్శకాలకు ఆంధ్రప్రభనే నమ్మేవారు. అందుకనుగుణంగానే ఉద్యమ కార్యాచరణ రూపుదిద్దేవారు.

అప్పటికీ ఇప్పటికీ ఆంధ్రప్రభ దేశం పట్ల, సమాజం పట్ల వ్యవస్థపట్ల తన బాధ్యతను అంతే నిబద్ధతతో నిజాయితీగా నిర్వర్తిస్తోంది. స్వతంత్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు పూర్తవుతున్న తరుణంలో అప్పటికీ ఇప్పటికీ సమాజంలో వచ్చిన మార్పులకు ఆంధ్రప్రభ దర్పణం పడుతోంది. ఆనాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థల్ని విశ్లేషించిన ఆంధ్రప్రభ ఇప్పుడూ అదే విద్యుక్త ధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తిస్తోంది. సమస్యల్ని పాలకుల దృష్టికి తేవడంలో కృతకృత్యమౌతోంది.

ఏడు దశాబ్దాల స్వేచ్ఛాభారత పరిస్థితిని పరికిస్తే ఎన్నో మార్పులు, మరెన్నో వ్యత్యాసాలు 1947నాటికి దేశంలో దుర్భర దారిద్ర్యం తాండవిస్తోంది. కడుపు నిండా తిండి, ఒంటినిండా బట్టాకట్టుకునే పరిస్థితిలేదు. జవహర్‌లాల్ నెహ్రూ 1946లో రాసిన ''ది డిస్కవరీ ఆఫ్ ఇండియా''లో కూడా ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. దేశంలో తిండికి, బట్టకు తీవ్ర కొరత ఉంది. 10 శాతం మంది కూడా కనీస సదుపాయాలకు నోచుకోవడం లేదు. స్వతంత్రం రాగానే పేదరిక నిర్మూలనకు పటిష్ట ప్రణాళికలు అమలు చేయాల్సింది. అప్పట్లో పుల్లలు, పిడకలు ఏరుకొచ్చి వంటకు వినియోగించేవారు. మట్టిపాత్రల్లోనే వంటలొండారు. ఉపాధి అవకాశాలు ఉండేవికాదు. సాగు జరిగేదికాదు. పరిశ్రమల్లేవు. ఆర్థికవ్యవస్థ లేదు. కానీ ఈ ఏడు దశాబ్దాల్లో దేశం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందింది. ప్రజల జీవన ప్రమాణాలు 3వ పేజీలో...

కొండచరియలు విరిగిపడి

312 మంది సజీవ సమాధి

మృతుల్లో 60మంది చిన్నారులు

సియర్రా లియోన్ రాజధాని ఫ్రీటౌన్‌లో ఘటన 3

ఔరా..!





వాణిజ్య యుద్ధం తప్పదేమో?

భారత్ నష్టపోతుందని చైనా మీడియా కథనాలు

అమెరికానూ వదలని గ్లోబల్ టైమ్స్



బీజింగ్: ఇటీవల భారత్‌కు యుద్ధ బూచిని చూపిస్తున్న చైనా, స్వరం మార్చింది. కాకపోతే ఇప్పుడు కూడా యుద్ధం బూచినే చూపిస్తోంది కానీ, వాణిజ్య యుద్ధమని చెబుతోంది. చైనా తెంపరితనం పెరిగిన తరువాత ఇటీవల భారత్ ఆ దేశానికి సంబంధించిన 93 ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ చార్జీలు విధించింది. దీంతో ఆయా వస్తువులు భారత్‌లో తక్కువ ధరకు అమ్ముడవడానికి అవకాశం లేకుండో పోయింది. దీంతో భారత్‌తో ఘర్షణ కాక వేడి తగిలిన చైనా, మరో తరహా బెదిరింపులు మొదలుపెట్టింది. తమ కంపెనీల పెట్టుబడులు భారత్‌కు రావని చైనాలో అధికార కమ్యూనిస్టు పార్టీ గ్రూపునకు చెందిన గ్లోబల్ టైమ్స్ ప్రచురించింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టే కంపెనీలు ముందు వెనుక ఆలోచించి పెట్టాలని అర్థం లేని హెచ్చరికలు జారీ చేసింది. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై తాము కూడా సుంకాలు విధించగలమని పత్రిక మరో వార్త ప్రచురించింది. భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 12 శాతం తగ్గి 11.75 బిలియన్ డాలర్లకు చేరాయని, కానీ భారత్‌కు చైనా ఎగుమతులు మాత్రం రెండు శాతం పెరిగి 59 బిలియన్ డాలర్లకు చేరాయని వివరించింది. ఇప్పటికే భారత్‌కు చైనాతో వాణిజ్య లోటు 47 బిలియన్ డాలర్లు ఉందని, అది మరింత పెరిగే అవకాశం ఉందని పరోక్షంగా బెదిరించింది. భారత వాణిజ్య శాఖ వివరాల ప్రకారం భారత్-చైనా వాణిజ్యం 70 బిలియన్ డాలర్లుండగా, లోటు 52 బిలియన్ డాలర్లు ఉంది. అయితే.. భారత్ విధించిన సుంకాల వల్ల ఇరు దేశాలూ వాణిజ్యంలో కయ్యానికి కాలు దువ్వుకోవాల్సి వస్తుందని చైనా పత్రిక ముందస్తు హెచ్చరికలు చేసింది. భారత్ చర్యల వల్ల చైనాకు నష్టమే అయినా, భారత్‌కు కూడా నష్టాలు తప్పవని బెదిరించింది. డోక్లాంలో ఇరు దేశాల సైనికుల మధ్య ప్రతిష్టంభన నెలకొన్న సందర్భంలో ఈ బెదిరింపులు రావడం గమనార్హం. దీంతో యుద్ధం నుంచి వాణిజ్యానికి, అక్కడి నుంచి చర్చలకు చైనా 5వ పేజీలో...

నవభారత్ నిర్మిద్దాం



అవినీతిరహిత సమాజాన్ని రూపుదిద్దుదాం

ఆధునికత, అనురాగం మేళవించిన ఇండియా

2022 నాటికి అది సుసంపన్నం కావాలి

అందరూ చదువుకోవాలి.. జాతిని నిర్మించాలి

71వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రపతి 11



ఎర్రకోటలో మోడీ ఏం చెప్తారు!

ప్రధానికి ఇది నాలుగో ప్రసంగం • తొలి ప్రసంగంలో ప్రధాన సేవక్‌ని అన్నారు • రెండో ఏడాది స్టార్టప్ ఇండియా అన్నారు • మూడో ప్రసంగంలో పాక్‌పై నిప్పులు చెరిగారు • తాజాగా నేటి ప్రసంగంపై సర్వత్రా ఉత్కంఠ • సంక్షేమ పథకాన్ని ప్రకటించే అవకాశం

11 లో





70ఏళ్ల స్వేచ్ఛా భారతం






➥ 1948లో మహాత్మా గాంధీ హత్య నూతన స్వతంత్ర భారత్‌ను షాక్‌కు గురిచేసింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను రద్దు చేస్తూ సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్ణయం. గాంధీ హత్యను నాటి హోంమంత్రి, ప్రముఖ గాంధేయవాది సర్దార్ పటేల్ కల్ట్ ఆఫ్ వయొలెన్స్‌గా ప్రకటించారు.

➥ 1949లో భారతీయ సెంట్రల్ బ్యాంకు ఇన్‌స్టిట్యూషన్ అయిన రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా జాతీయకరణ జరిగింది. 1950లో భారత్ గణతంత్ర దేశంగా ఆవిష్కృతమైంది. రాజ్యాంగం అమలులోకి వచ్చింది.

➥ 15 మార్చి1950న ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. తొలి






పంచవర్ష ప్రణాళిక వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అభివృద్ధి ఆలోచనలు కార్యాచరణలోకి వచ్చాయి.

➥ 1951-59లో తొలి భారతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఐఐటీ) ను ఖరగ్‌పూర్, చెన్నై, పొవాయ్, కాన్పూర్ నగరాల్లో ఏర్పాటు చేశారు. సాంకేతిక విద్య అనేది ఆర్భాటానికే పరిమితం కాదని ప్రభుత్వం చాటింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన, పేద దేశమైన భారత్‌కు ఇలాంటి విద్యాసంస్థలు అవశ్యమని మేధావులు పేర్కొన్నారు.

➥ నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా ప్రస్తుతించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేశారు. భాక్రానంగల్ ప్రాజెక్టుపై హైడ్రో పవర్





ప్రాజెక్టును 1963లో పూర్తిచేశారు. అలాగే హీరాకుడ్ డ్యామ్ (1973) తోసహా పలు ఆనకట్టలు నిర్మితం అయ్యాయి.

➥ తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా కేరళలో 1957లో ఎన్నికైంది. అయితే రెండేళ్ల తర్వాత కేంద్రం అక్కడి ప్రభుత్వాన్ని రద్దుచేసింది. అయినా అది చారిత్రక పరిణామంగా నిలిచింది.



➥ 1960లో మొఘల్ ఈ అజం సినిమా విడుదలైంది. 1944 నాటి అసిఫ్స్ ఆలోచనకు 14ఏళ్ల తర్వాత దృశ్యరూపం సాధ్యమైంది. సినిమాకు ఎట్టకేలకు ఫైనాన్సియర్స్ దొరికారు.


➥ 1962లో చైనాతో యుద్ధం. అక్సాయ్-చీనీ యుద్ధం భారత్‌కు చేదు అనుభవాన్ని మిగిల్చింది. అదే సమయంలో నెహ్రూ ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. వామపక్షేతర ప్రతిపక్ష పార్టీ దేశంలో బలం పుంజుకుంది. వేలాది మంది కమ్యూనిస్టులు, మద్దతు దారులు అరెస్టయ్యారు. 1963లో విక్రమ్‌సారాభాయ్ అంతరిక్షకేంద్రాన్ని నెలకొల్పారు.

➥ 1964లో నెహ్రూ మరణం తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం. దీంతో దేశం మరింత విపత్కర పరిస్థితులను ఎదుర్కొంది. లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఒకవైపు ఆహార కొరత, మరొకవైపు పొరుగుదేశాలతో యుద్ధాలు దేశాన్ని అతలాకుతలం చేశాయి. అదే సమయంలో జైకిసాన్, జై జవాన్ నినాదం దేశవ్యాప్తంగా మారుమ్రోగింది.

➥ 1966లో ఇందిరా గాంధీ ప్రధాని అయ్యారు. దేశ కరెన్సీ విలువను మూడింట ఒక వంతుకు తగ్గించారు. దీంతో చెల్లింపులు గగనం అయ్యాయి. ఆహారకొరత తీవ్రమైంది. కరవు విళయతాండవం చేసింది. అంతర్జాతీయ మార్కెట్ నుంచి ఆహార పదార్థాలు కొనగోలు చేయాల్సి వచ్చింది.

➥ 1966లో డాక్టర్ రీటా ఫారియా మొట్టమొదటి ఆసియా ఉమన్‌గా ప్రపంచ పోటీల్లో విజేతగా నిలిచింది. దీని తర్వాత సుమారు మూడు దశాబ్దాల అనంతరం సుస్మితాసేన్ 1994లో మళ్లీ ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకుంది. హరిత విప్లవం ప్రారంభమైంది. అధిక దిగుబడి వంగడాలతో పంటసాగు జరిగింది. క్రమంగా భారత్ ఆహార సమృద్ధి దశకుచేరింది.

➥ 1968లో భారత క్రికెట్ జట్టు తొలిసారి న్యూజీలాండ్‌పై టెస్టు సిరీస్ గెలిచింది. 1969లో ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయకరణ చేసింది. భారత ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో ఇదొక కీలక అధ్యాయంగా మారింది. దీంతో ఆమె పేదల పెన్నిధిగా నిలిచింది. 1971 ఎన్నికల్లో







తిరుగులేని విజయం సాధించింది.

➥ 1977 నాటికి జ్యోతి బసు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన కమ్యూనిస్టు ప్రభుత్వ అధినేతగా రికార్డు సృష్టించారు.

➥ డాక్టర్ వి కురియన్ కో-ఆపరేటివ్ మిల్క్ రివల్యూషన్‌ను ప్రారంభించాడు. 1970లో గుజరాత్‌లో వైట్ రివల్యూషన్ మొదలైంది. పాడి పరిశ్రమతో ఆర్థిక అభివృద్ధిలో మహిళలు తమ వంతు సహకారం అందించారు.

➥ 1976లో శ్యామ్‌బెనగల్ నిర్మించిన మంథన్ సినిమా చారిత్రక దృశ్యకావ్యంగా నిలిచింది. 1988లో కురియన్ ప్రారంభించిన ఆపరేషన్ ఫ్లడ్ ప్రాజెక్టులో ప్రపంచ బ్యాంకు 200 కోట్లు పెట్టుబడి పెట్టింది. డైరీ ప్రోగ్రామ్ ద్వారా భారత గ్రామీణ ఆర్థికవ్యవస్థ పదేళ్లలో 24వేల కోట్లకు చేరుతుందని ప్రపంచ బ్యాంకు గణించింది.



➥ 1970లో ఎలక్ట్రానిక్స్ విభాగం పెద్దఎత్తున ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్లను ప్రవేశపెట్టింది. 1971-78 మధ్య కాలంలో ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) దేశీయ కంప్యూటర్ల ఉత్పత్తిని ప్రారంభించింది. తొలుత టీడీసీ 312, టీడీసీ 316 మోడళ్లను విడుదల చేసింది.

➥ పౌరయుద్ధం తర్వాత తూర్పు పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ స్వంతంత్ర దేశంగా ఆవిర్భవించింది. ఈ యుద్ధంలో భారత్ బంగ్లాదేశ్‌కు మద్దతుగా నిలిచింది. 1971లో యుద్ధం ముగిసింది.

➥ 1973లో ప్రాజెక్టు టైగర్ ఆవిష్కారం. పులుల సంరక్షణ దీని ప్రధాన లక్ష్యం. ఇదే ఏడాది కేశవానంద భారతి కేసు సుప్రీంలో విచారణకు వచ్చింది.

➥ 1974లో పోఖ్రాన్ అణు పరీక్ష నిర్వహణ. అణు సరఫరా దారుల బృంద దేశాలు భారత్‌పై ఆంక్షలు విధించి ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేశాయి.

➥ 1975లో భారత తొలి ఉపగ్రహం ఆర్యభట్టను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. దీనిని ఇస్రో నిర్మించింది. 1976-77 ప్రాంతంలో రిజర్వుబ్యాంకు ఆర్యభట్ట ఫొటోను రెండు రూపాయల నోటు వెనుకవైపు ముద్రించింది.

➥ మల్టీస్టారర్ సినిమా రమేష్ సిప్పీ నటించిన షోలే సినిమా విడుదలైంది. దశాబ్దాల పాటు ఇదొక్కడే మల్టీస్టారర్‌గా నిలిచింది. ఆ తర్వాత అమితాబ్, ధర్మేంద్ర, జయభాదురి, హేమ మాలిని ఒక్కొక్కరుగా పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు. అంజద్ ఖాన్ నిర్మించిన ఈ సినిమాలో గబ్బర్ సింగ్ విలన్‌గా అలరించాడు.


➥ 1976లో రాజ్యాంగానికి సెక్యులర్, సోషలిస్టు అనే పదాలను చేర్చారు. 1977లో తొలిసారి కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడింది. జనతాపార్టీ నీడలో అనేక పార్టీలు ఒక్కటయ్యాయి. కాంగ్రెస్‌వ్యతిరేక ప్రభుత్వ ఏర్పాటులో జయప్రకాశ్ నారాయన్ జాతీయనేతగా గుర్తింపు పొందారు. మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు.

➥ 1977లో జ్యోతిబసు తిరిగి బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. తద్వారా ప్రపంచంలోనే సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని నడిపించిన ఘనకీర్తిని గడించారు. అదే యేడాది ఏప్రిల్ 23న భారత్ ఫ్రీ స్మాల్‌ఫాక్స్ రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.

➥ భారత్ హాకీ జట్టు 1980 ఒలింపిక్స్‌లో చివరి స్వర్ణపతకాన్ని నెగ్గింది. 1983లో తక్కువ విద్యుత్ ట్రాన్స్‌మీటర్ కాన్సెప్ట్ తెరపైకి వచ్చింది. దీంతో గ్రామీణ భారతానికి టీవీ ప్రసారాలు చేరువయ్యాయి. రంగుల టీవీ ప్రసారాల కల సాకారమైంది.

➥ 1983లో భారత క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ గెలిచి సంచలనం సృష్టించింది. మరుసటి యేడాది ఏప్రిల్ 2న రాకేశ్ శర్మ భారత్ తరపున అంతరిక్షంలోకి వెళ్లాడు. అంతరిక్షం నుంచి భారత్ గురించి ఏం ఆలోచించావని నాటి ప్రధాని ఇందిరా గాంధీ రాకేశ్‌ను ప్రశ్నించింది. అందుకు అతను సారే జహాసే అచ్చా అని సమాధానం ఇచ్చాడు.

➥ 1984 జూన్‌లో ఖలిస్తాన్ ఉద్యమ నేత జర్నయిల్ సింగ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని సైన్యం అణచివేసింది. ఆపరేషన్ బ్లూస్టార్ పేరుతో స్వర్ణదేవాలయంలోకి సైన్యం అడుగు పెట్టింది. ఈదాడుల్లో స్వర్ణదేవాలయం బాగా దెబ్బతిన్నది. దీంతో సిక్కులు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఊగిపోయారు.



➥ జులై 1984లో హమ్‌లోగ్ తొలి సీరియల్ దూరదర్శన్‌లో ప్రసారమైంది. దీనిని హిందీ రచయిత మనోహర్ శ్యామ్ జోషి నిర్మించారు. మెక్సికన్ కథ ఆధారంగా దీనిని రూపొందించారు. కానీ భారతీయ మధ్య తరగతి జీవితాలను ఇది ప్రతిబింబించింది.

➥ ఇందిరాగాంధీ బాడీ గార్డుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. ఆపరేషన్ బ్లూ స్టార్‌కు ప్రతీకారంగా వారు ఈ ఘాతుకానికి ఒడిగట్టారు.

➥ 1986లో తొలి భారతీయ టెస్టుట్యూబ్ బేబీగా హర్ష చావా జన్మించింది. డాక్టర్ ఇందిర హిందూజ పర్యవేక్షణలో విజయవంతంగా టెస్టు ట్యూబ్‌బేబీ జన్మించింది. గతేడాది 2016లో చావ్డా మరొక బిడ్డకు జన్మనిచ్చి తల్లిగా మారింది.

➥ రెండు దశాబ్దాల తర్వాత మిజోస్-ఇండియా మధ్య వివాదం ఒక కొలిక్కి వచ్చింది. జూన్ 1986లో మిజోరాం భారత్‌లో విలీనమైంది. ఈ మేరకు రాజీవ్‌గాంధీ-లాల్‌డెంగా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో ఈశాన్య రాష్ట్రాల్లోశాంతికి మార్గం సుగమం అయింది.

➥ ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక కోటా కల్పించాలని మండల్ కమిషన్ 1980లో ప్రభుత్వానికి నివేదించింది. 1990లో దీనికి వీపీసింగ్ ఆమోదం తెలిపారు .దీంతో దేశవ్యాప్తంగా మండల్ వ్యతిరేక, మండల్ అనుకూల ఆందోళనలు తీవ్రస్థాయిలో జరిగాయి. దీనిప్రభావం భారత రాజకీయాలపై ఆ తర్వాత మూడు దశాబ్దాలపాటు కనిపించింది.

➥ కేరళలోని ఎర్నాకులం తొలి సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా గుర్తింపుపొందింది. 4 ఫిబ్రవరి 1990లో నాటి ప్రధాని వీపీ సింగ్ ఎర్నాకుళంను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా అధికారికంగా ప్రకటించారు.

➥ మే 1991 పెరంబూర్ ఎన్నికల ప్రచారంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీపై ఆత్మాహుతి దాడి. రాజీవ్ మరణం. భారత రాజకీయాల్లో సంచలన మార్పులకు దారితీసింది.

➥ తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు నేతృత్వంలో నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అనంతర కాలంలో ఈ సంస్కరణలే దేశగతిని పూర్తిగా మార్చివేశాయి. ప్రపంచ పటంలో భారత్‌కు సముచిత స్థానం దక్కేందుకు దోహదపడింది.

➥ అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత. 1992లో చోటుచేసుకున్న ఈ ఘటన దేశవ్యాప్తంగా మతఘర్షణలకు దారితీసింది. భారత రాజకీయాల్లో విభజనపార్శ్వం మరింత స్పష్టమైంది.

➥ 1992లోనే బెంగాల్ లెజండరీ సినీ దర్శకుడు సత్యజిత్‌రేకు ఆస్కార్ అవార్డు లభించింది.

➥ 1995లో ఆదిత్యచోప్రాస్ దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే సినిమా దేశీయంగానూ,అంతర్జాతీయంగా విడుదలై రికార్డులు బద్దలుకొట్టింది. షారూక్ ఖాన్‌కు వర్ధమాన నటుడిగా తిరుగులేని గుర్తింపు తెచ్చిపెట్టింది.

➥ 1948 తర్వాత లియాండర్ పేస్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిపెట్టాడు. ఇది 1996లో క్రీడారంగానికి కలికితురాయిగా నిలిచింది.

➥ మొబైల్‌ఫోన్ భారత్‌లోకి ప్రవేశించింది. దేశంలోనే ప్రప్రథమంగా నాటి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు తొలి సెల్‌ఫోన్ సంభాషణ జరిపారు.

➥ 1999 సరిహద్దు చొరబాట్లు. భారత్‌లోకి చొచ్చుకొచ్చిన పాక్ సైన్యం. గొర్రెల కాపరులద్వారా ఆర్మీకి సమాచారం. అనంతరం అదే కార్గిల్ యుద్ధానికి దారితీసింది. రెండు నెలలపాటు జరిగిన ఆపరేషన్ విజయ్‌లో భారత్ విజయం సాధించింది.

➥ ఢిల్లీ నుంచి ఖాట్మండు వెళ్తున్న భారతీయ విమానం హైజాక్‌కు గురయింది. ముష్కరులతో రాజీ ప్రయత్నంలో భారత్ కొన్ని చారిత్రక తపిదాలు చేయాల్సి వచ్చింది. ప్రయాణికులను సురక్షితంగా విడిపించుకునే క్రమంలో ముగ్గురు తీవ్రవాదులను జైళ్లనుంచి విడుదల చేయాల్సి వచ్చింది.

➥ 1990 చరమాంకంలో భారత్‌లో కేబుల్ టీవీ ప్రసారాలు ప్రారంభం అయ్యాయి. బీబీసీ, సీఎన్‌ఎన్ ప్రసారమాధ్యంలో విప్లవాత్మక మార్పులకు కారణం అయ్యాయి.

➥ 2001 భారత పార్లమెంటుపై దాడి. దరిమిలా సరిహద్దుల్లో తీవ్రవాదుల వేట. ఆపరేషన్ పరాక్రమ్ పేరుతో పాక్‌తో భారత సైన్యం ఢీ అంటే ఢీ అనే స్థాయికి వెళ్లింది. పార్లమెంటుపై దాడికి పాకిస్తానే కారణమనేందుకు ఆధారాలు లభ్యమయ్యాయి. చివరకు 2004లో ఈ ఆపరేషన్ పూర్తయింది. పాక్‌కు బస్ సర్వీసును ప్రారంభించడం ద్వారా నాటి ప్రధాని వాజ్‌పేయి దౌత్యానికి శ్రీకారం చుట్టారు.

➥ 2002లో నాగపూర్ ప్రధాన కార్యాలయంపై ఆర్‌ఎస్‌ఎస్ తొలిసారి త్రివర్ణపతాకాన్ని ఎగురవేసింది. అప్పటి వరకు ఆర్‌ఎస్‌ఎస్ త్రివర్ణ పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తించలేదు.

➥ గుజరాత్ అల్లర్లు..2000 వేల మంది ప్రజలు మృతి. గోద్రా వద్ద రైలుకు నిప్పు. అయోధ్య నుంచి తిరిగివస్తున్న కరసేవకుల వధ. మతఘర్షణల్లో గుజరాత్ రావణకాష్టంగా మారింది. శాంతిభద్రతలు కట్టుదప్పాయి. మూకుమ్మడి దాడుల్లో ముస్లింలపై హింస. పలువురి మృతి.

➥ 2005లో భారత్ కుష్టు రహిత దేశంగా గుర్తింపుపొందింది.

➥ 2005లో దేశవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ విభాగాల్లో అవినీతిపై అంకుశం సంధించేందుకు పౌరులకు ఇది వరంగా మారింది

➥ 2006లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర్ ప్రవేశపెట్టింది. గ్రామాల్లో ప్రతి ఇంటికి 100 రోజుల పనిదినాలు కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

➥ 2008 నవంబర్ 8న చంద్రయాన్-1 అంతరిక్షనౌక చంద్రుడిపై అడుగుపెట్టింది.

➥ 2008లో ముంబైలోని తాజ్‌హోటల్‌పై ఉగ్రవాదుల దాడి. పాక్ నుంచి సముద్రమార్గం ద్వారా పడవలో వచ్చిన 10 మంది ముష్కరులు మారణహోమాన్ని సృష్టించారు. సుమారు 200 మంది పౌరులు మరణించారు.

➥ 2010 ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. 14 ఏళ్లలోపు బాలబాలికలకు విద్యను తప్పనిసరి చేయడమే దీని ముఖ్యోద్దేశం. ఇలాంటి చట్టాన్ని అమలు చేస్తున్న దేశాల్లో భారత్ 135వ దేశంగా నిలిచింది.

➥ 2011 భారత క్రికెట్‌కు చారిత్రకం. రెండోసారి ప్రపంచకప్‌ను ధోనీ నాయకత్వంలో టీమిండియా సాధించింది.

➥ దేశవ్యాప్తంగా అవినీతి వ్యతిరేక ఉద్యమం ప్రారంభమైంది. సామాజిక కార్యకర్త అన్నాహజారే, కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలు దీనిని ఉధృతం చేశాయి. లోక్‌పాల్ బిల్లుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చాయి.

➥ 27 మార్చి 2014 భారత్ పోలియో రహితదేశంగా ప్రకటించబడింది. ఇదే యేడాది భారత ప్రధానిగా నరేంద్ర మోడీ ఎన్నికయ్యారు. సాధారణ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ సారథ్యంలోని కూటమి అఖండ విజయం సాధించింది.

➥ 2016 నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం రూ. 500, రూ. 1000 నోట్లను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. నల్లధన నిర్మూలనలో భాగంగా చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు మోడీ ప్రకటించారు. దాదాపు మూడు నెలలపాటు నగదుకోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

➥ 2017 జులై 1న వస్తుసేవల పన్ను అమల్లోకి వచ్చింది. వివిధ రూపాల్లో ఉన్న పన్నుచట్టాలను క్రోడీకరించి ఒకే దేశం.. ఒకే పన్ను చట్టంగా జీఎస్టీని కేంద్రం అమలుచేసింది.



70 ఏళ్ల మార్పులకు దర్పణం ఆంధ్రప్రభ

(మొదటిపేజీ తరువాయి)

మెరుగయ్యాయి. ఉపాధి అవకాశాలు అనూహ్యంగా పెరిగాయి. ఇంటింటికి వంటగ్యాస్ అందుబాటులోకొచ్చింది. సగటు తలసరి ఆదాయం పెరిగింది. అయితే దురదృష్టవశాత్తు అప్పటికీ ఇప్పటికీ పేదరికంలో మగ్గుతున్న వారి సంఖ్య మాత్రం తగ్గలేదు. ఇటీవలె క్రెడిట్ సుర్సీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నిర్వహించిన అధ్యయనాన్ని ప్రపంచబ్యాంక్ 2016 నివేదికలో వెలువరించింది. దీని మేరకు దేశంలోని మొత్తం సంపదలో 60శాతం మొత్తం జనాభాలో 1శాతం వద్దే కేంద్రీకృతమైనట్లు పేర్కొన్నారు. 1950లో జరిగిన తొలి జనాభా లెక్కల అనంతరం అప్పటి జీవన వ్యయానికి అనుగుణంగా ఏడాదికి 240రూపాయల లోపు ఆదాయం ఉన్న వారందరినీ పేదలుగా ధ్రువీకరించారు. ఈ మేరకు మొత్తం జనాభాలో 65శాతం దారిద్ర్యరేఖకు దిగువనున్నట్లు గుర్తించారు. 1947లో స్వతంత్రమొచ్చనాటికి బ్రిటీష్ వలస ప్రాంతాల్లో 29,21,64,791మంది ఉన్నట్లు తేలింది. అప్పటికి ఇంకా కొనసాగుతున్న నైజాం, జమ్మూకాశ్మీర్, జోధ్‌పూర్ వంటి సంస్థానాల్లో మరో 9కోట్ల మంది జనాభా ఉన్నట్లు లెక్కించారు. ఫ్రెంచ్ పాలిత ప్రాంతాల్లో 2.25లక్షలు, పోర్చుగీస్ పాలిత ప్రాంతాల్లో 5లక్షల జనాభా ఉన్నట్లు లెక్కలేశారు. ఇప్పుడీ జనాభా అనూహ్యంగా పెరిగింది. 120కోట్లు దాటింది. కానీ ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని 24కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. పట్టణాల్లో 7.20కోట్ల మంది దుర్భర దారిద్ర్యంలోనే ఉన్నారు. 1950లో ప్రతి వెయ్యి శిశు జననాలకు గాను 146మంది మృత్యువాత పడేవారు. ఇప్పుడిది 80కి చేరింది. అయితే ఒడిషాలో ఇది ఇప్పటికీ ప్రతి వెయ్యికు 124గాను, మధ్యప్రదేశ్‌లో 117గా నమోదౌతోంది. ఇది సహారా ఏడారి ప్రాంతంలోని శిశువుల మృత్యువాతకంటే కూడా అధికంగా ఉంది. 1947తో పోలిస్తే భారతీయుల సగటు జీవన కాలం పెరిగింది. కానీ భారత్‌కంటే వెనుక స్వతంత్రం పొందిన చైనాలో సగటు జీవన ప్రమాణం 69ఏళ్ళుంటే భారత్‌లో ఇది ఇప్పటికీ 64గానే ఉంది. భారతీయ మహిళల్లో 85శాతం మంది 58ఏళ్ళలోపే మృత్యువాతకు గురికావడం ఆందోళనకు దారితీ స్తోంది. భారత్‌లో సంపదలో, జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు అనూహ్యంగా పెరిగినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సగటున ప్రతివ్యక్తి 2400 కేలరీస్‌ను మాత్రమే ఆహారంగా పొందగలుగుతుంటే పట్టణ ప్రాంతాల్లో ఇది 2100 కేలరీస్‌గా మాత్రమే ఉండడం కూడా ఆందోళనకరం. ఇప్పటికీ 74శాతం జనం గ్రామాల్లోనే జీవిస్తున్నారు. ఇప్పటికీ మహిళలపై లైంగికదాడులు కొనసాగుతూనే ఉన్నాయి.30కోట్ల మంది పౌష్టికాహారలోపంతో బాధపడుతూనే ఉన్నారు. విద్యుత్, సాగునీరు, వ్యవసాయం, ఎరువులు వంటి వాటిపై ఇస్తున్న సబ్సిడీలు పక్కదారి పడుతూనే ఉన్నాయి. సంపద పెరగడమే కాదు.. పేదరికంలో మగ్గుతున్న వారి సంఖ్య కూడా తగ్గాలి. సంపద విభజనలో ప్రపంచంలోనే అత్యధిక వ్యత్యాసాలున్న దేశంగా గుర్తింపున్న భారత్ దాన్ని పోగొట్టుకోవాలి. అవకాశాలు, ఆదాయం, విస్తృతస్థా యిలో పంపిణీకావాలి. రాజ్యాంగం నిర్దేశించిన విద్య, వైద్యాన్ని ప్రాథమిక దశలోనే కాకుండా ఉన్నతస్థా యిలో కూడా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఆహారభద్రతను చట్టంగానే కాకుండా ఆచరించి చూపాలి. అప్పుడే ఎందరో మహాత్ములు తమ ప్రాణాలొడ్డి సాధించిన స్వరాజ్యానికి సార్థకత సిద్ధిస్తుంది. ఈ క్రమంలో పాలనా వ్యవస్థతో పాటు ఆంధ్రప్రభ కూడా తమ అక్షరయజ్ఞాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది.

తెలుగు ప్రజలకు పంద్రాగస్టు శుభాకాంక్షలు : గవర్నర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగురాష్ట్రాల ప్రజలకు గవర్నర్ నరసింహన్ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్ష లు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వారికి మనం రుణపడి ఉన్నామని, దేశం కోసం త్యాగం చేసిన వారి నుండి స్ఫూర్తిని పొందాలన్నారు. నిజాయితీ, శాంతి, అహింస, స్నేహం, సౌభ్రాతృత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, జాతి నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు.

టీ. టీడీపీ అభినందనలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: 71వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా దేశ విదేశాల్లోని భారతీయులకు తెలంగాణ తెదేపా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ మహనీయుల స్ఫూర్తితో కలిసిమెలిసి జీవించాలని, నిరంతరం దేశ పురోభివృద్ధి కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. అలాగే శాంతి సౌభ్రాతృత్వాలను పంచుకుంటూ భారత దేశాన్ని అన్ని విధాలుగా ప్రపంచ అత్యున్నత స్థానానికి చేరే విధంగా కృషి చేయాలని వారు కోరారు.

అమరవీరులకు పవన్ శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత మాతను పరాయి చెర నుంచి విముక్తి చేయడానికి ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు, యోధులకు స్వాతంత్ర్య దినోవ్సవం సందర్భంగా ప్రణామాలు అర్పిస్తున్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. వ్యక్తులకు భిన్నమైన పర్వదినాలు ఉండవచ్చు కానీ జాతికి సంబంధించి ఇదొక్కటే పండుగ రోజు అని అన్నారు. అమరుల త్యాగాలవల్లే గత ఏడు దశాబ్దాలుగా స్వేచ్ఛ ఫలాలను మనం ఆస్వాదిస్తున్నామని తెలిపారు. అయితే దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా ఉన్నాయని మనకు గుర్తు చేస్తూనే ఉన్నాయన్నారు. స్వేచ్ఛ, సంపదలు ఇంకా అట్టడుగు వర్గాలకు దూరంగానే ఉన్నాయని పవన్ ఆందోళన వ్యక్తంచేశారు. సాంఘిక అసమానతలు సమసిపోయి, పేదరికం పేదగా మిగిలినపుడు మాత్రమే స్వాతంత్ర్యానికి అర్థం పరమార్థమన్నారు.

కొండచరియా విరిగిపడి 312మంది సజీవ సమాధి

- సియర్రా రాజధాని ఫ్రీటౌన్‌పైకి దూసుకొచ్చిన రాకాసి వరద
- 312 మంది మృత్యువాత..
- మృతుల్లో 60మందికిపైగా చిన్నారులు




ఫ్రీటౌన్: ఆఫ్రికన్ దేశం సియర్రాపై ప్రకృతి ప్రకోపాన్ని చూపించింది.సియర్రా రాజధాని ఫ్రీటౌన్‌పైకి రాకాసి వరద దూసుకొచ్చింది. వరద దాటికి 312 మంది మృత్యువాత పడగా..వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మృతుల్లో 60 మందికి పైగా చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వరద నీటితో పాటు భారీ స్థాయిలో ఎర్రమట్టి కొట్టుకురావడంతో ఎక్కువ మంది తప్పించుకునే ప్రయత్నంచేసినా ఊపిరాడక చనిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. చాలామంది ప్రాణాలు కాపాడుకునేందుకు కొండలు, గుట్టల వైపు పరుగులు తీశారు. వందలాదిమంది సహాయం కోసం ప్రాణాలను అరచేతిలో పె ట్టుకుని బిక్కుబిక్కుమని ఎదురుచూస్తున్నారు. రంగంలోకి దిగిన విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. ఫ్రీటౌన్ లోని ఏవీధిలో చూసినా కుప్పలు తెప్పలుగా శవాలు కనిపించాయని స్థానికులు చెప్పారు.సగానికిపైగా తెగిపోయిన మనుషుల శరీరాలతో హృదయవిదారక సన్నివేశాలను కనిపించడంతో విలేఖరులకు కూడా కన్నీళ్లు ఆగలేదు. సియర్రా అత్యంత పేదదేశం. ఆ దేశంలో ఆర్థిక ప్రగతి మొత్తం రాజధాని ఫ్రీటౌన్ లోనే కేంద్రీకృతమైంది. దీంతో దేశ ప్రజల్లో ఎక్కువ మంది ఉపాధి కోసం రాజధానిలోనే జీవనం సాగిస్తున్నారు. ఫ్రీటౌన్‌లో సుమారు 12 లక్షల మంది జనాభా ఉంటుందని అధికారుల అంచనా.



ఢిల్లీపై డేగ కన్ను

- పంద్రాగస్టు పండుగకు పటిష్ట భద్రత
- ఉగ్రవాద ముప్పు హెచ్చరికలతో హైఅలర్ట్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశరాజధాని ఢిల్లీ ముస్తాబైంది. ఎక్కడ చూసినా త్రివర్ణ పతాక రెపరెపలతో హస్తిన కన్నులపండువగా మారింది. ఉగ్రవాద ముప్పు పొంచి ఉందన్న ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరికలతో ఎర్రకోట, ఇండియా గేట్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.ఎటు వైపు నుంచైనా ముష్కర మూకలు దాడులకు తెగబడే ప్రమాదముండడంతో చీమ చిటుక్కుమన్నా పసిగట్టేలా ఐదంచెల భద్రతా వ్యవస్థను రూపొందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించే ప్రాంతంలో ప్రత్యేక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ప్రసంగం సాగే ప్రాంతం చుట్టుపక్కల 500 మంది ఎన్ఎస్‌జీ కమాండోలు విధులు నిర్వర్తించనున్నారు. వివిధ ప్రాంతాల్లో వేల సంఖ్యలో పారా మిలటరీ బలగాలు, బాంబ్‌స్క్వాడ్, ప్రత్యేక పోలీస్ బృందాలు మోహరించాయి. వేడుకలు జరిగే ప్రాంతానికి సమీపంలోని ప్రతి మూలా ఏం జరుగుతోందో కనిపెట్టేందుకు 360 డిగ్రీల పరిధిలో పని చేసే 300 నైట్ విజన్ కెమెరాలను అమర్చారు. అనుమానాస్పదంగా కనిపిస్తున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో భద్రతను పెంచారు. రెడ్ ఫోర్ట్‌కు దగ్గరగా ఉండే మెట్రో స్టేషన్లను మధ్యాహ్నం వరకూ మూసి వేశారు. జనం ఎక్కువగా ఉండే మార్కెట్లను రెండు రోజుల ముందు నుంచే బంద్ చేశారు.

రద్దీ మార్కెట్లను మధ్యాహ్నం ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రశాంతంగా ముగించేందుకు ఢిల్లీ పోలీసులు కఠినంగా శ్రమించారు. పంద్రాగస్టు వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వేడుకలు జరిగే ప్రాంతం వైపు రద్దీ లేకుండా ఇతర మార్గాల గుండా వాహనాలను మళ్లించారు. ప్రధాని జెండాను ఎగురవేసే అద్భుతమైన ఈ ఘట్టాన్ని చూడడానికి వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు.

- ప్రజల సూచనలతో ప్రధాని ప్రసంగం

క్విట్ ఇండియా ఉద్యమానికి 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2022 కల్లా అవినీతి, కులతత్వం, ఉగ్రవాదం, మతోన్మాదం, పేదరిక రహిత దేశాన్నిచూడడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఇప్పటికే మోదీ వెల్లడించారు. సాంఘిక దురాచారాలన్నిటినీ రూపుమాపి సరికొత్త భారత దేశాన్ని తయారు చేయడానికిఈ స్వాతంత్ర్య దినోత్సవవేడుకల సందర్భంగా ప్రతి పౌరుడూ ప్రతిజ్ఞ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తాను ఈసారి ఏయే అంశాలపై ప్రసంగించాలనే దానిపై మోదీ ఆకాశవాణిలో ప్రసారమయ్యే మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆయన విజ్ఞప్తికి పెద్ద ఎత్తున ప్రజలు స్పందించినట్టు సమాచారం. వారు సూచించిన అంశాల పైనే ఈసారి మోదీ దృష్టి కేంద్రీకరించబోతున్నట్టు తెలుస్తోంది.

పెద్దపల్లి మువ్వన్నెల మెగా ర్యాలీ



పెద్దపల్లి , (కెఎన్ఎన్) : భారత జాతి యావత్తు నిర్వహించుకునే అతి ఘనమైన పండగ స్వాతంత్ర దినోత్సవం... ప్రతి ఏటా ఈ రోజు వచ్చిందంటే రకరకాల పద్దతుల్లో దేశ భక్తిని చాటుకుంటారు.. ఈసారి పెద్దపల్లి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలతో పట్టణం మువ్వన్నెల రెపరెపలతో పరిఢ విల్లింది.. గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించిన మార్చ్‌తో పెద్దపల్లి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించింది.... సోమవారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి 20వేల మంది జాతీయ పతాకాలతో చేసిన ర్యాలీని రామగుండం పోలీస్ కమీషనర్ విక్రమ్ జిత్ దుగ్గల్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిలు ప్రారంభించారు.. ఈ ర్యాలీ దేశ భక్తి గేయాలాపనతో నిర్వహించిన మెగా ర్యాలీ పట్టణ వీధుల గుండా సాగింది... భారత్ మాతాకీ జై అంటూ చేసిన నినాదాలతో పట్టణం మారుమ్రోగింది.. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్ధులు భారత దేశ ఆకారంలో నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది... జాతీయ పతాకాలతో నిర్వహించిన ర్యాలీ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు పొందడంతో ప్రతినిధులు కమీషనర్‌కు ధృవీకరణ పత్రంతో పాటు మెడల్ అందించారు. జాతీయ సమైక్యత కోసం నిర్వహించిన మెగా ర్యాలీ అంతర్జాతీయ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు పొందిన సోమవారం పెద్దపల్లి జిల్లా చరిత్రలో సువర్ణ అక్షరాలతో మిగిలిపోనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, డీసీపీ విజయేందర్ రెడ్డి, ఏసీపీ సింధు శర్మతోపాటు వేలాది సంఖ్యలో విద్యార్ధులు, యువకులతోపాటు ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర సర్వీసు అధికారులకు గుర్తింపు

- దేశంలోనే తొలిసారిగా కేసీఆర్ నిర్ణయం
- ప్రతి ఆగస్టు15న సత్కరించే సాంప్రదాయానికి నాంది
- ఈ ఏడాది నలుగురు అధికారుల ఎంపిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభు త్వం తలపెట్టిన ప్రజాహిత కార్యక్ర మాలను ప్ర జల్లోకి తీసుకువె ళ్ళేందుకు అవిరళ కృషి చేస్తున్న అఖిల భారత సర్వీసు అధికారులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సన్మానించడాన్ని సాంప్రదాయంగా కొనసాగించాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిర్ణయించారు. దేశంలోనే తొలిసారిగా ఆల్ ఇండియా సర్వీసు అధికారులను గౌరవించి సన్మానించే కొత్త సాంప్రదాయానికి రాష్ట్రం నాంది పలకాలని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది నలుగురు కేంద్ర సర్వీసుల అధికారులను అవార్డులకు ఎంపిక చేశారు.కేసీఆర్ కిట్స్ పథకాన్ని విజయవంతం చేయడం లోనూ, ప్రభుత్వ వైద్యశాఖల పనితీరును మెరుగుపరచడంలోనూ విశేష కృషి చేసిన ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లను సమర్థవంతంగా నడుపుతూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పౌర సరఫరాల వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, మైనారిటీ గురుకుల పాఠశాలలను విజయ వంతంగా నిర్వహిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి ఎండి షఫీవుల్లాలను విశిష్ట సేవలం దించిన అధికారులుగా గుర్తించారు. ఈ నలుగురిని మంగళవారం గోల్కొండకోట వేదికగా నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం కేసీఆర్ స్వయంగా సత్కరిస్తారు.

990 మంది పోలీస్ అధికారులకు రాష్ట్రపతి పతకాలు

- జాబితాలో తెలుగు రాష్ట్రాల పోలీసులు
- అత్యధిక పతకాలు అందుకోనున్న ఏపీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఏపీపోలీసులకు ప్రెసిడెంట్ మెడల్స్ పంట పండింది. విధి నిర్వహణలో విశేష సేవ చేసిన, అపూర్వ ప్రతిభ కనబరిచిన వారిని కేంద్ర ప్రభుత్వం ఈ పతకాలతో సత్కరిస్తుంది. వివిధ విభాగాల్లో దేశంలోనే అత్యధికంగా 67 రాష్ట్రపతి పతకాలను ఈసారి ఏపీ పోలీసులు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 990 మంది పోలీస్ అధికారులకు రాష్ట్రపతి పురస్కారాలుదక్కాయి. ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పీపీఎమ్‌జీ), పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పీఎమ్‌జీ), ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్‌డ్ సర్వీస్ (పీపీఎమ్‌డీఎస్), పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (పీఎమ్ఎమ్ఎస్) కేటగిరీల్లో ఈ పతకాలు అందజేశారు. పీపీఎమ్‌జీ విభాగంలో దేశం మొత్తంలో ఛత్తీస్‌గడ్‌కు చెందిన అధికారి, పీఎమ్‌జీ విభాగంలో 190 మంది అధికారులు, పీపీఎమ్‌డీఎస్ విభాగంలో 93 మందికి, పీఎమ్ఎమ్ఎస్ విభాగంలో 706 మంది మెడల్స్ పొందారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పోలీస్ సిబ్బంది పీఎమ్‌జీ విభాగంలో 52, పీపీఎమ్‌డీఎస్ ముగ్గురు, పీఎమ్ఎమ్ఎస్ విభాగంలో 12 మంది పతకాలు సాధించారు. పీపీఎమ్‌డీఎస్ కేటగిరీలో ఇద్దరు, పీఎమ్ఎమ్ఎస్వి భాగంలో 10 మంది తెలంగాణాకు చెందిన పోలీస్ అధికారులు ఢిల్లీలో ఈ పతకాలు స్వీకరించారు. మెడల్స్ సాధించిన తెలుగు రాష్ట్రాల పోలీసులకు ఆ శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

100% స్వాతంత్ర్య ఫలాలు ఆస్వాదిద్దాం

- కేసీఆర్ నాయకత్వంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మంత్రులు హామీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, తలసాని శ్రీనివాస యాదవ్, కె.తారక రామారావు, టి.హరీష్‌రావులు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పరాయి పాలన నుంచి విముక్తి పొంది స్వేచ్ఛా వాయువులు ఆస్వాదిస్తున్న గొప్ప దినం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవమని వారన్నారు. స్వాతంత్ర్య ఫలాలను ప్రజలకు వందశాతం అందిస్తున్న ఘనత తమ రాష్ట్రానికి దక్కిందని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా, రక్తపాతానికి దూరంగా దేశానికి స్వాతంత్ర్యం ఏ విధంగా సాధించుకున్నామో ఆ పోరాటం, ఉద్యమ స్ఫూర్తి ఆదర్శంగా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామని, ఇది దేశం గర్వించదగ్గ అంశమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం, ఇక్కడి పథకాలు పొరుగు రాష్ట్రాలకు ఆదర్శప్రాయం కావడం శుభ పరిణామమని అన్నారు. దశాబ్దాల తరబడి తెలంగాణ ప్రజలు కలలుగన్న బంగారు తెలంగాణకు మనమంతా పునరంకితమవుతూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కేసీఆర్ పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తామంతా అకుంఠిత దీక్షతో, పట్టుదలతో రాష్ట్ర పునర్నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు హామీ ఇచ్చారు.

సీవీ ఆనంద్‌కు డబుల్ ధమాకా

- ఏకకాలంలో రెండు అవార్డులకు ఎంపిక
- పోలీసు మోడల్ ప్రకటించిన కేంద్రం
- రాష్ట్రం నుండి ఎక్సెలెంట్ అవార్డు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పౌరసరఫరాల సంస్థ కమీషనర్ సీ.వీ.ఆనంద్‌కు ఏక కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు అవార్డులను ప్రకటించాయి. ఐపిఎస్ అధికారిగా ఆయన అందించిన అత్యుత్తమ సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ అవార్డుకు ఎంపిక చేసింది. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కమీషనర్‌గా అందించిన ఉత్తమ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఎక్సెలెంట్ అవార్డుకు ఎంపిక చేసింది. ఒక ఐపిఎస్ అధికారిగా ఒకే రోజు రెండు అవార్డులకుఉ ఎంపిక కావడం విశేషం. పోలీసు శాఖలో సీన్సియర్ అధికారిగా పేరున్న సీ.వీ.ఆనంద్‌ను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఏడాది క్రితం పౌరసరఫరాల సంస్థ కమీషనర్‌గా నియమించారు. గత ఏడాది కాలంలో ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో పాటు చేపట్టిన వినూత్న చర్యల వల్ల సంస్థ గాడిలో పడింది. దాదాపు రూ. 1000 కోట్లు ఆదా చేశారు. వ్యవస్థలోని లోపాలను ఒకొక్కటిగా గుర్తించి చక్కదిద్దడంతో ప్రజాపంపిణీలో పారదర్శకత ఏర్పడింది. ఆయన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఎక్స్ లెన్స్ ఆవార్డును ప్రకటించింది.

చెప్పిందే చేస్తా..కాపు కాస్తా..


- బీసీ రిజర్వేషన్లు తగ్గించం
- కాపులకు అదనంగా ఇస్తాం
- పిఠాపురం హామీ నెరవేరుస్తా
- కాపు సంఘాల సమావేశంలో ఏపీ సీఎంచంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ: నేనంత వరకూ కాపులకు అన్యాయం జరగదు.. అన్యాయం జరిగితే మీరు ఉపేక్షించరూ.. మీ మనోభావాలను నేను అర్థం చేసు కున్నా.. మీరు ఎదురుచూస్తున్న రిజర్వేషన్ అంశం త్వరలోనే పరిష్కారమవుతుందంటూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కాపులను ఉద్దేశించి ప్రకటించారు. విజయవాడలో సోమవారం హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో 'కాపులకు విద్య, ఉద్యోగ, ఆర్థిక రిజర్వేషన్లు కావాలి. రాజకీయ రిజర్వేషన్లు వద్దు' అనే దానిపై అన్ని జిల్లాల కాపు సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సభను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలి. వెనుకబడిన వర్గాలకు అన్యా యం జరగకుండా ఉండాలన్నదే తన అభిమత మన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను పాదయాత్ర చేస్తున్న సమయంలో కాపుల పరిస్థితులను అర్థం చేసుకుని ఎవ్వరూ అడగకుండానే తానే వారిని బీసీలలో చేరుస్తానని పిఠాపురంలో హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఆ హామీ త్వరలోనే నెరవేరబోతున్నట్లు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కాపులకు మరింత సాయం చేయాలన్నదే తన ఆలోచన అని ఇంకా అధికంగా నిధులు ఇచ్చేందుకు ప్రయత్ని స్తున్నట్లు తెలిపారు. కాపు కార్పొరేషన్ భవనాలను అత్యాధునిక ఇన్‌ఫ్రాస్టక్చర్‌తో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ భవనాలు అన్నీ రకాలుగా ఉపయో గించుకోవాలన్నారు. కాపులు కూడా అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. నేను పాదయాత్ర చేసిన సమయంలో అనంతపురంలో కరువు చూసిరైతులకు రుణమాఫీని ప్రకటించాన న్నారు. 2811 వేల కిలోమీటర్లు పాదయాత్రలో తాను ఎన్నో అంశాలను గమనించాననీ, ప్రజల కష్టాలను నేరుగా దగ్గర నుంచి చూశానన్నారు. అప్పుడే సమాజంలో పేద వర్గాలకు ఏదైనా చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నానన్నారు. కాపులకు వెనుకబడిన వర్గాలతో సమానంగా రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుకున్నాననీ ప్రకటించారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్నో కష్టాలు పడ్డామని కట్టుబట్టలతో అమరావతికి వచ్చామన్నారు. బస్సులోనే బస, ఇల్లు, ఆఫీసు ఏర్పాటు చేసుకుని పనిచేసినట్లు గుర్తుచేశారు.
తలసరి ఆదాయం పెరగాల్సిన అవసరం ఉందిన మనకు పరిశ్రమలు లేవు, విద్యాసంస్థలు లేవు, అర్బన్ ప్రాంతాలు లేవు దీని వల్ల ఆదాయం పెరగడంలేదని అన్నారు. తక్కువ జనాభా, ఎక్కువ ఆదాయం ఉండటంతోనే తెలంగా ణ అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడు తుందన్నా రు. అయితే ఎన్నో వనరులు ఉన్నాయనీ వాటిని సద్వినియోగం చేసుకుంటే మనం నెంబర్ వన్ స్థాయికి ఎదుగుతామన్నారు. ఆ రోజు హైదరాబాద్ ను వదిలి రావడం ఎంతో బాధ కలిగిందన్నారు. ఎ నేడు పోలవరం వేగంగా నడవడానికి ఆనాడు తాను చేసిన ప్రయత్నమేకారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ కాపులకు ఏమి చేసిందని ప్రశ్నించారు.

గోల్కొండకోట ముస్తాబు

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం




హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వాతంత్ర్య దినోత్సవం పంద్రాగస్టు వేడుకలకు చారిత్రాత్మక గోల్కొండ కోట ముస్తాబైంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక ముఖ్యమంత్రి హోదాలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాలుగోసారి జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నారు. తెలంగాణ చారిత్రక వైభవాన్ని, ఇక్కడి సంస్కృతీ సాంప్రదాయాలు చాటిచెప్పే విధంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు ఘనంగా చేసింది. ఈ వేడుకలకు సంబంధించి పోలీసు, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ, మెట్రో వాటర్ బోర్డు, వైద్య, విద్య, ఉద్యాన, అగ్నిమాపక, పురావస్తు, సాంస్కృతిక, రోడ్డు రవాణా, సమాచార పౌరసంబంధాలు, విద్యుత్, సాధారణ పరిపాలన శాఖల ఉన్నతాధికారులు వారివారి పరిధిలో అన్ని ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో అమర వీరుల సైనిక్ స్మారక్ వద్ద శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం గోల్కొండ కోటలో ఉదయం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ గావిస్తారని సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాల సందర్భంగా రాజ్‌భవన్, సెక్రెటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్ తదితర ముఖ్య ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ ఉత్సవాల సందర్భంగా పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్, నిరంతర విద్యుత్, మంచినీటి సరఫరా, సైన్ బోర్డులు, పరిసరాల శుభ్రత, మొబైల్ టాయిలెట్స్, ఆర్టీసీ మినీ బస్సులు, వేదిక వద్ద పుష్పాలతో అలంకరణ వంటివి ఏర్పాటు చేశారు. ఈ వేడుకల సందర్భంగా గోల్కొండ కోటలో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే విధంగా కళాకారులచే కళా ప్రదర్శనలు నిర్వహిస్తారు.

శ్రీశ్రీ రవిశంకర్ ఆనందమయ పాఠాలు

- ఒకేసారి లక్షమందికి బోధన
- భాగ్యనగరంలో 100కిపైగా కేంద్రాల్లో ఏర్పాట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జీవితంలో ఆనందంగా, ఉత్సాహంగా, ఒత్తిడులు లేకుండా ఉండగలిగే రహస్యాలను నేర్పే హ్యాపినెస్ కార్యక్రమాన్ని ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురు శ్రీశ్రీ రవిశంకర్ ఒకేసారి లక్షమందికిపైగా ప్రజలకు తమ సంస్థ కార్యాలయంలో నేర్పుతారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి తెలిపారు. హైదరాబాద్ నగరంలో వందకుపైగా కేంద్రాలలో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది. వేలాది మంది ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొని లాభం పొందాలని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు. చేయడానికి చాలా పని ఉండి, సమయం చాలా తక్కువగా ఉండి, పనిచేయడానికి శక్తిలేనప్పుడు కలిగేది మానసిక ఒత్తిడని శ్రీశ్రీ రవిశంకర్ అంటారు. అయితే మీ శక్తిని మీరే పెంచుకోవచ్చు. ప్రాణాపాయం, ధ్యానం, సుదర్శనక్రియ మీకు రోజుకు కావలసిన శక్తిని అందించి మిమ్మల్ని పనిమంతులుగా చేస్తాయి. ఈ ప్రత్యేకమైన శ్వాస విధానం మనలోని మానసిక ఒత్తిడి, అలసట, కోపం, చికాకు, ఆత్మన్యూనత వంటి చెడు భావనలు అన్నింటిని తొలగించి, మనలను శక్తివంతంగా, అదే సమయంలో విశ్రాంతిగా, కేంద్రీకృతంగా ఉండేలా చేస్తుంది. ఈనాడు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఈ కార్యక్రమం వెబ్ టెలికాస్ట్ ద్వారా 2100 కేంద్రాలలో సమావేశ మయ్యే ప్రజలకు ఒకేసారి అందించబో తోంది. ముంబై నుంచి షిల్లాంగ్ వరకు, జమ్మూ నుంచి చెన్నై వరకు వివిధ నగరాలు, పట్టణాలలోని ప్రజలు ఈ కార్యక్రమా నికి ఆయా కేంద్రాలలో ఉన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్లు, కార్యకర్తలు సహకారం అందిస్తు న్నారు.గత 35 ఏళ్ళుగా ఈ సుదర్శనక్రియ వివిధ వర్గాల ప్రజలను శ్వాస ద్వారా దగ్గర చేయగలిగింది. సమాజంలోని వివిధ స్థాయిల, వర్గాలు, మతాల నుండి వచ్చినవారు, రైతులు, వైద్యులు, గృహిణులు, తీవ్రవాదులు, ఐటి నిపుణులు, మాజీ సైనికులు, యువత, వ్యాపార వర్గాలవారు, న్యాయవాదులు, హిందూ, ముస్లిం, క్రైస్తవ, జైన మతస్తులు ఇలా అనేకమంది శ్వాస అనే శక్తితో మానవత్వాన్ని ముడిపెడుతూ ఈ కార్యక్రమం ద్వారా దగ్గరయ్యారు.ఈ కార్యక్రమంలో భాగంగా యోగా, ప్రాణాపాయం, ధ్యానంతో పాటు పరస్పర చర్చలు, జ్ఞానబోధలు, జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులను, కష్టాలను అధిగమించే మార్గాలు ఉంటాయి. సుదర్శనక్రియ ద్వారా ప్రజలు ప్రశాంతమైన, స్థిరమైన మనసును, చుట్టూ ఉన్నవారితో ఒక చక్కని సంబంధం పొందించిన అనుభూతిని పొందగలుగుతారు.



సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 15 ఆగస్టు 2017

అసమానతతో
అభివృద్ధి కనుమరుగు!

స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు పూర్తి అయింది. ఈ ఏడు దశాబ్దాల్లో దేశం ఎంతో అభివృద్ధిని సాధించింది. నేలపైన,నింగిలోన భారత దేశ కీర్తి ప్రతిష్ఠలు జగజ్జేగీయమానంగా వెలుగొందుతున్నాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి ఎన్నోరెట్లు పెరిగింది. మరో వైపు అసహనధోరణులు,ఆర్థిక అసమానతలు అభివృద్ధిని కనుమరుగు చేస్తున్నాయి. సస్య విప్లవాల పేరిట వరి ఉత్పత్తి,నీలి విప్లవాల పేరిట మత్స్యసంపద వృద్ధి,శ్వేత విప్లవాల పేరిట పాడి ఉత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగినప్పటికీ, ఆకలిద ప్పులతో అలమటించేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది.వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధితో సంపద పెరుగుతున్నప్పటికీ,అది అన్ని వర్గాలకూ పంపిణీ కావడం లేదు.ఆర్థికపరమైన అంతరాలు పెరిగిపోతు న్నాయని కమ్యూనిస్టులు గతంలో ఆరోపించేవారు.ఆ ఆరోపణల్లో అసత్యం లేదని ఇప్పుడు ప్రభుత్వ లెక్కలే తెలియజేస్తున్నాయి. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో ఎక్కువ శాతం ఇప్పటికీ వ్యవసాయమే ఉంది.అయితే, వ్యవసాయానికి తగిన ప్రోత్సాహం లభించకపోవడం వల్లనే రైతులు అప్పుల పాలవడం,ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతోంది. ప్రభుత్వాలు మారినా రైతుల స్థితిగతులు మారడం లేదు.మరో వంక పారిశ్రామికీకరణ వల్ల ఉద్యోగాల సంఖ్య పెరగకపోయినా జల,వాయు కాలుష్యాలు పెరిగిపోతున్నాయి. పారిశ్రామిక, కార్పొరేట్ రంగాలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను శాసిస్తున్నాయి. అందుకే,పార్టీలు మారినా ప్రభుత్వాల నడక ఏ మాత్రం మారలేదు. పేదల అభ్యున్నతి గురించి,రైతులు,చేతివృత్తిపని వారి ఆర్థికాభివృద్ధి గురించి పాలకులు ఎన్ని గంభీర ప్రకటనలు చేసినా,అవి ఆచరణకు నోచుకోవడం లేదు. నిరుపేద వర్గాలకు కూడు,గూడు కల్పించలేని స్థితిలో ప్రభుత్వాలుఉన్నాయి. అయితే, ఏటా ఇందు కోసం వందల,వేల కోట్ల రూపాయిలు కేటాయిస్తున్నా,ఆ నిధులన్నీ అక్రమార్కులకే దక్కుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీ తనం తగ్గిపోయింది.పనిసంస్కృతి అంతరించిపోతున్నది. ఇందుకేనా మనం స్వాతంత్ర్యం కోరుకున్నదీ, సాధించింది అని నిస్పృహ వ్యక్తం చేయని వారు లేరు.

నిరుపేద వర్గాలకు కడుపునిండా తిండి,కంటినిండా నిద్ర కరవైంది. తలదాచుకునేందుకు గూడు లేక ఫుట్‌పాత్‌లపై జీవనం సాగించే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. స్వాతంత్ర్యానంతరం మురికి వాడల సంఖ్య పెరిగింది.మూడున్నర దశాబ్దాల్లో మురికి వాడల్లో నివసించే వారి సంఖ్యమూడు కోట్ల నుంచి పదిహేను కోట్లకు పెరిగింది.ప్రతినగరం లో,పట్టణంలో విలాసవంతమైన భవనాల పక్కనే గుడిసెలు దర్శనమిస్తాయి.దేశంలో 50 శాతం మంది పైగా ప్రజలు ఇప్పటికీ వ్యవసాయంమీదే ఆధారపడి జీవిస్తున్నారు. సేవారంగంలో తప్ప మిగిలిన రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరగడం లేదు. సాఫ్ట్ వేర్, అవుట్ సోర్సింగ్ రంగాల్లో మాత్రం కొద్దో గొప్పో ఉద్యోగాలు లభిస్తున్నాయి. తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టినా,వాటి వల్ల పెద్దగా ఉద్యోగ వృద్ధి జరగలేదు. సేవారంగంలో అభివృద్ధి ఎప్పుడూ నిలకడగా ఉండదు.అలాగే, అవుట్‌సోర్సింగ్ రంగంలో కూడా సంవత్సరం పొడుగునా ఉపాధి లభించదు. ఈ కారణంగా నిరుద్యోగుల శాతం ఆరు కన్నా కిందికి దిగడం లేదు. విద్యుత్,మంచినీరు,గ్యాస్, వంటి మౌలిక సదుపాయాలు లేని ప్రజలు 40 కోట్ల మందిపైగా ఉన్నారు.కోట్లు దాటిన వారే చట్టసభలకు ఎన్నిక కాగలుగుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం ఖరీదైన వ్యవహారంగా తయారు కావడంతో ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగామారిపోతోంది. ప్రస్తుత లోక్‌సభలో 400మందిపైగా కోటీశ్వరులు ఉన్నారు. ఆర్థిక పరమైనఅంతరాలు,సామాజిక పరమైన అంతరాలను పెంచుతున్నాయి. సమాజంలో వివిధవర్గాల మధ్య అంతరాలు పెరగడం వల్లనే అసహన ధోరణులు పెరుగుతున్నాయి. పారిశ్రామిక విప్లవంతో అంటరానితనం వంటి సామాజిక దురాచారాలు,రుగ్మతలు తొలగిపోతాయన్నది పాత మాట.అందుకు విరుద్ధంగా ఇప్పుడు అంటరానితనం మరింతగా పెరిగిపోయింది. సామాజిక న్యాయం గురించి ఉపన్యాసాలే తప్ప ఆచరణలో అది కానరావడం లేదు. దేశంలో పలుప్రాంతాల్లో పెరిగిపోతున్న అసహన ధోరణులే ఇందుకు నిదర్శనం.ప్రాథమిక హక్కులు మృగ్యంఅవుతున్నాయి.ఆధునికనాగరికత వెర్రితలలు వేస్తోంది. విద్యార్థులు, యువకులు పాశ్చాత్య నాగరికతలోని మంచినితీసుకోవడానికి బదులు విచ్చలవిడితనానికి అలవాటుపడు తు న్నారు. సామాజిక మాధ్యమాలు,మీడియా స్వయం నియంత్రణను పాటించకపోవడం వల్లే అవాంఛనీయధోరణులు పెరుగుతున్నాయన్నదిఅధిక సంఖ్యాకుల అభిప్రాయం. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో పేరొందిన ఒక వైద్య కళాశాల ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 70 మంది పైగా చిన్నారులు ప్రాణాలు వదిలిన ఘటన వైద్యరంగంలో మనవైఫల్యాలకు ప్రత్యక్ష నిదర్శనం. పట్టణాలు,నగరాల్లోనే ఆస్పత్రుల తీరు ఇలా ఉంటే గ్రామాలు,మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో పరిస్తితి ఎలా ఉందో మాటల్లో వర్ణించలేం. ఏజెన్సీ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు,రోగాల నుఅరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులు, కార్పొరేట్ విద్యాసంస్థల హవా పెరిగిపోవడంతో విద్య,ఆరోగ్యం వంటివి సామాన్యులకు అందని పండ్లమాదిరిగా తయారయ్యాయి. దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టన్న మహాత్మాగాంధీ ఏనాడో అరవైఏళ్ళ క్రితం అన్న మాటను ఏటా గుర్తు చేసుకుంటున్నాం తప్ప దానిని సాధించలేకపోతున్నాం.ఇలాంటి రుగ్మతలను పారద్రోలేందుకే ప్రధాని నరేంద్రమోడీ ఐదేళ్ళలో నవభారత్ నిర్మాణం కోసం ప్రతిన బూనాలని పిలుపు ఇచ్చారు. ఆ మహాసం కల్పయాత్రలో భాగస్వాములం కావడమే మన ముందున్న కర్తవ్యం.

మంచి మాట

చక్కని విద్య కంటే మించిన సిరిసంపదలు లేవు.



● జవహర్‌లాల్ నెహ్రూ

71 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఒకరు దయతలిచి ఇస్తే పుచ్చుకునేవి కావు.. పోరాడి సాధించుకునేవి.

శృంఖలాలు తెగిపడిందిలా...

తెల్లవాడి దాస్య శృంఖలాల నుంచి భారత దేశం 200 ఏళ్ళ అనంతరం విముక్తమైందని చెప్పుకోవడమే తప్ప ఆ కాలంలో పరిణామాలు ఈ తరం యువతకు అంతగా తెలియవు.. సిపాయిల తిరుగుబాటు నుంచి.. క్విట్ ఇండియా వరకూ సాగిన ఉద్యమాలు.. దాన్ని అణిచేసేందుకు బ్రిటిష్ దొరలు పన్నిన పన్నాగాలు తెలుసుకుని తీరాల్సినవే. విభజించి పాలించే విధానాన్ని విస్తృతంగా అమలుచేసి, భరత జాతిని ఇనుప బూట్ల కింద హింసించిన పాలన తీరును ఈ వ్యాసంలో వనం జ్వాలా నరసింహారావు వివరించారు.



బ్రిటిష్ వలస పాలన నుండి భారత దేశానికి విముక్తి కలిగించేందుకు జరిగిన ప్రప్రథమ స్వతంత్ర సంగ్రామం - 1857 నాటి సిపాయిల తిరుగుబాటు పర్యవసానంగా, ఆంగ్లేయుల దోపిడీ విధానంలో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. ఫ్యూడల్, జమీందారీ వర్గాలను పురికొల్పడం ద్వారా, బ్రిటిష్ వారి విభజించి పాలించే విధానం ఆరంభమైంది. పాశ్చాత్య ధోరణులు విపరీత పుంతలు తొక్కుతూ, జాతీయ వ్యతిరేక భావాలకు దారితీయడంతో, సహించలేని పలువురు సంఘ సంస్కర్తలు, భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావానికి పూర్వ రంగంలో, బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, ఆర్య సమాజం, థియోసాఫికల్ (బ్రహ్మ విద్య) ఉద్యమం, రామకృష్ణా మిషన్ లాంటి పునరుజ్జీవన - పునర్వికాస ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు.

లార్డ్ డఫరిన్ ఆశీస్సులతో ఆవిర్భవించిన భారతజాతీయ కాంగ్రెస్ బ్రిటిష్ వారి విభజించి పాలించే విధానంలో భాగమే. ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి పొందేందుకు, తమ ఆశీస్సులతోనే ఆవిర్భవించిన కాంగ్రెస్ పార్టీ ముసుగులో, భారత జాతీయ ఉద్యమం వేళ్లూనుకుంటున్న సంగతి అర్థం చేసుకోలేకపోయింది బ్రిటిష్ ప్రభుత్వం. కాంగ్రెస్ ఆవిర్భావపు తొలినాళ్లలో, మోడరేట్లుగా పిలువబడే మితవాద భావాల నాయకులు పార్టీనీ, పార్టీ కార్యకలాపాలనూ ప్రభావితం చేశారు. బ్రిటిష్ పాలకులు న్యాయంగా, ధర్మంగా వ్యవహరిస్తున్నారని కూడా అప్పట్లో వారి నమ్మకం. భావ స్వాతంత్ర్యానికి, పత్రికా స్వాతంత్ర్యానికి భంగం కలిగినప్పుడు జరిపిన పోరాటంలో తిలక్ లాంటి నాయకులను నిర్బంధంలోకి తీసుకుంది ప్రభుత్వం. మోడరేట్ల ప్రభావం క్రమేపీ క్షీణించి, మిలిటెంట్ భావాల వారి పలుకుబడి పెరగడంతో, పార్టీలో తీవ్రవాదుల ప్రాబల్యం మొదలయింది. అదికూడా ఒక విధంగా బ్రిటిష్ వారి విభజించి పాలించే విధానానికి అనుకూలంగానే కనిపించింది పాలకులకు.

లార్డ్ కర్జన్ తీసుకున్న బెంగాల్ విభజన నిర్ణయాన్ని నిరసిస్తూ, భారతీయ యువత, స్వదేశీ ఉద్యమం చేపట్టింది. అరబిందో, తిలక్, బిపిన్ పాల్ సహాయ నిరాకరణకు ఇచ్చిన పిలుపే, భవిష్యత్‌లో మహాత్మాగాంధీ, పెద్ద ఎత్తున చేపట్టారు. పూర్ణ స్వరాజ్యం స్వపరిపాలనాధికారం కావాలంటూ, బాలగంగాధర తిలక్ ఇతర అతివాద నాయకులు నినాదం లేవనెత్తటాలు ఇందులోనివే. 1907లో, కాంగ్రెస్ పార్టీలో చీలి కొచ్చి, మోడరేట్లు అతివాదులనుంచి విడిపోయారు. మోడరేట్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నంలో భాగంగా, అతివాదులపై మరిన్ని ఆంక్షలు విధించసాగారు బ్రిటిష్ పాలకులు.

భారత రాజకీయాలలో మహాత్మాగాంధీ ప్రవేశించిన తర్వాత స్వాతంత్ర్యోద్యమంపై ఆయన ప్రభావం పడింది. ప్రథమ ప్రపంచ సంగ్రామం ముగిసిన పిదప, బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా మొట్టమొదటి సారి జాతీయ స్థాయిలో సత్యాగ్రహం ఉద్యమానికి పిలుపునిచ్చారు గాంధీ. సెప్టెంబర్ 1920లో కలకత్తాలో నిర్వహించిన ప్రత్యేక కాంగ్రెస్ సమావేశాల్లో, లాలా లజపతిరాయ్, చిత్తరంజన్ దాస్ లాంటి నాయకులు వ్యతిరేకించినప్పటికీ, ఉద్యమం చేయాలన్న తీర్మానానికి పెద్దసంఖ్యలో మద్దతు లభించింది. మోతీలాల్ నెహ్రూ, గాంధి పక్షం వహించారు.

శాసనోల్లంఘన ఉద్యమానికి నాంది పలికిన గాంధీ, చౌరీ చౌరా సంఘటనలో పాతిక మంది పోలీసులు మరణించడంతో, సహాయనిరాకరణకు ఏకపక్షంగా స్వస్తి చెప్పారు. దరిమిలా, నవంబర్ - డిసెంబర్, 1922లో జరిగిన కలకత్తా, గయ కాంగ్రెస్ సమావేశాలలో చట్టసభల్లో ప్రవేశించే విషయంలో తీవ్ర అభిప్రాయ బేధాలొచ్చాయి. చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ ప్రభృతులు ఒకవైపు, రాజాజీ, అన్సారి ప్రభృతులు మరోవైపు వాదించారు. మాట నెగ్గించుకోలేని చిత్తరంజన్ దాస్ పార్టీకి రాజీనామా చేసి స్వరాజిస్ట్ పార్టీని స్థాపించారు. మోతీలాల్ నెహ్రూ ఆయన పక్షానే నిలిచారు. తండ్రి మోతీలాల్ స్థానంలో లాహోర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైన జవహర్‌లాల్ నాయకత్వంలో, డిసెంబర్ 31,1929 అర్ధరాత్రి, నూతన సంవత్సరం ఆరంభమవుతుండగా, పూర్ణస్వరాజ్ నినాదంతో, త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇక అప్పటినుంచి సత్యాగ్రహ శకం ఆరంభమయిందనాలి.


ఫిబ్రవరి 1930లో సబర్మతి ఆశ్రమంలో సమావేశమైన అఖిల భారత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, శాసనోల్లంఘన ఉద్యమం విషయంలో నిర్ణయాధికారం గాంధీజీకి వదిలింది. మార్చి 12, 1930 న చారిత్రాత్మక దండి సత్యాగ్రహానికి నాంది పలికారు. అప్పటికింకా గాంధీని అరెస్ట్ చేయలేదుగానీ, వల్లభాయ్ పటేల్ లాంటి నాయకులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ఏప్రిల్ 5, 1930 నాటికి దండి చేరుకుంది గాంధీజీ బృందం. సముద్రపు ఒడ్డున పిడికెడు ఉప్పును చేతబట్టి, ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించామని, ఇకముందు చట్టాన్ని ఉల్లంఘించి ప్రతి పౌరుడు తాము అనుకున్న స్థలంలో ఉప్పు తయారు చేసుకోవచ్చని పిలుపిచ్చారు. ఉప్పు కర్మాగారాలపై దాడి చేస్తామని మరో లేఖను వైస్రాయ్‌కు రాయడంతో, గాంధీజీని అరెస్టు చేసి ఎరవాడ జైలుకు తరలించింది బ్రిటిష్ ప్రభుత్వం. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని చట్టవిరుద్ధ సంస్థగా పేర్కొంటూ, మోతీలాల్ నెహ్రూను కూడా అరెస్ట్‌చేసింది ప్రభుత్వం.

గాంధీ - ఇర్విన్ మధ్య కుదిరిన ఒప్పందం అమలులో పూర్తిగా విఫలమైంది. ఇంగ్లాండ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన గాంధీజీ, రిక్త హస్తాలతో స్వదేశానికి తిరిగొచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ వంటి నాయకులను మరోసారి అరెస్టు చేసింది ప్రభుత్వం. జనవరి 4, 1932న గాంధీజీతో పాటు పలువురు అగ్రశ్రేణి నాయకులను అరెస్టు చేయడంతో సహా, కాంగ్రెస్ పార్టీని చట్టవ్యతిరేక సంస్థగా నిర్ణయించింది ప్రభుత్వం. సెప్టెంబర్ 1940లో, భావ స్వాతంత్ర్యాన్ని కాపాడాలంటూ, కాంగ్రెస్ నాయకత్వం సత్యాగ్రహానికి దిగింది. మొదటి సత్యాగ్రహి వినోభా భావే కాగా, జవహర్‌లాల్ నెహ్రూ ఆయన తర్వాత సత్యాగ్రహి. అరెస్టయిన నెహ్రూకు నాలుగేళ్ల కారాగార శిక్ష పడింది. జులై 14, 1942 న, వార్ధాలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, క్విట్ ఇండియా డిమాండ్ చేయాలని తీర్మానించింది. ఆగస్టు 7, 1942న బాంబేలో సమావేశమైన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, ఆ మర్నాడు ఆగస్టు 8, 1942న, జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన, క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ తీర్మానాన్ని బలపర్చారు. తీర్మానంలో చివరగా స్వతంత్ర భారతదేశం కావాలన్న వాంఛ వున్నప్పటికీ, దానికి సామూహిక ప్రజాఉద్యమం చేపట్టున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి అధికారం చేపట్టాలన్న ఉద్దేశం లేదు. అధికారం ఎప్పుడొచ్చినా, అది ప్రజలకే చెందుతుంది అని పేర్కొనడం జరిగింది. కాకపోతే స్వతంత్రం వచ్చిన నలభై సంవత్సరాల వరకు అధికారం కాంగ్రెస్ పార్టీ చేతుల్లోనే ఉంది. తీర్మానం ఆమోదించిన మరుక్షణమే మాట్లాడిన గాంధీజీ, తాను తక్షణమే, వీలుంటే ఆ రాత్రే - తెల్లవారే లోపునే స్వరాజ్యం కావాలని కోరుకుంటున్నానని అన్నారు. ఆగస్టు 8, 1942 న తెల్లవారకముందే, ప్రభుత్వం వేసుకున్న పటిష్ఠమైన ప్రణాళిక ప్రకారం, గాంధీజీతో సహా కాంగ్రెస్ నాయకులందరినీ నిర్బంధంలోకి తీసుకుని, రహస్య ప్రదేశాలకు తరలించింది. పార్టీకి అనుబంధంగా ఉన్న అన్ని సంస్థలను, వ్యవస్థలను నిషేధించింది. ఖాదీ హరిజన సంస్థల లాంటి సాంఘిక కార్యకలాపాలను కూడా నిషేధించింది. ప్రజలనుంచి కూడా అదే మోతాదులో ప్రతిఘటన ఎదురైంది. ముంబాయిలో పోలీసు హెచ్చరికలను లక్ష్య పెట్టకుండా అరుణా అసఫ్ అలీ ఝుండా ఎగురవేసింది. ఒకవైపు క్విట్ ఇండియా ఉద్యమం,

మరోపక్క అజాద్ హింద్ ఫౌజ్ ప్రభావం, ఇంకో దిశగా మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిటన్ ప్రధాని విన్ స్టన్ చర్చిల్ ఓటమి, బ్రిటిష్ ప్రభుత్వాన్ని కలవర పరిచాయి. చర్చిల్ వారసుడు క్లెమెంట్ అట్లీ, త్రిసభ్య కాబినెట్ కమిటీని నియమించి, ఆ కమిటీ భారత దేశాన్ని సందర్శించనున్నదని ఫిబ్రవరి 19, 1946 న ప్రకటించారు. కమిటీతో చర్చలకు పాకిస్తాన్ ఏర్పాటు ప్రాతిపదిక కావాలని జిన్నా అభిప్రాయపడ్డారు. త్రిసభ్య కాబినెట్ మిషన్‌తో రాజకీయ నాయకుల చర్చలు సఫలం కాలేదు. ఇంతలో, కాంగ్రెస్ పార్టీకి చెందిన బడుగు దళిత వర్గాల వ్యక్తితో కలిపి ఆరుగురు హిందువులు, ముస్లిం లీగ్‌కు చెందిన ఐదుగురు ముస్లింలు, ఒక సిక్కు, ఒక క్రిస్టియన్, ఒక పార్సీ మొత్తం పద్నాలుగురుండే మధ్యంతర ప్రభుత్వాన్ని ప్రకటించాడు వైస్రాయ్. ఆ ప్రతిపాదనను కాంగ్రెస్ వ్యతిరేకించడంతో, తాత్కాలికంగా, అధికారులతో కూడిన ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని ప్రకటించారు వైస్రాయ్. తదనంతరం, వైస్రాయ్ ఆహ్వానం మేరకు, ఆరుగురు హిందువులతో, ముగ్గురు ముస్లింలతో, ఒక సిక్కు, ఒక క్రిస్టియన్, ఒక పార్సీలతో జవహర్‌లాల్

నాయకత్వంలో ఏర్పాటైన ప్రభుత్వం సెప్టెంబర్ 2, 1946న అధికారాన్ని చేపట్టింది. అక్టోబర్ చివరి వారంలో ముస్లిం లీగ్ కూడా షరతులతో ప్రభుత్వంలో చేరింది. 1946-1947 మధ్యకాలంలో మత ఘర్షణలు చోటు చేసుకున్నాయి. భారీ సంఖ్యలో హిందువులకు ప్రాణ ఆస్తి నష్టం కలిగింది. నవంబర్ 1946లో గాంధీజీ నవొకాళీకి వెళ్లి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. మధ్యంతర ప్రభుత్వం తీసుకున్న తక్షణ చర్యలు పరిస్థితిని కుదుటబర్చాయి. దేశ విభజన జరగాలన్న మౌంట్ బాటన్ ప్రణాళికకు కాంగ్రెస్ పార్టీ ఆమోదం తెలిపింది. గాంధీజీకి విభజన ఇష్టంలేదు. వ్యతిరేకిస్తే విప్లవం మినహా మార్గాంతరం లేదని కూడా ఆయనకు తెలుసు. అలనాటి సంఘటనలను భారత ఆత్మ సంక్షోభంగా అభివర్ణించారు జవహర్‌లాల్ నెహ్రూ. లక్షలాది భారతీయుల ఇక్కట్ల త్యాగాల ఫలితంగా, ఆగస్టు 14 - 15 అర్ధరాత్రి సమయంలో, పాకిస్తాన్ భూభాగం భారతదేశం నుంచి విడిపోయిందన్న అశేష జనవాహిని మనస్థాపం మధ్య సంపూర్ణ స్వతంత్రం సిద్ధించింది భారతావనికి. క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన ఆగస్టు 9, స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్ట్ 15 భారతీయులకు అసలైన పండుగ దినాలు.

ప్రజాస్వామ్యానికి ప్రణామం



విశ్లేషణ

అనిత నల్లూజ
సీనియర్ పాత్రికేయురాలు

మనం లక్ష్యాలను సాధించాలనే చూస్తున్నాం తప్ప.. సమాజం బాగుపై దృష్టి సారించలేకపోతున్నాం. కిందిస్థాయిలో భారత్‌ను విస్మరిస్తున్నాం. ఫలితంగా అది దృష్టి నుంచి కనుమరుగవుతోంది. మనం పదిమందితో ఆహారాన్ని పంచుకోవడం మాని పక్కవారి వంటగదిలోకి చొచ్చుకుపోతున్నాం.

స్వతంత్ర భారత్ వయసు ఇప్పుడు 70ఏళ్ళు. బ్రిటిష్ ఇనుప సంకెళ్ళ నుంచి స్వాతంత్ర్యం పొందిన దేశానికి స్వేచ్ఛా ఊపిరులు పీల్చుకునేందుకు ఎన్నో సహేతుకమైన కారణాలున్నాయి. అభివృద్ధి ముద్రలు, ప్రపంచ స్థాయిలో గుర్తింపు, పెరుగుతున్న యువతరం మేథోశక్తి, ప్రత్యేకించి ఐటీ రంగంలో ప్రతిభ దేశాన్ని అంతర్జాతీయ సమాజంలో తలెత్తుకుని నిలబడేలా చేస్తోంది.


మన చుట్టూ ఉన్న దేశాలను పరికించుకుంటే, దళితుడు రాష్ట్రపతిగా, రైతు ఉప రాష్ట్రపతిగా, చాయ్‌వాలా ప్రధానిగా ఉన్న అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనని మనం అభినందించుకోవాలి. 2022నాటికి అభివృద్ధి చెందిన దేశంగా 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకునే దిశగా అడుగులేస్తున్న భారత్ వెలుగులీనుతూ ప్రకాశిస్తోంది. కానీ, మనలో ఓ అంతర్మథనం ఉంది. మనం నిజంగా మన లక్ష్యాలను సాధించామా అనేదే ఆ మథనం. ఎందరో స్వాతంత్ర్యోద్యమకారులు తమ ప్రాణాలను పణంగా పెట్టి స్వాతంత్ర్యాన్ని సాధించారు. మహాత్మ గాంధీ జీవించి ఉంటే.. ఈరోజు సంతోషంగా ఉండేవారా అని ప్రశ్నించుకుంటే లేదనే సమాధానమొస్తుంది. రాష్ట్రపతి లేదా ప్రధాన మంత్రి ఇలా ఎవర్నైనా విమర్శించే స్వాతంత్ర్యం మనకుంది. కానీ, మనం కోరుకునేది (బీఫ్) తినే స్వాతంత్ర్యం లేదు. మనం ఇష్టప్రకారం వివాహం చేసుకునే స్వాతంత్ర్యం లేదు. స్వేచ్ఛగా తిరగలేం... ముఖ్యంగా ఆడవారు. శాంతి, భద్రతలు అంతగా క్షీణించిపోయాయి. స్మశానాలకు ఇంకా కొబ్బరికాయలు కడుతూనే ఉన్నాం. పేదరికం నుంచి మనకింకా స్వాతంత్ర్యం సిద్ధించాల్సి ఉంది. మత, కుల విద్వేషాలకూ ఇంకా అతీతులం కాలేకపోతున్నాం. ప్రస్తుతం అవి ఎప్పుడూ లేనంత తీవ్ర స్థాయిలో ఉన్నాయి. దీనికి కారణమైన రాజకీయనేతలకు కృతజ్ఞతలు చెప్పకుండా ఉండలేం. మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక మాధ్యమం లోనూ మనం ఎంతో పురోగతిని



సాధించాం.. మన నగరాలు ఎంతో ఎత్తుకు సంఖ్యాప రంగా ఎదుగుతు న్నా యి. దీనికి ప్రతి భారతీయుడూ ఎంతో ఉప్పొంగి పోతున్నాడు. కానీ మనలో మనం ఆలోచించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అభద్రతాభావం, హింస తత్వాలు సమాజం నుంచి చెరిగిపోవాలి. అభివృద్ధి చెందిన ఆర్థిక శక్తులతో పోటీపడాలంటే ఇది తప్పని సరి. భారత్ విషయంలో ప్రజాస్వామ్యం జీవించి ఉంది. ఎవరినైనా అధికారంనుంచి తొలగించేశక్తి ఉంది. ఇది అభినందించదగ్గది. మన చేతుల్లో ఓటు శక్తుంది. దీన్నెవరూ మననుంచి వేరు చేయలేరు. దొంగిలించుకుని పోలేరు. దేశంలోని ప్రజలు ప్రత్యేకించి యువత తెలివైనది. అప్రమత్తంగానూ ఉంటోంది. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టంగా ఉంచడంలో వారు తోడ్పడుతున్నారు. ఓటింగ్ వ్యవస్థ, ఎల్కట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సక్రమంగా పనిచేసినంత కాలం, మనం ఎవరి గురించీ భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మనక్కావాల్సిన వారిని ఎన్నుకోగలం, అవసరం లేకపోతే.. అధికారం నుంచి దింపేయగలం. మన చేతిలో నిర్ణయాధికారం ఉన్నంత కాలం మనం స్వాతంత్రులం. అందుకే మనం దేశానికీ, జాతీయ గీతాలైన జనగణమన, వందేమాతరాలకు శాల్యూట్ చేయగలం. వందనం చేయనన్న వారిని మనతో కలవమని ఒత్తిడి చేయాల్సిన అవసరం లేదు. వారే క్రమేపీ మన దారిలోకి వస్తారు.. మనం చూపించే ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు అర్థం చేసుకున్న నాడు వారే మన జెండాకు వందనం చేస్తారు.

70 కోట్ల మందికి దక్కని స్వాతంత్ర్య ఫలాలు

ప్రతి ఏడాది మాదిరిగానే ఈ యేడు కూడా ఈ రోజు యావత్ దేశ ప్రజలు ఉత్సవాలు జరుపుకుంటున్నారు. ఈ 70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇంకా 70 కోట్ల మందికి స్వాతంత్ర్య ఫలాలు దక్కని విషయం గురించి నేటి పాలకులు, ఉన్నతాధికారులు, మేధావులు ఈ సందర్భంగా ఒకసారి ఆలోచించాల్సి ఉంది. భారతదేశ జనాభా 130 కోట్లు అనే విషయం అందరికీ తెలిసిందే. ఇందులో ఇంకా సగానికి పైగా దేశ ప్రజలు వివిధ సమస్యలతో కునారిల్లుతున్నారంటే... ఇందుకు పాలకులది తప్పా? చైతన్యవంతులు కాని ప్రజలది తప్పా? అని యావన్మంది ఆలోచించుకోవాలి. శాస్త్ర సాంకేతిక ఫలాలు ప్రజల గుప్పెట్లోకి వచ్చాయి. మొత్తం ప్రపంచం ఒక కుగ్రామంలా మారింది. గూగుల్ వ్యవస్థ ద్వారా దేశ ప్రజలలో సరాసరిన 60 శాతం మందికి స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి రావడంతో అరచేతిలో ప్రపంచం కనబడుతోంది. అయినా... మనదేశంలో 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు, 29 ప్రధాన పండుగలు, 16 ప్రధాన భాషలు, 15 లిఖిత భాషలు, 1600 చిన్న భాషలు, మాండలికాలు, 6400 కులాలు, ఉపకులాలు, 1600 అణగారిన కులాలు, 52 ప్రధాన గిరిజన తెగలు, 6 ప్రధాన మతాలు నేటికీ కొనసాగుతూ ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కోవిధంగా ఆర్థిక అసమానత్వం, అంతరాల తారతమ్యాలు తిష్టవేయడం చాలా బాధాకరం. ప్రజల కొరకు, ప్రజలచేత, ప్రజలకోసం రూపొందించ బడిన ప్రజాస్వామ్యం ధనస్వామ్యంలా మారినందుకే ప్రస్తుత లోక్‌సభలో 442 మంది కోటీశ్వరులు కొనసాగుతున్నారు. రాజ్యం బలవంతుని స్వార్థం అనే విధంగా పరిస్థితులు మారినందున 30 కోట్ల మంది ప్రజలు ఇంకా దారిద్ర్యరేఖకు దిగువన బతుకుతున్నారు. ఒకే కులం, ఒకే మతం, ఒకే ప్రజ, ఒకే దేశం, ఒకే చట్టం అనేవి నెరవేరని నినాదాలుగానే మిగిలిపోతు న్నాయి. చట్టాలు కొంతమందికి చుట్టాలు గా మారినందున అణగారిన వర్గాలకూ, అమాయకు లకూ, నిరుపేదలకూ ప్రాథమిక హక్కులనేవి లేకుండా అంతరించిపోతు న్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాలలో అంటరానితనం కొనసాగుతుండటం, దళితులకు ఆలయ ప్రవేశం లేకుండా వ్యవహరిస్తుండటం, మురికివాసుల ప్రజలను అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల సమయంలో కిరాయి కార్యకర్తలుగా ముసరకోసం వస్తున్న జనాలుగా భావిస్తుండడం చాలా బాధాకరం. 1981 లో మురికివాడల్లో 3 కోట్లమందుంటే నేడు వారి సంఖ్య 10 కోట్లు కావడం మన పాలకుల దమననీతికి నిదర్శనం. భారత



వృద్ధిరేటు 8 శాతం స్థిరంగా ఉందని ప్రగల్భాలు పలుకుతున్న నాయకులు 40 కోట్ల మంది దరిద్రులకు కరెంటు, మంచినీరు, గ్యాస్, స్వంత ఇళ్లు లేవనే అంశాన్ని తెలుసుకోవాలి. వందమంది కుబేరుల గుప్పెట్లో పాలకులు పావులుగా మారడం, ప్రపంచ బ్యాంకు ఇస్తున్న అప్పులతో ప్రభుత్వాలు మనుగడ సాగిస్తూ దాసోహం కావడం మరీ దారుణ పరిణామం. కావున నేటి స్వరాజ్యం కొంతమంది స్వార్థపరులకు భోజ్యం అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు.

తిప్పినేని రామదాసప్ప నాయుడు,
9989818212

స్వాతంత్ర్యం.. స్వేచ్ఛ

స్వతంత్ర ఏడు దశాబ్దాల ఉత్సవ
వేళ...
మన మననం.. గమనం.. గమ్యం..
నాడు - నేడు
స్వతంత్ర్యం మా జన్మహక్కని
ఇంక్విలాబ్ మా ఇజమని
వందేమాతరమే భారతజాతి
జనగళమై...
క్విట్ ఇండియా జనగర్జనల హోరులో
వలస పాలన కొట్టుకపోయి తీరం
దాటింది.
నాటి జాతిజనుల పోరును
అమరుల త్యాగాల కీర్తి, తరాలు
మారిన మరువనిది.
అక్షర జ్ఞానం, విజ్ఞానం,
కొద్దిమాత్రమైన
భరతజాతి స్వేచ్ఛా పంజర విహంగ
విముక్తికై
ధన, మాన, ప్రాణాలను
తృణప్రాయంగ వదిలిన త్యాగం
ముందు
మనమెంత? మనదెంత??
మనమిప్పుడు ఎక్కడ???
స్వేచ్ఛలో స్వార్థం పెరిగింది.
స్వతంత్ర్యంలో విచ్చలవిడితనానికి
మరిగి
మిడిసిపాటుతో, తోటివారి హక్కులను
హరించుడేంది?
ధనార్జనే పాలకులకు మహాభాగ్యమై...
పాలితుల నెత్తిన దౌర్భాగ్యమై
కూర్చుంది.
ఇదేనా మనవాళ్లు కోరిన స్వేచ్ఛా?
అసమానతలు లేని ఆర్థిక సామాజిక
సమసమాజ నిర్మాణమే
నాటి త్యాగధనులకు మనమిచ్చే
నిజమైన నివాళి.... అందుకు
పాలకులు, పాలితులు
దృఢమైన ప్రతిజ్ఞ పూని, పాలనతో
ప్రజల చెంతకు ఫలాలను చేర్చి,
ప్రపంచాన మేటిగా నిలుద్దాం...

-మేకిరి దామోదర్, 9573666650





కెఎన్ఎన్, సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట కోమటి చెరువు వద్ద నిర్మించే అడ్వంచర్ గేమ్స్, రోఫ్ వేలు నెల రోజుల్లో అందుబాటులోకి తేనున్నట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు సూచించారు.

నెల రోజుల్లో రోప్‌వేల ఏర్పాటు

సోమవారం ఉదయం సిద్దిపేట మినీ ట్యాంకు బండ్‌పై మార్నింగ్ వాకింగ్ చేస్తూ పనులపై ఎప్పటికప్పుడు ఆయా శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. సిద్దిపేట పట్టణానికి తలమానికైన కోమటి చెరువును రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలిపేందుకు హైద్రాబాద్‌లాంటి ప్రాంతంలో ఉండే థ్రిల్లింగ్ గేమ్స్‌ను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. కోమటి చెరువు సుందరీకరణ సిద్దిపేట పట్టణానికి ఎంతో అందాన్ని తెచ్చిందని సిద్దిపేటకు ఆహ్లాదం, ఉల్లాసం అనుభూతి ఇచ్చే విధంగా అడ్వంజర్ గేమ్స్, రోఫ్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం కట్టపై వాకింగ్ చేస్తూనే కట్టపై జరుగుతున్న పనులను పరిశీలిస్తూ చెట్లను వాష్ చేస్తూ సూచనలు చేశారు. మత్తడి ప్రాంతంలో క్రింది వైపు ఎత్తు పెరగడంతో నీరు మళ్లీ వెనుకకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఈఈ రవీందర్‌రెడ్డిని ఫోన్‌లో ఆదేశించారు. వాకింగ్ టాక్‌పై ఉన్న చెట్లకు అందం వచ్చే విధంగా చుట్టూ సిమెంట్ కట్టి ముగ్గులు వేయాలని సూచించారు. కట్టపై నుండి గంగమ్మ దేవాలయం వెనుక వైపు నుండి ఆడిటోరియం వైపుకు వెళ్లేందుకు వీలుగా పార్కింగ్ డయాస్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కోమటి చెరువుపై కాసేపు సేద తీరిన మంత్రి వివిధ పత్రికల వార్తలు చదివారు. పత్రికలలో వచ్చిన కథనాలపై అప్పటికప్పుడే అధికారులకు సూచనలు ఇచ్చారు.

ఇసుక మాఫియా ఆగడాలు ఆపించండి

- గవర్నర్‌కు అఖిలపక్ష నేతల వినతి పత్రం
- సానుకూలంగా స్పందించారని వెల్లడి
- 21, 22 తేదిల్లో రాష్ట్రపతి వద్దకు అఖిలపక్షం: ఉత్తమ్
- ఇసుక మాఫియా వెనుక కేసీఆర్ కుటుంబం: రమణ
- న్యాయం జరక్కపోతే సమైక్య పోరాటం: డాక్టర్ లక్ష్మణ్
- ఎస్పీని ఎందుకు సస్పెండ్ చేయడం లేదు: చాడ
- మానవత్వం ఉంటే కేసీఆర్ నేరెళ్లకు వెళ్లాలి: మోత్కుపల్లి
- నేరెళ్లలో ఉద్దేశ్యపూర్వకంగా చట్టం ఉల్లంఘన: కోదండరాం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నేరెళ్లలో దళితులు,బీసీలపై పోలీస్ దమనకాండకు నిరసనగా రాష్ట్రంలోని విపక్షాలన్నీ ఏకమయ్యాయి. బాధితులకు న్యాయం చేయాలని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ,సీపీఐ, ఆప్, పొలిటికల్ జేఏసీ, ఇతర వామపక్షపార్టీలు ఏకమయ్యాయి. అఖిలపక్షంగా ఏర్పడి రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను సోమవారం కలిసి నేరెళ్ల బాధితుల గోడును వినిపించారు. సమస్య పట్ల గవర్నర్ సానుకూలంగా వ్యవహరించారని నాయకులు చెప్పారు. ఇక్కడ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 21,22 తేదీలలో ఢిల్లీలో రాష్ట్ర పతిని కలిసి వినతిపత్రం సమర్పిస్తామని ప్రకటించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, సీఎల్పీ నాయకుడు కె జానారెడ్డి, మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్యే ఎస్ఎ సంపత్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ చింతా సాంబమూర్తి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యుడు బాల మల్లేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ రేవంత్ రెడ్డి, పోలిట్ బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు , ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్ రావు, తెలంగాణ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, నాయకులు ఇటిక్యాల పురుషోత్తం, తదితరులు కలిశారు. మూడు పేజీల వినతిపత్రాన్ని గవర్నర్‌కు సమర్పించారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో మానవహక్కుల హననం జరుగుతోందని మండిపడ్డారు. ఖమ్మంలో మద్దతు ధరను డిమాండ్ చేసిన గిరిజన రైతులకు ప్రభుత్వం బేడీలు వేసి అమానుషంగా వ్యవహరించగా, నేరెళ్లలో 8మంది యువకులను అత్యంత



క్రూరంగా హింసించిందని మండిపడ్డారు.

రాష్ట్రంలో దళిత, గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు.నేరెళ్లలో ఇసుక మాఫియా కేసీఆర్ కుటుంబం గుప్పిట్లోఉందని, వారి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ విశ్వజిత్ థర్డ్ డిగ్రీ పద్దతులు అవలంభించి వారిని పనికిరాకుండా చేశారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రైవేట్ పార్టులపై కరెంట్ షాక్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని ఉత్తమ్ చెప్పారు. బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.ఐపీఎస్ అధికారులు టీఆర్ఎస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంగా వ్యవహరిస్తే ఎలా అని ఉత్తమ్ ప్రశ్నించారు. దళిత, గిరిజనులపై ప్రభుత్వ వేధింపులకు నిరసనగా ఈ నెల 21,22 తేదీల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు.

బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ, నేరెళ్లలో పోలీసులు దమనకాండకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ వ్యవహారంపై జాతీయ ఎస్సీ కమిషన్ ఇచ్చిన ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎస్ఐని తప్పించి చేతులు దులుపుకోవాలని చూస్తోందని, అలాంటి చర్యలను సహించే ప్రసక్తిలేదని హెచ్చరించారు.

టీటీడీపీ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ, కేసీఆర్ ఫ్యామిలీ ధనదాహానికి యువకులు హింసకు గురయ్యారని ఆరోపించారు. కేటీఆర్‌కు ఏ మాత్రం నైతికి విలువలు ఉన్నా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, చిత్రహింసలకు సారథ్యం వహించిన ఎస్పీ విశ్వజిత్‌నుఎందుకు సస్పెండ్ చేయడం లేదని ప్రశ్నించారు. పోలీసులపై ఎస్సీ,ఎస్టీచట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియా గుట్టురట్టు చేయాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు.

మోత్కుపల్లి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్‌కు మానవత్వం ఉంటే నేరెళ్లకు వెళ్లి బాధితులను పరామర్శించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే,మంత్రి కేటీఆర్ ఘటన తెలియదని బుకాయించ డాన్ని మోత్కుపల్లి తప్పుబట్టారు.నేరెళ్ల దళితులు,బీసీలు దొంగలా...క్రిమినల్సా ఎందుకు అంత విపరీతంగా హింసించారని మండిపడ్డారు.

కోదండరాం మాట్లాడుతూ, ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే నేరెళ్లలో చట్ట ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. గుప్పెడు ఇసుక మాఫియా కోసమే చట్టాలను తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసులు హింసకు పాల్పడ్డారని చెప్పారు. విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ ఘటనలో ఎస్పీతో సహా 18 మంది పోలీసుల హస్తం ఉందన్నారు.

వాణిజ్య యుద్ధం తప్పదేమో?

(మొదటి పేజీ తరువాయి)

దిగి వస్తుందని విశ్లేషకుల అంచనా. డొక్లాంలో చైనా నిర్మించడానికి పూనుకున్న రోడ్డు భారత్‌కు ఇతర రాష్ట్రా లనుంచి ఈశాన్య రాష్ట్రాలకు లింకును కట్ చేస్తుంది. దీంతో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇదే కనుక మరింత ముదిరితే, భారత్‌లో పెట్టుబడులు పెట్టకుండా తమ కంపెనీలకు చైనా నిలువరించవచ్చని పత్రిక ఊహించింది. అసలు చైనా వస్తువులను బహిష్కరించడం భారత్‌కు నష్టమని మరో వార్త రాసేసింది. డొక్లాం నేపథ్యంలో భారత్ అనవసరంగా చైనాతో వాణిజ్య యుద్ధాన్ని కొనితెచ్చుకుంటోందని విశ్లేషించింది. భారత్ తీసుకుంటున్న చర్యలు వారినే భవిష్యత్‌లో దెబ్బ తీస్తాయని శాపనార్థాలూ పెట్టింది. చైనాపై అలిగితే భారత్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని ఊహాగానాలు చేసింది. చైనా సెల్‌ఫోన్లను నిషేధించినా, చైనా కంపెనీలను భారత్‌లో మూసివేసినా భారత్‌కే నష్టమని అంచనా వేసింది.

ఇక్కడ భారత్‌ను తెగనాడిన చైనా మీడియా అంతటితో ఊరుకోలేదు. డొక్లాం నేపథ్యంలో ఉత్తర కొరియాపై నోరు పెంచిన అమెరికాను కూడా బెదిరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాతో వాణిజ్య యుద్ధానికి దిగుతున్నారంది. అమెరికా సాంకేతికతను చైనా దొంగిలిస్తోందన్న విషయంలో ఆయన విచారణ చేపడితే ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధమే రావచ్చని హెచ్చరించింది. చైనా వాణిజ్య శాఖ పరిశోధకుడు రాసిన ఈ వార్తలో చైనాలో వాడుతున్న సాంకేతికతలపై అమెరికా విచారణ చేపడతుందని, అది ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచుతుందని ఆయన అంచనా వేసారు. మేధో సంపత్తి హక్కుల చట్టాన్ని ట్రంప్ ప్రయోగిస్తే ఇరు దేశాలకూ మంచిది కాదని హెచ్చరించింది. ఈ విషయమై అమెరికా ప్రకటన మీద చైనా మాత్రం అధికారికంగా ఇంకా స్పందించలేదు.

ప్రజాక్షేత్రంలోనే విపక్షాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లోనే.. అష్టదిగ్బంధం చేసి ఓడించే లక్ష్యంతో వ్యూహం రూపొందిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అంచనాలను తల్లకిందులు చేసి ఒంటిచేత్తో టీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్.. అధికారం నిలుపుకునే దిశగా, వరుసగా రెండోసారి గులాబీజెండా ఎగురవేసేదిశగా రాజకీయ వ్యూహాలు రూపొందిస్తున్నారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 111సీట్లు గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్న టీఆర్ఎస్, పలుమార్లు నిర్వహించిన సర్వేలలో ప్రజాదరణ తమకే ఉన్నట్లు ప్రకటించింది. ఇటీవల కాలంలో విపక్షనేతలు కార్యక్రమాల జోరు పెంచగా, కీలక నేతలుగా భావిస్తున్న వారు.. వివిధ కార్యక్రమాల పేరుతో తమ నియోజకవర్గాలు దాటి ఇతర ప్రాంతాల్లో బాగా తిరుగుతున్నారు.

విపక్ష కాంగ్రెస్‌కు పూర్వ నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలు బలమైన స్థావరాలుగా ఉండగా, ఆ రెండు జిల్లాల నుండే ప్రస్తుతం 8మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. నల్లగొండ ప్రాంతం నుండి సీఎం కేసీఆర్ పోటీచేయడం ఖాయమన్న ప్రచారం గత కొంతకాలంగా జరుగుతుండగా.. ఇటీవల గజ్వేల్ నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు కూడా దీనిని ప్రస్తావించారు. సీఎం గారు పోటీచేయాలని నల్లగొండ ప్రజలు కోరుకుంటున్నారు అంటూ ఫీలర్ వదిలారు. నల్లగొండ రాజకీయాల్లో ఇది కలకలం రేపుతోంది. నల్లగొండలో బలమైన నేతలుగా ఉన్న జానారెడ్డి నాగార్జున సాగర్‌కు, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గానికి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఈ మూడు నియోజకవర్గాల్లో బలమైన నేతలను రంగంలోకి దింపేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. నల్లగొండ ప్రాంతం నుండి సీఎం పోటీ చేయాలనుకుంటే హుజూర్‌నగర్ లేదా నల్లగొండ నియోజకవర్గం నుండి పోటీచేసే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ, కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిలకు చెక్ చెప్పేందుకు టీఆర్ఎస్ అస్త్రాలను సిద్ధం చేస్తోంది. జగిత్యాల నుండి కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉపనేత జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఇక్కడి నుండి నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత బరిలోకి దిగవచ్చన్న ప్రచారం చాలాకాలంగా ఉంది. కవిత పోటీచేస్తే జీవన్‌రెడ్డి కాళ్ళకు బంధం వేసినట్లేనని భావిస్తున్నారు. టీడీపీ నేత రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌పైనా ప్రత్యేక వ్యూహరచన చేస్తున్నారు. నేతలను దిగ్బంధించేందుకు.. స్థానిక నేతలు సరిపోరని భావిస్తే ఎంపీ లేదా మంత్రులను రంగంలోకి దించి ముచ్చెమటలు పట్టించాలని వ్యూహరచన చేస్తోంది.

టీఆర్ఎస్‌కు బలమైన నేతల సంఖ్య భారీగా ఉండగా, విపక్ష సీనియర్ నేతల నియోజకవర్గాల్లో ఎవరిని పోటీకి దించాలా అని ఆలోచనలు చేస్తోంది. సొంత పార్టీ ఎమ్మెల్యేల బలాలు, బలహీనతలతో పాటు ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేల బలాలు, బలహీనతలు కూడా సర్వేల ద్వారా తెలుసుకుంటున్న సీఎం కేసీఆర్ నివేదికలకు అనుగుణంగా వ్యూహాలకు పదునుపెడుతున్నారు. సీనియర్ నేతలకు నియోజకవర్గాల్లోని ఏ ప్రాంతాల్లో పట్టు ఉంది.. బలాలేంటి, బలహీనతలేంటి.. వారి గెలుపుకు దోహదపడ్డ ఫ్యాక్టర్ ఏంటి.. ఓడించాలంటే ఏం చేయాలి.. ఏ జాగ్రత్తలు తీసుకోవాలి.. ఏయే అంశాలు ప్రభావం చూపుతాయి వంటి వాటిపై నివేదికలు తెప్పించుకుంటున్నారు.

ఇక కొందరు బలమైన సీనియర్లు గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో.. ఓడగా, తిరిగి వారు కోలుకోకుండా చేసేందుకు అవసరమైతే అభ్యర్థుల మార్పు వ్యూహం కూడా యోచిస్తున్నారు. సీనియర్ నేతలకు సొంత నియోజకవర్గ టెన్షన్ సృష్టించడం, మాజీలు మళ్ళీ క్రియాశీలం కాకుండా చేయడం.. వంటి ఆలోచనలతో 2019లో మళ్ళీ జైత్రయాత్ర కొనసాగించాలని కసరత్తులు చేస్తోంది.

చెత్తకుప్పలో పేలుడు కలకలం




మియాపూర్, కెఎన్ఎన్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెత్తకుప్పల్లో సోమవారం బారీ పేలుళ్లు సంభవించి స్థానికంగా కలకలం సృష్టిచాయి. మియాపూర్ మెట్రో డిపోకు సమీపంలోని చెత్త కుప్పలో ఈ పేలుళ్లు జరగడంతో ఓ గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దింతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. విషయాన్ని స్థానికులు పోలీసులకు చేరవేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. మియాపూర్ ఏసీపీ రవికుమార్, మియాపూర్ సీఐ హరిశ్చంద్రారెడ్డి, ఎస్సైలు యాదయ్య, అప్పారావు, భూపాల్, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం తో తనిఖీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే మియాపూర్ న్యూకాలనీ ఓం కార్‌నగర్‌లో గుడిసెల్లో చెత్తను తరలించే కార్మికులు నివాసముంటున్నారు. గతంలో ఈ ప్రదేశంలో చెత్తను డంపింగ్ చేసేవారు. సోమవారం ఇదే స్థలంలో ఓ గెదె గడ్డి మేస్తూ అక్కడ తిరుగుతుండగా ఒక్కసారిగా బారీ శబ్ధంతో పైలుళ్లు జరిగాయి. గేదే గడ్డితో పాటు చెత్తలో ఉన్న పేలుడు పదార్థాల ముద్దను గట్టిక కొరకడంతో పెలుడు సంభవించి ఉంటుందని పోలీసులు బావిస్తున్నారు. అయితె ఈ బాంబులో ఉన్న పదార్థం ఏమిటి..?, ఇక్కడకు ఎలా వచ్చిందనే కోణంలో పోలీసులు ధర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసులు సంఘటన స్థలానికి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేపట్టారు. అలాగే పేలుడుకు సంబంధించిన విడిభాగాలను పోలీసులు పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలించినట్లు సమాచారం. ప్రమాదంలో మృతి చెందిన గేదె తల కనిపించకుండా పోయింది. పేలుళ్ల సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసును ధర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల సారథి ఉత్తమే

- నెలరోజుల్లో టీపీసీసీ భారీ మార్పులు
- ఆరునెలల ముందే అభ్యర్థుల ప్రకటన
- సమన్వయ కమిటీ కుదింపు
- పొత్తుల ప్రతిపాదనల్లేవు
- మీడియాతో కుంతియా ఇష్టాగోష్టి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర పార్టీకి పూర్తి జవసత్వాలు తెచ్చేందుకు కృషి చేస్తానని నెలరోజుల్లో టీపీసీసీలో భారీ మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటాయని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా వెల్లడించారు. 2019 ఎన్నికలకు ఆరునెలల ముందే అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల రాష్ట్ర రథసారథి టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డియేనని ప్రకటించారు. టీపీసీసీ సమన్వయ కమిటీని కుదించి పని చేసే వారికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ నిజాంక్లబ్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా విలేఖరులు అడిగిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలు చెప్పారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు తనకు వ్యక్తిగతంగా పరియచమని చెప్పారు. ఆయన సత్తా ఏంటో కూడా తెలుసని వ్యాఖ్యానించారు. ఆయన కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు కార్మిక నాయకుడినైన తాను పలు సమస్యలపై వెళ్లికలిసే వాడినని అన్నారు. కేసీఆర్‌తో వ్యక్తిగత విబేధాలు లేవని, ఆయన్ను విధానాల పరంగా మాత్రమే వ్యతిరేకిస్తామన్నారు. కేసీఆర్ ఆయన కుటుంబం తప్ప, జనానికి పెద్దగా ఒరిగిందేమీలేదన్నారు. ప్రజలు కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అందుకు సంగారెడ్డిలో నిర్వహించిన రాహుల్ గాంధీ విజయవంతం కావడమే నిదర్శమని ఉత్సాహంగా చెప్పారు. ఇప్పటికిప్పుడు ఆయనపై యుద్ధం ప్రకటించడం లేదని చెప్పారు. ఎన్నికల పొత్తుల ప్రతిపాదనలు లేవని, ఆ విషయం అధిష్టానం పరిధిలోనిదని కుంతియా తేల్చిచెప్పారు. ముందుగా తాను పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసే అంశంపైనే దృష్టికేంద్రీకరించానని, మూడూ నెలల్లో అన్ని జిల్లా, నియోజకవర్గం, మండలం, బూత్, గ్రామ కమిటీలు వేయడమే తన ముందున్న లక్ష్యమని, ఆ లక్ష్యం కోసం అవసరమైతే మండల కేంద్రాలలో కూడా బస చేస్తానన్నారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోనున్నామని, అందులో భాగంగా ఈ నెల 20 వరకు గ్రామ సోషల్ మీడియా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత రాజీవ్ సందేశ్ యాత్రను గ్రామ గ్రామం తీసుకువెళ్లనున్నామని, అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై చార్జిషీట్ ఎక్కడికక్కడ విడుదల చేయనున్నామని తెలియజేశారు. అక్టోబర్ ఆఖరుకు పార్టీ సంస్థాగత ఎన్నికలను పూర్తి చేసుకుని జవసత్వాలతో ప్రభుత్వవైఫల్యాలపై పోరాటం ఉధృతం చేస్తామన్నారు. 2014 ఎన్నికల్లో పార్టీ పరంగా తెలంగాణ పోరాటం చేసింది..ఇచ్చింది..కాంగ్రెస్ పార్టీయేనని ప్రజలకు చెప్పుకోలేకపోవడమే గాక అంగీకరించారు. అంతేగాక నాటి సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా వ్యవహరించడం , పదేళ్ల పాటు పార్టీ అధికారంలో ఉండడం తదితర కారణాలతో ఓడిపోయామన్నారు. వచ్చే ఎన్నికల్లో గతంలో జరిగిన పొరపాట్లు జరగవని, వ్యూహాత్మకంగా వెళతామన్నారు. ఇంచార్జీగా ఇక్కడే మకాం వేయనున్నామని, రాష్ట్రంలోని 538 మండలాల్లో పర్యటిస్తానన్నారు. రాష్ట్ర పార్టీలో ఉత్తమ్ కుమార్ రెడ్డే ఫైనల్ అని, ఆయనకు ఎదురుండదని స్పష్టంచేశారు . ఆయన పనితీరు పట్ల



సోనియాగాంధీ, రాహుల్ గాంధీ సంతృప్తికరంగా ఉన్నారని వెల్లడించారు. తాను ఇంచార్జీగా, ఉత్తమ్ అధ్యక్షుడిగా వచ్చే ఎన్నికలను ఎదుర్కొంటామని చెప్పారు. పార్టీలో నేతల మధ్య విబేధాలను పరిష్కరించుకుంటామన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను చేసే వారిని సహించే ప్రసక్తిలేదని కుంతియా హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం గడచిన మూడేళ్లలో సాధించిందేమీ లేదని, పెట్టుబడుల కోసం 19 దేశాలను తిరిగానని చెప్పుకుంటున్నా ఆయన ఎన్ని పెట్టుబడులు వచ్చాయో చెప్పలేకపోతున్నారని, సరికదా... ఆయన వెంట వెళ్లే వాణిజ్యవేత్తలు విదేశాల్లో పెట్టుబడులకై వెళుతున్నారన్న విమర్శలున్నాయని ఆరోపించారు.పెద్ద పరిశ్రమలు ఏవైనా వచ్చాయా ? చెప్పాలని మోడీ ప్రభుత్వాన్ని కుంతియా సవాల్ చేశారు. రాహుల్ నేతృత్వంలో దేశంలో పార్టీ బలపడుతోందని, పంజాబ్ ఎన్నికల్లో గెలిచామని, గోవా, మణిపూర్ రాష్ట్రాల ఎన్నికలలో మెజారిటీ సీట్లు గెలుచుకున్నామని, కాకపోతే గవర్నర్ తీసుకున్న అప్రజాస్వామిక చర్యల మూలంగా అధికారంలోకి రాలేకపోయామని కుంతియా విమర్శలు గుప్పించారు. ఓడిన చోట రాహుల్‌ను విమర్శిస్తున్నారని, గెలిచిన చోట్లను పట్టించుకోవడం లేదని తెలిపారు.



బీఎస్ఎన్ఎల్ స్వాతంత్ర్యదినోత్సవ ఆఫర్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగానికి చెందిన బీఎస్ఎన్‌లో దేశంలోనే మొట్టమొదటి ఆపరేటర్ 15జూన్ 2015న ఉచిత నేషనల్ రోమింగ్‌ను ప్రకటించింది. దాన్ని అనుసరించి 71వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా వాయిస్/ఎస్ఎంఎస్, స్పెషట్ టారిఫ్ వోచర్ (ఎస్‌టీవీ) కొంబో వోచర్‌ను ఆగస్టు 15, 2017నుంచి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. తరచూ ప్రయాణాలు చేసే జవాన్లు, జర్నలిస్టులకు, వ్యాపారులకు, విద్యార్థులకు, లబ్ధి చేకూరుతుందని బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ (సీఎం) ఆర్ కె మిట్టల్ చెప్పారు. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ కూడా స్వాత్రంత్యదినోత్సవాన్ని పురస్కరించుకుని డేటా కి ఆజాదీ ఆఫర్‌ను ప్రకటించింది. రూ.70తో ఒక ఏడాది పాటు 2జీ అపరిమిత డేటా ఆఫర్ ఇస్తోంది. దీంతో పాటు టాక్‌టైమ్ రూ.56 క్రెడిట్ చేస్తుంది. ఈ ఆఫర్ ఆగస్టు 14 నుంచి ఆగస్టు 16 వరకు మాత్రమే.



రిటైల్-టోకు జుగల్‌బంది

• కూరగాయల ధరలే కారణం • జులైలో భారీగా పెరిగిన ధరలు • ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గింపు అనుమానమే • రిటైల్, టోకు ద్రవ్యోల్బణం మరింత పైకి..

న్యూఢిల్లీ : ప్రతి ద్రవ్యోల్బణం స్థాయికి దిగివస్తుందున్న 2016-17 ఆర్థిక సర్వే రెండవ వాల్యూమ్‌కు వ్యతిరేకంగా జులై నెల రిటైల్ ద్రవ్యోల్బణం మూడు నెలల గరిష్ఠానికి 2.4 శాతానికి ఎగబాకింది. అదే జూన్‌నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డుస్థాయిలో 1.5 శాతానికి దిగివచ్చింది. ప్రభుత్వం జులై ఒకటవ తేదీ నుంచి వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి తేనున్న నేపథ్యంలో కొన్ని సేవల ధరలను సవరించడం జరిగింది. దీంతో పాటు కేంద్రప్రభుత్వం ఉద్యోగులకు ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్ఆర్ఏ)ను సవరించడం ద్రవ్యోల్బణం పెరగడానికి కారణంగా చెప్పుకోవచ్చు.

ఆర్థిక సర్వేలో ఆహార పదార్థాల ధరలు క్రమంగా తగ్గముఖం పడుతూ వస్తాయని తెలిపింది. అలాగే జులై నెలలో 0.3 శాతానికి దిగి రాగా.. జూన్ నెలలో 2.1 శాతంగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం పెరగుతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. దీంతో మానటరీ పాలసీ కమిటి (ఎంపీసీ) ఇక్కడి నుంచి వడ్డీరేట్లు తగ్గించడానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఆర్థిక సర్వే వడ్డీరేట్లు తగ్గించాలని ఆర్బీఐకి సిఫారసు చేసినా.. వడ్డీరేట్లు తగ్గడం కష్టమేనని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

ఇక టోకు ద్రవ్యోల్బణం విషయానికి వస్తే జులైలో 1.9 శాతం పెరిగి రెట్టింపయ్యింది. అంతకు ముందు జూన్ నెలలో 0.9 శాతంగా నమోదైంది. ముఖ్యంగా కూరగాయలు టమోటా ధరలు కిలో రూ.100 దాటడం దీనికి కారణంగా చెప్పవచ్చు. అయితే జులై నెలలో రిటైల్ ధరలు 3.6 శాతం తగ్గాయి. అంతకు ముందు జూన్‌తో పోల్చుకుంటే 16.5 శాతం వరకు ధరలు తగ్గుముఖం పట్టాయి.

జులై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణం కూరగా యల ధరలు పెరగడంతో పాటు కేంద్రప్రభుత్వం తమ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పెంచడం, జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత కొన్ని సేవలు ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయని ఇక్రా ప్రిన్సిపల్ ఆర్థికవేత్త ఆదితి నాయర్ చెప్పారు.

టోకు ధరల విషయానికి వస్తే ఇక్కడ కూరగాయల విషయంలో పరిస్థితి పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. జూన్‌లో టోకు ద్రవ్యోల్బణం రేటు 21.16 శాతంగా నమోదు కాగా.. జులై నాటికి 21.95 శాతానికి ఎగబాకింది. టోకు ద్రవ్యోల్బణంలో కూరగాయల ద్రవ్యోల్బణం విషయానికి వస్తే టయోటా ధరలు ఏకంగా 209.6 శాతం పెరిగాయి. దీనికి వ్యతిరేకంగా బంగాళాదుంపలు, ఉల్లిధరలు తగ్గముఖం పట్టి ప్రతిద్రవ్యోల్బణం స్థాయికి దిగివచ్చాయి. రిటైల్ ధరల సూచి విషయానికి వస్తే గృహ ద్రవ్యోల్బణం లేదా హౌసింగ్ ఇన్‌ఫ్లేషన్ జులైలో 4.98 శాతానికి ఎగబాకగా.. అంతకు ముందు జూన్ నెలలో 4.7 శాతంగా ఉంది. కేంద్రప్రభుత్వం తమ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పెంచడామే దీనికి కారణం. హెచ్ఆర్ఏ సవరించడంతో రిటైల్ ద్రవ్యోల్బణంలో హౌసింగ్ సూచి మరింత పైకి పోయే అవకాశాలున్నాయని నాయర్ వివరించారు.

ఇంటికి కావాల్సిన వస్తువులు, సేవల ద్రవ్యోల్బణం జులైలో 3.9 శాతానికి చేరగా.. అంతకుముందు నెలలో 3.8 శాతంగా నమోదైంది. మొత్తానికి చూస్తే రిటైల్ ద్రవ్యోల్బణం పెరగడానికి కారణం కూరగాయల ధరలు పెరగడంతో పాటు హెచ్ఆర్ఏ ప్రభావంతో హౌసింగ్ ఇండెక్స్



రేటు పెరిగిందని నాయర్ వివరించారు. పరిస్థితి చూస్తుంటే రిటైల్ ద్రవ్యోల్బణం రాబోయే కొన్ని నెలలో అంటే అక్టోబర్ నాటికి నాలుగు శాతానికి చేరవచ్చునని ఆమె అభిప్రాయపడ్డారు.

మానటరీ కమిటి సిఫారసు (ఎంపీసీ) వ్యాఖ్యలను బట్టి చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు చాలా చాలా తక్కువని ఆమె అన్నారు. తయారీ ప్రాడక్టులపై జీఎస్టి ప్రభావం టోకు ద్రవ్యోల్బణంపై పెద్దగా లేదని.. ఎందుకంటే జులైలో 2.18శాతానికి దిగిరాగా.. అంతకు ముందు జూన్ నెలలో 2.27 శాతంగా నమోదైంది. జులై నెలలో టోకు ద్రవ్యోల్బణం రెట్టింపు కావడానికి జీఎస్టి ప్రభావం లేదని, ఎందుకంటే జులై నెలలో తయారీరంగానికి చెందిన వస్తువులు ధరలు తగ్గాయని ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థిక వేత్త దేవేంద్రపంత్ చెప్పారు. ఇక్కడ గుర్తించుకోవాల్సింది టోకు ద్రవ్యోల్బణంలో సేవలను పరిగణనలోకి తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు.

మళ్లీ టోకు ద్రవ్యోల్బణం సెగ

టోకు ద్రవ్యోల్బణం 5 నెలల తర్వాత మళ్లీ కోరలు చాచింది. జులై నెలలో 1.88 శాతానికి ఎగబాకింది. కొన్ని ఆహార పదార్థాల ధరలు పెరగ డంతో ద్రవ్యోల్బణం మళ్లీ పుంజుకుంది. ప్రస్తుతం దేశంలోని పారిశ్రామిక వేత్తలు వడ్డీరేట్లు తగ్గించాలని డిమాండ్ చేస్తున్న సమయంలో టోకు ద్రవ్యోల్బణం పెరగడం వారి ఆశలపై నీళ్లు జల్లినట్లే. ఈ ఏడాది జూన్ టోకు ద్రవ్యోల్బణం 0.90 శాతంగా నమోదు కాగా.. అదే జులై 2016లో 0.63 శాతంగా నమోదైంది. మొత్తానికి చూస్తే జులై టోకు ద్రవ్యోల్బణం రెట్టింపయ్యింది. కేంద్రప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్)అమల్లోకి తెచ్చిన మొదటి నెలలోనే ద్రవ్యోల్బణం పెరగడం గమనార్హం. ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణం ఆహార పదార్థాలు ముఖ్యంగా కూరగాయల ధరలు పెరగడమే. మార్చి నెల నుంచి టోకు ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గముఖం పడుతూ వస్తోంది. ఆహార పదార్థాల ధరల ప్రతి ద్రవ్యోల్బణం స్థాయికి దిగివచ్చాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే జులై నెలలో 2.15 శాతానికి ఎగబాకిందని ప్రభుత్వ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. కూరగాయల ధరలు జూన్‌లో 21.16 శాతానికి దిగిరాగా.. జులై తిరిగే సరికి 21.95 శాతానికి ఎగబాకాయి. అయితే తయారీ రంగానికి చెందిన ద్రవ్యోల్బణం మాత్రం స్వల్పంగా తగ్గి 2.18 శాతానికి దిగిరాగా.. జూన్‌లో 2.27 శాతంగా ఉంది.

విద్యుత్, ఇంధనం ద్రవ్యోల్బణం జులైలో 4.37 శాతానికి దిగిరాగా.. అంతకుముందు నెలలో 5.28శాతంగా నమోదైంది. తాజా పరిణామా లపై ఫిక్కీ అధ్యక్షుడు పంకజ్ పటేల్ స్పందిస్తూ.. తాజా పరిస్థితిని గమనిస్తే వడ్డీరేట్లు తగ్గించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ప్రైవేట్ పెట్టుబడులు ఇంకా బలహీనంగా ఉన్నాయి కాబట్టి ఆర్‌బీఐ వీలైనంత త్వరగా వడ్డీరేట్లు తగ్గించాలని కోరారు. రాబోయేది పండుగ సీజన్ ... గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం మెరుగుపడే అవకాశాలున్నాయి కాబట్టి ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గించాలని పటేల్ కోరుతున్నారు.

కూరగాయల ధరలే కాకుండా .. గత నెలలో గుడ్లు, మాంసం, చేపల ధరలు పెరిగాయి. ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 3.30 శాతం పెరిగింది. పండ్ల ద్రవ్యోల్బణం 2.71 శాతం, తృణధాన్యాలు 0.63 శాతం, వరి 3.47 శాతం, చక్కెర 8.44 శాతం, ఖనిజాలు 1.90 శాతం పెరిగాయి. దీనికి వ్యతిరేకంగా బంగాళా దుంపలు ప్రతిద్రవ్యోల్బణం స్థాయికి 42.45 శాతానికి, పప్పులు 32.56 శాతానికి, ఉల్లి 9.50 శాతం తగ్గముఖం పట్టాయి. ప్రభుత్వం ధరలు పెరగకుండా కొన్ని చర్యలు తీసుకున్నందుకు అసోచామ్ ప్రభుత్వాన్ని అభినందించింది.

ఎయిర్ ఇండియా ఫ్రీడం సేల్ టికెట్ ధర

కేవలం రూ.425

అంతర్జాతీయ రూట్ టిక్కెట్ రూ.7వేల లోపే



ముంబై : స్వాతంత్ర్యదినోత్సవ సంబరాల్లో భాగంగా ఎయిర్ ఇండియా దేశీయ ప్రయాణ టికెట్ రూ.425కు, అంతర్జాతీయ రూట్లలో టికెట్ రూ.7వేల కంటే తక్కువకు అందుబాటులో ఉంచింది. పరిమితి కాలంలో లభించే ఈ టిక్కెట్లకు ఎయిర్ ఇండియా 'ఫ్రీడం సేల్' అని ముద్దుపేరు పెట్టింది. టిక్కెట్లు ఈ నెల 20వ తేదీ వరకు అందుబాటులో ఉంచింది. కాగా టిక్కెట్లు కొనుగోలు చేయాలనుకునే వారు ఎయిర్ఇండియా వెబ్‌సైట్, బుకింగ్ కార్యాలయం, మొబైల్ యాప్, లేదా అధీకృత ట్రావెల్ ఏజెంట్లనుంచి కొనుగోలు చేసుకోవచ్చునని సూచించింది. ప్రయాణ తేదీని సెప్టెంబర్ 16, 2017 నుంచి నవంబర్ 30,2017 వరకు లేదా జనవరి 25, 2018 నుంచి మార్చి 31, 2018 వరకు వినియోగించుకోవచ్చునని ఎయిర్ లైన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. అంతర్జాతీయ రూట్ల విషయానికి వస్తే ప్రారంభం టికెట్ ధర ఎకనమీ క్లాస్ రూ.7,000 కాగా, దక్షిణాసియా రూట్ల విషయానికి వస్తే ఖాట్మాండు, ఢాకా, మాలే, కొలంబో, కాబుల్‌కు ఈ చార్జీలు వర్తిస్తాయని తెలిపింది. బిజినెస్ క్లాస్ టిక్కెట్ల విషయానికి వస్తే ప్రారంభం ధర రూ.23,000 అని తెలిపింది.

గల్ఫ్ ప్రాంతానికి వస్తే ప్రారంభ టిక్కెట్ ధర రూ.6,000తో మొదలవుతుంది. దుబాయి, అబుదభి, షార్జ్ మస్కట్, బహ్రేన్, కువాయితి, రియాధ్‌లకు ఈ చార్జీలు వర్తిస్తాయి. ఈ టిక్కెట్లు కూడా ఈ నెల 20 వరకు అందుబాటులో ఉంచుతుంది. ఇక దేశీయ రూట్ల విషయానికి వస్తే జమ్ము - కాశ్మీర్ రూట్ ప్రారంభం టిక్కెట్ ధర రూ.425గా అందుబాటులో ఉంచింది.

ఐడిబీఐ నష్టం రూ.853 కోట్లు

• పెరిగిన మొండి బకాయిలు



ముంబై : ఐడిబీఐ బ్యాంకు నష్టాల్లోనే కొట్టుమిట్టాడుతోంది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంకు నష్టం రూ.853 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.241 కోట్లు లాభాన్ని ఆర్జించింది. కాగా బ్యాంకు మొండి బకాయిలు ఏకంగా 24.1 శాతం పెరిగి రూ.29,759 కోట్లకు ఎగబకాయి. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 82 శాతం పెరిగాయి. మార్చి త్రైమాసికంతో పోల్చుకుంటే 17 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో నికరనష్టం రూ.3,200 కోట్లుగా ప్రకటించింది. బీఎస్ఈలో దీని షేరు రూ. 52.75 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది.

సహారా రాయ్‌కు భారీ ఝలక్!

• ఆంబే వ్యాలీ వేలం ప్రక్రియ షురూ • రిజర్వు ధర రూ.37వేల కోట్లు

ముంబై : సహారా గ్రూపు చీఫ్ సుబ్రతారాయ్‌కు సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. రాయ్‌కు చెందిన ఆంబే వ్యాలీ వేలం ప్రక్రియను ప్రారంభించాలని సోమవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నియమించిన బొంబాయి హైకోర్టు లిక్విడేటర్ బిడ్‌లను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. దీని రిజర్వు ధర రూ.37,392 కోట్లుగా నిర్ణయించారు.



ఇక సహారాగ్రూపునకు చెందిన ఆంబేవ్యాలీ పూనే జిల్లాలోని లోనావాలలో ప్రత్యేకంగా చార్టర్డ్ సిటి నిర్మించారని నోటిఫికేషన్‌లో వివరించింది. అంతర్గతంగా నిర్మించిన హిల్‌సిటి టౌన్‌షిప్ మొత్తం 6,761.6 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ టౌన్‌షిప్‌లో టింబర్ చాలెట్స్ (కలప వసారాలు), మోడ్రన్ విల్లాస్, గోల్ఫ్‌కోర్స్, హాస్పిటల్, స్కూలు, ఎయిర్‌పోర్టుతో పాటు ఇతర సదుపాయాలున్నాయి. దీంతో పాటు సుమారు 1,700 ఎకరాల ఖాళీ స్థలం ఉంది.

సహారా గ్రూపు ఇటీవల విలాసవంతమైన ఆంబే వ్యాలీ మార్కెట్ ధర రూ.1 లక్షల కోట్ల కంటే ఎక్కువ గా ఉంటుందని ప్రకటించింది. కోర్టు వేలం ప్రక్రియ మొదలుపెట్టానికి ముందే మారిషస్‌కు చెందిన ఇన్వెస్టర్ రోయాల్ పార్టనర్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, గత వారం సహారా గ్రూపునకు చెందిన ఆంబే వ్యాలీ ప్రాజెక్టులో 1.67 బిలియన్ డాలర్లు రూ.10,700 కోట్లు పెట్టుడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఇదిలా ఉండగా గత వారం సుప్రీంకోర్టు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 14 నుంచి వేలం ప్రక్రియ మొదలుపెడతామని ప్రకటించింది. ఒక వేళ సహారాగ్రూపు రూ.1500 కోట్లు సెబి - సహారా రీఫండ్ ఖాతాలో సెప్టెంబర్ 7వ తేదీలోగా డబ్బు జమ చేస్తే అప్పుడు దానికి తగ్గట్లు ఆర్డర్ జారీ చేస్తామని తెలిపింది. ఇదిలా ఉండగా సహారా వేలం ప్రక్రియను సెప్టెంబర్ 16 వరకు వాయిదా వేయాలని, ఈ లోగా సహారా చీఫ్ రాయ్ డబ్బు సర్దుబాటు చేస్తారని కోర్టును కోరింది.

అధికారిక లిక్విడేటర్ విడుదల వేలం నోటీసులో బిడ్‌లు దాఖలు చేసే వారు కెవైసీ ఫాంలు తప్పకుండా సమర్పించాల్సి ఉంటుందని, దీంతో పాటు బిడ్‌లు దాఖలు చేసేవారు రిజర్వుధరలో 15 శాతం ఈఎండీగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

లిక్విడేటర్ ఇక్కడి విలాసవంతమైన ఆంబే వ్యాలీ ఆస్తి గురించి వివరణ కూడా ఇచ్చారు. అత్యాధునిక విల్లాలతో పాటు పలు విలాసవంతమైన వసతులు ఉన్నాయని.. వాటిలో గోల్ఫ్ కోర్స్, ఎయిర్‌పోర్టు, అడ్వెంచర్ స్పోర్ట్స్, రిటైల్, ఎంటర్‌టెయిన్‌మెంట్, ఇంటర్నేషనల్ స్కూలు, హాస్పిటాలిటీ (ఆతిథ్యం) తదితర సదుపాయలు ఉంటాయన్నారు.

జులై 25, 2017న సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం ఈ ఆస్తిని వేలం తర్వాత బిడ్‌లో ఆస్తులు దక్కించుకున్న వారికి పూర్తి హక్కులు, అనుమతులు రిజిస్ట్రేషన్‌లు అన్నీ సమకూరుస్తామని తెలిపింది. ఇదిలా ఉండగా సహారా తరపున కోర్టులో వాదిస్తున్న న్యాయవాదులు న్యూయార్కులోని హోటల్స్‌ను విక్రయించడం జరిగిందని, త్వరలోనే డబ్బు సహారా ఖాతాలో జమ అవుతుందని, వాటిలో రూ.1,500 కోట్లు సెబి సహారా రీఫండ్ ఖాతాకు సెప్టెంబర్ 7వ తేదీలోగా జమ చేస్తామని కోర్టుకు తెలియజేశారు.

ఇక అసలు విషయానికి వస్తే సహారా గ్రూపు మార్కెట్ నియంత్రణా సంస్థ సెబితో దీర్ఘకాలంగా న్యాయపోరాటం చేస్తోంది. సెబి అనుమతి లేకుండా చోటామోటా ఇన్వెస్టర్ల నుంచి సహారా రూ.25వేల కోట్ల వరకు డిపాజిట్లు వసూలు చేసింది. దీనిపై సెబి అభ్యంతరం వ్యక్తం చేయడం, అటు తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించడం, సుప్రీంకోర్టు సహారాను ఇన్వెస్టర్ల నుంచి సేకరించిన డిపాజిట్లను తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను బేఖాతారు చేయడంతో కోర్టు ధిక్కార నేరం కింద రాయ్‌ను అరెస్టు చేసి తీహార్‌జైలుకు పంపించింది. అటు తర్వాత రాయ్ తల్లి మృతి చెందడంతో అంతిమ సంస్కారాల కోసం పెరోల్‌పై ఆయన బయట ఉన్నారు.

స్టాక్ మార్కెట్లు 'మండే'

• 235 పాయింట్లు వృద్ధి • ఆరు రోజుల తర్వాత లాభాల్లోకి • గ్లోబల్ మార్కెట్ల అండ

ముంబై : ఆరు రోజుల తర్వాత స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు లాభాల రుచిని చూశాయి. బీఎస్ఈ ఏకంగా 235 పాయింట్లు పెరిగి 31,499 వద్ద ముగిసింది. దీనికి ప్రధాన కారణం అమెరికా - ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్తత కాస్తా సడలమే. చైనా అధ్యక్షుడు ఇరు దేశాలను సంయమనం పాటించాలని కోరడంతో ఉద్రిక్తత చల్లబడింది. అమెరికా ద్రవ్యోల్బణం బలహీనంగా నమోదు కావడంతో సమీప భవిష్యత్తులో యూఎస్ ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల పెంపు జోలికి పోకపోవచ్చునని ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు.



బీఎస్ఈ 30 షేర్ల సూచి ప్రారంభం నుంచి లాభాల బాటలోనే పయనిం చింది. మార్కెట్ ముగిసే నాటికి 235.44 పాయింట్ల లాభంతో 31,449.03 వద్ద ముగిసింది. కాగా అంతకు ముందు 5 ట్రేడింగ్ సెషన్‌లలో ఏకంగా 1,111.82 పాయింట్లు నష్టపో యింది. నిఫ్టీ విషయానికి వస్తే 83.35 పాయింట్లు లాభపడి 9,794.15 మార్కుకు ఎగబాకింది. కాగా మంగళవారం నాడు స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా మార్కెట్లకు సెలవు.

ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే యూరోపియన్ షేర్లు ప్రారంభం నుంచి లాభాలతోనే మొదలయ్యాయి. విశ్లేషకుల అంచనా ప్రకారం యూఎస్ ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల పెంపు జోలికి పోయే అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. కాబట్టి ఇవన్నీ అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు అనుకూలమైన అంశాలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా భారత్ మార్కెట్లకు బాగా కలిసొచ్చే అంశం. గత ఐదు ట్రేడింగ్ సెషన్‌ల నుంచి స్టాక్ మార్కెట్లు నష్టాలతో ట్రేడ్ కావడంతో ఇన్వెస్టర్లు తక్కువ ధరకు బ్లూచిప్ షేర్లు లభిస్తుండటంతో పెద్దమొత్తంలో రిటైల్ ఇన్వెస్టర్లు షేర్లను కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా శుక్రవారం నాడు దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐ)లు రూ.2,016.84 కోట్ల షేర్లను కొనుగోలు చేయగా.. విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు రూ.1,943.86 కోట్ల షేర్లను విక్రయించారని స్టాక్ ఎక్స్ఛేంజీ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఫార్మా షేర్లు బాగా పుంజుకున్నాయి. సిప్లా ఏకంగా ఐదు శాతం పెరిగింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం 24 శాతం వృద్ధి చెందడమేకారణం. సన్‌ఫార్మా 4.70 శాతం పెరిగింది. టాటాస్టీల్ 4.21 శాతం, అదానీ పోర్ట్స్ 3.07 శాతం, హీరోమోటోకార్ప్ 2.87 శాతంగా ఉన్నాయి. ఇక సూచిల విషయానికి వస్తే రియల్టీ సూచి 5.95 శాతం వృద్ధిని నమోదు చేయగా.. లోహ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, విద్యుత్ సూచిలు కూడా లాభాలను పంచిపెట్టాయి. టెక్నాలజీ, ఐటి రంగానికి చెందిన సూచిలు మాత్రం నష్టాలను చవిచూశాయి. రియల్టీ దిగ్గజం డీఎల్ఎఫ్ షేరు ఏకంగా 16.51 శాతం పెరిగింది. పెద్దమొత్తం ఇన్వెస్టర్లు స్పెక్యూలేటివ్‌కు పాల్పడ్డమే కారణం.

సెబి నుంచి అనుమతులు

దక్కించుకున్న ఇండియా ఇన్క్స్

హైదరాబాద్ : మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి నుంచి ఇండియా ఇన్క్స్ గోల్డ్ ఆప్షన్స్ కాంట్రాక్టు వాణిజ్యం నిర్వహించు కోవడానికి అనుమతులు దక్కించు కుంది. దేశంలో ఈ అనుమతులు దక్కించుకున్న మొట్టమొదటి అంతర్జాతీయ ఎక్స్ఛేంజీ తమదే నని మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. బాల సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఎఫ్ఎస్సీ బుధవారం నుంచి తమ వాణిజ్యాన్ని మొదలు పెట్టిందన్నారు.





ఐసీఐసీఐ లాంగ్ టర్మ్ వెల్త్ క్రియేషన్ ప్లాన్

హైదరాబాద్ : ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ డైనమిక్ ప్లాన్‌ను అక్టోబర్ 2002లో ప్రారంభించింది. స్టాక్ మార్కెట్లతో పాటు మనీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టి దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు సంపద సమకూర్చి పెడుతోంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ప్లాన్‌ను 27 సంవత్సరాల అనుభవం ఉన్న శంకరన్ నరేన్, ఐదేళ్ల అనుభవం ఉన్న దాల్వాయి నిర్వహిస్తున్నారని తెలిపింది. రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ కూడా టాప్ 30లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఒకటిని ప్రకటించింది. అక్టోబర్ 31, 2002లో కేవలం రూ.10వేలు ఈ ఫండ్‌లో పెట్టిన వారికి రూ.240,553లకు చేరిందని, ఏడాదికి సీఏజీఆర్ 24.11 శాతానికి చేరిందని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఒక ప్రకటనలో వివరించింది.

ఎగుమతుల్లో 3.94 శాతం వృద్ధి

• జులైలో 2254 కోట్ల డాలర్లకు


• 3.94 శాతం వృద్ధి

• వాణిజ్యలోటు పెరిగి 1145 కోట్ల డాలర్లకు

న్యూఢిల్లీ: దేశం నుంచి ఎగుమతులు మందకొడిగా కొనసాగుతున్నాయి. జులై నెలలో ఎగుమతుల్లో 3.94 శాతం వృద్ధి కనిపించింది. వరుసగా గత 11 నెలలో నుంచి ఎగుమతులు పుంజుకుంటున్నాయి. గత నెలలో దేశం నుంచి విదేశాలకు 2254 కోట్ల డాలర్ల సరుకు ఎగుమతులు జరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 2168 కోట్ల డాలర్ల ఎగుమతులు జరిగాయని వాణిజ్యమంత్రిత్వశాఖ సోమవారం నాడు విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది.

అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే గత మార్చి నుంచి ఎగుమతులు క్రమంగా తగ్గముఖం పడుతూ వస్తున్నాయి. మార్చిలో ఎగుమతులు ఏకంగా 27 శాతానికి ఎగబాకాయి.. గత ఐదు ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఎగుమతులు కొనసాగాయి. మే వచ్చే సరికి 8 శాతానికి, జూన్ నాటికి 4.39 శాతానికి ఎగుమతులు దిగివచ్చాయి. దీనికి కీలక రంగాల్లో ఎగుమతులు మందగించాయి. ప్రధానంగా చెప్పుకోవాలంటే జెమ్స్ అండ్ జువెలరీ విభాగంలో గత నెలలో 22 శాతం తగ్గముఖం పడితే.. జూన్‌లో 2.7 శాతం తగ్గింది. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత జులై కూడా ఎగుమతులు మందగించాయి. బంగారం దిగుమతులు ఏకంగా 95 శాతం పెరిగి 210 కోట్ల డాలర్లకు ఎగబాకాయి. అంతకు ముందు జూన్ నెలలో కూడా పసిడి దిగుమతులు 102 శాతం పెరిగాయి.

ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూస్తే ఎగుమతుల విలువ 9475 కోట్ల డాలర్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే కాలంలోల 8700 కోట్ల



డాలర్లతో పోల్చుకుంటే 8.91 శాతం పెరిగాయి. మొత్తం 30 కీలకమైన ఎగుమతుల విభాగంలో 11 విభాగాల్లో ఎగుమతులు తగ్గముఖం పట్టగా.. జూన్‌లో ఈ సంఖ్య 15గా ఉంది. దేశానికి విదేశీ మారకద్రవ్యం సంపాదించే పెట్టే విభాగం ఇంజినీరింగ్ ... ఎగుమతుల్లో 15 శాతం వృద్ధిని సాధించింది. అంతకు ముందు జూన్ నెలలో కూడా ఇంతే అంటే 14.8 శాతంగా నిలిచింది. మిగిలిన రంగాల్లో ఎగుమతులు మాత్రం కుంగాయి. ఇంజినీరింగ్ ఎగుమతులు బాగా పెరిగాయి.. దీనికి బేస్ మెటల్ ఎగుమతుల్లో మంచి వృద్ధి కనిపించింది. అయితే ఇక్కడ ఆందోళన కలిగించేఅంశం ఏమిటంటే రూపాయి బలపడ్డమేనని టీఎస్ బాషిన్ ఛైర్మన్ ఇంజినీరింగ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కౌనిల్ ఆఫ్ ఇండియా చెప్పారు. ఈ ఏడాది రూపాయి 6.8 శాతం పెరిగి సోమవారం నాటికి 64.10 మార్కుకు ఎగబాకింది. రూపాయి బలపడితే ఎగమతులు చౌక.. దిగుమతులు ఖరీదైన వ్యవహారంగా మారిపోతాయి. ఆర్థికవేత్తల అంచనా ప్రకారం రాబోయే రోజుల్లో రూపాయి మరింత బలపడుతుందని అంచనా వేస్తుండగా.. మరి కొంత మంది దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అంటున్నారు. దుస్తుల ఎగుమతులు జులైలో 11 శాతం క్షీణించగా.. జూన్‌లో 1.4 శాతం, ఫార్మా ఎగుమతులు 5.36 శాతం తగ్గగా.. జూన్‌లో 2.25 శాతం తగ్గుముఖం పట్టాయి.

ఇక దిగుమతుల విషయానికి వస్తే జులైలో 3,399 కోట్ల డాలర్లకు దిగివచ్చినా.. 15.42 శాతం పెరిగాయి. అలాగే జూన్‌లో దిగుమతులు 19శాతం పెరిగాయి. గత నెలలో చమురు దిగుమతులు 15 శాతం పెరిగి 784 కోట్ల డాలర్ల పెరిగినా మొత్తానికి దిగుమతులు విలువ తగ్గింది. మొత్తానికి ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు దిగుమతులు 14600 కోట్ల డాలర్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో 11300 కోట్ల డాలర్లని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

వైద్య శాఖ పనితీరు భేష్

మంత్రి లక్ష్మారెడ్డి అభినందన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైద్య ఆరోగ్యశాఖలో నిబద్ధత, చిత్తశుద్ధి గల అధికారులు ఉండడం గర్వించదగ్గ విషయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వం కొత్త సాంప్రదాయానికి నాంది పలుకుతూ అఖిల భారత సర్వీసు అధికారులను సత్కరించేందుకు ఎంపిక చేసిన అధికారుల్లో వైద్య ఆరోగ్య శాఖకు నేతృత్వంలో వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణ ఉండడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈసందర్భంగా తన శాఖలో పనిచేస్తున్న వివిధ స్థాయి అధికారులను మంత్రి అభినందించారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఉన్న కరుణ వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూ లక్ష్యాలను నెరవేరుస్తూ ఉత్తమ పనితీరును కనబరుస్తున్నారని కొనియాడారు. ఈ అధికారిణిని ఆదర్శంగా తీసుకుని మిగతా శాఖల్లోనూ లక్ష్యాలు సాధించే దిశగా అధికారులంతా మరింత నిబద్ధతతో, చిత్తశుద్ధితో పనిచేయాలని లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. వైద్య శాఖలో ఉత్తమ పనితీరు కనబరిచిన డాక్టర్ మధుసూదన్, నర్సు అంజమ్మలకు కూడా మంత్రి అభినందనలు తెలియజేశారు.

కాళేశ్వరం నీటితో రెండు పంటలు

●మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బీర్కూర్, కెఎన్ఎన్ : రైతులు మంజీరా నదిపై ఆశలు వదులుకుని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రెండు పంటలకు సాగునీరు అందించేందుకు తెరాస ప్రభుత్వం అహర్నిషలు కృషిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం అన్నారు. సోమవారం బీర్కూర్ మండలకేంద్రంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన 13 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన పంచాయతీకార్యాలయ భవనం, 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రయాణ ప్రాంగణ సీసీరోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నిజాం సాగర్ ఎగువన 40 ప్రాజెక్టులు నిర్మించడంతో రైతులకు ప్రస్తుతం సాగునీరు అందించలేకపోతుందని, దీంతో మంజీరా నదిపై రైతులు పూర్తిగా ఆశలు వదులుకోవాలన్నారు. తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, నిజామబాద్ జిల్లాలోని రైతాంగానికి రెండు పంటలకు నీరు అందించేందుకు తెరాస ప్రభుత్వం కృషిచేస్తుందని, ఇందులో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి కాళేశ్వరం వద్ద ఉన్నటువంటి ప్రాణహిత నది నీరు ప్రతీ యేడాదికి 1600 టీఎంసీల నీరు వృధాగా సముద్రంలోకి వెళ్తుందని, ఈ నీటిని నిజాంసాగర్‌లోకి మళ్ళించేందుకు భగీరథ ప్రయత్నం ముఖ్య మంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావ్‌లు చేపట్టారన్నారు.

ఈపీఎఫ్ ఖాతాదార్లకు గృహరుణాలు

•కేంద్ర భవిష్యనిధి కమిషనర్ వీపీ జాయ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈపీఎఫ్ ఖాతాదారుల సొంతింటి కల నెరవేర్చడానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి, సెంట్రల్ ఈపీఎఫ్ కమిషనర్ వి.పి.జాయ్ వెల్లడించారు. 2022 నాటికి సామాన్యుల సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని యాజమాన్యాలు, కార్మికులతో ఆయన సోమవారం ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈపీఎఫ్ ప్రయోజనాలను తెలియచేశారు. సంస్థలసమీపంలో కార్మికుల గృహ సముదాయం ఏర్పాటు చేయడం ద్వారా కలిగే యాజమాన్య ప్రయోజనాలను వివరించారు. యాజమాన్యాలు - కార్మికుల సంబంధాలను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికులకు తమ చరవాణి ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియచేయడం జరుగుతుందన్నారు. ఈపీఎఫ్ ఖాతాల నిర్వహణలో పారదర్శకత ఏర్పడిందని పేర్కొన్నారు. యాజమాన్యాల తోడ్పాటుతో కార్మికులు ఏర్పాటు చేసుకొనే గృహసముదాయాలకు కూడా భవిష్యనిధి ఖాతా నుండి రుణాలు పొందవచ్చన్నారు. ఈపీఎఫ్ ఖాతాదారులకు సొంతింటి నిర్మాణం కోసం తమ భవిష్యనిధి ఖాతాలో జమైన మొత్తంలో 90 శాతం వరకు రుణంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దీనికి తోడు ఈపీఎఫ్ నిధులతో సొంతింటిని కట్టుకొనే కార్మికులకు రూ. 2 లక్షల వరకు వడ్డీ రాయితీ వర్తింపచేస్తున్నామని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్రయోజనం కల్పించబోతున్నారన్నారు. ఈ రెండు ప్రయోజనాలతో పాటుగా బ్యాంకుల నుండి గృహ నిర్మాణ రుణాలు తక్కువ వడ్డీకి పొందే వెసులుబాటు ఉంటుందన్నారు. వ్యక్తులు, సమూహాలు, సంఘాలుగా గృహాలు నిర్మించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే తమిళనాడుతో పాటుగా అనేక రాష్ట్రాల్లో ఈపిఎఫ్ ఖాతాదారులు సొంతింటి నిర్మాణాల కోసం రుణాలు పొందుతున్నారని, తెలంగాణలోని కార్మికులు కూడా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వి.పి.జాయ్ కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని కార్మికులు సంఘాలుగా ఏర్పడి గృహాలు నిర్మించుకోవడానికి ముందుకొస్తున్నారన్నారు. ఆధార్‌తో ఈపీఎఫ్ ఖాతాలను అనుసంధానం చేస్తున్నామని, కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తున్నామని, కనీస పింఛను రూ. 1000లను అమలు జరుపుతున్నామని, ఎలక్ట్రానిక్ పేపర్ ఫ్రీ ఆర్గనైజేషన్‌గా ఈపీఎఫ్‌వోను మార్చబోతున్నామని, సాఫ్ట్‌వేర్‌ను ఆధునికరిస్తున్నామని, ఇక మీదట యాజమాన్యాలు, కార్మికులు ఈపీఎఫ్‌వో కార్యాలయాలకు రాకుండానే ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. దేశంలోని 22 కోట్ల మందికి యూఎఎన్ జారీ చేశామన్నారు. తెలంగాణలో కార్మికుల గృహ సముదాయాల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, చౌకలో గృహాలు నిర్మించడానికి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయని వి.పి. జాయ్ తెలిపారు. ఇప్పటికే అనేక సంస్థలు చౌక గృహాల నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించాయని తెలిపారు.



జిల్లా జడ్జీల పదోన్నతుల జాబితా విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న సివిల్ జడ్జిలకు (సీనియర్ డివిజన్) 16 మందికి హైకోర్టు పదోన్నతులు కల్పించింది. 2017 సంవత్సరానికి 65 శాతం కోటా కింద జిల్లా జడ్జీలుగా (ఎంట్రీ లెవెల్) పదోన్నతుల జాబితాను ఖరారు చేస్తూ ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) నోటిఫికేషన్ జారీ చేశారు. కృష్ణా జిల్లా విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.పి.సన్నిధి రావు, అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి జి. మాలతి, ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రమేశ్, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ రాజగోపాలరావు, రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వి.బాల భాస్కరరావు, హైదరాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కర్ణకుమార్, సికింద్రాబాద్ 10వ అదనపు ఛీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వీఏఎల్.సత్యవతి, వరంగల్ జిల్లా జనగాం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ఎన్.శ్రీదేవి, నెల్లూరు జిల్లా కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎన్. శాంతి, గుంటూరు జిల్లా తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.రాధారత్నం, కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శివకుమార్, నిజామాబాద్ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట హరినాథ్, గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఒ. వెంకటనాగేశ్వరరావు, గుంటూరు 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి. కమలాదేవి, రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ 7వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి హెచ్. అహ్మద్ ఖాన్, గుంటూరు జిల్లా నర్సారావు పేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.లక్ష్మి ఈ పదోన్నతుల జాబితాలో ఉన్నారు.

స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టుల్లో న్యాయాధికారుల నియామకం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 13వ ఆర్థికసంఘం కింద ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక మేజిస్ట్రేట్ కోర్టుల్లో నలుగురు విశ్రాంత న్యాయాధికారులకు నియామకపు ఉత్తర్వులు జారీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) నోటిఫికేషన్ వెలువరించారు. విశ్రాంత జిల్లా జడ్జి పీఎస్‌పీ.చిరంజీవి రావు, విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్రీనివాసరావు, విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి వి.కృష్ణమూర్తి, విశ్రాంత జిల్లా జడ్జి ఎం.విజయ చంద్రరావులను నియమించాలని ఏపీ ప్రభుత్వం హైకోర్టుకు ప్రతిపాదనలు పంపించింది. ఆ ప్రతిపాదన మేరకు హైకోర్టు విశ్రాంత న్యాయాధికారులను ప్రత్యేక మేజిస్ట్రేట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

బీసీ'ఏ'లోకి ముదిరాజ్‌లు

•సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా •భాగ్యనగరంలో ఒక భవనం, పదెకరాల స్థలం ఇచ్చేలా చర్యలు: ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ సూచించారు. ముదిరాజ్‌లను బీసీ 'డి' నుంచి బీసీ 'ఎ' లోకి మార్చేందుకు సీఎం చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకుపోతానని మంత్రి ఈటల అన్నారు. ప్రభుత్వం కూడా ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సంఘం నాయకుడు కృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల హాజరై కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కృష్ణస్వామి మహోన్నత వ్యక్తి అని, అనేక రంగాల్లో తనదైన ముద్ర వేశారని మంత్రి కొనియాడారు. ఆయన రచనలను తెలుగులోకి అనువాదం చేసేందుకు తన వంత కృషి చేస్తానని తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై కృష్ణస్వామి విగ్రహం ఏర్పాటుకు తన వంతు ప్రయత్నం చేస్తానని మంత్రి ఈటల హామీ ఇచ్చారు. ముదిరాజ్‌ల భవనంతో పాటు నగరంలో 10 ఎకరాల భూమిని కేటాయించేందుకు సీఎం దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తానని తెలిపారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వివరించారు. చెరువుల్లో చేపల పెంపకంపై మత్స్యకారులతో కలిసి వాటాను కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విషయంపై గత కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ ఇచ్చినప్పటికి అమలుకు నోచుకోలేదన్నారు.

తెలంగాణలో ముదిరాజ్‌లు అధికంగా జనాభా ఉన్నప్పటికి అన్ని రంగాల్లో అభివృద్ధికి చాలా దూరంగా ఉన్నారని తెలిపారు. ముదిరాజ్‌లను అన్ని పార్టీలు ఓటు బ్యాంక్‌గానే పరిగణించాయని, టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే కేసీఆర్ న్యాయం చేస్తున్నారని మంత్రి చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వార ఆర్థికంగా పైకి రావాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బండా ప్రకాశ్ ముదిరాజ్ అధ్యక్షత వహించగా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో కోలాటం



మహబూబ్‌నగర్, కెఎన్ఎన్ : శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా సోమవారం పాలమూరు జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆధ్వర్యంలో జేపీఎన్‌ఈఎస్ కళాశాల ప్రాంగణంలో రాంల్యాండ్ మార్క్ మైదానంలో వెయ్యి మంది విద్యార్థులు ఒకేసారి నిర్వహించిన కోలాటాన్ని ప్రదర్శించారు.. ఈ ప్రదర్శనకు గాను వండర్ బుక్‌ఆఫ్ రికార్డ్ ఘనత దక్కింది. ఈ పోటీలకు గాను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ వారి పర్యవేక్షణలో కోలాటం నిర్వహించారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ బెక్కరి రాంరెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ శాంత ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాధా అమర్, రాజేందర్‌రెడ్డి, డ్యాన్స్ టీచర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సిట్ విచారణలో కీలక మలుపు

●రూ. 550 కోట్ల విలువైన భూముల రికార్డుల ట్యాంపరింగ్ గుర్తింపు

విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో: విశాఖలో వేల కోట్లు విలువచేసే ప్రభుత్వ భూముల రికార్డుల ట్యాంపరింగ్, అన్యాక్రాంతంపై ప్రభుత్వం నియమించిన సిట్ కమిటీ విచారణ వేగవంతం చేసింది. ఈ భూ దందాల్లో సంబంధమున్న అక్రమార్కులను ఒక్కొక్కరినీ అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపతోంది. తాజాగా రూ.550 కోట్లు విలువ చేసే 55.35 ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డుల ట్యాంపరింగ్ వ్యవహారాన్ని సిట్ గుట్టురట్టు చేసింది. ఇందుకు సంబంధించి సోమవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ యోగానంద్ విలేకరుల సమావేశంలో అనేక అంశాలను వెల్లడించారు. జిఎల్ గణేశ్వరరావు సర్వే విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2009లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గణేశ్వరరావును ఏసీబీ అరెస్టు చేసింది. అయితే న్యాయస్థానంలో కేసు నడుస్తుండగా అంతగా ప్రాధాన్యత లేని స్థానంలో మాత్రమే విధులు నిర్వహించాల్సిన గణేశ్వరరావు తన పలుకుబడి, పరపతిని ఉపయోగించి కీలకమైన స్థానంలో తిరిగి ఉద్యోగం దక్కించుకున్నాడు. ప్రస్తుతం విజయనగరంలో సర్వే విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గణేశ్వరరావు భారీ కుంభకోణానికి తెరతీసాడు. తన పెంట్‌హౌస్‌ను భూ రికార్డుల తారుమారు వ్యవహారాలకు కేంద్రంగా మార్చుకున్నాడు. ఇదే సమయంలో చినగదిలి రూరల్ మండలంలో తహసిల్దార్‌గా పనిచేస్తున్న ఎన్.శంకరరావును ప్రలోభపెట్టి తన వైపు మళ్లించుకోగలిగాడు. ప్రభుత్వ భూముల రికార్డుల తారుమారుకు సహకరించాలని శంకరరావును గణేశ్వరరావు కోరాడు. ఇందు కోసం కారు, సుమారు కోటి విలువ చేసే ఆస్తి అందజేస్తానని గణేశ్వరరావు శంకర రావుతో ఒప్పందం చేసుకున్నారు. అందుకు తగ్గట్లుగా ఏపి31డిడి2752 నెంబరు మారుతీ సిఫ్ట్ కారును, కోటి రూపాయలు ఖరీదు చేసే మూడు పడక గదుల ప్లాటును శంకరరావుకు అందజేశాడు. దీంతో తహసీల్దార్ శంకరరావు ప్రభుత్వ భూముల రికార్డుల్లో గణేశ్వరరావు సూచించిన పేర్లను మార్పు చేశాడు.

అంతా సిద్ధరాముని దయ!

●శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు చుక్కనీరు కూడా చేరని దైన్యం ●నీటి విడుదలపై తేల్చని కర్ణాటక ప్రభుత్వం ●ముందు సానుకూలం... ఇప్పుడు తర్జనభర్జన ●కర్ణాటక విడవకుంటే తాగునీటికీ కటకటే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వర్షాల సీజన్ ముగిసే దశకు చేరుతున్నా.. ఇప్పటికి రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు చుక్కనీరు చేరకపోవడంపై రైతాంగం తీవ్ర ఆందోళనగా ఉంది. సాగునీరే కాకుండా తాగునీటికీ కటకట ఏర్పడుతోంది. పరిస్థితి తీవ్రతను గుర్తించే.. కనీసం తాగునీటి కోసమైనా 15 టిఎంసిల నీటిని విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం కర్ణాటకకు విజ్ఞప్తిచేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు స్వయంగా కర్ణాటక మంత్రితో ఫోన్‌లో మాట్లాడడంతో పాటు అధికారుల ద్వారా లేఖ కూడా పంపారు. దీనిపై కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించినా.. కర్ణాటకకు ఎగువ నుండి వరద రాకపోవడం, వర్షాలు తగ్గుముఖం పట్టడంతో విడుదలపై తర్జనభర్జన పడుతోంది. రెండు రోజుల కిందట ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన కృష్ణాభాగ్యజల నిగమ్ బోర్డుభేటీలో నీటి విడుదలపై ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో విడుదలకు సంబంధించిన ఆశలు అడుగంటాయి. కాంగ్రెస్ నేతలు డికె అరుణ, పొంగులేటి సుధాకర్ రెడ్డిలు కూడా నీరు విడుదల చేయాలని కర్ణాటక మంత్రికి ఫోన్‌చేసి మాట్లాడారు. అయినా నిర్ణయం జరగలేదు. ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా రంగంలోకి దిగితే కొంత ఫలితం ఉండవచ్చని భావిస్తున్నారు.

ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నీరు కనిష్ట మట్టం కంటే దిగువకు చేరగా, కర్ణాటక కనికరించకుంటే హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడనుంది. ఇప్పటికే నాగార్జునసాగర్ కింద ఖరీఫ్ ఆశలు అడుగంటగా, చుక్కనీరు కూడా చేరకుంటే.. ఈ ఏడాది తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతాయన్న ఆందోళన నెలకొంది. ప్రస్తుతం శ్రీశైలంలో 215 టిఎంసిలకు గాను కేవలం 19.78 టిఎంసిల నిల్వలు మాత్రమే ఉన్నాయి. 778 అడుగుల నీటిమట్టానికి నిల్వలు పడిపోవడంతో నీటివిడుదలకు ఎపి అంగీకరించే పరిస్థితి లేదు. దీంతో సాగర్‌కు ప్రవాహాలు కరువై నీటి నిల్వ తగ్గుతోంది.

ప్రస్తుతం నీటి నిల్వ 500.4 అడుగుల నీటిమట్టానికి పడిపోయింది. ఈ జలాలతో అక్కంపల్లి, ఉదయసముద్రం రిజర్వాయర్ల ద్వారా ఐదారు రోజులకు మించి నీటిసరఫరా చేసే అవకాశాల్లేవు. ప్రస్తుతం ఉదయసముద్రంలో 0.1టిఎంసి, అక్కంపల్లిలో 0.14 టిఎంసిల లభ్యత మాత్రమే ఉంది. దీంతో రాష్ట్రప్రభుత్వం నారాయణపూర్ జలాశయం నుండి 15 టిఎంసిలు విడుదల చేయాలని కోరింది.

తొలుత సానుకూలంగానే స్పందించినా అధికారులతో చర్చించాక విడుదలపై మనసు మార్చుకుంది. ఇపుడు కర్ణాటక సిఎం సిద్ధరామయ్య సానుకూలంగానే స్పందిస్తేనే.. కనీసం తాగునీటి కష్టాలైనా తీరుతాయి. సాగునీటిపై ఆశలు అడుగంటిన తరుణంలో తాగునీటి కోసం కర్ణాటకకు మరోసారి విజ్ఞప్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

విద్యార్థి నాయకులపై దాడి హేయం

●శాసన మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ



కామారెడ్డి, కెఎన్ఎన్ : ఈ నెల 11న తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ ప్రొ.కోదండరాం ప్రజా సమస్యలపై చేపట్టిన అమరవీరుల స్ఫూర్తి యాత్ర సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద జేఏసీ విద్యార్థి సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన సభలో తెరాస నాయకులు కోడిగుడ్లు, టమాటాలు, కుర్చీలతో గుండాలుగా వ్యవహరించి దాడిచేయడం దుర్మార్గమైన చర్య అని శాసన మండలి విపక్ష నేత షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ప్రభుత్వం నుండి సభకు, యాత్రకు అనుమతులు తీసుకున్నప్పటికి తెరాస నాయకులు దాడి చేయడంతో ఐదుగురు విద్యార్థి సంఘాల నాయకులు గాయాల పాలయ్యారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నిస్తూ తెలంగాణ రాష్ట్రం నీ ముక్కు చూసి తెలంగాణ ఇవ్వలేదని కేవలం విద్యార్థుల బలిదానలతోనే సోనియాగాంధీ మనస్సు చలించి తెలంగాణను ఇచ్చారన్నారు. ఇంట్లో పని మనిషి చనిపోతే ఎంత బాధ ఉంటుందో సోనియాగాంధీకి తెలుసు కాబట్టే తెలంగాణ ఇచ్చిందన్నారు. విద్యార్థుల బలిదానలతో తెచ్చుకున్న తెలంగాణ కేవలం కేసీఆర్ కుటుంబానికే ఉపయోగపడుతుందన్నారు.

నేడు మిట్టీ బ్యాక్ ట్రైలర్ లాంచ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో రైతుల సమస్యలు, వారి ఆత్మహత్యలకు ప్రధాన కారణం అవుతున్న అంశాలను ప్రధానంగా జోడించి తీసిన సినిమా మిట్టీబ్యాక్ ట్రైలర్‌ను మంగళవారం నగరంలో లాంచ్ చేయనున్నారు. హైటెక్ సిటీలోని టిఎస్‌ఐఐసీ పార్కులోని ఫోనిక్స్- అరెనాలో ఈ కార్యక్రమం జరుగుతుంది.



అవకాశమిస్తే చెరగని ముద్ర వేస్తా

●నాన్న బాటలో నడుస్తా ●డబ్బుతో ముఖ్యమంత్రి ప్రలోభాలు ●నంద్యాలలోనే కేబినెట్ తిష్ట ●మూడున్నర ఏళ్ల పాలనపై ఇది తీర్పు ●రైతులు, పేదల ముఖాల్లో చిరునవ్వే నిజమైన అభివృద్ధి : నంద్యాల ఎన్నికల సభలో వైఎస్ జగన్

నంద్యాలక్రైం, కెఎన్ఎన్: ఒక్క అవకాశం ఇస్తే తన నాన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాదిరిగా అందరి గుండెల్లో చెరగని ముద్ర వేస్తానని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీని గెలిపించాలని, అన్ని రకాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మూడున్నర ఏళ్ళలో రాష్ట్రాన్ని నిలువునా దోచుకొని లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ముఖ్యమంత్రి చంద్రబాబు అంతటితో ఆగకుండా నంద్యాల ఉప ఎన్నికల్లో అవినీతికి తెరలేపారని ధ్వజమెత్తారు. 6వ రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన నంద్యాల పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి ప్రసంగిస్తూ నంద్యాల ఉప ఎన్నికల్లో అవినీతి డబ్బుతో ఓట్లను కొనాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మూడున్నర ఏళ్ళ చంద్రబాబు పాలనపై నంద్యాల ఉప ఎన్నికల తీర్పు ఉండబోతుందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ పోటీని తట్టుకోలేక రాష్ట్రకేబినెట్‌ను దించారని ఆరోపించారు.

ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని ప్రతి సామాజిక వర్గాన్ని తెలుగుదేశం నేతలు బుజ్జగిస్తున్నారన్నారు. మాట వినని వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. అర్ధరాత్రి వేళ భవనాలను కూల్చివేసి రోడ్లను త్రవ్వేస్తే అభివృద్ధి కాదన్నారు. రైతులు, పేదల ముఖాల్లో చిరునవ్వును అందించినప్పుడే నిజమైన అభివృద్ధి అన్నారు. అధికార అహంకారంతో చంద్రబాబుకు కళ్ళు నెత్తికి ఎక్కాయన్నారు. విశ్వసనీయతతో రాజకీయాలను నడుపుతున్నానని, అబద్ధం ఆడను, అమలు చేయలేని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేయలేనన్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి హయాంలో రేషన్ షాపుల్లో గతంలో పేదలకు అన్ని నిత్యావసర వస్తువులు లభించేవని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక వాటిని ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో పేదలు ఎన్నో ఇబ్బందులకు లోనవుతున్నారన్నారు.

చంద్రబాబు గత మూడున్నర ఏళ్ళలో ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అవినీతి పనులకు తెర లేపారన్నారు. ఇందుకు ఇళ్ళ పథకమే ఒక ఉదాహరణ అన్నారు. మూడున్నర ఏళ్ళుగా నంద్యాలలో అభివృద్ధి పనులను చేయని కారణంగానే చంద్రబాబు అవినీతిని ఆశ్రయిస్తున్నారన్నారు. తన దృష్ట పరిపాలనను కప్పి పుచ్చుకునేందుకు డబ్బుతో ఓట్లను కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. చిన్నా, పెద్దా నాయకులతోపాటు ప్రజలను డబ్బుతో కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మూడున్నర ఏళ్ళ పాలనపై నంద్యాల ఓటర్లు ఉప ఎన్నికల్లో ఇచ్చే తీర్పు కావాలన్నారు. చంద్రబాబు అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు స్పందించాలన్నారు. ఎన్నికలు రాక ముందు చంద్రబాబు ఒక్కసారైనా నంద్యాలకు వచ్చారా అని ప్రజలను అడిగారు. అప్పుడు నంద్యాలలో కనబడలేదన్నారు. ఇప్పుడు ఉప ఎన్నికలు వచ్చేసరికి నంద్యాల గుర్తుకు వచ్చిందన్నారు. ఉప ఎన్నికల్లో వైసీపీ పోటీ పెట్టక పోయి ఉంటే బాబు నంద్యాలకు వచ్చేవారా అని ప్రజలను అడిగారు. చంద్రబాబు ఒక్క హామీనైనా నెరవేర్చారా అని ప్రజలను అడుగుతూ చంద్రబాబు హయాంలో అభివృద్ధి సున్న అన్నారు. ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఎవరిని అడగకుండా షాపులు, ఇళ్ళను కూల్చి వేస్తారా అని ప్రశ్నించారు. నంద్యాలలో గజం రూ. 1.10 లక్షలు ఉందని, సెంటు స్థలం రూ. 50 లక్షలు పలుకుతుందన్నారు. చంద్రబాబు రాత్రికి రాత్రి భవనాలను కూల్చి వేసి గజానికి రూ. 18 వేలు ఇస్తానంటున్నారని ఇదా చంద్రబాబు అభివృద్ధి అంటే అన్నారు. ఇళ్లు కట్టేందుకు అడుగుకు రూ. 1000 అయితే చంద్రబాబు నంద్యాలలో ఇళ్ళ పథకం కాంట్రాక్టర్‌కు రూ. 2,778కి ఇచ్చారన్నారు. పేదలను సైతం వదిలి పెట్టడం లేదన్నారు. చంద్రబాబు పాలనకు వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. నంద్యాల ప్రజలు వేసే ఓటు రాబోయే రోజుల్లో జరుగబోయే మార్పుకు నాంది పలకాలన్నారు. నాయకుడు చెప్పింది చేయకపోతే ప్రజలు కాలర్ పట్టుకొని అడిగే పరిస్థితి రావాలన్నారు. చంద్రబాబు మీ వద్దకు వసారని, మూటేలు మూటేలు డబ్బులు తీసుకొని మరోసారి మోసం చేసేందుకు త్వరలో వస్తారన్నారు. నా తండ్రి పెద్ద కుటుంబాన్ని తనకు ఆస్తిగా అందించారన్నారు. వైఎస్సార్ సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో బ్రతికి ఉండటమే నా ఆస్తి అన్నారు. జగన్ అబద్ధం ఆడరని, మోసం చేయడని మాట మీద నిలబడే విశ్వసనీయతే నాకున్న పెద్ద ఆస్తి అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలే నా ఆస్తులన్నారు. అన్ని రకాలుగా నంద్యాల ప్రజలకు అండగా ఉంటానన్నారు. ఒక అవకాశం ఇస్తే నాన్న మాదిరి అందరి గుండెల్లో ముద్ర వేసుకుంటానన్నారు. కాగా నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఆర్చీ వద్ద ప్రారంభమైన రోడ్ షో టెక్కె, నాగులకుంట రోడ్డు, గిరినాథ్ సర్కిల్, సుద్దులపేట, చంద్రశేఖర్ టాకీస్, నూనెపల్లె, ఎన్‌జిఓఎస్ కాలనీ వరకు సాగింది. జగన్ పర్యటనలో భాగంగా ప్రజలను పలుకరిస్తూ సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు.



కొయ్యలగూడెంలో రష్మి ఠాగూర్

•వారానికి మూడు, నాలుగు సార్లు చేనేత వస్త్రాలను ధరించాలి • వీవర్స్‌కు నావంతు సహాయ సహకారాలు అందిస్తా • పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ అంబాసిడర్ రష్మిఠాగూర్



చౌటుప్పల్(రూరల్)కెఎన్ఎన్ : వారానికి మూడు,నాలుగు సార్లైనా చేనేత వస్రాలను దరించాలని పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ అంబాసిడర్ రష్మిఠాగూర్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల మండలంలోని కొయ్యలగూడెం చేనేత సంఘాన్ని సోమవారం ఆమె అధికారులతో కలిసి సందర్శించారు.చేనేత వస్త్రాలను ఆమె పరిశీలించారు. చేనేత కార్మికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మి కులకు ప్రతి రోజు కూలీ ఎంత గిట్టుబాటు అవు తుందని ఆమె అడిగి తెలుసుకున్నారు. చేనేత చీరలను పరిశీలించి డిజైన్లను అడిగి తెలు సుకున్నారు. ఈసందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే పోచంపల్లి ప్రాంతానికి మంచి గుర్తింపు లభిం చింది.చేనేత వస్త్రాలను తయారు చేయడంలో డిజైనర్స్ తక్కువ మంది ఉన్నారు. కొత్త కొత్త డిజైనర్స్‌తో చేనేత లకు పని కలుగుతుంది అని ఆమె అన్నారు. చేనేతలకు నావంతు సహయసహకారాలు పూర్తిగా అంది స్తానని అన్నారు. విదేశీయులు కూడా చేనేత వస్రాలను ఇష్టపడుతున్నారు కాని అక్కడ అందుబాటులో హ్యాం డ్లూమ్ మార్కెట్‌లు అందు బాటులో లేకపోవడం వలన చేనేత వస్త్రాలను కొనలేకపోతున్నారు. విదేశీయులు భారతదేశానికి వచ్చినప్పుడు కచ్చితంగా చేనేత వస్త్రాలను కొంటున్నారు. వారానికి ప్రతిఒక్కరూ మూడు,నాలుగు సార్లైనా చేనేత దుస్తులను ధరించా లని ఆమె తెలిపారు. చేనేత వస్త్రాలపై విస్తృతంగా ప్రచా రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చేనేత కార్మికులు వస్త్రాలను తయారు చేయడంలో ఎంత కష్టపడుతున్నారు అనేది మనం ఆలోచన చేయాలన్నారు. ప్రపంచ స్థాయిలో నేనే ప్రచారం చేస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా చేనేత రంగానికి పూర్తిగా సహకారం అందిస్తుంది. బడ్జెట్ కూడా కేటాయించింది కాని ఇంకా సప్సిడీలతో బడ్జెట్‌ను పెంచాలని ఆమె పేర్కొన్నారు. నేను పూర్తిగా చేనేత వస్త్రాలనే దరిస్తానని ఆమె తెలిపారు.చేనేత వస్తువులు విదేశాలకు ఎగుమతి పెరిగితే ఉపాధి కూడా పెరుగుతుంది అని ఆమె తెలిపారు.



ఈ కార్యక్రమంలో అధికారులు అరుణ్‌కుమార్,హిమద్‌కుమార్,సర్పంచ్ మాచర్ల క్రిష్ణ చేనేత సంఘం అధ్యక్షుడు వర్కాల శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు గడ్డం జయశంకర్,కార్యదర్శి గుర్రం వెంకటేశ్వర్లు,కర్నాటి పారిజాత,పొట్టబత్తిని ఉపేందర్, ఏలె భాస్కర్,జెల్ల వెంకటేశం,మేనేజర్ గంజి మార్కండేయ, పొట్టబత్తిని హరిక్రిష్ణనరేందర్ తదతరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ గ్రాడ్యుయేట్లకు లక్షల్లో జీతాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ ట్రిపుల్ ఐటి.. ఇక్కడ చదువుకుంటే భలే ఛాన్స్.. గ్రాడ్యుయేషన్ పూర్తయితే చాలు.. లక్షల్లో జీతం ఇవ్వడానికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీనికి తాజా ఉదాహరణలు ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.13 నుంచి 18 లక్షలు ఇవ్వడానికి ముందకొచ్చాయి కంపెనీలు. అంతేకాదు ఐటిలో మాస్టర్ ప్రోగ్రామ్స్ పూర్తిచేసిన విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో రూ.14 లక్షల నుంచి రూ.17.7 లక్షల వార్షిక జీతాలున్న ఉద్యోగాలు లభించాయి. ఇక్కడ జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో మొత్తం 116 కంపెనీలు రిజిస్టర్ చేసుకున్నాయి. విద్యార్థులందరికీ కొలువులు దక్కాయి. ఈ సంస్థ 16వ స్నాతకోత్సవం శనివారం జరగ్గా, 473 మంది విద్యార్థులు పట్టాలు పొందారు. వీరిలో రికార్డు స్థాయిలో 16 మంది పీహెచ్‌డీలతో పాటు 84 మంది పరిశోధక విద్యార్థులు ఉన్నారు. సంస్థ పాలక మండలి చైర్మన్ ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ రెడ్డీస్ లేబోరేటరీస్ సీఈవో జీవీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

హజ్‌యాత్ర ప్రారంభించిన డిప్యూటీ సీఎం మహమూద్ ఆలీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : మొదటి విడతగా హజ్‌యాత్రకు వెళ్లే ముస్లిం యాత్రికులకు డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ అభినందించారు. సోమవారం శంషాబాద్ ఏయిర్‌పోర్టుకు వెళ్లిన డిప్యూటీ సీఎం హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింల వద్దక వెళ్లి పలకరించి హజ్ యాత్ర జెండాను ఊపి మాట్లాడుతూ హజ్‌యాత్రను విజయవంతం చేసుకొని సురక్షితంగా తిరిగిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బాబాషపియోద్దీన్, మైనార్టీ వెల్ఫేర్ శాఖ చైర్మన్ అక్బర్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయశాఖలో రెవెన్యూశాఖను విలీనం చేయొద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

హైదరాబాద్,ఆంధ్రప్రభ : వ్యవసాయ శాఖలో రెవెన్యూ శాఖను విలీనం చేయాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రంలో కూడా రెవెన్యూ వ్యవస్థను ఇతర శాఖలో విలీనం చేయలేదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ శాఖలో విలీనం చేయ డం వల్ల భూ రికార్డులు తారుమారయ్యే ప్రమాదం ఉందని, తద్వార చిన్న రైతులకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. రెవెన్యూ శాఖ బలోపేతానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

దుబాయ్‌లో పెట్టుబడులకు నిధులెక్కడివి.?

అమరావతి, ఆంధ్రప్రభ: దుబాయ్‌లో వివిధ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన నిధులు ఎక్కడివని రాజ్యసభ సభ్యుడు కేవిపి రామచంద్రరావును ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన కేవిపికి బహిరంగ లేఖ రాశారు. మీ రెండవ కుమారుడు దుబయ్‌లో వ్యాపార రీత్యా ఒక షేక్ వద్ద పెట్రో ఆయిల్, రియల్ ఎస్టేట్ రంగంలో రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయిన మాట వాస్తవం కాదా అన్నారు. ఈ నిధుల కోసం షేక్‌ను భయపెట్టాలని చూస్తే అతను తండ్రీకొడుకులిద్దరినీ జైల్లో పెట్టిస్తానని బదులివ్వడంతో చేతులు దులుపుకుని వెనక్కి తిరిగిరాలేదా ఇది నిజం కాదా అన్నారు. ఈ డబ్బు మీకు ఎక్కడిది, ఏలా సంపాదించారని డిమాండ్ చేశారు. ఢిల్లీలో విలాసవంతమైన ప్రాంతం సఫ్దర్‌గంజ్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న గెస్ట్ హౌస్ అద్దె నెలలకు రూ.4 లక్షల 50 వేలు కడుతున్నారన్నారు. ఢిల్లీ కేంద్రంగా చేసుకుని ఈశాన్య ప్రాంతంలోను, ఇతర ప్రాంతాలలోను కొన్ని వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టేందుకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల నిర్మాణంలో దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన పనులను దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలో మీ కుమారుడు డైరెక్టర్ ఇది నిజంకాదా అన్నారు. శ్రీకాకుళం జిల్లా కాకరాపల్లి వద్ద నిర్మించనున్న మేఘువరం ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులో మీ కుమారుడు ప్రధాన భాగస్వామి అన్నారు. పారిశ్రామికవేత్తల నుంచి వసూలు చేసే అవినీతి మొత్తాలు సింగపూర్, మలేషియాల్లోని బ్యాంకుల్లో జమచేసి తిరిగి వివిధ సంస్థల పేరుతో అక్కడ నుంచి ఆ డబ్బును వైఎస్ కుటుంబ సభ్యులకు, తన కుటుంబ సభ్యులకు వాటాలు ఉన్న విద్యుత్ సంస్థల్లో పెట్టుబడుల రూపంలో తరలించలేదా అని ప్రశ్నించారు.

22న కృష్ణా బోర్డు భేటీ

•పాత నిర్ణయాలపై వ్యతిరేకత
•కొత్తనీరు 22 టీఎంసీలే ప్రాజెక్టుల్లో
•438 టీఎంసీల ఖాళీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కృష్ణానదీ జలాల పంపిణీ ఏవిధంగా చేపట్టాలన్న అంశంపై తెలుగురాష్ట్రాలతో చర్చించి త్వరలోనే షెడ్యూల్ ఖరారు చేయాలని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి త్వరలోనే ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేయబొతున్నట్టు కేంద్ర జల వనరులశాఖ నుంచి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖకు కబురందింది. కృష్ణానదీ జలాల వినియోగానికి సంబంధించి తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో చర్చించిన కేంద్రప్రభుత్వం గత రెండేళ్ల కిందట తాత్కాలికంగా షెడ్యూల్ ఎంపిక చేసి రెండు రాష్ట్రాల మధ్యన ఒక అంగీకారం కుదిర్చింది. అదే పాత ఒప్పందాన్ని 2017-18 నీటి సంవత్సరానికి కూడా అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది.అయితే తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని ఈ ఏడాదికి కూడా అమలు చేసేందుకు అంగీకరించటంలేదు. అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే విధమైన అభిప్రాయంతో ఉంది. దీంతో తిరిగి రెండు రాష్ట్రాల ప్రతినిధులను సమావేశ పరిచి 2017-18 నీటి సంవత్సరానికి షెడ్యూల్ ఎంపిక చేయాల్సివస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేయబోతోంది. ఈ సమావేశపు తేదీలను త్వరలోనే తెలియపరుస్తాని కేంద్ర జలవశనరులశాఖ నుంచి సమాచారం వచ్చింది.



22న కృష్ణారివర్‌బోర్డు భేటీ:

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశాన్ని ఈ నెల 22న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సారి అమరావతిలో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు బోర్డు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ ప్రారంబం నుంచి 2017-18 నీటిసంవత్సరం ప్రారంబమయ్యాక తొలిసారి పూర్తిస్థాయిలో బోర్డు కీళక సమావేశం ఏర్పాటు చేస్తోంది. ఈ సమావేశంలో ఈ ఏడాది జూన్ నుంచి కృష్ణాదిలో నీటి ప్రవాహాలు, జూరాల , శ్రీశైలం, నాగార్జున సాగర్ పులిచింతల తదితర ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిలువలు , ఈ ఏడాది ఇప్పటివరకూ చేరిన కొత్త నీటి వివరాలు తదితర అంశాలను బోర్డు సమావేశంలో చర్చించనున్నారు. అంతే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నీటి అవసరాలపై కూడా చర్చించనున్నారు. కృష్ణానదిపై ఉన్న ప్రధాన ప్రాజెక్టుల వద్ద తొలిదశ టెలిమీటర్ల ఏర్పాటు అంశం కూడా అజెండాలో చేర్చారు. కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు లోగోను కూడా ఈ సమావేశంలో చర్చించి ఎంపిక చేయ నున్నారు.

కొత్తనీరు 22టీఎంసీలే !

ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచి కృష్ణానది పరివాహకంగా తెలుగురాష్ట్రాల్లో ఉన్న ప్రధాన ప్రాజెక్టుల్లోకి 22.89టీఎంసీల కొత్తనీరు చేరింది. అందులో జూరాల ప్రాజెక్టుకు 12.27టీఎంసీల నీరు చేరగా, శ్రీశైలం ప్రాజెక్టులోకి 3.48టీఎంసీలు , నాగార్జున సాగర్‌లోకి ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా 3.09టీఎంసీలు , పులిచింతల ప్రాజెక్టులోకి 4.5టీఎంసీల నీరు చేరింది. ఈ ప్రాజెక్టులు పూరి స్థాయిలో నిండాలంటే ఎగువ నుంచి 438టీఎంసీల నీరు చేరాల్సివుంది.

సోమవారం జూరాల వద్ద ఎగునుంచి 3032క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతుండగా 4661క్యూసెక్కుల నీటిని జూరాల జలా శయం నుంచి కాలువలకు విడుదల చేస్తున్నారు. ఇక దిగువన శ్రీశైలం మొదలుకుని పులిచింతల దాక పరి వాహకంగా కురిసిన కొద్దిపాటి వర్షాలతో శ్రీశైలంలోకి 1130క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌లోకి 791 క్యూసెక్కులు, పులిచింతల లోకి 2550 క్యూసెక్కుల నీటి ప్రవాహాలు కొనసాగుతున్నాయి.

కృష్ణాష్టమి వేడుకల్లో వెంకయ్య



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఉత్తరాదివాసులు ఘనంగా, ఆనందోత్సాహాలతోజరుపుకునే శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సందడి చేశారు. రోజంతా అధికారిక కార్యక్రమాలతో బిజీ గా ఉన్న ఆయన సాయంత్రం బాల కృష్ణులు, చిట్టి గోపికమ్మలతో సరదాగా గడిపారు. ఢిల్లీలోని అబ్దుల్ కలామ్ రోడ్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సంబరాల్లో పాల్గొన్నారు. రాధాకృష్ణుల వస్త్రధారణలో ముస్తాబైన బాల బాలికలతో ఆడి పాడారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో వెంకయ్య నాయుడు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణాష్టమి సంబరాల్లో ఆయన సతీమణి, కుటుంబ సభ్యులూ సరదాగా గడిపారు. ఉప రాష్ట్రపతి అయ్యాక తాను పాల్గొన్న తొలి పండుగ ఇది అని ఆయన మీడియాకు వివరించారు.

తాగునీటకి కృష్ణా నీరు వదలండి

కర్నాటక సీఎంకి ఉత్తమ్ లేఖ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన తాగు నీటి కొరత దృష్టిలో ఉంచుకుని కృష్ణా నదీజలాలను వదలాలని కర్నాటక ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. నిరుడు నీటి కొరత ఏర్ప డినప్పుడు తాము చేసిన విజ్ఞప్తిని మన్నించి నీరు వదిలినందుకు కృత జ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొ న్నారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఏర్పడినందున నీరు వదిలేందుకు చర్యలు తీసుకోవాలని లేఖలో ఉత్తమ్ అభ్యర్థించారు.

విహెచ్‌ను పరామర్శించిన కుంతియా




హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : అస్వస్థతకు గురైన పీసీసీ మాజీ అధ్యక్షుడు వి హనుమంతరావును ఎఐసీసీ కార్యదర్శి , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ డాక్టర్ రామచంద్రకుంతియా పరామర్శించారు. సోమవారం మధ్యాహ్నం అంబర్‌పేటలోని విహెచ్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని గూర్చి అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుంతియా వెంట టీపీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి వేణుగోపాల్ , ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ తదితరులు ఉన్నారు.

ఢిల్లీ వెళ్లిన కుంతియా..

విహెచ్‌ను పరామర్శించిన అనంతరం డాక్టర్ కుంతియా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లి అక్కడి నుంచి విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర ఇంచార్జీగా నియమితులైన తర్వాత మూడు రోజుల పాటు ఇక్కడే మకాం వేసి పార్టీ శ్రేణులను స్వయంగా కలిసి పార్టీ పటిష్టతకై వారి అభిప్రాయాలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో

ఓంకార్ కుమారుడు మృతి



నకిరేకల్, కెఎన్ఎన్ : మాజీ ఎమ్మెల్యే ఓంకార్ కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మొత్తం ముగ్గురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే ఓంకార్ తనయుడు డాక్టర్ మద్దికాయల విజయ్‌కుమార్, అతని భార్య డాక్టర్ ఝాన్సీలక్ష్మి గత కొన్నేళ్లుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో ప్రైవేటు ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. సోమవారం జడ్చర్లలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హజరయ్యేందుకు విజయ్‌కుమార్ తన భార్యతో పాటు అత్త సావిత్రమ్మ, పెంపుడు కుమార్తె శోభలతో కలిసి ఏపీ 20 ఏఎం 3339నెంబర్ గల కారులో బయలుదేరారు. ఈ క్రమంలో కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం శివారులో గల గచ్చుగురి చెరువు కాల్వ వద్ద ముందుగా వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీని అధిగమించే క్రమంలో అదుపు తప్పి ట్యాంకర్‌ను వెనుకనుంచి వేగంగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న డాక్టర్ మద్దికాయల విజయకుమార్ (30), అతని అత్త దాసరాజు సావిత్రి (70)లు అక్కడికక్కడే మృతి చెందారు. అతని భార్య ఝాన్సీ లక్ష్మి, కుమార్తె శోభలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు. క్షతగాత్రులను నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. ఝాన్సీ లక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహామేరకు హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుమార్తె శోభ కుడికాలు విరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని నకిరేకల్ రూరల్ సీఐ విశ్వప్రసాద్ సందర్శించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించారు.

డాక్టర్ విజయ్‌కుమార్ మృతిపై సీపీఐ, సీపీఎం సంతాపం

ఎంసీపీఐ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దికాయల ఓంకార్ కుమారుడు డాక్టర్ విజయ్‌కుమార్ మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంలు వేర్వేరుగా సంతాపం ప్రకటించారు. ఓంకార్ కుటుంబం ఉమ్మడి కమ్యునిష్టు పార్టీలో పని చేయగా.. ఆయన కుమారుడు వామపక్షభావజాలంతో ఉండి డాక్టర్‌గా ప్రజలకు వైద్య సేవలు అందించారని వారు గుర్తు చేశారు.

పసికందును కడతేర్చిన తల్లి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆదిలాబాద్ జిల్లాలో ఓ తల్లి మాతృత్వానికి మచ్చగా మిగిలింది. వివాహేతర సంబంధం ఎక్కడ బయటపడుతుందో అని పురిటి బిడ్డనే కడతేర్చింది. ఇంట్లోనే గొయ్యితీసి పూడ్చిపెట్టింది. ఆ తర్వాత ఏమైందో గానీ.. తన బిడ్డ కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆ తల్లి దుర్మార్గాన్ని బట్టబయలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం కప్పర్లకు చెందిన వెంకటమ్మ భర్త చనిపోవడంతో అదే గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చి మగ శిశువుకు జన్మనిచ్చింది. వివాహేతర సంబంధం బయటపడుతుందని భావించిన వెంకటమ్మ ఇంట్లోనే గొయ్యితీసి ఆ శిశువును అందులో పాతిపెట్టింది. ఆ తర్వాత ఓ వ్యక్తి కుమారుడిని ఎత్తుకెళ్ళాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఆదిలాబాద్ శివారులో వెంకటమ్మ, శంకర్ కనిపించారు. అనుమానంతో వారిని విచారించగా శిశువు హత్య బయటపడింది. అయితే మృత శిశువు పుట్టడంతోనే పాతిపెట్టామని వారు చెబుతున్నారు.

సికింద్రాబాద్-విశాఖ మధ్య రెండు సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సికింద్రాబాద్ - విశాఖపట్టణం మధ్యన రెండు సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లను నడిపిస్తున్నారు. ఈ ప్రత్యేక సూపర్ ఫాస్టు ఎక్స్ ప్రెస్ 15వ తేదీన 20.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు విశాఖ చేరుకోనుంది. అదే విధంగా 16వ తేదీన 19.45 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు 6.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ప్రయాణికుల రద్దీ పెరగడంతో ప్రత్యేక సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లను నడిపిస్తున్నారు. మార్గమధ్యలోని వరంగల్, విజయవాడ, రాజమండ్రి సామర్లకోటలో మాత్రమే ఈ సూపర్ ఫాస్టు ఎక్స్ ప్రెస్‌లను నిలుపుదల చేయడం జరుగుతుంది

విశాలో జాతీయ విద్యుత్ సదస్సు

అమరావతి, ఆంధ్రప్రభ: విద్యుత్ ఆదాపై జాతీయ స్థాయి సదస్సుకు విశాఖపట్నం వేదికకానుంది. 2018-2019 కాలంలో దేశ వ్యాప్తంగా 1.32 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను ఈనెల 18వ తేదీన జరిగే సదస్సులో నిర్ణయిస్తారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖలోని ఎనర్జి ఎఫిసియన్సీ బ్యూరో (బీఈఈ) నిర్వహించే ఈ కార్యక్రమంలో 29 రాష్ట్రాలు, కేంద్రపాలిన ప్రాంతాల ప్రతినిధులు హాజరవుతారు. విద్యుత్ సమర్ధవంత వినియోగం ద్వారా ఏటా రూ. 53 వేల కోట్ల వరకూ ఆదా చేసుకోవచ్చని ఏపీ ఎనర్జి కన్జర్వేషన్ మిషన్ సీఈవో చంద్రశేఖర రెడ్డి వెల్లడించారు. ఎల్‌ఈడీ బల్బుల వాడకం, వ్యవసాయ రంగంలో సమర్థ యాజమాన్యం, ఉజాలా, పారిశ్రామిక రంగంలో మెరుగైన పద్దతులు అమలు, భవన నిర్మాణంలో ప్రమాణాలను పాటించడం, నాణ్యమైన విద్యుత్ పరికరాల వాడకం వంటి వాటి ఫలితంగా విద్యుత్‌ను ఆదాచేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఏపీలో 'చంద్రన్న' అపర భగీరథ యత్నం

•సీఎం మహా సంకల్పానికి అన్నదాతల చేయూత
•చకచక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం
• నేడు జగ్గంపేటలో భారీ బహిరంగ సభ

అమరావతి, ఆంధ్రప్రభ : సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న కృషికి సర్వత్రా నీరాజనాలు పలుకుతున్నారు.కరవు రహిత రాష్ట్ర నిర్మాణం దిశగా ఆయన చేస్తున్న అపర భగీరథ యత్నానికి జనం కొండంత అండగా నిలవడంతో సాగునీటి ప్రాజెక్టులపై మరింత చొరవ చూపిస్తూ ముందుకు పోతున్నారు. నాడు భగీరథుడు గంగను ఏ విధంగానైతే భూమ్మీదకు తీసుకువచ్చి,ప్రవహింపజేసేందుకు ఎంతటి కఠోర శ్రమను అనుభవించాడో నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా అంతటి రీతిలో శ్రమిస్తూ అపర భగీరథ ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. రాష్ట్రరైతాంగం సుస్థిరాభివృద్ధితో పాటు ప్రజలకు నీటి భద్రత కల్పించడం కోసం మునుపెన్నడూ లేని రీతి లో ముఖ్యమంత్రి అహోరాత్రులు శ్రమిస్తున్నారు.సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ఈ మూడేళ్లలో జలవనరుల శాఖ రూ. 32,740 కోట్లు వ్యయం చేసిందంటే ఏ రీతిలో కృషి జరుగుతుందో వేరే చెప్పనక్కర్లేదు. రాష్ట రైతాంగాన్ని ఆర్ధికంగా మరింత బలోపేతం చేసే బృహత్తర లక్ష్యంతో మనుపెన్నడూ లేని విధంగా కేవలం ఈ మూడేళ్లలోనే అన్ని వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడం సాగునీటి చరిత్రలొనే ప్రప్రధమమని అంటున్నారు. సాగునీటి ప్రాజెక్టులే ప్రగతికి సోపానం అనే నినాదంతో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సీఎం అహర్నిశలు కృషిచేస్తూ మహా సంకల్పంతో ముందడుగు వేయడం ప్రతి రైతు గర్వించదగ్గ విషయంగా పేర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపటి, జాతికి అంకితం చేసిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించింది. సీఎం మహా సంకల్పానికి అన్నదాతల నీరాజనాలు అంబరాన్నంటాయి. ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత దిశగా చేసేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న అప్రతిహత కృషిని అందరి అభినందనలు అందుకుంటోంది. ముఖ్యమంత్రి అంకితభావంతో నవ్యాంధ్ర పురోగతికి సాగునీటి ప్రాజెక్టులే కీలకమన్న సత్యాన్ని గ్రహించి, ముందడుగు వేస్తున్నారు. ఆయనలోని చిత్తశుద్ధి, కర్తవ్య దీక్ష, ధృఢ సంకల్పం, సేవానిరతి అన్నింటిని మించి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ముఖ్యమంత్రి అపర భగీరథ ప్రయత్నానికి జనం నీరాజనాలు పలుకుతున్నారు. ఈ ఏడాది పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 30 టీఎంసీల నీటిని సాగునీటికి మళ్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఎన్ని విమర్శలు గుప్పించినా, అవంతరాలు వచ్చిన రికార్డు సమయంలోనే పట్టిసీమను పూర్తి చేసి,గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించిన ముఖ్యమంత్రి అదే పట్టుదలతో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని కూడా అనతికాలంలోనే పూర్తి చేసి,ఈనెల 15వ తేదీన రాష్ట్ర ప్రజలకు అంకితం చేయబోతున్నారు. రాష్ట్రప్రభుత్వం చేసిన అవిరళ కృషి ఫలితంగా ఇప్పటికే కృష్ణా డెల్టా వ్యాప్తంగా ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను సమకూర్చేందుకు ప్రభుత్వం పురుషోత్తపట్నం ప్రాజెక్టునకు కూడా అత్యంతర ప్రాధాన్యత ఇచ్చింది. సీఎం దిశా నిర్దేశంలో ప్రభుత్వం పవిత్ర కర్తవ్యంగా ప్రాధాన్యత క్రమంలో పురుషోత్తపట్నం భారీ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది.ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి, సాగును వ్యవస్టీకరించి, భావితరాల సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలని వ్యవసాయరంగాన్ని, రైతాంగాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వ నదుల అనుసందానంతో ముందుకు పోతున్నది. ఎన్ని అవంతరాలు ,ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తలపెట్టిన ప్రాధాన్యతా ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసి, రాష్ట్రంలోని నదులన్నింటిని అనుసంధానించి, వాన నీటిని సంరక్షించుకుని, ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంపొందించి,రాష్ట్రాన్ని కరవు రహితంగాచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ప్రాధాన్యత క్రమంలో ఎంచుకుని,నిర్దేశిత గడువు విధించుకున్న పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ఆగస్టు 15న సీఎం చేత ప్రారంభించేందుకు నీటిపారుదల శాఖాధికారులు సర్వం సిద్దం చేశారు.



టీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలకు గడ్డుకాలం

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెరాస హయంలో మూతపడిన పరిశ్రమలను తెరిపించడం అనే మాటను పక్కనపెడితే నడుస్తున్న పరిశ్రమలే అధికంగా మూత పడుతున్నాయని తెదేపా ఆరోపించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణీ ప్రధాన కారణమని మండిపడింది. సూపర్‌మాక్స్ కంపెనీ కార్మిక సంఘానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఇ. పెద్దిరెడ్డిని సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో టీఎన్‌టీయుసీ రాష్ట్ర శాఖ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎల్. రమణ,పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌బాబు, కార్యక్రమాల కమిటీ కన్వీనర్ బుచ్చిలింగం తదితరులు హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పెద్దిరెడ్డిన గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పార్టీ అధ్యక్షుడు ఎల్. రమణ మాట్లాడుతూ, ఎన్టీఆర్ కార్మిక రత్న బిరుదు పొందిన పెద్దిరెడ్డి సూపర్‌మాక్స్ కంపెనీలోని టిఎన్‌టీయుసి తరపున పోటీ చేసి గెలిచినందుకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మూతపడ్డ పరిశ్రమలను తెరిచి కార్మికుల శ్రేయస్సు కోసం తెరాస పనిచేస్తుందని కేసీఆర్ ఘతంలో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ తెరాస అధికారంలోకి



వచ్చి మూడేళ్ళు అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు మూతపడిన కంపెనీలో ఏ ఒక్కదానినైనా తెరిపించగలిగారా? అని రమణ ప్రశ్నించారు. పైగా నడుస్తున్న పరిశ్రమలే ప్రస్తుతం మూతపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇందుకు తెరాస ప్రభుత్వం కార్మిక లోకం పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరేనని ఆయన మండిపడ్డారు. రాష్ట్రం హోంశాఖ మంత్రి నాయినీ నర్సింహ్మారెడ్డికి చెందిన హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్మికుల గురించి పట్టించుకోకుండా యజమాన్యాలకు తొత్తుగా వ్యవహరించడం వల్లే సూపర్‌మాక్స్ కంపెనీ కార్మికులు వరసగా రెండుసార్లు ఓడించారని ఆయన ప్రశంసించారు. నిజాయితీ, నిబద్ధత గల పెద్దిరెడ్డిని గెలిపించి కార్మికులు తమ చిత్తశుద్ధని నిరూపించుకున్నారన్నారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని కార్మిక సంఘాలు పలుమార్లు ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ దాని గురించి పట్టించుకోకపోవడం అత్యంత దారుణమని అని వ్యాఖ్యానించారు. తక్షణమే ప్రభుత్వం కనీస వేతన చట్టం అమలు చేయాలని,లేనిపక్షంల కార్మికులతో కలిసి టిఎన్‌టియుసి చేసే పోరాటల్లో తెలుగుదేశం పార్టీ కూడా పాలుపంచుకుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి టిఎన్‌టియుసీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బిఎన్. రెడ్డి సభ అధ్యక్షత వహించగా పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఎంపీలు X ఎమ్మెల్యేలు!

- పలు జిల్లాల్లో నేతల మధ్య డిష్యుం.. డిష్యుం..
- పోటీగా భావించే నేతలకు చెక్‌పెట్టే వ్యూహాలు
- సర్దుబాటు సమస్యలతో మరింత రగడ
- ఆరా తీస్తున్న సీఎం కేసీఆర్
- విభేదాలకు ఆజ్యం పోసే నేతలపై నజర్
- పార్టీకి నష్టం చేసేవారికి మందలింపులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిఆర్ఎస్.. ఇపుడు రాష్ట్రంలో తిరుగులేని పార్టీ. గత ఎన్నికల సమయం లో.. బలమైన నేతలకోసం పలు నియోజకవర్గాల్లో అన్వేషించిన టిఆర్ఎస్ ఇపుడు నేతల ఓవర్‌ఫ్లోతో సర్దుబాటు సమస్యను ఎదుర్కొంటోంది. నియోజక వర్గాల పునర్విభజన ఆశ కూడా అడుగంటడంతో వచ్చే ఎన్నికల్లో ప్లేస్‌మెంటే లక్ష్యంగా పలువురు నేతలు.. తమ కు పోటీగా భావించే నేతల కాళ్ళ కిందకు నీళ్ళు తెస్తున్నారు. మరికొందరు నేతలు తమకు పోటీగా భావించే ప్రజాప్రతినిధులకు వచ్చే ఎన్నికలలో టిక్కెట్ రాకుండా చేసే వ్యూహాలకు కూడా పదునుపెడుతున్నారు. పలు జిల్లాల్లో నేతల మధ్య వివాదాలు చిలికిచిలికి గాలివాన గా మారుతుండగా, మరికొన్ని చోట్ల పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టుకునే వరకు పరిస్థితి వెళ్ళింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అత్యంత పకడ్బందీగా వ్యవహరించేందుకు వ్యూహం రూపొందిస్తున్న గులాబీ దళపతి కెసిఆర్ నేతల మధ్య పెరుగుతున్న విభేదాలపై నజర్ వేశారు. పార్టీకి నష్టం చేస్తున్న నేతల తీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆది నుండీ పక్కా వ్యూహంతో వ్యవహరిస్తున్న సిఎం కెసిఆర్.. ఎమ్మెల్యేసీట్లకు ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడం, పలు చోట్ల అభ్యర్థులను మార్చాల్సిన అవసరాల నేపథ్యంలో ప్రతి అంశంపైనా ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

సీఎంకు నివేదికలు

నేతలు బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో.. ఎక్కువగా విభేదాలు రచ్చకెక్కుతుండగా, పోటీ తీవ్రంగా ఉండి సర్దుబాటుకు అవసరం లేని చోట కూడా కారును తకరారు చేస్తున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, నేతల తీరుపై సిఎంకు ఎప్పటికపుడు నివేదికలు అందుతుండగా, పరిస్థితి తీవ్రంగా ఉన్న చోట సిఎం స్వయంగా మందలిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పుకు సంబంధించి సిఎం ఇప్పటికే డిసైడ్ అయినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీకి నష్టం చేసే చర్యలను సహించనని నేతలను సుతిమెత్తగా హెచ్చరిస్తూనే వచ్చే ఎన్నికలు లక్ష్యంగా సిఎం పక్కా స్కెచ్ రూపొందిస్తున్నారు. పార్టీలో నేతల సంఖ్యకు కొదవలేకపోవడంతో.. విభేదాలకు ఆజ్యం పోసేవారికి, సామర్థ్యం నిరూపించుకోలేని వారికి చెక్ తప్పదన్న ప్రచారం జరుగుతోంది.


రోడ్డెక్కుతున్న విభేదాలు..

అధికార టిఆర్ఎస్ పార్టీలో పది నుండి పదిహేను నియోజకవర్గాల్లో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేల మధ్య వివాదాలు ఉండగా, మరికొన్ని చోట్ల ఇతర నేతల మధ్య కూడా పంచాయతీలు ఉన్నాయి. అధికార టిఆర్ఎస్ పార్టీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీయే లక్ష్యంగా కొందరు, పార్టీలోని తమ ప్రత్యర్థికి సీటురాకుండా చేయాలని మరి కొందరు కదుపుతున్న పావులతో వర్గపోరు రసకందాయంగా మారుతోంది. ఎంపీ అంటేనే.. కొందరు ఎమ్మెల్యేలు భగభగలాడుతుండగా, ఎమ్మెల్యే అంటే కొందరు ఎంపీలు కస్సుమంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ సీటుపై కన్నేశాడని కొందరు ఎమ్మెల్యేలు, నియోజకవర్గంలో తమకు అనుకూ లంగా లేని కొందరు నాయకులను ప్రోత్సహిస్తున్నారని మరికొందరు ఎమ్మెల్యేలు ఎంపీలపై రుస రుసలాడుతున్నారు. తామంటే.. ఎమ్మెల్యేలు కనీస గౌరవం ఇవ్వడంలేదని, తాము నియో జకవర్గాలకు వెళితే గౌరవ మర్యాదలు లభించడం లేదని, వీటికోసం తాము కొందరిని ప్రోత్సహిస్తే ఎమ్మెల్యేలు సహిం చడంలేదని కొందరు ఎంపీలు వాపోతున్నారు. మరోవైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలోకి దిగాలని భావి స్తున్న కొందరు ఎంపీలు.. తమకు అనుకూల స్థానాలపై కన్నేసి ఎమ్మెల్యేలకు పొగపె డుతున్నారన్న ప్రచారం పలువురికి నిద్రపట్టనివ్వడం లేదు. ఇటీవల కొందరు ఎమ్మెల్యేల ఆగ్రహం.. కట్టలు తెంచుకోగా, వివాదాలు ముఖ్యమంత్రి దృష్టికి కూడా చేరాయి. పలు నియోజక వర్గాల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఆంధ్రప్రభ సేకరించిన సమాచారం.. పలు జిల్లాల్లో కారును కంగారుపెట్టే సమస్యలు ఇలా ఉన్నాయి.

- ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మధ్య విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. మంత్రి సమక్షంలోనే బాహాబాహీకి నేతలు సిద్ధపడగా, మాజీ ఎంపిపై ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఎం స్వయంగా హెచ్చరించిన తర్వాత కూడా.. మాజీ ఎంపీ నియోజకవర్గ వ్యవహారాల్లో వేలుపెట్టడం, తనకు పోటీగా గ్రూపు రాజకీయాలు ప్రోత్సహించడంపై ఎమ్మెల్యే రేఖానాయక్ సిఎంకు ఫిర్యాదుచేసినట్లు సమాచారం.
- కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ తీరుపై వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల ఎంపీ బర్త్‌డే వేడుకలు నిర్వహించారని ఆయన అనుచరులైన ఎంపిపితో సహా నలుగురు ముఖ్యనేతలను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. దీనిపై ఎంపీ వినోద్ సిఎంకు ఫిర్యాదుచేసినట్లు సమాచారం.
- పెద్దపల్లి ఎమ్మెల్యే బాల్కసుమన్‌కు, రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణకు మధ్య సఖ్యతలేదు. అక్కడ ఎమ్మెల్యే ఎంపీని లెక్కచేయడం లేదనే ప్రచారం ఉండగా, రామగుండం మేయర్ సహా నగరపార్టీ ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తూ ఎంపీకి దన్నుగా నిలుస్తున్నట్లు ప్రచారం ఉంది. ఇక చొప్పదండి లేదా పెద్దపల్లి అసెంబ్లీ స్థానాల నుండి సుమన్ బరిలోకి దిగవచ్చన్న ప్రచారం నేపథ్యంలో అక్కడి ఎమ్మెల్యేల్లో గుబులు ఉంది.
- భువనగిరి ఎంపీ బూరనర్సయ్యగౌడ్‌కు, నల్లగొండ జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలతో సఖ్యతలేదు. దీనిపై గతంలో ముఖ్యమంత్రి మందలించిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే కొందరు ఎమ్మెల్యేలు ఎంపీని పట్టించుకోకపోవడంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఆలేరు ఎమ్మెల్యేకు ఎంపీకి మధ్య సంబంధాలు ఉప్పునిప్పులా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.
- టిఆర్ఎస్ లోకసభపక్ష నేత జితేందర్‌రెడ్డికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్‌కు మధ్య విభేదాలు ఉన్నాయి. ఇప్పటికే రెండు సార్లు నేతలు బహిరంగంగా వాదనలకు దిగగా, వచ్చే ఎన్నికల్లో ఒకరికొకరు సహకరించుకునే అంశంపై అనుమానాలున్నాయి. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజ కవర్గంపై కూడా ఎంపీ తన వారసుడి కోసం కన్నేసినట్లు జరుగుతున్న ప్రచారం అక్కడి ఎమ్మెల్యే కు కునుకలేకుండా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- ఇక నల్లగొండ ఎంపీ గుత్తాసుఖేందర్ రెడ్డి వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యేగా బరిలో నిలవ నుండగా, తమ సీటుకు ఎర్త్ పెడతాడేమోనన్న ఆందోళన మునుగోడు, మిర్యాలగూడ ఎమ్మెల్యేల్లో ఉన్నట్లు టిఆర్ఎస్ ఇన్నర్ సర్కి ల్స్‌లో ప్రచారం జరుగుతోంది.
- మహబూబాబాద్ అసెంబ్లీ నియోజ కవర్గానికి సంబంధించి ప్రస్తుత ఎమ్మెల్యే శం కర్‌నాయక్, కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్‌లోకి వచ్చిన మాజీమంత్రి రెడ్యానాయక్ కుమార్తె కవితకు మధ్య విభేదాలున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగు తోంది. చాలా కాలంగా ఇరువురు నేతల మధ్య సఖ్య త లేకపోగా, సీటు పంచాయతీనే ఇందుకు కారణమన్న చర్చ ఉంది.



సమస్యల పోరాటంలో విపక్షాలు విఫలం




హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రతిపక్ష పార్టీలు సామాజిక వర్గాలను కలుపుకుని పోవడంలో విఫలమవుతున్నాయని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్‌గౌడ్ విమర్శించారు. నేరెళ్ల ఘటనపై విపక్ష పార్టీలు గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయడాన్ని తమ పార్టీ స్వాగతిస్తున్నదని, అయితే సామాజిక వర్గాలను విస్మరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆయన తెలంగాణ ఇంటి పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అఖిపలక్ష పార్టీల నేతలు సామాజిక వర్గాల నాయకులకు కూడా కలుపుకొని వెళ్లితే ఉద్యమాలకు మరింత బలం చేకూరుతుందని ఆయన అభిప్రాయడ్డారు. రాష్ట్రంలో పాలకులు మారిన ఉమ్మడి రాష్ట్రంలోని విధానాలే కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. సీఎం చంద్రశేఖర్‌రావు భూస్వామ్య విధానాలు, నిరంకుశ దోరణిని అనుసరిస్తున్నాడని, ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలపై దాడులు జరుగుతున్నా నోరుమెదపడం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. 70 వేల పుస్తకాలను చదివాను అన్న సీఎం కేసీఆర్.. నేరెళ్ల ఘటనపై ఎందుకు స్పందించడం లేదన్నారు. పుస్తకాలు చదివితే సామాజిక పరివర్తన వస్తుందని ఆయన తెలిపారు. నేరెళ్ల ఘటన వెనుక మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు సంతోష్ పాత్ర ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా ఎస్పీ పాత్ర కూడా ఉందని, ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని చెరుకు సుధాకర్ డిమాండ్ చేశారు. కొత్త రాష్ట్రంలో వడి వడిగా

కొత్త జిల్లాల ప్రకారమే టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: కొత్త జిల్లాల ప్రకారమే టీచర్ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, టీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. టీచర్ పోస్టులను 8,972 భర్తీ చేస్తామని చెప్పడం కాదని, ఖాళీగా ఉన్న 40 వేల పోస్టులను నింపాలన్నారు. సోమవారం సీఎం చంద్రశేఖర్‌రావుకు ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య లేఖ రాశారు. టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన కోరారు. అదిగో, ఇదిగో అంటూ జాప్యం చేయడం వల్ల నిరుద్యోగ యువతలో అసహనం పెరుగుతోందన్నారు. పాత జిల్లాల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేస్తే సాంకేతికపరమైన అంశాలతో మళ్లీ వాయిదా పడే ప్రమాదం ఉందన్నారు. సెప్టెంబర్ 13లోగా టీచర్స్ రిక్రూట్‌మెంట్ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. టీచర్ పోస్టుల ఖాళీల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పడం లేదన్నారు. 25,600 ఖాళీలు ఉన్నాయని అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రకటిస్తే.. ఒక సంవత్సరం తర్వాత మంత్రి వర్గ సమావేశంలో 16 వేలు భర్తీ చేస్తామని చెప్పారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ వచ్చునప్పుడు 25 వేలు ఖాళీగా ఉంటే.. ఈ మూడేళ్లో మరో 15 వేల మంది పదవీ విరమణ పొందారని ఆయన గుర్తు చేశారు. బీఈడీ, డీఈడీ, పీఈటీ, భాష పండితుల కోర్సులు చేసిన వారు రాష్ట్రంలో దాదాపు 5 లక్షలకు పైగా మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు.

కిలిమంజారోను అధిరోహించిన ఎస్ఎల్ఎన్ఎస్ విద్యార్థులు



భువనగిరి, కెఎన్ఎన్: జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహా స్వామి డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం సౌతాఫ్రికాలోని కిలిమంజారో శిఖరం అధోహించారు. ఇది ప్రపంచంలోని ఎత్తైన ఏడు శిఖరాలలో కిలి మంజారో శిఖరం ఒకటి. శిఖరాన్ని అధిరోహించిన శ్రీకాంత్ నాయక్, అరుణ్ నాయక్‌లను శిక్షకులు శేఖర్ బాబు అభినందించారు. ఈ విద్యార్థులు భువనగిరిలోని రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ పొందారు.

గురుకులాల విద్యార్థుల అభినందించిన సీఎం కేసీఆర్

ఆఫ్రికాలోని ఎత్తైన శిఖరం కిలిమంజారోను ఆదిరోహించిన గిరిజన గురుకులాల విద్యార్థులను సీఎం చంద్రశేఖర్‌రావు అభినందించారు. గతంలో కూడా మాలవతి పూర్ణ కిలిమంజారోను ఆదిరోహించగా, ఆనంద్‌కు మార్ ఎవరెస్టు శిఖరాన్ని ఆదిరోహించారు. గురుకులాల విద్యార్థుల విద్యకు, ఎత్తైన పర్వతాలను ఆదిరోహించడానకి సహకరిస్తున్న సీఎం చంద్రశేఖర్‌రావు, మంత్రులు జగదీష్‌రెడ్డి, చందూలాల్‌కు గురుకులాల కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వంపై పోరాడేందుకు ముందుండాలి

- అనుబంధ సంఘాలకు కుంతియా పిలుపు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడడంలో అనుబంధ సంఘాలు ముందుండాలని ఎఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమరం సాగించాలని కోరారు. ఇంచార్జీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగాటీపీసీసీ అనుబంధ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఆయన దిశా, నిర్దేశం చేశారు.ఈ సమావేశాల్లో ఎఐసీసీ సహ ఇంచార్జీ సతీష్, పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ జే గీత, ఎస్ఎ సంపత్‌కుమార్, పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, కిసాన్ సెల్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడారు. తొలుత సేవాదళ్ నాయకులతో మాట్లాడారు. ఆ తర్వాత యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనారిటీ, ఎన్ఎస్‌యూఐ, లీగల్, కిసాన్ కాంగ్రెస్, లింగ్విస్టిక్ సెల్ సమావేశాల్లో మాట్లాడారు. పార్టీకి అనుబంధసంఘాలు, విభాగాలు అత్యంత కీలకమని, వేలాది మంది కార్యకర్తలు సంఘాల్లో ఉన్నారని,ప్రభుత్వం చేసే తప్పిదాలపై ఎక్కడికక్కడ పోరాటాలు చేయాలని కుంతియా పిలుపునిచ్చారు.

పార్టీలో విబేధాలు పనికిరావని, గొడవలపై బజారుకు ఎక్కడం,మీడియాకు ఎక్కడం సరికాదన్నారు. గత ఎన్నికలసందర్భంగా టీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి సారించి అమలుకాని వాటికై పోరాట బాట పట్టాలని కోరారు. ఇంటికో ఉద్యోగం అని మాట ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు.

లక్ష ఉద్యోగాల ఊసెత్తడం లేదని కుంతియా ధ్వజమెత్తారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కొంచెం కష్టపడితే రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ఉత్సాహం నింపారు.పార్టీ నిర్దేశించిన మేరకు కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, సేవాదళ్ చైర్మన్ కనుకుల జనార్ధనరెడ్డి, బీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్ దాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, లీగల్ సెల్ చైర్మన్ దామోదర్ రెడ్డి, మైనారిటీ సెల్ చైర్మన్ ఫక్రుద్దీన్, ఎస్టీ సెల్ చైర్మన్ జగన్ లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కేజ్ కల్చర్ కేంద్రాలు

- ప్రయోగాత్మకంగా వంద కేంద్రాలు నెలకొల్పాలని నిర్ణయం
- ఆధునిక మత్స్య మార్కెట్లకు ప్రోత్సాహకాలు
- ఎన్ఎఫ్‌డీబీ ద్వారా ప్రత్యేక రాయితీలతో వాహనాలు, ఇతర పరికరాలు
- కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో లక్షలాది మంది ఆధారపడి ఉన్న మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపల చెరువుల్లో కేజ్ కల్చర్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఇక్కడ దిల్‌కుషా అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 3345 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయని, ఈ సంఘాల్లోని సభ్యులంతా ఈ వృత్తినే ప్రధాన జీవనాధారంగా నమ్ముకున్నారని అన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన కేజ్ కల్చర్ టెక్నాలజీ ద్వారా పెద్ద చేపలు చిన్న చేపలను మింగేయకుండా, అతితక్కువ సమయంలో చేపపిల్లలు పెరిగే విధంగా చేయవచ్చునని వివరించారు. ప్రస్తుతం కూకట్‌పల్లి, నాచారం, బేగంబజార్, దోమలగూడలలో ఉన్న ఫిష్ మార్కెట్లను ఆధునీకరించేందుకు కేంద్రం ఈ ఏడాది రూ.9.60 కోట్లు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను వినియోగించుకోలేకపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఇంటర్నేషనల్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ

తెలంగాణలో ఇంటర్నేషనల్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీని నెలకొల్పేందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ సంసిద్ధంగా ఉందని దత్తాత్రేయ తెలిపారు. అందుకోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పోచంపల్లిలో కేటాయించిన 100 ఎకరాల భూమి ఫ్లోరైడ్ ప్రాంతమైనందున అధికారుల బృందం నిరాకరించిందని తెలిపారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రానికి వస్తున్నం దున సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి మరో ప్రాంతంలో 200 ఎకరాల స్థలాన్ని కేటా యించాలని కోరారు.



మల్లేపల్లి మోడల్ ఐటిఐ

మల్లేపల్లిలో ఉన్న పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)ని కేంద్ర కార్మికశాఖ దత్తత తీసుకుని మోడల్ ఐటిఐగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించామన్నారు. అందులో 10 కొత్త ట్రేడ్లను ప్రారంభించి విద్యార్థులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలను కూడా కల్పించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. అందుకోసం మారుతీ మోటార్స్ లిమిటెడ్‌తో అవగాహన కుదుర్చుకున్నామన్నారు.


కోదండరాం భేటీ

చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం తనను కలిశారని దత్తాత్రేయ తెలిపారు. ఈ విధానాన్ని నిరసిస్తూ ఈనెల 21, 22 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని, అందులో తనను కూడా పాల్గొనాలని కోరినట్లు చెప్పారు. నేరెళ్ళ ఘటనలో దళిత కుటుంబాలను ఆదు కోవాలని విజ్ఞప్తి చేసిన విషయాన్ని దత్తాత్రేయ వెల్లడించారు.

తొలగిన అడ్డంకులు

ఇక నిర్మాణమే తరువాయి

- బైసన్ పోలో మైదానంలో రాష్ట్ర పరిపాలనా కేంద్ర సముదాయం
- సచివాలయం, విధానసభ, విధాన పరిషత్, కళాభారతి భవనాలు కూడా ఇక్కడే
- మొత్తం 59 ఎకరాలు, నాలుగు భారీ బహుళ అంతస్తుల భవనాలు
- వాటి ముందుభాగంలో 30 ఎకరాల పరేడ్ గ్రౌండ్
- ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు
- దసరా రోజున శంకుస్థాపన ముహూర్తం?
- గరిష్టంగా రెండేళ్లలో నిర్మాణాలు పూర్తి చేసే దిశగా చర్యలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రత్యేకతలతో కూడిన పరిపాలనా కేంద్ర సముదాయం నిర్మించాలన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆలోచన త్వరలోనే కార్యరూపంలోకి రాబోతోంది. సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో క్రీడా మైదానంలో విశాలమైన స్థలంలో సర్వహంగులతో కూడిన సచివాలయ భవన సముదాయం కొలువుదీరనుంది. అదే వరుసలో విధానసభ, విధాన పరిషత్, తెలంగాణ కళాభారతి భవనాలు కూడా నిర్మించనున్నారు. ప్రస్తుతం సైనిక శిక్షణ కోసం ఉపయోగిస్తున్న ఈ స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ భవనాల నిర్మాణానికి కేంద్ర రక్షణశాఖ అంగీకారం తెలిపింది. గడిచిన ఆరు నెలలుగా చేస్తున్న ప్రయత్నాలకు ఇటీవలే క్లియరెన్స్ రావడంతో నిర్మాణ ప్రతిపాదనలు తయారు చేసేందుకు సీఎం ఆదేశాలిచ్చినట్లు సమాచారం. బైసన్ పోలో గ్రౌండ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధీనంలో ఉన్న స్థలం కలుపుకుని మొత్తం 59 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు భారీ బహుళ అంతస్తుల భవనాలను నిర్మించనున్నారు. ప్రభుత్వం ప్రాథమికంగా నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ఈ భవనాల ముందుభాగంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో పరేడ్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఈ ప్రతిపాదనలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు తెలంగాణాలో ముఖ్యమైన పండగ దసరా రోజున బైసన్ పోలో మైదానంలో శిలాఫలకం వేసేందుకు కేసీఆర్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. గరిష్టంగా రెండేళ్ళలో నిర్మాణాలు పూర్తిచే చేసే విధంగా కాలవ్యవధిని నిర్దేశిస్తూ టెండర్లను ఆహ్వానించనున్నారు. 2019 జూన్ 2 నాటికి కొత్త సచివాలయం కొలువుదీరాలన్న లక్ష్యంతో, పట్టుదలతో సీఎం ముందడుగు వేస్తున్నారు. భూగర్భంలో ఆరు అంతస్థుల పార్కింగ్ కాంప్లెక్స్, భూ సమాతరం పైన 8 అంతస్థుల పరిపాలనా భవనాలు నిర్మించేందుకు రోడ్లు, భవనాలశాఖ ఇంజనీరింగ్ నిపుణులు రోడ్‌మ్యాప్‌ను తయారు చేసి ఇటీవలే సీఎంకు అందజేసినట్లు సమాచారం.

ఇప్పుడున్న సచివాలయం స్థానంలోనే నిర్మించాలన్న ఇంతకుముందు ప్రణాళికలో 'యు' ఆకారంలో ఈసువిశాల బహుళ అంతస్థుల భవనాలు నిర్మించాలని ప్రతిపాదించినప్పటికీ, ప్రస్తుతం బైసన్ పోలో గ్రౌండ్‌లో నిర్మించే సచివాలయాన్ని 'టి' ఆకారంలో నిర్మించేందుకు సీఎం కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. మంత్రులు, ముఖ్య కార్యదర్శుల వాహనాలు మినహా మిగతా ఏ ఒక్క వాహనం కూడా పైన కనిపించకుండా పూర్తిగా అండర్ గ్రౌండ్ పార్కింగ్‌లోనే ఉండేవిధంగా ప్రత్యేక నమూనాను రూపొందింస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అవలంభిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ భవన నిర్మాణ సముదాయాన్ని నెలకొల్ప బోతున్నారు. సచివాలయా నికి వచ్చే సాధారణ సందర్శకుల వాహనాలకు కూడా అక్కడే ప్రత్యేక పార్కింగ్ జోన్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రముఖ భవన నిర్మాణాల రూపకర్త హఫీజ్ కాంట్రాక్టర్ తెలంగాణ నూతన సచివాలయ భవన సమూదాయా నికి సరికొత్త నమూనాను రూపొందించి ఇప్పటికే ముఖ్యమంత్రికి అందజేసిన విషయం తెలిసిందే.

కేసీఆర్ నిర్ణయం పట్ల పార్టీ వర్గాల ధీమా

తన పాలనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న సంకల్పంతో ఉన్న కేసీఆర్ తన నిర్ణయాన్ని వాయిదా వేసుకోవడానికి గానీ, విరమించుకోవడానికి గానీ అవకాశాలు ఏమాత్రం లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్మాణం చారిత్రాత్మకమైనదని, లక్ష్యం తప్పకుండా నెరవేరుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గరిష్టంగా రెండేళ్లలోగా సకల సదుపాయాలతో కూడిన కొత్త సచివాలయ భవన సమూదాయాన్ని నిర్మించేందుకు కార్యాచరణ ప్రణాళిక కూడా సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సుమారు ఏడాది కాలంగా కొత్త సచివాలయ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏనాడూ అధికారికంగా వెల్లడించలేదు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావడంతో రెండో ప్రాధాన్యత అంశంగా సచివాలయ నిర్మాణాన్ని ఎంచుకున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తరహాలోనే యుద్ధ ప్రాతిపదికన కొత్త సచివాలయాన్ని కూడా నిర్మించి తీరాలన్న ఆలోచనతో ముందడుగు వేస్తున్నారు.




తరం మారింది.. స్వరం మారింది

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లయింది.ఈ ఏడు దశాబ్దాల్లో ఎన్నో మెరుపులు.. మరెన్నో మరకలు.. అయితే 67ఏళ్ల రాజకీయాలు ఒకవిధంగా ఉంటే.. గడిచిన 3 ఏళ్లుగా ఎన్నో మార్పులు కనిపిస్తున్నాయి. సైద్ధాంతికంగా, భావజాలం పరంగా ఎన్నో రకాల మార్పులు వచ్చాయి. ప్రజలను పాలించే పాలకులు విధానాలే ఇందుకు కారణమని చెప్పొచ్చు.. ప్రస్తుతం రాజ్యాంగ బద్ధ అత్యున్నతపదవుల్లో ఉన్న నలుగురు వ్యక్తులు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జన్మించిన వారే కావడంతో వారి తరంలోని మార్పు స్వరంలోనూ ప్రస్ఫుటిస్తున్నది. రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్యా నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్..ఈ నలుగురు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన వారే. ఈ నేపథ్యంలో వారి ఆలోచన విధానం..ఇదివరకున్న వారి ఆలోచనా విధానానికి సరితూగడం లేదు. గతంలో రాజ్యాంగ పదవులను అలంకరించిన వారందరూ స్వాతంత్ర్య సంగ్రామంలోని కీలక అంశాలను తరుచూ ప్రస్ఫుటిస్తుండేవారు.తమ ప్రాణాలను పణంగా పెట్టి స్వాతంత్ర సంగ్రామంలో భాగస్వాములైన వారి జీవిత చరిత్రలు, వారి నోటినుంచి జాలువారిన వాఖ్యాలను వల్లేవేసేవారు. కానీ ఇప్పుడు తరం మారింది.స్వరమూ మారింది. స్వతంత్ర భారతంలో మరుగున పడినవారి సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రస్తుత తరం మతైంది.



మారనిది గాంధీయే



నాటి, నేటి తరాలకు ఆదర్శనీయుడు మహాత్మాగాంధీ. అహింసా మార్గంలో స్వాతంత్రాన్ని సంపాదించుకోవాలని నిరంతరం పరితపించిన బాపు.. మితవాత, అతివాదులను ఉద్యమంలో కలుపుకుని ముందుకుసాగారు. ఎన్నో ఒడిదుడుగులు ఎదురైనా శాంతి మంత్రంతోనే అన్నింటా విజయం సాధించారు. గ్రామలే దేశానికి పట్టుకొమ్మలన్న గాంధీజీ నినాదం తరాలు మారిన మనుగడలోనే ఉంది. ఎన్ని తరాలు మారిన గాంధీ వేసిన బాటలు అనుసరనీయమనే భావన ప్రతి ఒక్క భారతీయుడిలో ప్రస్ఫుటిస్తోంది.

నెహ్రూ వద్దు..పటేల్ ముద్దు

ప్రస్తుత తరం నెహ్రూ వద్దూ..పటేల్ ముద్దు అన్న భావనతో ముందుకు వెళ్తోంది. ఇదివరకున్న తరం సందర్భానుసారంగా నెహ్రూ విజయాలను గుర్తుచేస్తూ ఆయన సేవలను గుర్తుచేసుకునేవి..నవభారత నిర్మాణ సారథిగా నెహ్రూను అభివర్ణించే వారు. జాతీయోద్యమ పోరాటంలో పాల్గొని పలుమార్లుజైలు శిక్ష అనుభవించిన నెహ్రూ గాంధీ తర్వాత రెండో నాయకుడిగా అవతరించారని ప్రముఖంగా ప్రస్తావించేవారు. దేశ తొలి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి విదేశాంగ విధానంలో తన రాజకీయ చతురతను ప్రదర్శించి..భారత్‌ను ప్రపంచ దేశాలకు ధీటుగా నిలబెట్టారని అనునిత్యం ప్రస్తావించేవారు. 1962 చైనా యుద్ధంలో భారత భూభాగాన్ని కోల్పోయి విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ... ఆయన ఆలోచన నుంచి అమలులోకి వచ్చిన పంచశీల ఒప్పందం, అలీన విధానం వంటివి భారత కీర్తిని ప్రపంచ దేశాలకు పరిచయం చేశాయని చెప్పుకొస్తుండేవారు. పంచవర్ష ప్రణాళికలను రూపొందించి భారత దేశ అభివృద్ధి బాటలు వేసిన ఘనుడిగా నెహ్రూ కీర్తించబడ్డారు. దేశ మొదటి హోంమంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లాభాయ్ పటేల్ సేవలను ప్రజలకు కలకాలం గుర్తుండిపోయేలా నేటి తరం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. భారత దేశపు ఉక్కుమనిషిగా పేరున్న పటేల్.స్వాతంత్రానంతరం సంస్థానాలన దేశంలో విలీనం కావడానికి అలుపెరగని కృషి చేశారు. హైదరాబాద్,జునాగఢ్ లాంటి సంస్థానాలు భారతదేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కుతుంది. బార్డొలిలో జరిగిన సత్యాగ్రహానికి నాయకత్వం వహించి విజయవంతం చేయడమే కాకుండా తాను దేశ ప్రజల దృష్టికి ఆకర్షించారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలోలోనే కాకుండా దేశప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘీక ఉద్యమాలను చేపట్టారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తిని జాతియావత్తు గుర్తుంచుకోవాలన్నది నేటి తరం అభిమతం.

స్టాట్యూ ఆఫ్ యూనిటీ పేరుతో పటేల్ విగ్రహం

భారత స్వాతంత్ర ఉద్యమం నుంచి స్వాతంత్రానంతరం సేవలు చేసిన పటేల్ ను మన నాయకులు మరచారన్నది ప్రస్తుత తరం వాదన. అందుకే పటేల్ సేవలు చిరస్మరణీయం చేసేందుకు ప్రపంచంలోనే అతిఎతైన విగ్రహన్ని గుజరాత్ లోని సర్దార్ సరోవర్ డ్యాంకు మూడు కిలోమీటర్ల దూరంలోనిర్మిస్తున్నారు. 182 మీటర్ల ఎత్తులో పటేల్ విగ్రహన్ని నిర్మించేందుకు ప్రస్తుత ప్రధానమంత్రి పూనుకున్నారు. ఈ విగ్రహానికి ఐక్యతా విగ్రహంగా నామకరణం చేసి ..పటేల్ సేవలను ప్రతి గ్రామంలోని ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలుచేపట్టారు.

ప్రభుత్వ పథకాల్లో మారుమోగుతున్న దీన్ దయాల్ పేరు

పేదల కళ్లల్లో వెలుగు చూడాలనే లక్ష్యంతో నిరంతరం పరితపించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ సేవలను నేటి తరం చిరస్మరనీయం చేస్తోంది. దీన్ దయాల్ ఆశయాలు, ఆకాంక్షను నెరవేర్చాలనే లక్ష్యంతో గ్రామీణ,పట్టణ ప్రాంతల పేదల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారు.దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన ద్వారా నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలను కూడా ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూతనిచ్చే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా నిరుద్యోగులు, మహిళలకు ఉపాధి కార్యక్రమాలకు చూపడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం.


ఎర్రకోటపై కాషాయదళం

- కీలక రాజ్యాంగ పదవులతో బీజేపీకి తొలి స్వాతంత్ర్య దినం
- దేశ చరిత్రలో ఓ నూతన పరిణామం



న్యూఢిల్లీ: భారత రాజకీయ యవనికపై ఓ నూతన పరిణామం నేడు ఆవిష్కృతమవనుంది. భారత దేశ పార్ల మెంటరీ ప్రజాస్వామ్యం వ్యవస్థలో సరికొత్త అధ్యాయం నమోదవనుంది. సంఘ్‌పరివార్ ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్న ప్రత్యేక సమయమిది. అదే... ఎర్రకోటపై నిండైన కాషాయదళం కాలు మోపడం. భారత రాజ్యాంగం ప్రకా రం... మనకు కీలకమైన నాలుగు రాజకీయ రాజ్యాంగ పదవులున్నాయి. ప్రస్తుతం అందులో నలుగురూ భారతీయ జనతా పార్టీకి చెందిన వారే ఉండటం ఓ ప్రత్యేకత. అందుకే, భారత 70వ స్వాతంత్ర్య దినోత్సవాలు బీజేపీకి, దాని సైద్ధాంతిక గురు వు ఆర్‌ఎస్‌ఎస్‌కు మరింత సంబరాన్ని తెచ్చిపెట్టనున్నాయి. అరవై సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో దేశ ప్రజలు స్కాములు, బంధుప్రీతితో విసిగిపోయారు. ఈ నేపథ్యంలో 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీని అఖండ మెజారిటీతో ఆ పార్టీకి అధికారమిచ్చారు. అదే ఆత్మబలంతో అందలమెక్కిన మోడీ ఇతర రాష్ట్రాల్లో కూడా వరుస విజయాలతో దూసుకెళ్లారు. ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో విజయ పరంపర కొనసాగింది. దీంతో, ఆయన బరిలోకి దింపిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి అభ్యర్థుల గెలుపు కూడా నల్లేరు మీద నడకే అయింది. బిహార్ మాజీ గవర్నర్‌గా ఉన్న రామ్‌నాథ్ కోవింద్, మాజీ కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నికతో దేశంలో నాలుగు కీలకమైన రాజ్యాంగమైన పదవుల్లో బీజేపీ పాగా వేసినట్లయింది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్ వంటి ముఖ్యమైన పదవుల్లో భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకులే ఉండటం దేశ చరిత్రలో మొదటిసారి. ఇంతకు ముందుకు కూడా బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటికీ, ఇటువంటి పరిణామం చోటుచేసుకోలేదు. 1977లో కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడినప్పటికీ, కాంగ్రెస్ మూలాలున్న నీలం సంజీవరెడ్డియే రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అటుతర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన పలు పార్టీలు సైతం కాంగ్రెస్ పార్టీ చెందినవారినో, లేక దాని నుంచి విడిపోయి వేరు కుంపటి పెట్టిన వారినో దేశ అధ్యక్ష పదవికి ఎంపిక చేశాయి. 1998,1999లలో అధికారం చేపట్టిన బీజేపీకి రాష్ట్రపతిని ఎన్నుకొనే అవకాశం వచ్చింది. అయితే, ఆ సమయంలో ఎన్‌డీయే పొత్తులో భాగంగా లోక్‌సభ స్పీకర్ పదవి తెలుగు దేశం పార్టీకి చెందిన జీఎంసీ బాలయోగికి వెళ్ళింది. ఆయన అకాల మరణం తర్వాత మురళీ మనోహర్‌జోషి లోక్‌సభ అయ్యారు. కానీ, అప్పుడు ప్రధానిగా ఉన్నటువంటి అటల్ బిహారీ వాజ్‌పేయ్ మాత్రం బీజేపీలో ప్రాథమిక సభ్యత్వం లేని ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాంను ఎంపిక చేశారు. దీంతో, ఈ అరుదైన అవకాశాన్ని అప్పుడు బీజేపీ కోల్పోయింది. ఆర్‌ఎస్‌ఎస్ దాని పరివారానికి, అన్ని కలసి రావడానికి 70 ఏండ్లు పట్టిందన్నది ఇక్కడ అసలు సారం.

తెరపైకి ఆజాద్, తిలక్



దేశ స్వాతంత్ర ఉద్యమ కాలంలో బ్రిటీష్ పాలకుల దమననీతికి ఎదురొడ్డి పోరాడి న చంద్రశేఖర్ ఆజాద్, బాలగం గాధర్ తిలక్ ల సేవలను నేటి తరం మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేప్రయత్నం చేస్తోంది. గాంధీ నేతృత్వంలోని సహాయ నిరాకరణ ఉద్యమంలో కీలకభూమిక పోషించిన ఆజాద్.. ఉద్యమంలో పాల్గొన్న నేరానికి పదేహేనేళ్లప్రాయం లోనే అరెస్టయ్యారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి అడిగిన ప్రశ్నకు తనదైన శైలిలో సమాధానమిచ్చారు. నీ పేరేమిటి అని అడగ్గా.. పెద్ద శబ్దంతో ఆజాద్ అని చెప్పారు. దాంతో మెజిస్ట్రేట్ విధించిన 15 కొరడా దెబ్బల్లో ప్రతీ దెబ్బ కు భారత్ మాతాకీ జై అంటూ గొంతెత్తినినదించారు. అలా ఉప్పెనలా ఎగిసిపడిన ఆ గొంతు ఎన్నో ఉద్యమాలకు కేంద్రబిందువైంది. ఆజాద్ సేవలను ప్రస్తత తరానికి గుర్తు చేస్తూ నేటి నాయకత్వం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించింది. ఇక స్వాతంత్రం నా జన్మహక్కు అని నినదించి ప్రతీ భారతీయుడి




గుండెల్లో విప్లవ శంఖాన్ని పూరించిన బాల గంగాధర్ అసామాన్య ధైర్య సాహసాలు ప్రదర్శించేవారు. ఎవరు తప్పుచేసినా వేళెత్తి చూపే తత్వం కలిగిన తిలక్ కు లోకమాన్య అనే బిరుదు ఉంది. లోకమాన్య తిలక్ ప్రయత్నాలు ప్రజల్లో ఆత్మాభిమానాన్ని, ఆత్మ విశ్వాసాన్ని నింపాయని నేటితరం ఆయన్ని పొగడ్తలతో ముంచెత్తుతోంది. తిలక్ జయంతి ఉత్సవాలు సైతం గతం రెండు, మూడేళ్లుగా అంబరాన్నంటుతున్నాయి.

ప్రణాళికా సంఘం స్థానంలో నీతిఅయోగ్


దేశాభివృద్ధి ప్రణాళికలు అత్యంత ఆవశ్యకమని నాడు నెహ్రూ వేసిన ప్రణాళిక సంఘానికి నేటి తరం మంగళంపాడింది. ప్రణాళికావ్యవస్థకు బీటలు వారాయని నేటి తరం ఆ వ్యవస్థను సమూలంగా రద్దు చేసింది. దేశానికి ప్రస్తుతం కావాల్సింది పంచవర్ష ప్రణాళికలు కావని...ప్రస్తుత, భవిష్యత్ ప్రణాళికలని కొత్తపల్లవి అందుకుంది. అందులో భాగంగానే నీతిఆయోగ్ అనే సంస్థ పురుడుపోసుకుంది. ఇందులో అన్ని రాష్ట్రాలకు భాగస్వామ్యం కల్పిస్తూ..ఆయా రాష్ట్రాల సమస్యలకు సత్వర పరిష్కారమార్గాలు చూపే విధంగా వ్యవస్థను రూపొందించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కీలక వ్యక్తుల సలహాలు, సూచనలు తీసుకునే విధంగా నీతి ఆయోగ్ వ్యవస్థ రూపుదిద్దుకుంది. పంచవర్ష ప్రణాళికల ద్వారా ఐదేళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా..నీతి ఆయోగ్ మాత్రం సత్వర పరిష్కారం, భవష్యత్ వ్యూహం అనే నినాదాలతో ముందుకెళ్తోంది.

ఆ హింసను మరువలేం
ప్రత్యక్ష సాక్షుల మనోగతం



ఆంగ్లేయుల వలస పాలన నుంచి విముక్తి పొందిన భారతీయులకు ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. దేశాన్ని భారత్ -పాకిస్థాన్ లుగా విభజించాలన్న నిర్ణయం ఎంతోమంది భారతీయులను కలచివేసింది. విభజనకు పూనుకున్న ఆంగ్లేయులు రెండు దేశాల ప్రజల మధ్య విద్వేశాలకు రెచ్చగొట్టి వెళ్లిపోయారు. ఫలితంగా సరిహద్దుల్లో కొన్ని రోజుల పాటు మారణకాండ కొనసాగింది. మత అల్లర్లతో సరిహద్దుల్లో దాదాపు 10 లక్షల మంది ప్రాణాలు కోపోయారు. పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి వచ్చే వారిపై, భారత్ నుంచి పాకిస్థాన్ వెళ్లే వారిపై జరిగిన మూకుమ్మడి దాడులతో సరిహద్దుల్లో రక్తం ఏరులై పారింది. మత దురహంకారులు ఆడిన ఈ మృత్యుక్రీడలో బలైంది సామాన్య ప్రజలే. ఆగస్టు 14 1947 రోజు జరిగిన హింసాత్మక ఘటనల కారణంగా పంజాబ్ లోని జంటనగరాలైన లాహోర్, అమృత్ సర్ నగరాల్లోని రైల్వే స్టేషనలకు వచ్చిన రైళ్లలో గుట్టలు గుట్టలుగా మృతదేహాలు పడిఉన్నాయి.ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి లభించి..తమ స్వస్థాలాలకు వెళ్తున్నామన్న చాలామంది ఆశలు దారిలోనే ఆవిరయ్యాయి. ఎక్కడికక్కడ తెగిపడిన తలలు...గుర్తుపట్టలేని రీతిలో జరిగిన మృత్యు క్రీడ ఎంతోమందిని కలచివేసింది. విభజన ఉద్దేశం ఒకటేతే జరిగింది మరొకటి..ప్రాణాలు పణంగా పెట్టి దేశానికి స్వాతంత్రం సంపాదించిన మహనీయులు కన్న కలలు..సరిహద్దు మృత్యు క్రీడతో కల్లలుగానే మారిపోయాయి. భారత్ నుంచి విడిపోయి పాకిస్థాన్ ప్రాంతంగా ఉన్న భాసిన్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృత్యు క్రీడకు సజీవ సాక్షులుగా నిలిచారు. హింసాత్మక ఘటనల నుంచి ప్రాణాలతో బయటపడ్డ సంత,నిరంజన్ సింగ్ అనే ఇద్దరు అన్నదమ్ములు రక్తపు మరకల్లో ఉన్న ఎంతోమందిని చూసి నివ్వెరపోయారు. సరిహద్దు గ్రామాల్లో జరిగిన హింసాత్మక ఘటనలు కళ్లారా చూసిన వీరిద్దరి వయస్సు 15 నుంచి16 ఏళ్లు. తమ కళ్లముందే గ్రామస్తులు కత్తులు, తుపాకులతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటుంటే చూసి ఆశ్చర్యపోయామన్నారు. ఇన్నేళ్లు ఒకే దేశంలో ఉన్న వీళ్లంతా దేశం విడిపోగానే ఎందుకింత ఉన్మాదత్వాన్ని ఆపాదించుకున్నారని ఆవేదన చెందారు.తలపై బుల్లెట్ గాయంతో మృత్యువాత పడిన సోదరుడిని తీసుకొచ్చిన క్షణాలను శాంత గుర్తుచేసుకున్నారు.

పారిశ్రామిక విప్లవంతోనే
శక్తివంతమైన భారత్




- మానవ వనరులు సద్వినియోగం కావాలి
- మేక్ ఇన్ ఇండియాతోనే ఉపాధి, వృద్ధి
- రుణమాఫీ తాత్కాలికమే.. శాశ్వత నీటి ప్రాజెక్టులే మేలు
- విద్య, ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ ఆర్థిక వ్యవస్థ శ్రీఘ్ర ప్రగతి సాధించి శక్తివంతంగా నిలవాలంటే పారిశ్రామిక విప్లవం రావలసిన అవసరం ఉందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు చెప్పారు. జాతీయ స్థూల ఉత్పత్తిలో ఏటా 15శాతం పెట్టుబడులు పెరగాల్సి ఉందని, ఇది ఉత్పత్తి రంగంలో సానుకూల ఫలితాలు ఇస్తుందన్నారు. ఈ రంగంలోకి భారీ పెట్టుబడులు వస్తేనే ఉపాధి అవకాశాలు మెరుగై జాతీయ ఉత్పత్తి మరింత పెరుగుతుందని ఆయన అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రోటరీ క్లబ్ సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో నడక నుంచి పరుగులు తీయించాలంటే తీసుకోవలసిన చర్యలు, అనుసరించాల్సిన వ్యూహాలపై 'విల్ ద ఎలిఫెంట్ స్టార్ట్ డ్యాన్సింగ్' అన్న అంశంపై ఆయన ప్రసంగించారు. ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, రోటరీ క్లబ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ సూరజ్ శెట్టి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధి గత ఏడాది 7.1 శాతం నమోదు కాగా, ఈ ఏడాది అది 7.3 శాతానికి పెరుగుతుందన్నారు. ద్రవ్యోల్బణం స్థిరంగా ఉందని, కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉన్నందున ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే విధంగా ప్రధాని నరేంద్రమోడీ నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు ఒడిదుడుకులకు లోనవుతుండగా, భారత వ్యవస్థ స్థిరంగా నిలిచిందని చెప్పారు. భారత్‌లో మానవ వనరులు ఒక సంపదగా నిలిచిందని, దీన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. చైనాలాంటి కొన్ని దేశాల్లో పిల్లలు, వృద్ధులు ఎక్కువ మంది ఉన్నందున ఇప్పుడు ఆ దేశంపై ఆర్థిక భారం పడుతోందని, కానీ భారత్‌లో ఇది ప్రస్తుత తరుణంలో సంపదను సృష్టించేలా ఉందని సుబ్బారావు అన్నారు. గత కొంతకాలంగా ఆర్థిక వ్యవస్థ పురోగతి మందగించిందని, ఎగుమతులు, పెట్టుబడులు తగ్గాయని, బ్యాంకుల నుంచి రుణాలు ఇవ్వడం క్షీణించిందని ఆర్థిక సర్వే వెల్లడించిన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. దేశంలో సర్వీసు రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, ఉత్పత్తి రంగంలో వృత్తి నైపుణ్యం ఎంతో అవసరమని సుబ్బారావు చెప్పారు. లక్షల మంది ఐటిఐ, ఇంజనీరింగ్ డిగ్రీలతో బయటకు వస్తున్నప్పటికీ వారికి వృత్తిపరమైన నైపుణ్యం లేదని ఆయన చెప్పారు. అలాగే దేశంలో 55 శాతం జనాభా వ్యవసాయంపైనే ఆధార పడ్డారని, ఈ రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సరైన సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీలు అందడం లేదని, రుణ పరపతి సరిపోవడం లేదని, ఉత్పత్తి వ్యయానికి తగ్గట్టు పంటలకు ధర రావడం లేదని, దీంతో రైతాంగం నష్టాలను ఎదుర్కోవలసి వస్తోందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలంటూ అనేక నిపుణుల కమిటీలు సూచించాయని ఆయన గుర్తుచేశారు. రుణమాఫీ అవసరమేనని, అయితే శాశ్వత ప్రాతిపదికన ప్రయోజనం కలిగించే సాగునీటి ప్రాజెక్టు నిర్మాణమే దువ్వూరి సుబ్బారావు అన్నారు.

సుస్థిరంగా భారత ఆర్థిక వ్యవస్థ : గౌర శ్రీనివాస్

ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్ మాట్లాడుతూ, అనేక ఆర్థిక వ్యవస్థలు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ భారత వ్యవస్థ సుస్థిరంగా ఉందన్నారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో సానుకూల ఫలితాలు వస్తాయని భావిస్తున్నామన్నారు. జిఎస్‌టిపై వ్యాపార వర్గాలు, ప్రజల్లో మిశ్రమ స్పందన ఉందని, జిఎస్‌టి అమలుతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) వస్తాయని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

గడప గడపకూ ప్రధాన పార్టీలు!





- ముమ్మరంగా ప్రచారం
- పార్టీల జల్లెడలో నంద్యాల
- పాదయాత్రలు..
- ఇంటింటి ప్రచారాలు
- దూకుడు పెంచిన జగన్
- అఖిలప్రియ రోడ్ షోలు
- వైఎస్ బొమ్మతోనే జనంలోకి కాంగ్రెస్


నంద్యాల, ఆంధ్రప్రభ: ఎన్నికల గడువు సమీపిస్తున్న కొలదీ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశాయి. తెలుగుదేశం, వైఎస్ఆర్‌కాంగ్రెస్, రాయలసీమ పరిరక్షణ సమితి, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాల ద్వారా నంద్యాలను జల్లెడ పడుతున్నారు. చిన్నచిన్న సందు గొందులను సైతం వదలటం లేదు. ఒక్క ఇల్లు ఏమర్చినా ఎక్కడ ఆ నాలుగు ఓట్లను చేజార్చుకుంటామో అన్న తాపత్రయం నేతలతో ప్రతి తలుపూ తట్టిస్తూనే ఉంది. ప్రత్యేకించి అధికార , ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు, వారి అనుచరులు బంధువులతో ఇంటింటి ప్రచారాలను ముమ్మరం చేశారు. వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్మో హన్ రెడ్డి నంద్యాల నియోజకవర్గంలో నంద్యాల, గోస్పాడు మండలాల పరిధిలోని అత్యధిక శాతం గ్రామాల్లో తొలివిడత ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేశారు. నంద్యాల పట్టణంలో ఆదివారం నుంచి రోడ్‌షోల ద్వారా దూకుడు పెంచారు. గణనీయమైన సంఖ్యలో ముస్లిం మైనారిటీ జనాభా ఉన్న పట్టణంలో జగన్ తన ఎన్నికల ప్రచారం ద్వారా ముస్లిం ఓటర్లను ఆకట్టుకునేందుకు తన వేష భాషలు అందుకు అనుకూలంగా మార్చుకున్నారు. తలపై టోపీ ధరించారు. పట్టణ సమస్యలకు తన ప్రసంగంలో ప్రాధాన్యత పెంచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపైనా, తెలుగుదేశం పార్టీ ఎన్నికల వాగ్ధానాలు, వాటి వైఫల్యాల పైన విమర్శల వాడి పెంచారు. అభ్యర్థి శిల్పామోహన్ రెడ్డిని పక్కన నుంచోపెట్టుకుని వార్డుషోలు చేస్తున్నారు. అటు తెలుగుదేశం పార్టీ నేతలు కూడా నంద్యాలలో వార్డుషోలను ముమ్మరం చేశారు. పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ కూడా జగన్‌కు పోటీగా నంద్యాలలో రోడ్‌షోలు చేపట్టారు. అటు జగన్, ఇటు అఖిలప్రియ రోడ్‌షోలు శ్రీనివాస నగర్ ప్రాంతంలో ఒకేసారి ఎదురెదురు పడే పరిస్థితి ఏర్పడటంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఏంజరుగుతుందో అన్న ఆందోళన పుట్టుకొచ్చింది. అంతలోనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉద్రిక్త పరిస్థితులకు తావు లేకుండా ముందు జాగ్రత్త కింద జగన్ రోడ్ షో కాన్వాయ్‌ని మంత్రి అఖిలప్రియ వాహన శ్రేణులవైపునకు వెళ్లనీయకుండా దారిమళ్లించారు. మరోవైపు ఐడీసీ మాజీ ఛైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి కూడా కాలుకు తగిన గాయంతో వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినా లెక్కచేయకుండా వీల్‌ఛైర్ సహాయంతో ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. టెక్కె, రెవెన్యూ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో ఏవి ఎన్నికల ప్రచార పాట్లు అయ్యో...పాపం అనిపిస్తున్నాయి. పార్టీకి చెందిన సీనియర్లు, మంత్రులు మండలాలు, వార్డులకు ఇంచార్జిలుగా వుంటూ ఎన్నికల ప్రచారాన్ని ఎప్పటికపుడు సమీక్షిస్తు పార్టీ అధిష్టానానికి నివేదికలు పంపుతున్నారు.

నేనమ్మా బైరెడ్డిని..

నేనమ్మా బైరెడ్డిని.. రాయలసీమ పార్టీ మనది. పూటకో పార్టీ మార్చే మోసగాళ్లు వస్తున్నారు . జాగ్రత్తగా ఉండండి. రాయలసీమ అభివృద్ధి, మీబిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయండి అంటూ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజ శేఖర్ రెడ్డి నంద్యాల పట్టణంలో గడపగడపకు తిరుతున్నా రు. కనపడ్డ ప్రతిఒక్కరికీ చేతులెత్తి దండాలు పెడుతున్నారు. మరో వైపు కాంగ్రెస్‌పార్టీ కూడా కార్యకర్తలను తయారు చేసు కుని ఎన్నికల ప్రచారంలో కొత్తశక్తిని కూడగట్టుకునే ప్రయ త్నంలో ఉంది. ప్రధానంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటోను ముందుపెట్టుకునే ఎన్నికల ప్రచారం చేస్తోంది. వైఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలనే ప్రచారంలో వల్లవేస్తూ ఓట్లను అభ్యర్థిస్తోంది.

నవభారత్ నిర్మిద్దాం





• ప్రభుత్వంతో కలిసి నడుద్దాం • ఆధునికత, అనురాగం మేళవించాలి • అందరికీ అన్నీ ఉన్నప్పుడే ఆధునికత సాకారం • అందరూ చదువుకోవాలి • ఆత్మశోధన, త్యాగనిరతి, చదువు, సాంకేతికతో జాతి నిర్మాణం జరగాలి • 71వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జాతికి రాష్ట్రపతి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: భారతీయులు, భారత ప్రభుత్వం మధ్య చక్కటి భాగస్వామ్యంతో 2022 నాటికి కొత్త భారత దేశాన్ని సృష్టించవచ్చని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. అది ఆధునికత, అనురాగం మేళవించినసమాజం కావాలని ఆకాంక్షించారు. మానవత్వం అనేది మన దేశపు డీఎన్‌లోనే ఉందని చెప్పారు.

మొట్టమొదటి సారిగా జాతినుద్దేశించి 71వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించారు. నూతన భారత దేశమంటే.. ప్రతి కుటుంబానికీ ఇల్లు, విద్యుచ్ఛక్తి, మంచి రహదారులు, సమాచార వ్యవస్థ, ఆధునిక రైల్వేలు, అధిక వృద్ధి రేటు ఉండాలన్నారు. ఇంతేనా.. ఇది సరిపోద న్నారు. వీటన్నింట్లోనూ మానవత్వం తొణికిసలాడాలని ఆకాంక్షించారు. అదే మన జాతి డీఎన్ఏ అని అభిప్రాయబడ్డారు. మన దేశాన్ని, మన నాగరికతకు అదే మూలమని చెప్పారు. నూతన భారత దేశంలో ఆధునికతతో పాటు అనురాగమూ ఉండాలన్నారు.

1947 ఆగస్టు 15న స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న భారత దేశం సార్వభౌమాధికార దేశంగా వెలసిందన్నారు. మన దేశాన్ని మనం తీర్చి దిద్దుకునే స్వేచ్ఛ లభించిందని, ప్రతి భారతీయుడికీ తానేమిటో నిరూపించుకునే అవకాశం రావాలని అభిలషించిన కోవింద్, ఆ క్రమంలో అందరూ సంతోషంగా ఉండాలని కోరారు.

మన కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకునే భారతీయులు తమ ప్రభుత్వంతో భాగస్వామ్యం నెరపాలన్నారు. ఆ భాగస్వామ్యం ఉంటే, ఏదీ అసాధ్యం కాదని వివరించారు. జాతి నిర్మాణం జరగాలంటే, పిల్లలకు సరైన విద్య అందాలని చెప్పారు. అవకాశం ఉన్న ప్రతి వ్యక్తీ, ఒక చిన్నారిని చదివించాలని కోరారు. ఆ సంఘసేవ తత్వం, స్ఫూర్తి భారత్‌లో ఉన్నాయని, మరింత సానబడితే సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని సెలవిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించిన పలు ప్రకటనలు, పథకాల ఫలితాలు అందరికీ చేరాలంటే, పౌరులకు, ప్రభుత్వానికీ మధ్య భాగ స్వామ్యం తప్పదని స్పష్టం చేసారు. ఎల్పీజీ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోవడం, నోట్లరద్దు, జీఎస్టీ అమలు, ఆడపిల్లను చదివించడం, స్వచ్ఛ భారత్ వంటి పథకాలు, ప్రకటనలు, విధానాలు పౌరుల సహ కారం లేకుండా అమలు కావని చెప్పారు. భారతీ యుల నుంచి సదరు సహకారాన్ని ఆయన కోరారు.

అందుకు త్యాగనిరతి అవసరమని ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటన్ పోలీసుల తుపాకి గుండ్లకు నేలకొరిగినన మాతంగిని హజరాను గుర్తు చేసుకున్నారు. వందేమాతరం అంటూ ప్రాణాలొదిలిన ఆమెతో పాటు రాణి చెన్నమ్మ, ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్ సింగ్, చంద్రశేఖర ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫకుల్లా ఖాన్, బిర్సా ముండా వంటిస్వాతంత్ర్యసమర యోధులత్యాగాలను స్మరించుకున్నారు. మీరు రక్తతర్పణమిస్తే నేను స్వాతంత్ర్యం తెస్తానన్న సుభాష్ చంద్రబోస్ తెగింపు అందరికీ అలవడాలని చెప్పారు.

ఇతర పన్నుల వ్యవస్థనుంచి జీఎస్టీకి మారడమనేది చక్కగా జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. మనం కట్టే పన్నులు జాతి నిర్మాణానికి ఉపయోగపడితే జాతికి మంచిదని హితవు పలికారు. ఆ డబ్బుతో మౌలిక సదుపాయాలు మెరుగు పరచడం, సరిహద్దులను కాపాడుకోవడం చేయొచ్చని చెప్పారు. అందుకు సౌభ్రాతృత్వం అవసరమని చెప్పారు. తన చిన్న తనంలో ఊళ్లో పెళ్లవుతుంటే.. అందరూ తలో చేయి వేసేవారని, అలాంటి కలివిడితనం అనురాగం మేళవించిన ఆధునిక భారత దేశం 2022 నాటికి రావాలని ఆకాంక్షించారు.

2022లో భారత దేశ స్వాతంత్ర్యానికి 75 ఏళ్లు పూర్తవుతాయని, అప్పటికి సాధించాల్సినవి మనం రాసిపెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మనలను మనం దర్శించుకోవడమనేది విద్య ద్వారా సాధ్యమవుతుందని చెప్పారు. దేశాభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఆయన చెప్పారు. అప్డే ప్రజాసాధికారత వస్తుందని చెప్పారు. పేదరికం పోవాలంటే సాంకేతికను అంది పుచ్చుకోవాలని నూతన సాంకేతికతలు ఇక్కడే ఆవిర్భవించాలని కోరారు. 2020లో టోక్యోలో జరిగే క్రీడల్లో మనవారు తమ సామర్థ్యాన్ని చూపాలన్నారు. అందరూ చదువుకుంటే.. దేశాన్ని వెలిగించే 125 కోట్ల దివ్వెలు తయారవుతాయని చెప్పారు. అలాంటి భారత దేశం రావాలని కోరుకుంటూ భారత ప్రజానీకానికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కాశ్మీర్ కలతలు

సైన్యంపై గ్రెనేడ్‌లతో దాడి

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లోని బుడ్గమ్ జిల్లా సమీప ప్రాంతాల్లో భారత సైన్యంపై ముష్కరులు గ్రెనేడ్‌లతో దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఇద్దరు భారత సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన జవానులను స్థానిక స్కిమ్స్ ఆసుపత్రిలో చేర్చినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో నియంత్రణ రేఖ భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనతో పరిసర ప్రాంత ప్రజానీకం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే సమాచారంతో కూంబింగ్ నిర్వహించిన భద్రత బలగాలపై తీవ్రవాదులు జరపడంతో సైన్యం దీటుగా సమాధానమిచ్చింది. ముందుగా తీవ్రవాదుల గురించి ఇంటెలిజెన్స్ అధికారులు సమాచారం ఇవ్వడంతో సైన్యం కూంబింగ్ నిర్వహించింది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగకుండా ఇంటర్‌నెట్ సర్వీసులను నిలిపివేశారు. అయినప్పటికీ, భద్రతా బలగాలపై దాడులకు దిగిన స్థానికుల్లో ఆరుగురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. తీవ్రవాదుల కోసం కూంబింగ్ ఇంకా కొనసాగుతోందని భద్రతా బలగాలు ప్రకటించాయి. కాగా, పాకిస్థాన్ భద్రతా బలగాలు కూడా సరిహద్దు రేఖ వెంబడి గల భారత చెక్‌పోస్టులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరుపుతున్న విషయం తెలిసిందే.

అవసరమైతే ఆర్టికల్ 35ఎపై రాజ్యాంగ ధర్మాసనం: సుప్రీం



న్యూఢిల్లీ: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 35ఏ ఉంచాలా? వద్దా? అన్న న్యాయపరమైన చిక్కులపై అవసరమైతే రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తుందని దేశ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ప్రకటించింది. ఐదుగురు న్యాయమూర్తులు గల రాజ్యాంగ ధర్మాసనమే ఈ విషయంపై పూర్తిగా విచారించగలదని దీపక్ మిశ్రా, ఏఎమ్ ఖాన్వీకర్ ద్విసభ్య ధర్మాసనం వెల్లడించింది. ఈ అంశాన్ని తాము రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిస్తామని పేర్కొంది. సాధారణంగా రాష్ట్రపతి ఉత్తర్వు జమ్మూ కశ్మీర్‌కే చెల్లుబాటు అయ్యే విధంగా ఇటీవల వెల్లడైన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వు ప్రకారం రాజ్యాంగంలో జమ్మూ కశ్మీర్ మహిళ బయటి వ్యక్తిని చేసుకుంటే తనకు కుటుంబం నుంచి వాటాగా పొందే ఆస్తులను పొందే అవకాశం కోల్పోతుందని, దీన్ని సుప్రీం కోర్టులో కశ్మీర్‌కు చెందిన చారు వాలీ ఖన్నా అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు. అయితే, పిల్‌ను పూర్తిగా విచారించిన న్యాయస్థానం ఈ అంశాన్ని త్రిసభ్య ధర్మాసనానికి కేటాయిస్తామని చెప్పింది. అటు తర్వాత ఈ విషయంపై రాజ్యాంగ ధర్మాసనం పూర్తిగా విచారిస్తుందని తెలిపింది.

ఎర్రకోటపై ఏంచెప్తారు?!



• మోడీ ప్రసంగంపై సర్వత్ర ఉత్కంఠ • ప్రధానికి ఇది నాలుగో ప్రసంగం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంగళవారం ఉదయం ఎర్రకోటలో 71వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలసందర్భంగా జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఎర్రకోట బురుజుల నుంచి మోడీ స్వాతంత్ర్య సందేశం ఇవ్వడం ఇది నాలుగోసారి. ఆయన ఉదయం ఎర్రకోటలోని లాహోరీ గేటుకి చేరుకోగానే రక్షణమంత్రి అరుణ్ జైట్లీ, ఆ శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ భామ్రే, రక్షణ శాఖ కార్యదర్శి సంజయ్ మిత్రా స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత ఆయన శాల్యూట్ బేస్‌లో నిలబడి పోలీస్ గార్డ్ గౌరవ వందనం స్వీకరిస్తారు.

ప్రధాని మోడీ 2014లో ప్రధానమంత్రి హోదాలో తొలిసారి ఎర్రకోటలో స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇచ్చారు. అప్పటికి కొద్ది వారాల క్రితం దాకా ఎన్నికల ప్రచారంలో చేసిన ఆరోపణల దాడికి స్వస్తి చెబుతూ ఆయన.. తాను ప్రధాన మంత్రిని కాదని.. కేవలం ప్రధాన సేవక్‌నని తనని తాను అభివర్ణించుకున్నారు. పార్లమెంటులో కేవలం మంద బలం ఉందన్నట్టుగా ప్రవర్తించనని ఏకాభిప్రాయంతో పాలిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందున్న ప్రధానుల మాదిరి కాకుండా ఆయన తొలిసారి బుల్లెట్ ప్రూఫ్ అద్దాల్లేకుండా ప్రసంగించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. దేశవ్యాప్తంగా పెచ్చరిల్లిపోయిన రేప్ ఉదంతాలను ప్రస్తావిస్తూ అవి మనల్ని తలలు దించుకునేలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ ఉత్పత్తిదారులకు ఆయన పిలుపిస్తూ.. భారత్ వచ్చి ''మేకిన్ ఇండియా''లో పాల్గొనవల్సిందిగా కోరారు. డిజిటల్ ఇండియా వైపు పయనించాలని కోరారు. అలాగే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకాన్ని ప్రకటించారు. స్కిల్ ఇండియా కార్యక్రమానికి కొత్త రంగులు అద్దారు. 2015లో 68వ స్వాతంత్ర్యదినోత్సవ సందేశమిస్తూ.. ఏడాది కాలంలో తమ ప్రభుత్వం చేసిన పనులను చెప్పడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. కొత్త ప్రణాళికలు గాని, పథకాలు గాని ప్రకటించలేదు. పాలనాపరంగా తాను చేపట్టిన వివిధ సంస్కరణలను వివరించారు. ''స్టార్టప్ ఇండియా- స్టాండప్ ఇండియా'' అని కొత్త నినాదమిచ్చారు. బలహీనవర్గాలు తమకు తాముగా సొంతంగా వ్యాపారాలు చేయడానికి ఈ నినాదం ప్రాతిపదికగా బ్యాంకులు ఇతోధికంగా ఆదుకోవాలని కోరారు. పెచ్చుమీరుతున్న కుల, మత ధోరణులను అధిగమించాల్సి ఉందన్నారు. వెయ్యి రోజుల్లో ప్రతి గ్రామానికి కరెంటు ఇస్తామని, జూనియర్ స్థాయి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉండవని ఆయన ప్రకటించారు. ''వన్ ర్యాంక్- వన్ పెన్షన్'' ఫార్ములాకు సూత్రప్రాయంగా ఆమోదం తెలుపుతున్నట్టు ప్రకటించారు. ఇక 2016లో 69వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాజకీయ మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు. పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ ప్రకటించి తేనెతుట్టెను కదిపారు. తాజాగా మంగళవారం ఆయన నాలుగో ప్రసంగం చేయబోతున్నారు. పెద్దనోట్ల రద్దు, పాక్ సరిహద్దుల్లో మెరుపు దాడులు తదితర అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తారని భావిస్తున్నారు. ఐదేళ్ల పదవీ కాలంలో ఇంకా ఆయనకు వచ్చే ఏడాది ఒకే ఒక్క అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ ఏడాది సందేశంలో ఆయన దేశవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే సంక్షేమ పథకాన్ని ప్రకటించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున మెజారిటీ ప్రజలకు ఉపయుక్తమయ్యే పథకాలకు రూప కల్పన చేయాలి. మరోవంక అంతర్జాతీయ స్థాయిలో పాకిస్తాన్ చైనాలతో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో మోడీ విధానం ఎలా ఉండబోతున్నదన్నది అందరికీ ఆసక్తికరంగా మారింది.

సుమోటోగా స్వీకరించలేం

• అలహాబాద్‌హైకోర్టును ఆశ్రయించండి • గోరఖ్‌పూర్ చిన్నారుల మృతిపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉత్తర్ ప్రదేశ్ లోని గోరఖ్ పూర్ ఆస్పత్రి విషాదం అంశాన్ని సుమోటోగా స్వీకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బాబా రాఘవ దాస్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 70 మంది చిన్నారులు మృతి చెందారని...ఈ కేసును సుమోటోగా స్వీకరించాలని దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ అంశంపై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన ధర్మాసనం...ఆస్పత్రి పరిస్థితులను యూపీ సీఎం యోగి ఆధిత్యనాథ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నందున అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్ కు సూచించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ బృందానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వం వహించాలని ఇదివరకు కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

తిరుగు వలసలు

• అక్రమంగా వచ్చిన వారిని తిప్పి పంపుతున్న అమెరికా • 12 ఏళ్ల నుంచి ఉంటున్న సిక్కు వ్యక్తి త్వరలో భారత్‌కు



వాషింగ్టన్: అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన 39 ఏళ్ల సిక్కును వెనక్కు పంపనున్నారు. మెక్సికోనుంచి పదేళ్ల క్రితం అతడు అమెరికాలోకి ప్రవేశించాడు. తాజాగా అక్రమ వలసదారుల మీద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్కుపాదం మోపడంతో బల్జీత్ సింగ్ అనే అతడిని వెనక్కు పంపనున్నారు. ఈయనకు నేర చరిత్ర లేకపోగా, ఇద్దరు పిల్లలూ అమెరికన్ పౌరులే. సాధారణంగా జరిగే వలసదారుల తనిఖీల కోసం అతడు ఇటీవల ఇమిగ్రేషన్ అధికారులను సంప్రదించగా, అతడిని 90 రోజుల్లో భారత్ పంపేస్తామని సదరు అధికారులు చెప్పారు. మెక్సికో నుంచి 12ఏళ్ల క్రితం అతడు టెక్సాస్‌కు వచ్చాడు. దీంతో మూడు నెలల తరువాత అతడు భారత్‌కు తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. చట్టవిరుద్ధంగా ఏం చేయకపోయినా వెళ్లకతప్పడం లేదని అతని భార్య కేట్ వాపోయింది. 1.1కోట్ల మంది ఉన్న అక్రమ వలసదారులను తిప్పి పంపేస్తానన్న వాగ్దానంతో ట్రంప్ అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. మెక్సికో నుంచి వచ్చిన చాలా మంది అమెరికాలో దశాబ్దాల నుంచి నివసిస్తున్నారు. సింగ్ కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. అమెరికాలో ఉండడానికి సింగ్‌కు ఎలాంటి చట్టపరమైన అర్హతలు లేవని కోర్టులు పదే పదే చెప్పాయి. దీంతో అతడు అమెరికాలోనే ఉంటే అరెస్టు చేసి జైల్లో పెడతారు. సింగ్ లాంటి ఎందరో భారత్‌కు లేదా ఇతర దేశాలకు తిరిగి వచ్చే అవకాశం ముమ్మందు ఉందని పరిశీలకుల అంచనా. బల్జీత్ సింగ్‌ను ఆరునెలల కోసారి తనిఖీ చేస్తూ ఇన్నేళ్లు ఉండనిచ్చారు. ఇకపై అలా కుదరదు.

కార్తీ చిదంబరానికి ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు కార్తీకి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ విచారణకు హాజరు కాకుండా కార్తి విదేశాలకు వెళ్లొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. సీబీఐ లుక్ అవుట్ నోటీసులపై మద్రాస్ హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణ సందర్భంగా కార్తీ తరపు న్యాయవాది తన క్లయింట్ విదేశాలకు వెళ్లాలనే ఆలోచనలో లేడని తెలపగా..న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఇదివరకు చేసిన తప్పులను ఇకమీదట చేయకూడదని అనుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ఖేహర్, జస్టిస్ చంద్రచూడ్ లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో ఎంతోమందికి విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తే వాళ్లు ఇంతవరకు స్వదేశానికి తిరిగిరాలేదు..కార్తీ విషయంలో ఆ తప్పును మరోసారి చేయలేమని పేర్కొంది. ఈ ఏడాది మే 18, 21 తేదీల్లో కార్తీ సీబీఐ విచారణకు హాజరుకావాల్సి ఉన్నా...రాజకీయ దురుద్దేశంతోనే తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని కార్తీ విచారణ నుంచి తప్పించుకున్నారు.

వరద నీటిలో ఈదుతూ..ఆహారాన్ని కాపాడుకుంటూ..



వరద తాకిడి

• మునిగిన అసోం, బీహార్ • సీఎంలకు మోడీ ఫోన్ • సాయంపై హామీ • ఎన్డీఆర్ఎఫ్ దళాల తరలింపు • మరిన్ని దళాలను కోరిన నితీశ్ • హెలికాప్టర్లను కూడా పంపుతామన్న ప్రధాని

న్యూఢిల్లీ: అసోంలో నాలుగు రోజుల్లో వరదల్లో చిక్కుకుని 15 మంది మరణించడంతో ప్రధాని నరేంద్ర మోడీ ఆ రాష్ట్ర సీఎం శర్బానంద సోనోవాల్‌తో మాట్లాడారు. సోమవారం ఆయన అసోంలో వరద పరిస్థితి గురించి తెలుసుకుని అవసరమైన సాయాన్ని అందిస్తామని సీఎంకు హామీ ఇచ్చారు. అసోంలో ఇప్పటి వరకూ వరదల తాకిడికి 99 మంది మరణించగా, 21 జిల్లాల్లో 22.5 లక్షల మంది బాధితులయ్యారు. సైన్యం కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటోంది. ఈ సందర్భంగా మధ్య, ఎగువ అసోంలో ట్రాఫిక్ స్తంభించిపోవడాన్ని మోడీకి సీఎం వివరించారు. మధ్య, ఎగువ అసోంల మధ్య జాతీయ రహదారి 37 మీద ట్రాఫిక్ స్తంభన కారణంగా రాకపోకలు ఆగిపోయాయని చెప్పారు. అక్కడ వరదలు మొదలైనప్పటి నుంచి కేంద్రం పరిస్థితిని సమీక్షిస్తోంది. అయితే.. పరిస్థితి మరింత క్షీణించడంతో మోడీ మరోసారి అసోం సీఎంతో మాట్లాడారు.

బీహార్లోనూ పలు జిల్లాలు ముంపునకు గురికావడంతో బీహార్‌కు ఎన్డీఆర్ఎఫ్ దళాలను కేంద్రం పంపింది. అవసరమైన సాయాన్ని కూడా అందిస్తామని ప్రధాని మోడీ బీహార్ సీఎం నితీశ్ కుమార్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే బీహార్‌లో ఉన్నాయని ప్రధాని ప్రధాని ట్వీట్ చేసారు. ఈ సందర్భంగా సహాయ కార్యక్రమాల కోసం మరో 10 కంపెనీల ఎన్డీఆర్ఎఫ్ దళాలను రాష్ట్రా నికి పంపాలని మోడీని నితీశ్ కోరారు. వారితో పాటు భారత వాయుసేన హెలికాప్టర్లను కూడా వరద బాధితుల సహాయార్థం పంపుతామని మోడీ చెప్పారు. నేపాల్ లోనూ, సీమాంచల్ జిల్లాలోనూ వర్షాల వల్ల బీహార్ లోని మహానది, కంకాయి నదులు పొంగిపొరలుతున్నాయి. వరద ప్రవాహం ఊళ్లను ముంచి వేస్తోంది. వరద పరిస్థితిపై ఒక నివేదిక పంపితే పరిశీలిస్తామని ప్రధాని ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్రా, అసోం ప్రధాన కార్యదర్శి వీకే పిపర్‌సేనియాను కోరారు.

బీహార్‌లో వరద ముంపు



కుంభవృష్టి బీభత్సం



కుంభవృష్టిలో నలుగురు మృతి

పితోడ్‌గఢ్: ఉత్తరాఖండ్‌లో వివిధ ప్రదేశాల్లో అకస్మాత్తుగా కురిసిన కుంభవృష్టికి ఆరుగురు బలయ్యారు. ఇక్కడ సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఇద్దరు జవాన్లు కూడా గల్లంతయ్యారు. సోమవారం తెల్లవారు జామున ఉత్తరాఖండ్‌లోని వివిధ ప్రాంతాల్లో కుంభవృష్టి కురిసింది. దీంతో ఆయా ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతో ఈ ప్రాంతాలను సందర్శించిన సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ సరిహద్దు ప్రాంతాలైన దార్చులా జిల్లాకు విపత్తు నిర్వహణ బృందాలను పంపామని చెప్పారు. సీఎం వెంట ఆర్థిక మంత్రి ప్రకాశ్ పంత్ కూడా ఉన్నారు. అయితే.. పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా మారే అవకాశం లేదని సీఎం ప్రజలకు భరోసానిచ్చారు. యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని, ఏ పరిస్థితినైనా ఎదుర్కొంటామని రావత్ అన్నారు. సహాయ, పునారావాస కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన మొదలుపెట్టామని, సైన్యం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు ముంపునకు గురైన ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. మాల్పా నుంచి గల్ వరకూ లామడి నుంచి చుడి వరకూ రహదారుల మీద కొండచరియలు రాకపోకలను స్తంభింపజేసాయి. వ్యాస్ లోయలో పలువురు యాత్రికులు చిక్కుకుపోగా హెలికాప్టర్లతో తరలించారు. మొదటి కుంభవృష్టి దార్చులాలోని తవాఘాట్ దగ్గరి మాంగ్తి నుల్లాలో కురిసింది. దీంతో పలు దుకాణాలతో పాటు సైనిక శిబిరం కూడా ముంపునకు గురయింది. సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న విపత్తు నిర్వహణ దళాలు రెండు మృతదేహాలను వెలికితీసాయి. రెండో కుంభవృష్టి మాల్పాలో కురవగా, నలుగురు కొట్టుకుపోయారు. వారందరి మృతదేహాలను కనుగొన్నారు. ఇక్కడ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ కూడా సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోంది.



బోల్ట్ నిష్క్రమణ అథ్లెటిక్స్‌కు లోటే..

● ఈ శూన్యతను వర్ధమాన అథ్లెట్లు భర్తీ చేయాలి ● అంతర్జాతీయ క్రీడా నిపుణుల సూచన



లండన్: ఉసేన్ బోల్ట్ రిటైర్‌మెంట్‌తో అథ్లెటిక్స్‌లో భారీ వెలితి ఏర్పడింది. అతడి స్థానాన్ని భర్తీ చేసేందుకు అథ్లెట్లు సరైన దిశలో పయనించాలి. స్కాండల్స్‌తో దెబ్బతిన్న ఇమేజీని పునరుద్ధరించుక ని తమకు తాము రీబ్రాండింగ్ చేసుకోవడం సులువైనపని కాదు అని క్రీడా మార్కెటింగ్ నిపుణులు అభిప్రాయపడు తున్నారు. మాజీ అథ్లెటిక్ బాస్ లామిన్ డియాక్ కూడా ఒకానొక దశలో తీవ్ర డోపింగ్ ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చింది. జమైకా సూపర్‌స్టార్ తన చివరి నాలుగు వందల మీటర్ల పరుగుపందెంలో ఫిట్‌నెస్ కారణంగా ట్రాక్‌పై కుప్పకూలాడు. పరుగు రిలేలో తనకు ఎదురేలేదని చాటిన చిరుత చరమాంకంలో చతికిలబడింది. అర్బన్ స్ట్రీట్ రేసుల నుంచి వర్ధమాన చిరుతలను గుర్తించి, వారిని ప్రోత్సహించడం ద్వారా బోల్ట్‌లేనిలోటును అథ్లెటిక్ రంగంలో భర్తీ చేయవచ్చని జాన్ టిబ్స్ అసోసియేషన్ క్రీడా సంస్థ అభిప్రాయపడింది. అథ్లెటిక్స్‌లో సూపర్ స్టార్లు వస్తుంటారు.. పోతుంటారు. బోల్ట్ స్టేచర్ కూడా అంతే అని జాన్‌టిబ్స్ పేర్కొంది. బోల్ట్ నిష్క్రమణ కొంతకాలం పాటు శూన్యతను మిగులుస్తుంది. టైగర్ వుడ్స్ రిటైర్‌మెంట్ తర్వాత గోల్ఫ్ ఎలా శూన్యతను ఎదుర్కొన్నదో, బోల్ట్ నిష్క్రమణ కూడా అంతే. జోర్డాన్ స్పీత్ కూడా గొప్ప ఆటగాడే. కానీ అతనికి అభిమాన ఆదరణ తక్కువే. వుడ్స్, బోల్ట్ ఇందుకు అతీతులు. వీరిద్దరూ ఆయా రంగాల్లో రికార్డులను బద్దలుకొట్టడమే కాదు.. తిరగరాశారు కూడా. వీళ్లిద్దరూ నిజమైన రాక్‌స్టార్స్.

డేవిస్‌కప్ రేసు నుంచి పేస్ ఔట్

● భాంబ్రి, మైనేనికి గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: డేవిస్‌కప్ స్క్వాడ్‌నుంచి వెటరన్ టెన్నిస్ ప్లేయర్ లియాండర్ పేస్‌ను పక్కనబెట్టారు. సింగిల్ ప్లేయర్ యుకి భాంబ్రి, సాకేత్ మైనేనిలకు అవకాశం లభించింది. ఇండియన్స్ ఏటీపీ ర్యాకింగ్స్‌లో 495వ స్థానంలో ఉన్న సాకేత్ ప్రతిభపై ఏటీపీ నమ్మకం ఉంచింది.ఇతను సింగిల్స్, డబుల్స్‌లో ఆడగల సమర్థుడు. ఇదే ఇతడిని డేవిస్ కప్‌కు ఎంపికయ్యేలా చేసింది. ప్రజ్నేశ్ గున్నేశ్వరన్, సమిత్ నాగల్, శ్రీరాం బాలాజి, విష్ణువర్ధన్, సాయి కుమార్ ముకుంద్ తదితరులు ఏటీపీ ర్యాంకింగ్స్ జాబితాలో సాకేత్ కంటే ముందున్నా సెలెక్టర్లు మైనేనివైపు మొగ్గుచూపారు. పాదం గాయం కారణంగా ఇదివరకు ఉజ్బెకిస్తాన్, బెంగళూరు టోర్నీలకు మైనేని సాకేత్ దూరమవ్వాల్సి వచ్చింది. తిరిగి ఇటీవల రీఎంట్రీ ఇచ్చిన సాకేత్ సిటీ ఓపెన్ టోర్నీలో ప్రపంచనంబర్ 22 గాయెల్ మన్‌ఫిల్స్‌ను ఓడించి సత్తా చాటాడు. సాకేత్ డబుల్స్ విభాగంలో రోహన్ బొపన్నతో జట్టుకట్టే అవకాశం ఉంది. అన్నివేళలా కేవలం ర్యాంకులనే ప్రాతిపదికగా తీసుకోబోమని మైనేని ఎంపికపై సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎస్‌పీ మిశ్రా వ్యాఖ్యానించారు.



లంకను ఊడ్చేశారు..

● మూడో టెస్టులో 171 పరుగులతో భారత్ ఘనవిజయం ● సిరీస్ క్లీన్‌స్వీప్‌తో కోహ్లీసేన విదేశీగడ్డపై సరికొత్త రికార్డు ● రాణించిన బౌలర్లు.. చేతులెత్తేసిన లంక మిడిలార్డర్

క్యాండీ: టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. శ్రీలంకతో జరిగిన మూడో టెస్ట్‌లో ఇన్నింగ్స్ 171 రన్స్ తేడాతో గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టల సిరీస్‌ను ఓ ఇండియన్ టీమ్ క్లీన్‌స్వీప్ చేయడం ఇదే తొలిసారి. తొలి రెండు టెస్టలను నాలుగో రోజు ముగించిన విరాట్ సేన.. మూడో టెస్టను మాత్రం మూడు రోజుల్లోపే ముగించేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకు ఆలౌటైన లంక.. రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులు మాత్రమే చేయగలిగింది. రెండో ఇన్నింగ్స్‌లో అశ్విన్ 4, షమి 3, ఉమేష్ యాదవ్ 2 వికెట్లు తీసుకున్నారు. శ్రీలంక తరఫున డిక్‌వెల్లా 41 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగులు చేసిన భారత్.. లంకను తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే ఆలౌట్ చేసి ఫాలోఆన్ ఆడించిన విషయం తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో ధావన్ (119), పాండ్యా (108) సెంచరీలు చేయడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు హార్దిక్ పాండ్యాకు దక్కగా.. సిరీస్‌లో రెండు సెంచరీలు సహా మొత్తం 358 రన్స్ చేసిన శిఖర్ ధావన్‌కు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కింది.

పేస్.. స్పిన్ ఉచ్చుతో బిగించేశారు..

కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకేయులను భారత బౌలర్లు కట్టడిచేశారు. ఒకదశలో వారికి క్రీజ్‌లో నిలదొక్కుకోవడమే పెద్దసవాల్‌గా మారింది. ఓ వైపు స్పిన్.. మరో వైపు పేస్‌తో ఎదురు దాడిచేశారు. దీంతో ఫాలోఆన్‌లో ఓవర్‌నైట్ స్కోరు 19/1తో మూడో రోజు, సోమవారం బరిలోకి దిగిన ప్రత్యర్థి 181 పరుగులకే కుప్పకూలింది. నైట్ బ్యాట్స్‌మన్ కరుణరత్నె (16)ను అశ్విన్ 26 పరుగుల వద్ద ఔట్ చేశాడు. పుష్పకుమార్ (1)ను ఉమేశ్, కుశాల్ మెండిస్ (12)ను షమి ఎక్కువ సేపు నిలవనీయలేదు. 34/9తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న ఆ జట్టును సారథి దినేశ్ చండిమాల్ (36), ఏంజెలో మాథ్యూస్ (35) వికెట్ పడకుండా కాపాడారు. 65 పరుగుల భాగస్వామ్యం అందించారు. చండిమాల్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ జోడీని కుల్‌దీప్ విడదీశాడు. ఆ తర్వాత మాథ్యూస్‌ను అశ్విన్ ఎల్బీ చేయడంతో లంక పతనం మరింత వేగం పుంజుకొంది.

పెరీరా (8), సండకాన్ (8) వెంటవెంటనే ఔటైనా డిక్వెలా (41బీ 52 బంతుల్లో 5ఐ4) ఆఖర్లో మెరుపులు మెరిపించాడు. అతణ్ని ఉమేశ్ ఔట్ చేశాడు. లహిరు కుమార (10)ని అశ్విన్ బోల్తా కొట్టించడంతో లంక కథ ముగిసింది. అశ్విన్ (4/68), మహ్మద్ షమి (3/32), ఉమేశ్ యాదవ్ (2/1) కుల్‌దీప్ (1/56) బౌలింగ్‌లో రాణించారు.

మూడూ భారీ విజయాలే..

ఈ మూడు విజయాలు కూడా భారీవే. తొలి టెస్ట్‌లో 304 రన్స్‌తో గెలిచిన టీమిండియా.. రెండో టెస్ట్‌లో మరింత ఘనంగా ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక మూడో టెస్ట్‌లో ఈ రెండు విజయాలను తలదన్నేలా ఇన్నింగ్స్ 171 రన్స్‌తో గెలుపొందింది. విరాట్ కెప్టెన్సీలో టీమిండియాకు ఇది వరుసగా ఎనిమిదో టెస్ట్ సిరీస్ విజయం. ఈనెల 20 నుంచి ఐదు వన్డేల సిరీస్ మొదలవనుంది. ఇక శ్రీలంకలో మోస్ట్ సక్సెస్‌ఫుల్ టీమ్‌గానూ ఈ విజయంతో ఇండియా నిలిచింది. ఇప్పటివరకు శ్రీలంకలో 24 టెస్టులాడిన భారత్ ఖాతాలో మొత్తం 9 విజయాలు, 7 ఓటములు, 8 డ్రాలు ఉన్నాయి. భారత్ తర్వాతి స్థానంలో పాకిస్థాన్ ఉంది.



'గబ్బర్'కు కొత్తపేరు!

టీమిండియా ఓపెనర్ శిఖర్ ధవన్‌కు కొత్తపేరు పెట్టారు యువ ఆటగాళ్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్. శ్రీలంకతో జరుగుతున్న మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్ ధవన్ 123 బంతుల్లో 119 పరుగులు చేసి అదరగొట్టాడు. రెండు చేతులతో విజయ చిహ్నం చూపించి సంబరాలు చేసుకున్నాడు. హార్దిక్ పాండ్యా శతకం చేసినప్పుడు, కేఎల్ రాహుల్ మైదానం నుంచి బయటకు వస్తున్నప్పుడు అతడినే అనుసరించారు. విక్టరీ చిహ్నంతో సంబరాలు చేసుకున్నారు. ఈ ఇద్దరు శిఖర్ ఇన్నింగ్స్‌ను ప్రశంసిస్తూ ట్వీట్లు పెట్టారు. అందులో 'బిగ్ డ్యాడీ డి' అంటూ ధావన్‌ను కొత్త ముద్దుపేరుతో సంబోధించారు. అతడికి ఇంతకు ముందే 'గబ్బర్', 'జాట్ జీ' అనే పేర్లున్న సంగతి తెలిసిందే.



ధోనీ రికార్డు బద్దలు

శ్రీలంకపై మూడో టెస్ట్ విజయంతో విరాట్‌కోహ్లీ ధోనీని మించిపోయాడు. విదేశీ గడ్డపై అత్యధిక టెస్ట్ విజయాలు సాధించిన ఇండియన్ కెప్టెన్ల జాబితాలో ధోనీని వెనక్కినెట్టి విరాట్ ద్వితీయ స్థానాన్ని ఆక్రమించాడు. ఈ విజయంతో 85 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో విదేశీ గడ్డపై తొలిసారి మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఘనత కూడా విరాట్‌సేనకే దక్కింది. పల్లెకెలెలో విజయంతో విదేశాల్లో విరాట్ విజయాల సంఖ్య ఏడుకు చేరింది. అయితే విదేశాల్లో పదకొండు విజయాలతో ఇప్పటికీ సౌరవ్ గంగూలీ తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. 2015లో శ్రీలంకపై రెండు, 2016లో వెస్టిండీస్‌పై 2, ఇప్పుడు మళ్లీ శ్రీలంకపైనే మూడు టెస్ట్ విజయాలు విరాట్ సారథ్యంలో టీమిండియా సాధించింది. ధోనీ ఖాతాలో ఆరు విజయాలు మాత్రమే ఉన్నాయి. కోహ్లీసేన తదుపరి సిరీస్‌ను ద.ఆఫ్రికాతో ఆడనుంది. అసలైన సవాల్ ఎదుర్కోనుంది.

స్కోరు వివరాలు

- **భారత తొలి ఇన్నింగ్స్ 487 (122.3 ఓవర్లకు)**
- **శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 135 (37.4 ఓవర్లకు)**
- **శ్రీలంక రెండో ఇన్నింగ్స్ 181 (74.3 ఓవర్లకు ఫాలోఆన్‌లో)**

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



71వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకం



* కోట్లకొద్దీ జనాభా పెరిగినా...అన్నదమ్ముల్లా కలిసే ఉంటున్నారు
* భిన్నభాషల్లో మాట్లాడుకుంటున్నా...మనసులు ఒక్కటే అంటున్నారు
* వైరుధ్యమున్న సంప్రదాయాలున్నా....మేము వేరు కాదంటున్నారు
* సంస్కృతి ఆచారాలు పండుగల్లో తేడాలున్నా...సమైక్యతని చాటుతున్నారు
* అసలు భారత్‌లో ఏం జరుగుతోంది....సమైక్యరాగం సుదీర్ఘకాలాలను దాటేస్తోంది....

మేరా భారత్ మహాన్...

భారతదేశం...ఏక సంతకం





భారతదేశంలోని భిన్నత్వం ఒక విచిత్రం...అంతటి భిన్నత్వం ఏకమై ఉండటం అంతకంటే విచిత్రం. భారత్‌కి మొదటి సారి వచ్చిన విదేశీయులు...మనం ఒక్కదేశంలోనే ఉన్నామా...అనే సందేహం కలిగేంతగా భిన్నత్వం భారత్‌లో కనబడుతుంది. దేశం ఏం సాధించాలన్నా...ప్రజలంతా ఏకబాటలో....నడవాలి....ఆ స్థిరత్వం, ఆ స్థిమితత్వమే...ప్రగతికి పునాది. అక్కడక్కడా చిన్నపాటి చికాకులూ, వైరుధ్యాలు, విభేదాలూ ఉన్నా...నూట ఇరవై కోట్ల ప్రజలున్న భారతంలో...అవి సముద్రంలో నీటి బిందువులు. అందుకే మనదేశంలో భిన్నత్వం... ఉత్తేజభరితం. ఇరుగుపొరుగు ఇచ్చిపుచ్చుకునే వంటకాల్లా భిన్నత్వాన్ని ఆస్వాదిస్తున్న దేశం మనది. ఇక్కడి భిన్నత్వం...సుందరం, సుమధురం, సార్వజనీనం. సెక్యులర్ విధానాన్ని రాసుకోవడమే కాకుండా...ఆచరణలోనూ సర్వేజనా సుఖినోభవంతు ... అంటున్న దేశం మరి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరోసారి ఆ భిన్నత్వ రుచులను అక్షరాలా...అక్షరాల్లో ఆస్వాదిద్దాం-

పెనవేసుకున్న మతాలు..మతాతీతంగా అనుబంధాలుకులాలు మతాలు వంటలు పండుగలు నృత్యాలు సినిమాలు దుస్తులు ఫ్యాషన్లు జీవన విధానాలు ఒక్కటేమిటి...ఇక్కడ పక్కపక్క ఇళ్లలో...పొంతనే లేని రెండు రకాల కుటుంబాలు కలివిడిగా కలిసి బతికేస్తుంటాయి. ఏ భిన్నత్వమూ లేనట్టుగానే..అసలా విషయం గుర్తు లేనట్టుగానే అనుబంధాలు పెనవేసుకుని ఆత్మీయతలు పంచుకుంటూ ఉంటాయి. హిందూయిజం, సిక్కిజం, జైనిజం, బుద్ధిజం అనే నాలుగు ప్రధాన మతాలకు మనదేశం పుట్టినిల్లు. తిరిగి హిందువుల దేవతలు, పండుగలు, ఆచారాలు, సంప్రదాయాల్లో ఎంతో భిన్నత్వం కనబడుతుంది. 2011జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో 79. 8శాతం మంది హిందువులు ఉన్నారు. 14.2శాతం మంది ఇస్లాంని పాటిస్తుండగా మిగిలిన ఆరుశాతం మంది క్రిస్టియానిటి, బుద్ధిజం, సిక్కిజం మొదలైన మతాలను అనుసరిస్తున్నారు. ఇండోనేషియా తరువాత ప్రపంచంలోనే అత్యధికంగా ముస్లింలు నివసిస్తున్న దేశం కూడా మనదే. ప్రపంచంలోనే షియాలు ఎక్కువగా ఉన్న దేశాల్లో మూడవది. అహ్మది ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న అతి కొద్ది దేశాల్లో భారత్ ఒకటి. కనీసం పదిలక్షలమంది ఈ వర్గపు ముస్లింలు ఉన్నారు. పార్శీలు, ఇరానీయులు ఎక్కువగా ఉన్న దేశం కూడా భారతే. మతకల్లోలాలు, ఉద్రికత్తలు, మతోన్మాద ఘటనలు..లాంటివి అప్పుడప్పుడు చోటుచేసుకుంటున్నా...ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణం...దేశాన్ని కలిపి నిలిపి ఉంచుతోంది.

బహుభాషల మ్యూజియం

భారత్‌ని... భాషా ప్రతిపదికన రాష్ట్రాలుగా విభజించినా...ఇంకా ప్రతి రాష్ట్రంలోనూ ఎన్నో ఉప భాషలు ఉన్నాయి. పదివేలమందికంటే ఎక్కువ మంది మాట్లాడుతున్న భాషలు 122 వరకు ఉన్నాయి.. ఇక దేశంలో ప్రధాన భాషలుగా కోటికంటే ఎక్కువమంది మాట్లాడుతున్న భాషలు హిందీ, ఇంగ్లీషు, తెలుగు, బెంగాలీ, మరాఠీ, తమిళ్, ఉర్దూ, గుజరాతీ, కన్నడ, మలయాళం, ఒడిషా, పంజాబీ, అస్సామీ, మైథిలీ భాషలు ఉన్నాయి. ఇవి కాకుండా సంస్కృతం, మణిపురి, నేపాలీ, గుజరాతీ, బోడో, డోగ్రి, సంతలి లాంటి భాషలు ఉన్నాయి. 1961 జనాభా లెక్కల ప్రకారం మొత్తంమీద ఇండియాలో 1652 భాషలు ఉన్నట్టుగా గుర్తించారు. ప్రస్తుతం 880 భాషలు వాడుకలో ఉన్నాయి. రాజ్యాంగం గుర్తించిన భాషలు 22. ఇంతటి భాషా వైవిధ్యం దేశ సమైక్యతను అడ్డురాకపోవటం విశేషం.

ఎన్నో నృత్యాలు..అయినా కలిసిమెలసి బతకడంలో ఆనందం

భారత్‌లో ప్రత్యేకంగా కనిపించే నృత్యాలు.. .కేరళనుండి కథాకళి, తమిళనాడు భరతనాట్యం, ఆంధ్రప్రదేశ్ కూచిపూడి, తెలంగాణ పేరిణి శివతాండవం, ఒడిషా ఒడిస్సీ, ఉత్తర ప్రదేశ్ కథక్, మణిపూర్ మణిపూరీ...ఇవి కాకుండా ఆంధ్రప్రదేశ్ కోలాటం, తెలంగాణలో బతుకమ్మ, పంజాబ్ నుండి భాంగ్రా, గుజరాత్ నుండి గార్బ దాండియా రాస్, ఇంకా తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రనాట్యం, అసోంలో బాగురుంబా, భోర్టల్, బిహు, దేవ్‌ధాని జానపద నృత్యాలు. పంజాబ్‌లో గిద్దా, తమిళనాడులో కొల్లాట్టం జానపదనృత్యం, కరకట్టం, పశ్చిమ బెంగాల్ ఒడిషాల్లో ఛావూ, పశ్చిమ బెంగాల్‌లో గాడియా నృత్యం, ఒడిషాలో ధింసా, ఘుమురా, ఉత్తరాఖండ్‌లో ఛోలియా, గుజరాత్‌లో గెరయ్యా నృత్యం, మహారాష్ట్రలో ధాంగరి, కోలీ, లావని జానపద నృత్యాలు, కర్ణాటకలో డొల్లుకునిత, రాజస్థాన్‌లో ఘూమర్, అసోం, జార్ఖండ్ ఒడిషా, పశ్చిమ బెంగాల్‌లలో ఝుమర్ జానపద నృత్యాలు...ఇలా ఎన్నో భిన్నమైన నృత్యాలు దేశవ్యాప్తంగా కనబడతాయి.

వినూత్న అనుభూతినిచ్చే పండుగలు

భారత్‌లో పండుగల్లోనూ ఎంతో భిన్నత్వం కనబడుతుంది. దేశవ్యాప్తంగా జరుపుకునే జాతీయ పండుగలు దీపావళి, సంక్రాంతి, దసరా, వినాయక చవితి లాంటివాటితో పాటు ప్రాంతాన్ని బట్టి స్థానిక చరిత్రని బట్టి అనేక పండుగలు, జాతరలు జరుపుకుంటూ ఉంటారు. 0తఅలాగే ముస్లింలు జరుపుకునే పండుగలు రంజాన్, బక్రీద్, మొహరం, క్రిస్టియన్ పండుగలు క్రిస్టమస్, ఈస్టర్, ఇంకా గురునానక్ జయంతి, మహావీర్ జయంతి, బుద్ధ పూర్ణిమ లాంటి పండుగలుసైతం ఘనంగా నిర్వహిస్తారు. అలాగే ప్రాంతాలను బట్టి కూడా కొన్ని పండుగల పేర్లు మారిపోవటం కూడా కనబడుతుంది. హోలీ అనేది ఉత్తర భారతంలో ఘనమైన పండుగ కాగా దసరాని పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేకంగా దుర్గాపూజ అంటారు. కేరళలో ఓనం ప్రత్యేక పండుగ. ఇక జాతరలు, కుంభమేళాలు లాంటివయితే చెప్పాల్సిన పనిలేదు. విదేశీయులకే కాదు..సొంతదేశంలో ఉన్నవారికి సైతం దేశంలో ఒక్కొక్కప్రాంతం ఒక్కోలా కనబడుతూ వింత గొలుపుతుండటం విశేషం.




రుచులెన్నో...కమ్మదనం ఒకటే

భారత్‌లో ప్రధానమైన ఆహారం ఏమిటి...అంటే ఎవరూ టక్కున ఒక్కమాటలో సమాధానం చెప్పలేరు. అంతటి భిన్నత్వం వంటకాల్లో కనబడుతుంది. వేటి రుచి వాటిదే...వేటి కమ్మదనం వాటిదే. ముఖ్యంగా ప్రాంతాన్ని బట్టి ఆహారంలో మార్పులు చాలా ఎక్కువగా కనబడతాయి. ఉత్తర భారతదేశంలో పాలు, పన్నీర్, నెయ్యి, పెరుగు లాంటి పాల ఉత్పత్తులు ఎక్కువగా వాడుతుంటారు. అలాగే రోటీ పరోటా తందూర్, నాన్, కుల్చా లాంటివి ఇక్కడ ఎక్కువగా తింటారు. తందూరి చికెన్ లాంటివాటిని బొగ్గులతో మండే మట్టి పొయ్యిల్లో కాల్చుతారు. సమోసాని స్నాక్‌గా ఎక్కువగా తీసుకుంటారు. ఇక గులాబ్‌జామ్, జిలేబి, దూద్‌పేడా, కుల్ఫీ, ఫాలుదా....లాంటి వెరైటీ తీపి పదార్థాలను వీరు ఇష్టపడుతుంటారు. మాంసాహారాన్ని కబాబ్స్‌గా ఎక్కువగా తీసుకుంటారు. ఉత్తర భారతదేశపు మాంసాహార వంటకాలు పాకిస్తాన్ వంటకాలకు ఎక్కువ పోలికలు కనబడతాయి. తూర్పు భారత్... పశ్చిమ బెంగల్ ఒడిషా లాంటి ప్రాంతాల్లో డిజర్ట్‌లను ఎక్కువగా ఇష్టపడతారు. రసగుల్లా. చమ్ చమ్, రసబలి లాంటి స్వీట్లు ఎక్కువ. బెంగాలీ వంటకాల్లో జీలకర్ర ఆవాలు, పచ్చిమిర్చి, పెరుగు, జీడిపప్పు పేస్ట్ లాంటివి ఎక్కువగా వాడతారు. ముఖ్యంగా ఆవనూనెతో వండుతారు. కూరగాయలను ఎక్కువగా తింటారు. బెంగాల్‌లో చేపలను దాదాపు ప్రతిరోజూ తింటారు. ఇక దక్షిణ భారతంలో వరి ఎక్కువగా తినటం మనకు తెలుసు. పప్పుచారు, రసం, పులుసులు, ...ముఖ్యంగా చింతపండు వాడకం దక్షిణభారతంలో ఎక్కువగా కనబడుతుంది. మళ్లీ ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటకాల రుచుల్లో తేడాలుంటాయి. ఒక్క సాంబారునే ఒక్కొక్కరు ఒక్కో విధంగా తయారుచేస్తారు. చేపలు రొయ్యలు లాంటివి ఆంధ్రలో ఎక్కువగా తింటే హైదరాబాద్ బిర్యానీకి ప్రపంచవ్యాప్తమైన పేరుంది. పచ్చళ్లు, అప్పడాలు, వడియాలు, వేపుళ్లు, వంటివి తప్పకుండా భోజనంలో ఉంటాయి. ఉత్తర ఈశాన్య రాష్ట్రాల ఆహారంపై బర్మా చైనా ఆహారాల ప్రభావం ఉంటుంది.

- వి.దుర్గాంబ

గార్ల జాగీరులో తొలి సత్యాగ్రహి



స్వాతంత్ర్య సమరయోధుడుగా, నిజాం హైదరాబాద్ సంస్థానం పాలన నుంచి విముక్తికొరకు జరిగిన పోరాటంలో పాల్గొన్న వ్యక్తిగా, శాసనసభ సభ్యుడుగా, ప్రముఖ న్యాయవాదిగా, శాసనసభ అంచనాల కమిటీ అధ్యక్షుడుగా, పానెల్ స్పీకర్‌గా, బొగ్గారపు సీతారామయ్య తెలంగాణ ప్రజలకు చిరపరిచితుడే. ఆయన పుట్టింది ఫిబ్రవరి 12, 1930. ఖమ్మం జిల్లా పండితాపురంలో జన్మించిన సీతారా మయ్య కేవలం 15 సంవత్సరాల వయసు లోనే సత్యాగ్రహం చేసి జైలుకెళ్లారు. శిక్షకాలం పూర్తైన తరువాత, తెలంగాణ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొ న్నారు. స్వాతంత్ర్య సమరయో ధుడుగా భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర సత్కారం పొందారాయన. ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఉస్మానియ విశ్వవిద్యాలయం, సీతారామయ్యను విశిష్ట స్వాతంత్ర్య సమరయోధుడుగా సత్కరించాయి.

1951లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాలను నెలకొల్పారు. ప్రధానోపాధ్యాయ స్థాయికి కూడా ఎదిగారు. హైదరాబాద్ స్టేట్ యూనియన్ నాయకుడిగా సేవలందించారు. 1961 లో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ఖమ్మంలో న్యాయవాదిగా పనిచేయడం ప్రారంభించారు. జిల్లా న్యాయవాదుల సంఘానికి అధ్యక్షుడయ్యారు. 1969 లో తెలంగాణ ప్రజాసమితిలో చేరి, ప్రత్యేక తెలంగాణ వేర్పాటు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ, జైలు శిక్షను కూడా అనుభవించారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఇప్పటివరకూ అందులోనే కొనసాగుతున్నారు. 1978 లో ఇందిరా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఖమ్మంజిల్లా సుజాత్ నగర్ నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

బొగ్గారపు సీతారామయ్య నేను ఖమ్మం రికాబ్ బజార్ పాఠశాలలో చదువుతున్నప్పుడు మాకు ఇంగ్లీష్ బోధించిన ఉపాధ్యాయుడు. సీతారామయ్య సార్‌ను కలవడానికి ఎమ్మెల్యే కాలనీలోని వారింటికి వెళ్తుండేవాడిని. పాత రోజుల నాటి సంగతులు, బొగ్గారపు సీతారామయ్య సార్ ఎమ్మెల్యే అయిన రోజులనాటి విష యాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వ్యవ హారం... ఇలా... చాలా కబుర్లు చెప్పుకునే వాళ్ళం. ఒకసారి నేను, డాక్టర్ రంగారావు, లలిత ఆయనతో సంభాషించినప్పుడు తన చిన్ననాటి విషయాలను మాతో పంచుకు న్నారు.

87 సంవత్సరాల వయసులో కూడా నవ యవ్వన యువకుడిలో ఉన్న ఉత్సాహంతో అలనాటి సంగతులు చెపుతుంటే ఎంతో సంతోషం వేసింది మాకు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరుగుతున్న విష యాన్ని మరీ మరీ చెపుతూ ఆయన ఎంత గానో ఆనందించారు. తన జీవిత కాలంలో తెలంగాణ ఏర్పాటును చూడగల గడం తనకెంతో సంతోషాన్నిస్తున్నదని పలుమార్లు అన్నారు. ఎక్కడా మొదట్లో ఫార్మల్ ఎడ్యుకేషన్ అనేది లేదు. ఒక ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి వరకు చదివారు. ప్రముఖ జర్నలిస్ట్ ఆదిరాజు వెంకటేశ్వరరావుది కూడా పండితాపురమే. సీతారామయ్య తండ్రి పోలీసు పటేల్, తాత పట్వారీ. పటేల్, పట్వారీ లంటే ఆ రోజుల్లో హడల్. వాళ్లిద్దరూ ఆ గ్రామాధినేతలే. బొగ్గారపు తండ్రికి ఒక్కడే కొడుకు. మధ్యతరగతి కుటుంబీకులు.

వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగించేవాళ్లు. చిన్నప్పటి నుంచీ పటేల్ పట్వారీలంటే నిరసన ధోరణితో వ్యవహరించేవాడు సీతారామయ్య. వాళ్లకెప్పుడూ దండం పెట్టకపోయేవాడు. చిన్నప్పటి నుంచీ ఒకరకమైన తిరుగుబాటుతనం వుండేది ఆయనలో. అప్పట్లో ఐదో తరగతి (ఫస్ట్‌ఫామ్ అనేవారు) చదవాలంటే ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖమ్మం రావాల్సిందే. సీతారామయ్య చిన్నతనంలో నాలుగో తరగతి అయిన తరువాత ఖమ్మం వెళ్లి ఐదో తరగతి చదవడానికి గొడవ పడినప్పుడు తాత ఈయనగారి తల్లి దగ్గరకు వచ్చి, నీ కొడుకేమన్నా చదువుకొని పటేల్‌గిరి చేస్తాడా? పట్వారీ గిరి చేస్తాడా? తవీడిని గొడ్ల కాపలాకు పంపిస్తే ఒక పుట్టెడు గింజలు మిగులుతాయి కదా? అన్నాడు. అంతే సీతామయ్యను ఖమ్మం పంపడం మానేసుకున్నారు. అంతేకాదు ఆయనను పశువులు కాయడానికి పెట్టారు తల్లిదండ్రులు. ఆ రోజుల్లో పశువులు కాసేవాళ్లంతా చేపలు కూడా పట్టేవారు. మిగతా కుర్రకారుతో పాటు ఆయన కూడా చేపలు పట్టడం చేసేవాడు.

మిగతా 13లో

సమపాలన కావాలి!

బానిసత్వ విముక్తి చాలదు...ఆ అంశాల నుండి విముక్తి కావాలి!



స్వాంతంత్ర్యం వచ్చి డెబ్బయ్యేళ్లు పూర్త య్యాయి. ఈ సందర్భంగా ఇప్పటివరకు మనం సాధించిన విజయాలను, మూట గట్టుకున్న అపజయాలను ఒకసారి సమీక్షించుకోవాలి. నెహ్రూ మనదేశాన్ని భిన్నత్వం లో ఏకత్వమున్న దేశంగా పేర్కొన్నారు. అది మన బలహీనత కాదు, బలం. ప్రజాస్వామ్య విధానంతో ఇక్కడ అందరికీ అన్ని విధాలు గా సమన్యాయం జరిగేలా కృషి జరుగుతోంది. ఆర్థికంగా కూడా ఎన్నో అడుగులు ముందుకు వేశాం. అయినా ఇంకా పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యాలు, స్త్రీపురుష వివక్ష, ప్రాంతీయ అసమానతలు లాంటి సమస్యలను ఎదుర్కొం టూనే ఉన్నాం. సివిల్ సర్వీసెస్‌కి సిద్ధమవుతున్న అభ్యర్థిగా, కాబోయే సివిల్ సర్వెంట్‌గా... భారత్.. ..పేదరికం, అవినీతి, టెర్రరిజం, కులమత వివక్షలు... వీటన్నింటి నుండీ విముక్తి పొందాలని ఆశిస్తున్నాను. దేశం ...సహనం, సంపద, సమతలతో తులతూగాలని కోరుకుంటున్నాను.

-రోచిష్మ, ఎమ్మెస్సీ (అప్లయిడ్ సైకాలజీ)

పాలన, ప్రజలు...ఇవి రెండూ విడదీయలేనంత అనుబంధమున్న అంశాలు. ఒకదేశం దేదీప్యమానంగా వెలగాలంటే పాలన బాగుండాలి. అది ప్రజలకు అందాలి. అందుకే మనం సుపరిపాలన అనే అంశాన్ని ప్రధానంగా తెరపైకి తెచ్చాం. అయితే నేటి పాలన ఎలా ఉంది...అభివృద్ధి చెందుతున్న ఇండియాకు ప్రస్తుత పాలన సరిపోతుందా...ఇంకా మార్పులు రావాలా.... ఈ విషయాలపై స్పందించారు...భవిష్యత్తులో పాలనా రంగంలోకి వెళ్లబోతున్న యువతీ యువకులు....వీరంతా సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నవారు....దేశ భవిష్యత్తుతో తమ భవిష్యత్తుని ముడివేసుకున్నవారు...

ఒక వైపు అలా...మరో వైపు ఇలా!



భారత్‌లో చాలా రంగాలు అభివృద్ధి చెందాయి. అది ఆనందించదగ్గ విషయమే. అయితే ఒకవైపు ఎంతో సంపద కనబడుతుంటే మరో వైపు అంతే స్థాయిలో పేదరికం ఉంది. తరతరాలుగా ఎన్నో సంప్రదాయాలు సంస్కృతులకు చెందిన ప్రజలు ఇక్కడ సామరస్యంతో జీవిస్తున్నారు. మరోవైపు కులమతాల వివక్షలు చిచ్చులు రగులుతున్నాయి. ఒక వైపు మనదేశం మెడికల్ టూరిజం...కి ప్రసిద్ధి చెందుతుంటే మరోవైపు అనారోగ్యాలతో కునారిల్లుతోంది. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా మారాలనే నేను సివిల్ సర్వీసెస్‌ని నా కెరీర్‌గా ఎంచుకున్నాను. సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాల వారికి అందేలా చేయాలని, ఇల్లు, ఆహారం, ఉపాధి లాంటి కనీస అవసరాలు అందరికీ తీరాలని, ప్రజల మధ్య ఉన్న తారతమ్యాలను సాధ్యమైనంతవరకు తగ్గించాలనేదే నా ఆశయం.

ఎమ్‌డి. నదీమ్, బి.టెక్ (మెకానికల్ ఇంజినీరింగ్)

ఆ కలలు తీరితే..మరింత ఆనందం!



దేశాన్ని ఎలా చూడాలి...అనే విషయంలో నాకు కొన్ని కలలు ఉన్నాయి. అవి-

ఆడపిల్లని భారంగా మగపిల్లవాడిని సంపదగా భావించని భారత్ కావాలి. అంటరానితనం, పరువు హత్యలు, మూఢన మ్మకాలు లేని దేశం కావాలి. ప్రజలంతా ఒకరికొ కరు అండగా నిలబడాలి. అలా మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రజలు సహజవ నరులు, పర్యావరణం పట్ల బాధ్యతగాఉండాలి. తమ చర్యలు ఇతరులకు హాని కలిగించకూడదనే స్పృహలో ఉండాలి.ప్రజలు జూదం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. రాజకీయాలు... కులమతాలు, అణగారిన వర్గాల వివక్షలకు అతీతంగా ఉండాలి.విద్య , ఆరోగ్యం, అభివృద్ధి...ఇవి అందరికీ మారుమూలల పల్లెల వరకు చేరాలి. ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగా అందాలి. మహిళలు అన్నింటా పురుషులతో సమానంగా తఅవకాశాలు పొందాలి.

-పృధ్వీరాజ్, ఎమ్.టెక్


ప్రశ్నించాలి



స్వతంత్ర భారతం లో దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లడానికి మనకు చాలా సంక్షేమ పథకాలు ఉన్నాయి. కేంద్రం నుండి రాష్ట్రాలకు అందుతున్న పథకాలు సైతం చాలా ఉన్నాయి. కానీ అవన్నీ చేరాల్సిన వారికి సవ్యంగా చేరటం లేదు. మధ్యలో ఉన్న వారికి ఎంతో కొంత ముట్టచెప్పనిదే పేద ప్రజలకు అందటం లేదు. ప్రజలకు పథకాలపై అవగాహన ఉన్నా...ప్రశ్నించాలంటే భయపడుతున్నారు. ప్రభుత్వాలు...సంక్షేమ పథకాలు సవ్యంగా చేరుతున్నాయా లేదా అనే విషయంలో సమీక్షించుకుంటూ ఉండాలి. రైతులకు కేంద్రప్రభుత్వం బీమా పథకాలు ప్రవేశపెట్టింది..కానీ మన రైతుల్లో ఎక్కువమందికి వాటిపట్ల అవగాహనే ఉండటం లేదు. దళారులు, దుర్వినియోగం తగ్గితే...మనం అనుకున్నవన్నీ సాధించగలం. మనకు ఏం చేయాలో తెలుసు...కానీ ఎలా చేయాలో తెలియటం లేదని చెప్పవచ్చు. ఈ విషయంలో మరింత చిత్తశుద్ధిని చూపాల్సి ఉంది.

ఎమ్. శరత్ పాటిల్

అరవిందుని ఐదు కలలు



భారతదేశం ఆధ్యాత్మికతకు పుట్టిల్లు. ఆధ్యాత్మిక భావ విప్లవం వల్లనే వినూతనమైన ప్రపంచంలో సమైక్యతను సాధించవీలవుతుంది. పంథొమ్మిదవ శతాబ్దం ద్వితీయార్థంలో పాశ్చాత్య దేశాలపై భారతీయ ఆధ్యాత్మిక బీజాలు వెదజల్లబడ్డాయి. ఇవి మొలకెత్తి దినదిన ప్రవర్ధమానమవుతున్నాయి. అద్యతన భవిష్యత్తులో అవి తమ ప్రభావాన్ని చూపగల్గుతాయి. అక్కడక్కడ కాలం చేస్తున్న విలయతాండవంలో దిక్కుతోచని పాశ్చాత్యులు భారతదేశంవైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. భారతదేశం తన ఆధ్యాత్మిక సంపత్తితో రోజురోజుకూ పెరుగుతున్న ప్రజల ఆక్రందనలను తొలగించి, చీకటిలో మగ్గుతున్న ఆశాజీవులపై తన ఆధ్యాత్మిక భావ విప్లవజ్యోతి వెలుగులను ప్రసరింపజేసి తన ఆదర్శాన్ని తెలియజెప్పాలి.

భారతదేశం స్వాతంత్ర్యం పొంది డెబ్బై ఏళ్లు గడిచాయి. ఈ ఆగస్టు పదిహేనున 71వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని దేశప్రజలు జరుపుకుంటున్నారు. డెబ్బై ఏళ్లకు పూర్వం స్వాతంత్ర్య పతాకం ఢిల్లీ ఎర్రకోటపై ఎగురవేసినప్పుడు ఇరువురు మహనీయులు తప్ప దేశప్రజలందరూ ఆనందోత్సాహాలతో తేలియాడారు. వారు మహాత్మాగాంధీ, అరవిందఘోష్‌లు.

దేశం రెండు ముక్కలై, తూర్పున, హిందూ ముస్లింల మధ్య హింస చెలరేగుతుంటే అక్కడ శాంతిని నెలకొల్పడానికి గాంధీజీ నౌఖాలీలో తన ప్రయత్నాలు చేయడానికి వెళ్లారు. నాడు స్వార్థ రాజకీయాలతో, అధికార దాహంతో, గద్దెనధిరోహించడానికి తహతహ లాడుతున్న వర్గంతో విభేదించిన అరవింద ఘోష్ అస్త్ర సన్యాసం చేసి, తనను అరెస్టు చేయడానికి వీలులేకుండా ఫ్రెంచ్‌వారి అధీనంలో ఉన్న పుదుచ్చేరికి వెళ్లిపోయేరు.

ఆగస్టు 15వతేదీ అరవిందుల జన్మదినం కావడం విశేషం.

అరవింద ఘోష్ లండన్‌లో విద్యాభ్యాసం చేస్తున్న కాలంలో బ్రిటిష్‌వారు తమ పాలనలో ఉన్న భారతదేశంలో జరుపుతున్న దమనకాండను చూసి చలించిపోయేరు. తమ దేశాన్ని బ్రిటిష్ కబంధ హస్తాల నుంచి ఏవిధంగా విముక్తి చేయాలన్న ఆలోచనలు ఆనాడే అతని మదిలో మెదిలాయి. చదువు పూర్తి చేసుకుని స్వదేశం తిరిగి వచ్చిన అరవిందులు తన కలలను సాకారం చేసుకోవడానికి కదనరంగంలో కాలు మోపారు. కార్యశూరునిగా, విప్లవకారునిగా, పత్రికాసంపాదకునిగా, ఎన్నో రంగాలలో తనదైన ముద్ర వేసుకున్నారు. యువకునిగా ఉన్నప్పుడే నాటి జాతీయోద్యమ నాయకులకు దిశానిర్దేశం చేసారు. బాలగంగాధర తిలక్ మరణం తరువాత జాతీయ కాంగ్రెసు అధ్యక్ష పదవిని అందుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నా, కాంగ్రెసులో ఉన్న వర్గపోరాటాలూ, అధికార లాలస వంటివి జాతీయోద్యమానికి విఘాతాలుగా పరిణమించడంతో రాజకీయాలకే దూరమయ్యారు.

పుదుచ్చేరిలో తాను నెలకొల్పిన అరవిందాశ్రమంలో ఉంటున్న కాలంలో 1947 ఆగస్టు 15న భారతదేశం స్వతంత్ర దేశంగా అవతరించడం, అదీ తాను జన్మించిన రోజునే జరగడం అరవిందులకు ఏమాత్రం సంతోషాన్ని ఇవ్వలేదు. తను ఏ లక్ష్యంతో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక సైనికుడుగా పాలుపంచుకున్నారో ఆ లక్ష్యం నెరవేరలేదు. తాను కన్న కలలు సాకారం కాలేదు. ఆశ్రమంలో మౌన దీక్ష వహించారు.

ఆ రోజున, ఆ మహనీయుని హృదయాన్ని ఆవిష్కరించాలన్న కోరికతో కొన్ని ప్రసార మాధ్యమాలు, కొందరు పత్రికా విలేఖరులు అరవిందాశ్రమానికి వచ్చి, తమ ఉద్యమాల కారణంగా దేశం స్వాతంత్ర్యం పొందిన తరుణంలో అరవిందులు భారతీయులకు తమ సందేశం ఇవ్వవల్సిందిగా కోరారు.

మౌనదీక్షలో కళ్లు మూసుకొని ఉన్న అరవిందులు కళ్లు తెరిచి, ఎదురుగా ఉన్నవారిని చూసారు. వారి ముఖంలో నిర్లిప్తత చోటు చేసుకున్నట్లు విలేఖరులు గమనించారు. అరవిందులు కళ్లు మూసుకున్నారు. ఆయన మనస్సులో ఏదో కలకలం జరుగుతున్నట్లు ముఖకవళికలు తెలిపాయి. కాసేపటికి కళ్లు తెరిచి గళం విప్పారు.

విలేఖరుల అభ్యర్థన మేరకు తన అంతరంగాన్ని విలేఖరుల ముందుంచారు.

''ఇది నేను కలలుగన్న స్వాతంత్ర్యం కాదు. నా ఉద్యమ లక్ష్యం కానే కాదు''అని మొదలు పెట్టి ఈ పవిత్ర భారతదేశం గురించి తన స్వప్నాలను తెలియజేశారు. నా మొదటి స్వప్నం. సంపూర్ణ, సమైక్య భారతదేశం. నా విప్లవ లక్ష్యం సమైక్య భారతం. ఈ దేశం సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించడం. ఆ కల సాకారం కాలేదు. సమైక్యతను సాధించలేదు. కారణాలేవైనా ఒక లక్ష్యసాధనకు సాగించిన ఉద్యమం విఫలమైంది. ఒకదేశం భూభాగం రెండు ముక్కలై రెండు దేశాలుగా విభజించబడింది. ఈ దేశం ప్రజల్లో మతపరమైన చీలిక జరిగింది. హిందూ, ముస్లిం విభేదం స్థిరపడింది. మత ప్రాతిపదిక లక్ష్యంతో దేశం విభజించబడింది. ఈ విభజన వెనుక రాజకీయ ఒత్తిడి ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ఇది తాత్కాలిక పరిష్కారమని భావించకుండా శాశ్వత విధానంగా భావించాలని కోరుకుందాం. ఈ విభజన వల్ల భారతదేశం బలహీనమవుతుంది. శరీరంలో ఒక భాగం కోల్పోవడంతో అంగవిహీనమైనట్లు భారతదేశానికి అంగవైకల్యం ప్రాప్తిస్తుంది. మతప్రాతిపదికన లేదా ఇతర కారణాల వల్ల, భారతదేశం ఆంతరంగికంగా అశాంతిని ఎల్లప్పుడూ పొందుతుంది. రాజకీయ సిద్ధాంతపరంగా ఇతర దేశాల ప్రాబల్యం పెరుగుతుంది.

ఇతరదేశాలు తమ ప్రాబల్యం పెంచుకుంటూ, అధికారాన్ని సాధించడానికి పోరుబాట అనుసరించవచ్చు. ఆ కారణంగా ఈదేశం పై పరాయిపెత్తనం మరోసారి అనుభవంలోకి రావచ్చు. ఈ దేశపు ఆంతరంగిక, అభ్యున్నతీ వైభవ ప్రాభవాలకు ఆటంకం కలగవచ్చు. అంతర్జాతీయంగా భారతదేశం బలహీనపడవచ్చు. భవిష్యత్తు నిరాశాజనకంగా ఉండకూడదనుకుంటే విభజన రద్దయి, తిరిగి భరతభూమి అఖండంగా ఉండాలి.

అనాదికాలంగా ఆసియాఖండం చైతన్యశీలి. దీనికి ముఖ్యకారణం ఈ ప్రాంతంలో భారతదేశం ప్రధాన భూమిక వహించడం. మళ్లీ భారతదేశం తన పాత్రను సమర్థవంతంగా నిర్వహించి, ఆసియా ఖండవాసులను జాగృతం చేసి తన పూర్వౌన్నత్యాన్ని చాటి చెప్పాలి. ప్రపంచ దేశాలలో భారతదేశం విశిష్టస్థానాన్ని పొందాలన్నదే నా రెండవ కల.

వివేకానందుడు ప్రపంచ మత సమ్మేళనంలో చెప్పినట్లు, ప్రపంచ మానవులందరూ ఉదాత్తమైన, రమణీయమైన, ఉజ్జ్వలమైన శాంతియుత జీవనం గడపాలి. ''వసుధైక కుటుంబకం'' అన్న భారత ఉపనిషద్వాణి తిరిగి ప్రపంచమంతా మారుమ్రోగాలి. అందుకు ప్రపంచ సమైక్యత ఒక్కటే మార్గం. ఇందుకోసం భారతదేశంతో సహా మరికొన్ని దేశాలలో ప్రపంచ మానవుల సమైక్యత కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం సమగ్రంగా కనిపించకపోవచ్చును. ఏ ప్రయత్నానికైనా ఆటంకాలు ఎదురౌతాయి. వీటిని అధిగమించే ఒక ప్రబలమైన ప్రచోదక శక్తి అంతిమంగా, అనివార్యంగా, విజయం సాధించగలదనడంలో సందేహం లేదు. ఇది నా మూడవ కల.

నా నాలుగవ కల ఆధ్యాత్మిక సంబంధమైనది. భారతదేశం ఆధ్యాత్మికతకు పుట్టిల్లు. ఆధ్యాత్మిక భావ విప్లవం వల్లనే వినూతనమైన ప్రపంచంలో సమైక్యతను సాధించవీలవుతుంది. పంథొమ్మిదవ శతాబ్దం ద్వితీయార్థంలో పాశ్చాత్య దేశాలపై భారతీయ ఆధ్యాత్మిక బీజాలు వెదజల్లబడ్డాయి. ఇవి మొలకెత్తి దినదిన ప్రవర్ధమానవుతున్నాయి. అద్యతన భవిష్యత్తులో అవి తమ ప్రభావాన్ని చూపగల్గుతాయి. అక్కడక్కడ కాలం చేస్తున్న విలయతాండవంలో దిక్కుతోచని పాశ్చాత్యులు భారతదేశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. భారతదేశం తన ఆధ్యాత్మిక సంపత్తితో రోజురోజుకూ పెరుగుతున్న ప్రజల ఆక్రందనలను తొలగించి, చీకటిలో మగ్గుతున్న ఆశాజీవులపై తన ఆధ్యాత్మికభావ విప్లవజ్యోతి వెలుగులను ప్రసరింపజేసి తన ఆదర్శాన్ని తెలియజెప్పాలి.

ఇక చివరికల- పరిణామదిశగా చైతన్యాన్ని కలగజేయడం. ప్రపంచ మానవులలో ఆదర్శ సమాజం గురించి, పరిపూర్ణత గురించి స్వప్నాలు కనడం ప్రారంభమైంది. కాని, స్వప్నాలు సాకారం కావడం లేదు. ఎన్నో అడ్డంకులు ఎదురౌతున్నాయి. వీటిని తొలగించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రయత్నాలు క్రాంతదర్శులైన కొందరు భారతదేశంలోనూ ఇతర పశ్చిమదేశాలలోనూ చేపట్టి ఆటంకాలను తొలగించేప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధి పథంలో పయనించేవారికి ఆటంకాలు ఎదురవడం సహజం. తమ స్వార్థం కోసం అభివృద్ధి నిరోధకులు అడుగడుగునా ఉంటారు. భారతీయ క్రాంతిదర్శు లకు ఇది తెలియంది కాదు. ఆధ్యాత్మిక చైతన్యానికి పుట్టినిల్లైన భారతదేశం ఆయా దేశాలకు దిశానిర్దేశం చేస్తూ మార్గదర్శి కావాలి.'


పుదుచ్చేరిలోని అరవింద ఆశ్రమం



71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న ఈ తరుణంలో మేధావులు, రాజకీయ నాయకులు, శ్రీఅరవిందుల ఆదర్శాలను అవగతం చేసుకుని, ఆనాడు వారు కన్న కలలు సాకారమయ్యే దిశగా అడుగులు వేస్తారని ఆశిద్దాం.

- ఏ. సీతారామారావు
8978799864

భగవద్గీత



ఆత్మానుభవానికి వేర్వేరు పద్ధతులు

అధ్యాయం 4

శ్లోకం 27:

సర్వాణీంద్రియకర్మాణి
ప్రాణకర్మాణి చాపరే।
ఆత్మసంయమయోగాగ్నౌ
జుహ్వతి జ్ఞానదీపితే॥

తాత్పర్యము : ఇంద్రియ, మనోనియమము ద్వారా ఆత్మానుభవమును సాధించగోరు ఇంకొందరు ఇంద్రియ కర్మలను మరియు ప్రాణవాయువు కర్మలను మనో నియమమనెడి అగ్ని యందు ఆహుతులుగా అర్పింతురు.

భాష్యము: ''పతంజలి'' యోగ పద్ధతిలో, ఇంద్రియ భోగనుభవమునకు ఆకర్షితుడైన వ్యక్తిని ''పరాగాత్మ'' అని ఆత్మ సాక్షాత్కారమును పొందిన వ్యక్తిని ''ప్రత్యగాత్మ'' అని అంటారు. పతంజలి యోగ పద్ధతి మన శరీరములోని పది రకాల వాయువులను ఎలా నియంత్రిస్తే ఆత్మ పరిశుద్ధికి, భౌతిక విముక్తికి దోహదము చేస్తాయో తెలియజేస్తుంది. ఎవరైతే జీవితమునే లక్ష్యముగా భావిస్తారో వారు అన్ని రకాల కార్యాలను ఆత్మ సాక్షాత్కారము కొరకు మాత్రమే వినియోగిస్తారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

సగం కనబడే లింగం బాబా భుసండేశ్వర్

ఒడిషాలోని బాలాసోర్ జిల్లా భోగారాయ్ గ్రామంలో ఒక విలక్షణ శివాలయం ఉంది. అక్కడున్న శివుని పేరు బాబా భుసండేశ్వర్. 12 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పు ఉన్న ఈ శివ లింగం నల్ల గ్రానైట్ తో చేయబడి ఉంది. దీనిలో సగ భాగమే కనబడుతూ ఉంటుంది. మిగతా సగం భూమిలో ఉండి పైకి కనబడదు. ఏళ్ళ తరబడి భూమిలో కప్పబడి ఉంది.

దేశంలో చాలా చోట్ల శివాలయాలు, వాటిలో లింగాలు ఉన్నాయి. ఒక్క శివునికే ఉన్న రూపం లింగ రూపం. శివాలయాలు చాలా ఉంటాయి. కాని ఎక్కువ చోట్ల లింగాలే ఉంటాయి. శివునికి ఆద్యంతాలు లేవని, అయన నిరాకారుడని, అన్నివైపులా చూస్తుంటాడని చెప్పడమే లింగ రూపంలోని ప్రత్యేకత అని చెబుతారు. అలాగే శివుని మరో రూపం కంటే లింగ రూప ఆరాధనే ఎన్నో రెట్లు ఎక్కువ ఫలితాన్ని ఇస్తుందని కూడా చెబుతారు. ఇక లింగం శివుడని పానుపట్టం అమ్మవారని కూడా చెబుతుంటారు. అంతేకాక శివుని లింగాలను చాలా చోట్ల తాకవచ్చు. కొన్ని చోట్ల ధూళి దర్శనం కూడా ఉంటుంది. అందరికీ అందుబాటులో ఉండే లింగాలు ఎన్నో ఉన్నాయి.



ఒడిషాలోని బాలాసోర్ జిల్లా భోగారాయ్ గ్రామంలో ఒక విలక్షణ శివాలయం ఉంది. అక్కడున్న శివుని పేరు బాబా భుసండేశ్వర్. 12 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పు ఉన్న ఈ శివలింగం నల్ల గ్రానైట్‌తో చేయబడి ఉంది. దీనిలో సగభాగమే కనబడుతూ ఉంటుంది. మిగతా సగం భూమిలో ఉండి పైకి కనబడదు. ఏళ్ళ తరబడి భూమిలో కప్పబడి ఉంది. ఈ లింగం స్థల పురాణం ప్రకారం శివుడు ఒక పర్యాయం త్రేతా యుగంలో తన భక్తుడైన రావణాసురునికి ఒక లింగాన్ని బహూకరించాడు. అయితే దానిని తీసికెళ్లే సమయంలో ఎక్కడా ఆగవద్దని హెచ్చరించాడు. రావణాసురుడు లింగంతో తన పుష్పక విమానంలో బయలుదేరాడు. రావణాసురునికి వచ్చిన ఈ అదనపు అనుగ్రహాన్ని చూసి దేవతలు బాధపడ్డారు. అయితే రావణుడు లింగం విమానంలో ఉంది కదా అని దానిని వదలి అల్పాచమానానికి దిగాడు. తర్వాత బయలుదేరుదామంటే శివలింగం బరువుకు విమానం లేవలేదు. చివరకు విమానం లేవా లంటే దానిని విమానంలో నుంచి దించాలని నిర్ణయించి ఎలాగో కదిపి కిందకు దించాడు. లింగం బరువైనది అవడం వల్ల సగ భాగం భూమిలో దిగబడింది. అప్పటి నుంచి అది అక్కడే ఉండి పోయిం ది. ఆ తర్వాత అక్కడ శివాలయం కట్టారు. అయితే గుడి చిన్నదిగా ఉంటుంది. ఇది ఆత్మలింగం గురించి ప్రచారంలో ఉన్న కథను పోలి ఉంటుంది. అయితే దీనిలో అంతరార్థాలు ఉన్నాయి. శివుడంతటి వాడు ఏదైనా ఇచ్చినపుడు దానిని వదలి వెళ్లరాదనేది ఒక విషయం. అంతేకాక అహంకరిస్తే జరిగే ఫలితం ఇదేనని దీని నుంచి మనం తెలుసుకోవచ్చు. శివుడు భక్త సులభుడు. భోళా శంకరుడు. తన భక్తులపై అనుగ్రహ వర్షాన్ని కురిపిస్తాడు. అయితే అటువంటి అనుగ్రహం లోకకంటకుడైనవాడికి దక్కితే దాని వల్ల ఫలితం దక్కదనేది గుర్తెరగాలి. ఒక వేళ అలా కాకుంటే శ్రీ మహావిష్ణువు అటువంటి వారిని తర్వాత సంహరించిన సందర్భాలు అనేకం. అయితే శివుడిస్తే విష్ణువు సంహరించడమేమిటనే ప్రశ్న వస్తుంది. దీనికి ఒక్కటే సమాధానం. శివకేశవులు ఇద్దరూ ఒకరే. ఇచ్చేవాడూ ఆయనే. సంహరించే వాడూ ఆయనే. రూపాలే వేరు. ఒకే మనిషి ఒకరికి తండ్రి. ఒకరికి భర్త లేదా భార్య, మరొకరికి పుత్రుడు లేదా పుత్రిక. వేర్వేరు విధులు నిర్వర్తించడం లేదా. మనకు ఒకే రూపం అయన ఒక్కొక్క దానికి ఒక్కో రూపం ధరిస్తాడు. అందుకే అప్పయ్య దీక్షితులవారు విష్ణ్వాలయానికి వెళ్ళి శివుణ్ని ప్రార్థిస్తే లింగం కాస్తా విష్ణు రూపం దాల్చింది. విష్ణ్వాలయానికి వెళ్లి శివుణ్ని ప్రార్థిస్తే అక్కడున్న విగ్రహం కూడా లింగంగా మారింది. ఇంకా ముందుకు వెడితే హరిహర తత్త్వం ఉండనే ఉంది.


సేకరణ : పార్వతీశం

చింతన

ధర్మం-మర్మం

సృష్టి అనేది ఎలా జరిగింది?


సృష్టి: పరమాత్మ ప్రళయకాలా నంతరు జగత్తును సృష్టించాలని సంకల్పించి ప్రకృతిలో చేరి ప్రకృతిని క్షోభిం పచేయగా ప్రకృతి నుండి మహాతత్త్వం పుట్టింది. మరల మహాతత్త్వంలో చేరి దానిని క్షోభింపచేయగా అహంకార తత్త్వం పుట్టింది. సాత్త్విక అహంకా రము, రాజస అహంకారము, తామస అహంకారము మూడు విధములైన అహంకారాలు. సాత్త్విక అహంకాన్ని వైకారికము అని, రాజస అహంకారాన్ని తైజస అహం కారము అని తామస అహంకారాన్ని భూతాది అని అంటారు. ఈ విధంగా సాత్త్విక అహంకారం నుంచి మనస్సు పుట్టింది. రాజస అహంకారం నుంచి ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేం ద్రియాలు పుట్టాయి. తామస అహం కారం నుంచి తన్మాత్రలు అనగా ఆయా విషయాల సూక్ష్మ అవస్థలు పుట్టాయి.



- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

సిద్ధులు



శ్రీ రమణాశ్రమం
10-8-46

ఈరోజున భగవత్సన్నిధిలో సిద్ధులను గురించి ప్రసంగం వచ్చింది ఎవరో సిద్ధులకై ప్రయత్నించారనీ, ఏమో సంపాదించారనీ ఏమేమో మాట్లాడారు కొందరు. భగవాన్ విని విని ఉద్రేక ధ్వనితో ''ఏమో సిద్ధులట. ఎక్కడి నుంచో సంపాదిస్తారట. అందుకొరకు సాధనాలు, తపస్సులూను. రూపంలేని మనకు కళ్లు, కాళ్లు, చేతులు, ముక్కు, చెవులు, నోరు ఇత్యాదులతో కూడిన ఈ శరీరం రావటం, దీనితో ఏమేమో చేయటం, ఇదంతా సిద్ధే గదా? మనమంతా సిద్ధులమే. అన్నం కావాలంటే అన్నం, నీళ్లు కావాలంటే నీళ్ళు, పాలు కావాలంటే పాలు, అన్ని సిద్ధిస్తూ వున్నవి. ఇన్ని రకాల సిద్ధులు ఎప్పుడూ అనుభవిస్తూనే ఇంకాయేమో సిద్ధులు గావాలని గంతులు పెడతారు. ఏం కావాలో?'' నన్నారు భగవాన్.

దాదాపు రెండేళ్లకు ముందు అఖిల భారత శాసనసభాసభ్యుడు, జ్ఞానేశ్వర భగవద్గీతకు అనువాద కర్త అయిన మునుసుబేదారు భగవత్సందర్శనార్థం వచ్చినప్పుడు, శ్రీవారి సన్నిధిలో ప్రసంగవశంగా ''అన్ని గ్రంథాలలో సిద్ధపురుషులను గురించి వ్రాశారే గాని సాధకులను గురించి వ్రాసినవి ఎక్కడా కనిపించవే? అట్టి గాథలేమైనా ఉన్నవా?'' అని అడిగితే, ''తమిళ 'భక్త విజయం'లో జ్ఞానేశ్వర విఠోబాల సంవాదం వున్నది. అది సిద్ధ సాధక సంవాదం. దానిలో సాధకుని స్థితి విపులంగా తెలుస్తుంది'' అని చెప్పి ఆశ్రమ గ్రంథాలయంలో ఉన్న 'భక్తవిజయం' తెప్పించి ఆ భాగం శ్రీవారే చదివి విషయం వివరించి చెప్పారు. మనసుబేదారు స్వస్థానం చేరిన వెనుక ఆ భక్త విజయం పంపమని వ్రాస్తే ఆ పుస్తకం తెప్పించి పంపుతూ ద్రావిడ భాషలో ఉన్న ఆ సంవాదం ఇంగ్లీషులోకి భగవాన్ తర్జుమా చేయించి పంపారు. సుబేదారు దానిని మూడవ కూర్పుగా ప్రచురిస్తూ వున్న తమ జ్ఞానేశ్వరికి అనుబంధంగా చేర్చారు.

ఈ మధ్య నేను ఆ సంవాదాన్ని తెలుగులోకి అనువదించాను. మొన్న పూర్ణిమకు నీ విక్కడికి వచ్చినప్పుడు ఈ సంవాద విషయమైన ప్రసంగవశాన ''జ్ఞానేశ్వరుడు సిద్ధుడు, విఠోబా సాధకుడు'' అని భగవాన్ చెప్పారు కదా! అందువల్ల దానికి సిద్ధ సాధక సంవాదము అని పేరు పెట్టాను .

''తన్ను, దా తెలిసి తాను తానుగ నిలువగలుగుట సిద్ధిగాని వేరేదీ సిద్ధిగా భావించరా''దని భగవానులు అప్పుడప్పుడు అంటూ ఉంటారు. తన తలపు ఆత్మాన్వేషణలో మగ్నం చేస్తే ఎప్పటికైనా యథార్థం గోచరిస్తుంది. అదే ఉత్తమ సిద్ధి.

''ఉన్నది నలుబదిలో శ్రీవారి సిద్ధులను గురించి రచించిన వచనమే దీనికి ప్రమాణంగా వ్రాస్తున్నాను చూడు.

35. సిద్ధమైయుండు వస్తువును యెఱిగి యుండుటయే సిద్ధి
ఇతర సిద్ధులు అన్నియు స్వప్నసిద్ధసిద్ధులే, నిద్రపోయి మేలు
కొనిన వెనుక అవి సత్యమగునా! సత్యవస్తు నిష్ఠులైమాయ
వీడినవారు వానియందు భ్రమనొందగలరా! దెలియుము.

సిద్ధ సాధక సంవాదము

శ్రీ పాండురంగ విఠలుని యనుగ్రహముచే జన్మించిన విఠోబా అడవి యందు తపమొనర్చుచుండ వారి బిడ్డలగు జ్ఞానేశ్వరాదులు పట్టణమందున్న మాతా మహునింట నివసించుచుండిరి. ఆ బిడ్డల మేధాసంపత్తికి ఆ దేశపు రాజు ఆశ్చర్యమంది ఇట్టి సంతతి వడసిన జనకుఁడెంత మహనీయుఁడో యని చింతించి వారిని పట్టణమునకు రావించి పూజింపఁదలఁచి తోడ్కొని వచ్చుటకై దూతలతో సహా జ్ఞానేశ్వరాదులను వారికడ కంపెను. దూతలెంత ప్రార్థించినను విఠోబా నగరమునకు రా నిరాకరించిరి. జ్ఞానేశ్వరులు తామెట్లో తమ తండ్రిని ఒప్పించి తోడ్కొని రాగలమని చెప్పి వారినందఱను పట్టణమును కనిపి, పిదప తన వాదముచేజనకుని మెప్పించి పట్టణమునకు తోడ్కొని వెళ్లిరి.

విఠోబా జ్ఞానేశ్వర సంవాదము

జ్ఞా: నాయనా! తాము నగరమందుండక అడవియందున్నచో మేము మాత్రము నగరమును సుఖముగ నుండగలమా? కన్నతండ్రిని విడుతుమా? శీఘ్రమే మాతో పట్టణమునకు ప్రయాణము గండు.

వి: అప్పా! జ్ఞానేశ్వరా, కక్కినది ఆయాసము దీర్చు పాయసమే కానీ, దానిని తినువారుందురా, వాక్కులు ఉత్తములకు రెండుగా నుండునా? అడవికి వచ్చిన పిదప నగరమున ప్రవేశింపవచ్చునా. తెలివిలేని మనుజులతో స్నేహము చేయవచ్చునా? వారిని మచ్చికతో మనసార విశ్వసింపవచ్చునా? అల్పుడగు రాజును పూజింపనగునా? ఎప్పటికినీ నాకీ యరణ్యమే శరణ్యము. మీకు పట్టణమే వాసయోగ్యమగును. కావున నీ పట్టువదలి పట్టణమున కేఁగి సుఖముగా ఉండుము.

జ్ఞా: నాయనా! తామీ యడవి యందుండు కారణమేమి?

వి: అప్పా! జ్ఞానేశ్వరా! నగరమున నిఁకమీద నేను పొందదగిన భోగలాభమేమున్నది? నగరమునకు వచ్చినచో మోక్షమునకు విఘ్నమేగాని, సహాయము లేదు. నిర్జనమైన ఈయడవియే మౌననిష్ఠకు యోగ్యము. ఈ కొండ చఱియ యందే సంచరించెదను.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



తెలుగునాట గాంధీజీ పాదముద్రలు!



స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మాగాంధీ పాదస్పర్శతో పునీతమైన ప్రాంతాలు ఆంధ్రదేశంలో ఎక్కువ ఉన్నాయి. ఇప్పటికీ అవి గాంధీ పేరుతో పిలువబడుతున్నాయి. అనాటి ఆ విశేషాలు ఎంతో ఆసక్తికరం...స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా గాంధీ నడయాడిన ఆ ప్రాంతాల వివరాలు మీకోసం-

స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మాగాంధీ పాదస్పర్శతో పునీతమైన ప్రాంతాలు ఆంధ్రదేశంలో ఎక్కువ ఉన్నాయి.వాటిలో రాజమహేంద్రవరం సమీపంలోని సీతానగరం ఆశ్రమం ప్రధానమైంది. సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించి వచ్చిన గాంధేయవాదులు తెలుగునాట గోదావరి తీరాన కూడా అటువంటి ఆశ్రమం అవసరం ఉందని భావించారు.గాంధీజీ ప్రబోధించిన నిర్మాణ కార్యక్రమాల ప్రచారానికి ఆరోజుల్లో సీతానగరం ఆశ్రమం ఆటపట్టు అయింది.ఎంతో మంది స్వాతంత్ర్యయోధులకు అది స్ఫూర్తి నిచ్చింది.గాంధీజీ ఆశయాలకు అంకితమైన ఎంతో మంది సమరయోధులకు అది శిక్షణ ఇచ్చింది.ఆ ఆశ్రమాన్ని బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి పోరాడిన బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారు నెలకొల్పారు. బ్రిటిష్ పోలీసుల లాఠీ దెబ్బలకు నేలకొరిగిన ఆయన మరణించారనుకుని ఆనాటి పోలీసులు వెళ్ళిపోయారు.ఆయన ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారనీ, నేతాజీ సుభాస్ చంద్రబోస్‌కి అత్యంత ప్రియుడుఅయిన మద్దూరి అన్నపూర్ణయ్య, వంగవీటి దీక్షితులు, డాక్టర్ ఎబి నాగేశ్వరరావు,క్రొవ్విడి లింగరాజు వంటి యోధులు అక్కడ గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొన్నవారే. కుష్టురోగులకు సేవ, పారిశుధ్యం, హిందీ వ్యాప్తి,మద్యపాన వ్యతిరేక ప్రచారం,నూలు వడకడం,హరిజనోద్ధరణ, తేనెటీగ లను పెంచడం వంటివి గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల్లో ముఖ్య మైనవి. ఆరోజుల్లో గాంధీజీ సిద్ధాంతాలను నమ్మి ఆచరించే వారం తా నిర్మాణ కార్యక్రమాల్లో విధిగా పాల్గొనేవారు. ఎన్ని పనులు, సభలూ, సమావేశాలు ఉన్నా రోజుకు కనీసం గంట సేపైనా నూలువడికేవారు. అలా వడికిన నూలుతో తయారైన ఖద్దరు వస్త్రాలను ధరించేవారు. ఖద్దరంటే ఆధునిక రాజకీయనా యకులు ధరించే సిల్కు ఖద్దరు కాదు,ముతక ఖద్దరు వస్త్రాలనే ఆనాటి యోధులు ధరించేవారు. ముతక ఖద్దరు ధరించి నిరాడంబర జీవనం సాగించడం వల్లనే కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు పుచ్చలపల్లి సుందరయ్యకు కమ్యూనిస్టు గాంధీ అనే పేరు వచ్చింది.గాంధీజీ స్వాతంత్రోద్యమంలో రాజమండ్రి, కాకినాడ, రాజోలు,దోసకాయలపల్లి, సీతాన గరం,గుం టూరుజిల్లాలో చెరుకుపల్లి మండ లంలోని పలు గ్రామాల్లో పర్యటిం చారు. స్వామి సీతారామ్‌గా పేరొందిన గొల్లపూడి సీతారామశాస్త్రి ఆ గ్రామంలో నెలకొల్పిన గ్రంథాలయాన్ని గాంధీజీ ప్రారంభిం చారు.గాంధీజీ పాదస్పర్శతో ఎన్నో ప్రాంతాలు పునీతమైనాయి. ప్రజల్లో శాంతి, సత్యం,అహింస సిద్ధాంతాలు పరివ్యాప్తమ య్యాయి.గాంధీజీ బోధనలు ఆరోజుల్లో ఎంతో మందిని ఉత్తేజ పర్చాయి. గాంధీజీ ప్రభావంతో వాడవాడలా ఖద్దరు ఉత్పత్తి కేంద్రాలు, తేనెటీగల పెంపకం కేంద్రాలు వెలిశాయి. గ్రామాల్లో ముఖ్యంగా,హరిజన వాడల్లో పర్యటించి వారని జాగృతం చేసేవారు.అవిద్యను పారద్రోలేందుకు విస్తృతంగా ప్రచారం చేసేవారు. వయోజనులకు రాత్రివేళల్లో విద్యా బోధన గరిపేవారు.

కోల్‌కతా మీదుగా రైలులో గాంధీజీ మద్రాసుకు వెళ్తున్నప్పుడు అన్ని రైల్వే స్టేషన్లలోనూ ఆయనకుప్రజలు ఘనస్వాగతం పలికారు. అలా రాజమండ్రి,తాడేపల్లి గూడెం,ఏలూరు, విజయ వాడ,ఒంగోలు, నెల్లూరు తదితర నగరాల్లో గాంధీజీ దర్శనం కోసం రైల్వే స్టేషన్‌ల వద్ద పడిగాపులుకాచేవారు. రైలు ఫ్లాట్ ఫారాలే వేదికలుగా గాంధీజీ ప్రజలనుద్దేశించి ప్రసంగిం చేవారు.గాంధీజీ మాదిరిగానే తెలుగు రాష్ట్రా ల్లో బిపిన్ చంద్రపాల్,నేతాజీ సుభాస్ చంద్రబోస్‌వంటి యోధులు కూడా బెంగాల్ నుంచి తమిళనాడుకు వెళ్తూ మార్గమధ్యంలో మజిలీ చేసేవారు. వారి ప్రసంగాలను వినేందుకు ఎముకలు కొరికేచలిని సైతం లెక్క చేయక ప్రజలు రాత్రి ఎంత పొద్దుపోయినా నిరీక్షించేవారని ఆంధ్రకేసరి టంగుటూరుప్రకాశం పంతులు గారికి పార్లమెంటరీ కార్యదర్శిగా వ్యవహరించిన క్రొవ్విడి లింగరాజుతెలిపారు.

పాల్ చౌక్

రాజమహేంద్రవరానికి బిపిన్ చంద్రపాల్ వచ్చినప్పుడు ప్రస్తుతం తాలూకా ఆఫీసు కు ఎదురుగాఉన్న మైదానంలో ఆయన ప్రసంగించారు.దాంతో ఆ మైదానానికి పాల్ చౌక్ అని పేరు స్థిరపడింది.ఆ పాల్ చౌక్ కబ్జాలకు గురి కావడంతో అది ఎక్కడ ఉందో ఇప్పుడు వెతుక్కోవాలి. అలాగే, మునిసిపల్ కార్పొరేషన్ ఎదురుగా గల సుబ్రహ్మణ్య మైదానం కూడా కబ్జాలకు గురై పేరుకి మాత్రం మైదానంగా మిగిలింది. స్వాతంత్ర్యయోధులకు ఎంతో స్ఫూర్తినిచ్చిన భవనాలు,ప్రదేశాలు ఉభయగోదావరి జిల్లాల్లో చాలా ఉన్నాయి. ఆత్రేయపురంలో డొక్కా సీతమ్మ అనే వితంతువు స్వాతంత్ర్య సమరయోధులు ఎప్పుడు వచ్చినా అన్నం పెట్టేవారు. నిరతాన్నదాతగా ఆమె ప్రసిద్ధులయ్యారు.

సీతానగరం ఆశ్రమం ప్రశస్తి

సీతానగరం ఆశ్రమానికి అంత ప్రాశస్త్యం రావడానికి ప్రధాన కారణం ఆ ఆశ్రమాన్ని గాంధీజీ రెండు సార్లు సందర్శించడమే.ఆ ఆశ్రమంలో అడుగు పెట్టగానే ఎంతటి పాషాణులైనా దయార్ద్రులుగా మారిపోతారన్న నమ్మకమే కాదు,అలా జరిగిన ఉదంతాలు ఉన్నాయని డాక్టర్ ఏబీ నాగేశ్వరరావుగారిని ఉటంకిస్తూ ఆంధ్రకేసరి యువజన సమితి వ్యవస్థాపకుడు వైఎస్ నరసింహారావు తెలిపారు.శ్రీకాకుళంలో సర్దార్ గౌతులచ్చన్న, విశాఖలో తెన్నేటి విశ్వనాథం, కాకినాడలో బులుసు సాంబ మూర్తి,విజయవాడలో కాశీనాథుని నాగేశ్వర రావు, కాళేశ్వ రరావు వంటి యోధులు గాంధీజీకి స్వాగతస త్కారాలు అందించిన వారిలో ఉన్నారు. గాంధీజీ సందర్శించిన ప్రతి ప్రాంతాన్నీ పుణ్య క్షేత్రంగా పరిగణించేవారు. ఊరూరా గాంధీనగర్‌లు, గాంధీ పురాలు వెలిశాయి.

గాంధీ బొమ్మ సెంటర్‌ఃతెలుగునాట చాలా నగరాలు, పట్టణాల్లో గాంధీ బొమ్మ సెంటర్లు ఉన్నాయి. గాంధీజీ పట్ల జనంలో ఉన్న ఆరాధనా భావానికి ఈ విగ్రహాలు నిలువెత్తుని దర్శనాలు. అలాగే,గాంధీజీ వేషధారులుదాదాపు అన్ని నగరాలు, పట్టణాల్లో కనిపిస్తుంటారు.

గుంటూరు జిల్లాలో

గాంధీజీ నిర్వహించిన సత్యాగ్రహాల్లో తెలుగువారు ఎక్కువ మంది పాల్గొన్నారు. జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య కృష్ణాజిల్లాకు చెందిన వారే.అలాగే, గుంటూరు జిల్లాల్లో చీరాల,పేరాల,పెదనందిపాడు, కృష్ణా జిల్లాలో పరిటాల తదితర ప్రాంతాల్లో సత్యాగ్రహాలు, పన్నుల నిరాకరణ ఉద్యమాలు జరిగాయంటే అదంతా గాంధీజీ ప్రేరణే.

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గాంధీజీ సిద్ధాంతాలను తుచ తప్పకుండా పాటించిన యోధుడు.ఆయన గాంధీజీ పట్ల ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండేవారు. ఒకసారి ఆయనపై గాంధీజీకి పట్టాభి సీతారామయ్యగారు ఫిర్యాదు చేస్తే,మీరు మీ బోధనలు, మార్గాలను మార్చుకున్నారేమో కానీ, మాకు మాత్రం అవే శిరోధార్యాలు. మీబోధనలను పాటించడమే తప్పయితే చెప్పండి సరిదిద్దుకుం టామని ప్రకాశంగారుఅనే సరికి గాంధీజీ వెనక్కి తగ్గారనీ, ప్రకాశం గారి ధీరోదాత్తత గురించి చెబుతూ లింగరాజుగారు ఓ సందర్భంలో వివరించారు. అలాగే,నెల్లూరు,గూడూరు ప్రాంతాల్లోనూ, అటు కర్నూలు,అనంతపురం ప్రాంతాల్లోనూ గాంధీజీ అనుయాయులు అనేక మంది ఆయన ప్రచార కార్యక్రమాల్లోపాల్గొన్నప్పటికీ ఆయన సిద్ధాంతాలను పాటించే విషయంలో ఎన్నడూ రాజీ పడలేదు.విజయవాడలో పిడబ్ల్యుడి గ్రౌండ్స్‌కి స్వరాజ్య మైదానం అనే పేరు రావడానికి గాంధీజీ ప్రేరణతో ఆ ప్రాంతంలో స్థానికులు సత్యాగ్రహాలు, ఉద్యమాలు నిర్వహించడమే కారణం.

గాంధీ కొండ

విజయయవాడలో గాంధీకొండ ఉంది.ఆ కొండపై గాంధీజీ ఆంధ్రప్రాంతం సందర్శించిన నాటి ఫొటోల ప్రదర్శన,స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి అద్దం పట్టే పలు రకాల వస్తువులు ఉంటాయి.ఈ నాటి తరానికి ఆంధ్రప్రదేశ్‌తో గాంధీజీకి ఉన్న సాన్నిహిత్యాన్నితెలియజేయడానికి ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. గాంధీజీ యుగంలో అడవి గాచిన మల్లెలు శీర్షికతో ఆరోజుల్లో గాంధీజీకి సన్నిహితంగా మెలిగిన తెలుగు యోధుల గురించి దశిక సూర్యప్రకాశరావు నలభైఐదేళ్ళ క్రితం ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో వారంవారం ఒక వ్యాసం ప్రచురించేవారు.తెలుగునాట గాంధీజీ నడయాడిన ప్రదేశాల గురించి, అపురూపమైన ఛాయాచిత్రాలతో ప్రతిఆదివారం వెలువరించి భావితరాలనుఉత్తేజ పర్చేవారు.

అవనిగడ్డలో గాంధీ క్షేత్రం

గాంధీజీ సిద్ధాంతాలను జీవితాంతం ప్రచారం చేసిన మాజీ మంత్రి, దివిసీమ నాయకుడు దివంగత మండలి వెంకటకృష్ణారావు అవనిగడ్డలో గాంధీజీ క్షేత్రాన్ని నెలకొల్పారు. అక్కడ గాంధీజీ సిద్ధాంతాల గురించి యువతరానికి ప్రబోధం చేశారు. ఎంతో మంది స్వాతంత్ర్య యోధులను ఆహ్వానించి ఉపన్యాసాలు ఇప్పించారు.అవనిగడ్డ దివిసీమకు ప్రధాన కేంద్రమైనప్పటికీ ముందుగా గుర్తుకు వచ్చేది గాంధీజీ క్షేత్రం.అలాగే, చీరాలలోనూ,ఇతర ప్రాంతాల్లో గాంధీజీ ఆశ్రమాలు పని చేశాయి. కృష్ణా జిల్లాలో ఘంటశాల, శ్రీకాకుళం ప్రాంతాల్లోనూ, జగ్గయ్యపేట,పరిటాల ప్రాంతాల్లోనూ బ్రిటిష్‌పాలకుల నిబంధనలు ఉల్లంఘించి జెండా వందనాలు, స్వాతంత్ర్యోద్యమం గురించి విస్తృతమైన ప్రచారాలు నిర్వహించారు.ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఖిల్లా అయినప్పటికీ,జమలాపురం కేశవరావువంటి యోధులు గాంధీజీ సిద్ధాంతాలను ప్రచారం చేశారు.

గాంధీ టోపీ అంటే మక్కువ

ఖద్దరు వస్త్రాల ధారణ, గాంధీ టోపీ అంటేఆరోజుల్లో అందరికీ మక్కువ ఉండేది. నిజాం పాలనలో ఉన్న ఖమ్మం,నల్లగొండ జిల్లాల్లో కూడా స్వాతంత్ర్యోద్యమ సభలూ,సత్యాగ్రహాలు జరిగేవి.

రాయలసీమలోనూ

రాయలసీమలో కూడా స్వాతంత్ర్య సమర ఘట్టాలు ప్రఖ్యాతి గాంచినవే. పప్పూరి రామాచార్యులు,కల్లూరి సుబ్బారావు, తాళ్లపాక నారాయణాచార్యులు వంటి యోధులు,సాహితీ వేత్తలు తమ కవితల ద్వారా జనాన్ని జాగృతం చేశారు. గాంధీజీ ప్రభావం ఇతర రాష్ట్రా ల్లో కన్నా తెలుగు రాష్ట్రా ల్లో ఎక్కువగా ఉండేది.అందుకు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు, బులుసు సాంబ మూర్తి,దుర్గాబాయ్ దేశముఖ్, వంటి యోధులు విస్తృతంగా నిర్వహించిన ప్రచారమే కారణం.

నేతాజీ అభిమానులు

గాంధీజీతో పాటు నేతాజీ సుభాస్ చంద్రబోస్‌ని అభిమానించి ఆరాధించిన యోధులు ఆరోజుల్లో ఎంతో మంది ఉన్నారు.వారిలో మద్దూరి అన్నపూర్ణయ్య ప్రథములు. స్వాతంత్ర్యోద్యమంలో 14 సంవత్సరాలు జైలు జీవితాన్ని గడిపిన యోధుడు ఆయన. అలాగే, దేవత శ్రీరామమూర్తి,ముదిగంటి జగ్గన్న శాస్త్రి, పారుపూడి తదితర కుటుంబాలకు చెందిన వారు ఉద్యమాల్లో పాల్గొ న్నారు . పలుచోట్ల గాంధీజీ స్థూపాలు ఉన్నాయి. ఆరోజుల్లో గాంధీజీ విగ్రహాలు మాత్రమే ఉండేవి.ఇప్పుడు దివంగతనాయకులకే కాకుండా, మన మధ్య తిరుగుతున్న వారికి కూడా విగ్రహాలను ప్రతిష్ఠింపజేయడం చర్చనీయాంశం అయింది.

మాలపిల్ల

అంటరానితనం నిర్మూలన గాంధీజీ సిద్ధాంతాల్లో ప్రధానమైనది. అందుకోసం గూడవల్లి రామబ్రహ్మంగారు మాలపిల్ల చలనచిత్రాన్ని నిర్మించి విస్తృతంగా ప్రచారం చేశారు.ఆరోజుల్లో అది విప్లవాత్మకమైన చర్య. అదే స్ఫూర్తితో చాలా చలన చిత్రాలు వచ్చాయి. సారా నిషేధాన్ని ప్రచారం చేయడం కోసం కల్లుమానండోయ్ జనులారా కళ్ళు తెరవండోయ్ అనే గీతాలు కూడా విస్తృతంగా ప్రచారం అయ్యాయి.

మాకొద్దీ తెల్లదొరతనము

జాతీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ మాకొద్దీ తెల్లదొరతనమంటూ రాసిన గీతాలు జాతీయ భావ వ్యాప్తికి ఎంతో దోహదం చేశాయి.స్వాతంత్ర్యోద్యమంలో భాగంగానే ఆరోజుల్లో గ్రంథాలయోద్యమం, తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం ఏక కాలంలో జరిగాయి. గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య,పాతూరి నాగభూషణం ప్రభృతులు జాతీయ భావాల వ్యాప్తికి కృషి చేశారు.ఆదర్శ ప్రజాప్రతినిధులు తెన్నేటి విశ్వనాథం,వావిలాల గోపాల కృష్ణయ్య ప్రభృతులు కూడా స్వాతంత్ర్యోదమంలో కీలక భూమిక వహించారు.

మహిళల పాత్ర

స్వాతంత్రోద్యమంలో మహిళల పాత్ర తక్కువేమీ కాదు .గుమ్మిడిదల కుటుంబానికిచెందిన దుర్గాబాయ్,కనపర్తివరలక్ష్మమ్మ,డొక్కా సీతమ్మ స్వాతంత్ర్య భావాల వ్యాప్తికి ఎంతో కృషి చేశారు.దారులువేరైనా లక్ష్యం ఒక్కటే అన్న రీతిలో తెలంగాణలోనల్లగొండ జిల్లాలో నిజాం వ్యతిరేక పోరాటంలో అనేకమంది మహిళలు పాల్గొన్నారు.వారిలో చాకలిఐలమ్మ, మల్లు స్వరాజ్యంవంటి వారు ముఖ్యులు.వీరంతా స్వాతంత్రోద్యమానికి బాసటగానిలిచారు.

- అనంత పద్మనాభ స్వామి

గార్ల జాగీరులో తొలి సత్యాగ్రహి

(11వ పేజీ తరువాయి)

ఇలావుంటే ఆగస్టు 8, 1947 వచ్చింది. పక్కవూరి పెద్ద మనిషి రాధాకృష్ణ చేతిలో ఆంధ్రప్రభ దినపత్రిక వుంది. దాన్నాయన తనతో తీసుకుపోతున్నాడు. పండితాపురంలో పోస్టాఫీస్ లేదు కాబట్టి పేపర్లు రావప్పట్లో. ఎప్పుడో పేపర్ దొరికితే అదొక పండుగలాంటిది. ఒక్క పేపర్ చదువొచ్చిన వాళ్లంతా చదివేవారు.రాధాకృష్ణ సీతారామయ్య పొలం నుండే కాలిదారిన వెళ్తున్నాడు. నమస్కారమండీ అన్నాడీయన. మీ చేతిలో పేపరిస్తారా? అని అడిగాడు. తన వూరు వాళ్లు ఈ పేపర్ కొరకు ఎదురు చూస్తుంటారని ఇవ్వలేనని సమాధానం వచ్చింది. తాను చదివి ఆయన ఊరుకు తీసుకొచ్చి ఇస్తానని మాటిచ్చాడు సీతారామయ్య. ఎలాగో ఒప్పించి పేపర్ తీసుకు న్నాడు.

మెయిన్ పేపర్ మెయిన్ హెడ్డింగ్ చదివాడు. తెలంగాణాలో సత్యాగ్రహ మహోద్యమ విజృంభణ... వాడవాడలా మువ్వన్నెల జండా రెపరెప... నిజాం గుండెల్లో గుబులు... మధిరలో జమలా పురం అరెస్టు.. అని ఉంది. అది చదవగానే సీతారామయ్యకు పెద్ద ఉత్సాహం కలిగింది. తనకు కూడా సత్యాగ్రహం చేయాలని సంకల్పం కలిగింది. ఆయన గ్రామం ఇల్లెందు తాలూకా... గార్ల జాగీరులో వుంది. అంతకు ముందు ఆ ఊళ్లో సత్యాగ్రహం చేసినవాళ్లెవరూ లేరు. ఆయనే మొదటి వాడవుతాడు. అందులో ఇంకా అప్పటికాయన మైనరే! పద్దెనిమిదో సంవత్సరం నడుస్తోంది. ఇదిలా ఉండగా ఆగస్ట్ 15, 1947 న స్వామీ రామానంద తీర్థ సత్యాగ్రహానికి మరో పిలుపిచ్చాడు. తక్షణమే పండితాపురంలో సీతారామయ్య సత్యాగ్రహం చేశాడు. సహచర విద్యార్థులను ఉపాధ్యాయుడి అనుమతితో తరగతులనుంచి బయటకు తీసుకొచ్చి, కొందరు గ్రామస్తులతో కలిసి, ఒక ఊరేగింపు తీసి మువ్వన్నెల జండా ఎగురవేసి సత్యాగ్రహం చేశాడు. విప్లవ భావాల టీచర్ కూడా సహకరించాడు.

బ్రిటిష్ ప్రభుత్వ గార్ల జాగీర్ పోలీసులొచ్చి అరెస్ట్ చేశారు ఆయన్ను. అప్పట్లో ఖమ్మం ఖిలా కూడా జాగీరే. అలాగే ఖిలా చుట్టుపక్కల ప్రాంతమంతా జాగీరే. అక్కడ ఏదన్నా నేరం జరిగితే గార్ల జాగీర్ కోర్టుకు రావాల్సిందే. గార్ల జాగీరుకు కలెక్టర్ వేరే. వాళ్లప్పుడు తాలూకా గార్ల, జిల్లా గార్ల అని రాసుకునేవాళ్లు. వరంగల్ జిల్లాలో భాగంగా చెప్పుకోలేదు. దానికి పాలనంతా వేరే. పోలీసు అడ్మినిస్ట్రేషన్ వేరే. అంతా జాగీర్ అడ్మినిస్ట్రేషన్. అది ఖానం జంగ్ బహద్దర్‌ది. అతడు నిజాం ప్రైవేట్ సెక్రటరీ కూడా. అతను నిజాంకు సలహా కూడా ఇచ్చాడు. స్వతంత్రంగా వుండవద్దు... యూనియన్‌లో కలుద్దామని. నిజాం వినిపించుకోలేదు. జాగీర్దారైనా అతడికి జాతీయ భావాలుండేవి.

గార్ల జాగీర్ కస్టడీలో పెట్టారు సీతారామయ్యను. ఒకరోజు పోలీసు కానిస్టేబుల్ వచ్చి మెజిస్ట్రేట్ దగ్గరకు తీసుకుపోయాడు. పోగానే మెజిస్ట్రేట్ సీతారామయ్యను కుర్చీలో కూచోబెట్టి, చపాతీలు పెట్టి, ఖైమా పెట్టి తినమన్నాడు. (దాశరథి రంగాచార్య కూడా గార్ల జాగీరులోనే). కేసు ఎల్లుండి వస్తుంది. క్షమాపణ (మాఫీ మాంగో) కోరు అని సలహా ఇచ్చాడు. మాఫీ నై మాంగేతో, ఆయిందా నై కర్తే బోలో... ఛోడ్ దేతాహూం అన్నాడు. ఆయిందా నై కర్తే బోల్కే నై బోల్తా... మాఫీ భీ నై మాంగ్తా... మై గల్తీ నై కరేతో మాఫీ మాంగ్ నే కా సవాల్ కహా హై? అన్నాడు సీతారామయ్య. మూడోనాడు కోర్టుకు మేజిస్ట్రేట్ దగ్గరకు తీసుకుపోయారు. షాహీ ఖాన్దాన్ ముర్దాబాద్.. నిజాం నవాబ్ ముర్దాబాద్ అని అన్నాడని సాక్షి అబద్ధం చెప్పాడు. ఎక్కువ కఠిన శిక్షపడే విధంగా సాక్ష్యం చెప్పాడు. గాంధీజీకి జై.. సుభాష్ బోస్ కీ జై అని అన్నాం కాని ముర్దాబాద్ అన్న మాటే రాలేదని సీతారామయ్య అన్నాడు. నేరం చేశావా? అని అడిగాడు న్యాయమూర్తి. నేరం చేయలేదు... సత్యాగ్రహం చేశాను అని జవాబిచ్చాడు. ఆర్నెల్ల జైలుశిక్ష విధించినట్లు తీర్పిచ్చాడు న్యాయమూర్తి. వరంగల్ సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు. అక్కడ కూడా ఓ ముప్పై మందిని వెంటేసుకుని ఆందోళన చేసాడు. ఆహారం బాగాలేదని గొడవ చేశారు. ఆ ముప్పైమందిని ఔరంగాబాద్ సెంట్రల్ జైలుకు పంపమని రాశారు. వరంగల్ నుంచి అందర్నీ ఔరంగాబాద్‌కు మార్చారు. సబ్ జైలులో, చాలా చిన్న గదిలో నిల్చోడానికి కూడా చోటులేని విధంగా వీళ్లనుంచారు. మూత్ర విసర్జన చేయాలంటే గోడకు అభిముఖంగా ఇతరుల మీద పడుతుంటే చేయాల్సిందే! పొద్దున్నే తీసుకుపోయి ఔరంగాబాద్ సెంట్రల్ జైల్లో పడేశారు. ఫిబ్రవరి 29, 1948న ఆర్నెల్ల శిక్ష పూర్తి అయిన తరువాత విడుదల చేశారు.

పోలీసుల్లో కూడా ఆ రోజుల్లో మంచి వాళ్లుంటారని చెప్పడానికి ఒక ఉదాహరణ ఇచ్చారు. విడుదల చేసినప్పుడు సీతారామయ్యకు పాపటపల్లికి టికెట్ కొన్నారు. రైల్వే స్టేషన్‌కు చేరుకున్న కాసేపటికి, ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్ పాపటపల్లి వెళ్లడానికి సికింద్రాబాద్‌కు, ఔరంగాబాద్ మీదుగా పోవద్దని, బొంబాయి పొమ్మని సలహా ఇచ్చాడు. మన్మాడ్ మీదుగా పొమ్మన్నాడు. ఆయన దగ్గర పైకం లేదు. మన్మాడ్ పోయే రైల్లే బగర్ టికెట్ చలేజావ్ అన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టర్.అలానే చేసిన ఆయన్ను చెకింగ్ వాళ్లు మన్మాడ్‌లో పట్టుకున్నారు. వాళ్లు ఆయనను డబ్బులడగలేదు. సెకండ్ క్లాస్‌లో కూచోబెట్టి బొంబాయిలో వదిలిపెట్టారు. బొంబాయి బజార్లో ఒక గుడ్డల దుకాణంలో గాంధీ టోపీతో ఒక మార్వాడీ కనిపించాడు. మార్వాడీ దగ్గరకు పోయి దండం పెట్టి తన పరిస్థితిని వివరించాడు. వెంటనే గుమాస్తాను పిల్చి పహలే ఖానా ఖిలా ఏ బచ్చేకో అన్నాడు ఆయన. మంచి భోజనం పెట్టించాడు. ఎక్కడికి పోవాలని అడిగి, విజయవాడకని తెలుసుకుని టికెట్ తెప్పించి ఇచ్చి, వంద రూపాయలు జేబులోపెట్టాడు మార్వాడీ సేట్. ఆ రోజుల్లో దేశభక్తులంటే అలా వుండేవారు. అక్కడ నుంచి విజయవాడలో ఉన్న హయగ్రీవాచారి దగ్గరకు పోయాడు. అప్పటికే ఆయన దగ్గర ఈయన రికార్డుంది. ఆయనెలా అరెస్టైంది కూడా ఉంది. హయగ్రీవాచారి ఆయన్ను అక్కడే వుండమని, భోజ నాలు ఏర్పాటు చేశారు. అక్కడనుండి ఒక కాంపుకు పొమ్మన్నారీయనను. అలాగే చేశాడు. సీతారామయ్య ఎక్కడికి పోయిందీ, ఏం చేస్తున్నదీ, ఆయన కుటుంబ సభ్యులకెవ్వరికీ తెలియదు.

ఆ తరువాత పోలీస్ యాక్షన్ అయింది. సీతారామయ్య ఇల్లెందు, కారేపల్లి కాంపుల్లో తిరుగుతూ వుండేవాడు. ఇండియన్ యూనియన్ పోలీసొచ్చింది. వాళ్లేమో కమ్యూనిస్టులను ఆడా మగా తేడా లేకుండా కొట్టేవాళ్లు. సీతారామయ్య లాంటి వాళ్లు ఫలానా వాళ్లు కమ్యూనిస్టులు కాదంటే వదిలిపెట్టేవాళ్లు.

ముచ్చర్ల కాంపు, లింగాల కాంపులో పనిచేసుకుంటూ పోలీసుల వెంట పోయేవాడీయన. కాంగ్రెస్ వాళ్లను రక్షించుకునే ప్రయత్నం చేసేవాడు. ఔరంగాబాద్ జైల్లో వుండగా అక్కడున్న అడ్వకేట్ల ద్వారా కొంచెం ఇంగ్లీష్ మాట్లాడడం నేర్చుకున్నాడు. క్రమేణా ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ప్రైవేట్‌గా మెట్రిక్యులేషన్ చదివి 1951 లో పాసయ్యారు. దాశరథి రంగాచార్య రాసిన జీవనయానం ఆత్మకథలో సీతారామయ్య చదువు గురించి రాశారు. దాశరథిది కూడా అప్పట్లో సీతారామయ్య పరిస్థితే. ఆయనా ఈయనతో పాటే పరీక్ష రాయడానికి వచ్చి డబ్బులు లేకపోయిన సందర్భంలో ఇరువురూ సహాయం చేసుకున్నారు. తన దగ్గరున్న కొంచెం డబ్బులతోనే, ఒకపూట తినీ తినక సీతారామయ్య, దాశరథికి సహాయం చేశాడు. తిరుగు ప్రయాణం టికెట్లిప్పించాడు. తనకున్న అనుభవం ప్రకారం, కాంగ్రెస్‌పార్టీ కేవలం పాతిక శాతం మాత్రమే స్వాతంత్ర్యం రావడానికి కారణమంటారు. ముప్పై ముప్పై అయిదు శాతం సుభాష్ చంద్రబోస్ కారణమంటారు. మిగిలింది ఇతర విప్లవ వీరుల వల్ల వచ్చిందని ఆయన అభిప్రాయం. కాంగ్రెస్ పార్టీ వల్లనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనడం వాస్తవం కానేకాదంటాడాయన. ఇదంతా చారిత్రక సత్యం అని కూడా అంటాడాయన.ఆంధ్రా మెట్రిక్ రాసిన తరువాత ఏం చెయ్యాలన్న ఆలోచనలో పడ్డాడు.

ఇంటర్మీడియెట్‌లో చేరడం సీతారామయ్యకు ఇష్టంలేదు. టీచర్ ఉద్యోగంలో చేరాడు. అప్పుడు అరవై ఎనిమిది రూపాయల హాలీలు జీతం వుండేది. 1956లో ప్రైవేట్‌గా బిఏ పాసయ్యారు. చాలాసార్లు అక్కడికీ ఇక్కడికీ ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. తనకు 1972లో శాసనసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ దొరకలేదు. దొరకనందుకు బాధపడ్తున్నావా అని అడిగిన జలగం వెంకళరావుకు సమాధానంగా, తానెప్పటికైనా ఎమ్మెల్యే అయి తీరుతానని స్పష్టం చేసాడు. ఆయన చెప్పినట్లే 1978 ఎన్నికల్లో ఖమ్మం జిల్లా సుజాత్‌నగర్ నుంచి శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. మర్రి చెన్నారెడ్డి వీరికి టికెటిచ్చారు. చెన్నారెడ్డితో సీతారామయ్యకు మంచి సంబంధాలుండేవి. ఆయనకు వీరాభిమానీయన. క్రియాశీలక రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్న తర్వాత పూర్తికాలం అడ్వొకేట్‌గానే పనిచేశారు. మంచిపేరు తెచ్చుకున్నారు. పదిమందికీ అవసరానికి వీలైనంత సహాయపడడం ఆయనలోని సుగుణం. జీవితాం తం అలానే ఉండాలని ఆయన కోరిక.

వనం జ్వాలా నరసింహారావు

అండమాన్ ఆత్మఘోష



భారత ప్రధాన భూగానికి 700 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి బంగాళాఖాతం మధ్యలో గల అండమాన్,నికోబార్ దీపాల సమూహం.... ఆగస్ట్ 15,1947 కంటే ముందుగానే బ్రిటీష్ రాజ్యం నుంచి స్వాతంత్ర్యం పొందిన ప్రాంతం. ముందుగా మన జాతీయజెండా అక్కడే రెపరెపలాడుతూ ఎగిరిందని చాలామందికి తెలియదు.

అండమాన్ విషయంలో బ్రిటీష్ వాళ్లే అనుకుంటే వాళ్లను మించి జపాన్ వాళ్లు సాగించిన దౌర్జన్యాలు అన్నీఇన్నీ కావు. ఆక్సిస్ కూటమిలో భాగస్వాములైన జపాన్ ..ఆసియాలో తిష్టవేసుకు కూర్చున్న యూరప్ దేశాలన్నింటిని తరిమేస్తూ వచ్చింది. సిం గపూర్ ,బర్మా వంటి ప్రాంతాలను అప్పటికే స్వాధీనం చేసుకుంది. ఇక బ్రిటీష్ ఇండియాను కూడా స్వాధీనం చేసుకోవడమే తరువాయిగా పెట్టుకుంది. కరెక్ట్‌గా ఆ టైమ్లోనే బోస్ తన చతురతో... బ్రిటీష్ రాజ్యానికి వ్యతిరేకంగా... ఆక్సిస్ కూటమితో ఓ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం అండమాన్ నికోబార్ దీవులను జపాన్ స్వాధీనం చేసుకుని మనకు అప్పగించాలి. శత్రువుకు శత్రువు మిత్రుడనే ఆలోచనతో బోస్ ఆ రకమైన ఒప్పందం చేసుకున్నాడు. అప్పటికే ఇంగ్లాండ్‌తో జపాన్‌కు శత్రుత్వం ఉండడాన్ని కూడా బోస్ తన పరిగణలోకి తీసుకునే ఈ నిర్ణయం తీసుకున్నాడు.

అండమాన్ దీవులను అనుకున్నట్లుగానే కేవలం మూడు గంటల వ్యవధిలోనే బ్రిటీజ్ వారి చెరనుంచి జపాన్ ట్రూప్‌లు స్వాధీనం చేసుకున్నాయి. అక్కడి లోకల్ జనాలు కూడా జపనీస్ ట్రూప్స్‌కు స్వాగతం చెప్పాయి. వెంటనే చంద్రబోస్ అండమాన్ చెరసాలలో మగ్గుతున్న ఖైదీలను విడిపించి వారందరినీ ఇండియన్ నేషనల్ ఆర్మీలోకి రిక్రూట్ చేసుకున్నాడు. బోస్ ముందుగా చెప్పినట్లు.. డిసెంబర్ 30 ,1943న అండమాన్లో మన త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి భారతీయుల్లో స్వరాజ్య కాంక్ష మరింత రగిల్చాడు. అలాగే ఇండియన్ నేషనల్ ఆర్మీలో లోకనాథాన్ని గవర్నర్ గా నియమించాడు. అలాగే ఈ రెండు ద్వీపాలకు చంద్రబోస్ షాహీద్ ,స్వరాజ్‌లుగా నామకరణం చేశాడు

అయితే అండమాన్‌లో పైకి మన ఆర్మీ పరిపాలన సాగిస్తున్నా.. వెనుక నుంచి పెత్తనం చేసే బాధ్యతను మాత్రం జపాన్ తీసుకుంది. ఆ టైమ్లోనే జపనీస్ ట్రూపులు అదును చూసి అండమాన్ ప్రజలపై దౌర్జన్యాలు చేయడం,ఇష్టానుసారంగా రెచ్చిపోవడం మొదలుపె ట్టాయి. ఆ ప్రాసెస్‌లో ఎంతోమంది మహిళలను మానభంగాలు చేసారు. అక్కడితో ఊరుకోకుండా ఊచకోతలు కోసారు. వీరి బాధితుల్లో జుల్ఫికర్ ఆలీ జపనీస్ ఆర్మీపై ఎయిర్‌గన్‌తో తిరుగుబాటు చేసాడు. అంతే జపాన్ ఆర్మీ మరింత రెచ్చిపోయి ఆలీని అప్పగించాలని స్థానికులను మరింతగా చిత్రహింసలు పెట్టడం మొదలుపెట్టింది. జపాన్ ఆర్మీ హింసలకు తాళలేక కొందరు జుల్ఫికర్ ఆలీని జపనీస్‌కు అప్పగించడంతో వారు అతన్ని కాల్చిపారేశారు.

ఆ సమయంలోనే మన ఇండియన్ నేషనల్ ఆర్మీకి చెందిన పంజాబి రచయిత దివాన్‌సింగ్ లోకల్ ప్రజలకు అండగా నిలిచి వారికి ధైర్యాన్ని నూరిపోశాడు. దీంతో ఆగ్రహించిన జపనీస్ ట్రూపులు దివాన్‌ను అదుపులోకి తీసుకుని జనవరి 1944 వరకు అనగా 82రోజులు పాటు అతన్ని చిత్రహింసలు పెట్టి... చంపేసాయి. అదే సమయంలో ఇతనితో పాటు మరో 44మంది భారతీయులు జపాన్ ఆర్మీ చేతిలో చిత్రహింసలు అనుభవించి చనిపోయారు. అనధికార లెక్కల ప్రకారం జపాన్ ఆర్మీ అండమాన్‌లో తిష్టవేసుకుని ఉన్నంత కాలం ఎంతలేదన్నా రెండువేల మందిని పొట్టన పెట్టుకుంది.

ఇక్కడ విచిత్రమేమిటంటే... జపనీస్ భారతీయులను పెడుతోన్న హింసలను ఏనాడు సుభాష్ చంద్రబోస్‌కు తెలియకుండా చేసినట్లుగా తెలుస్తోంది. అయితే బ్రిటీష్ రాజ్యం జపాన్‌కు బోస్ అమ్ముడైపోయాంటూ కొత్త పల్లవి అందుకుంది. బోస్ వ్యతిరేక శక్తులు కూడా దీనిని బలపరిచే ప్రయత్నం చేశారు. కాని బోస్ నిజాయితీ ఏంటో దేశ ప్రజలకు భాగా తెలుసు. కాని ఆగస్ట్ 18,1945న నేతాజి అదృశ్యమయ్యాక బ్రిటీజ్ గవర్నమెంట్ అండమాన్ దీవులను తిరిగి స్వాధీనం చేసుకుంది. అంటే జపనీస్ అరాచక శక్తుల నుంచిబ్రిటీష్ వినాశకర శక్తులకు అండమాన్‌ను తిరిగిఅప్పగించినట్లయింది.

- సూర్యమ్ కలిదిండి

వెండితెర గుండెల్లో స్వాతంత్య్ర యోధులు...


కొంతమంది కోట్లాది ప్రజల స్వేచ్ఛ కోసం పోరాడారు..
మాతృభూమి సంకెళ్లు తెంచేందుకు ప్రాణమిచ్చారు..
కుటుంబాలను వదిలారు, లాఠీ దెబ్బలు తిన్నారు...
జైలు శిక్షల చిత్ర హింసలు అనుభవించారు..
పుట్టిన మట్టిని తమ త్యాగాలతో పులకింపజేశారు...
అసమాన ధైర్య సాహసాలతో స్వాతంత్య్రం సాధించారు..
ఈ వీరుల త్యాగాలను వెండితెర గుండెల్లో నిలుపుకుంది..
స్వాతంత్య్ర యోధుల జీవితాలను తెరపైకి తెచ్చి తరించింది...


వందలాది పోరాటాల, వేలాది వీరుల, కోట్లాది ప్రజల ఆశలకు రూపం స్వాతంత్య్రం. వెండితెర వినోదాత్మక సాధనమైనా...కొన్నిసార్లు తన కర్తవ్యాన్ని, బాధ్యతను గుర్తుంచుకుంటుంది. స్వాతంత్ర్య వీరుల జీవిత చరిత్రలను తెరకెక్కించి..తన గమనాన్ని సార్థకం చేసుకుంది. భారత స్వేచ్ఛా పోరాటాన్ని అహింసతో నడిపించిన యోధుడు మహాత్మా గాంధీ. ఆయన జీవిత చరిత్రను 'గాంధీ' పేరుతో 1982లో బ్రిటీష్ దర్శకుడు రిచర్డ్ అటెన్‌బరో రూపొందించారు. బెన్‌కింగ్‌స్లే మహాత్ముడి పాత్రలో నటించారు. ఈ చిత్ర నిర్మాణానికి నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్థిక సహాయాన్ని అందించింది. గుజరాత్‌లో గాంధీజీ బాల్యం, దక్షిణాఫ్రికాలో చదువు, ఉద్యోగ జీవితం, అక్కడి భారతీయులకు మద్దతుగా పోరాటం, భారత్‌కు వచ్చాక కాంగ్రెస్‌లో చేరిక, అంచెలంచలుగా భారత జాతీయ కాంగ్రెస్ అగ్ర నేతగా, స్వాంతత్ర్య ఉద్యమానికి సారథిగా మారిన క్రమం...ఇలా మొత్తం మహాత్ముడి జీవితాన్ని ప్రతిబింబిస్తుందీ చిత్రం. అత్యంత సహజసిద్ధమైన చిత్రీకరణతో, పాత్రధారుల ఎంపికతో 'గాంధీ' చరిత్రలో నిలిచిపోయే సినిమా అయ్యింది. దర్శకుడు అటెన్‌బరో, గాంధీ పాత్రధారి బెన్‌కింగ్‌స్లే ఎల్లలులేని ప్రశంసలు అందుకున్నారు.


జీవితాన్ని దేశ సేవకు అంకితం చేసిన నేత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్. 1993లో దర్శకుడు కేతన్ మెహతా పటేల్ జీవితాన్ని 'సర్దార్' పేరుతో తెరకెక్కించారు. పరేష్ రావల్ వల్లభాయ్ పాత్రలో నటించారు. 'సర్దార్' ఆ మహనీయుడి జీవితాన్ని ప్రేక్షకుల కళ్ల ముందుంచింది. దేశ స్వేచ్ఛకు ప్రాణమిచ్చిన మరో నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. ఆయన జీవితాన్ని 'బోస్, ఫర్‌గాటెన్ హీరో' పేరుతో సినిమాగా రూపొందించారు ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్. సచిన్ ఖేద్కర్ నేతాజీ పాత్రను పోషించారు. నేతాజీ బాల్యం నుంచి నాయకుడిగా ఎదిగిన క్రమం, స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్‌తో విబేధాలు, ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు, ప్రపంచ నేతల మద్దతు కూడగట్టేందుకు చేసిన ప్రయత్నాలు, అనూహ్యంగా ఆయన కనుమరుగైన తీరు ఇవన్నీ కథలో చేర్చారు దర్శకుడు. దేశ బంధ విముక్తి కోసం నేతాజీ ఆరాటాన్ని హృద్యంగా చూపించిందీ సినిమా. 13 మే 2005లో 'బోస్, ఫర్‌గాటెన్ హీరో' విడుదలైంది. విప్లవమే జాతి ముక్తికి మార్గమని నమ్మిన దేశభక్తుడు షాహీద్ భగత్‌సింగ్. యవ్వనంలో జీవితాన్ని దేశం కోసం అర్పించిన త్యాగనీయుడు. విప్లవమంటే హింస కాదని...పోరాట సిద్ధాంతమని నమ్మాడు భగత్‌సింగ్. తన స్నేహితులతో కలిసి ఆయన చేసిన సాహసాలు దేశ ప్రజల్లో చైతన్యాన్ని నింపాయి. అజయ్ దేవగణ్ భగత్ సింగ్ పాత్రలో నటించగా...దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషీ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రంలో మొత్తం భారత స్వాతంత్ర్య విప్లవ వీరుల పాత్రలు కనిపిస్తాయి. పీడిత ప్రజల పక్షాన, బ్రిటీష్ అన్యాయాలకు వ్యతిరేకంగా విల్లెత్తిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. నటుడు కృష్ణ ఈ పాత్రను తెలుగు తెరపై అజరామరం చేశారు. ప్రజలకు అల్లూరి గొప్పదనం గుర్తుచేశారు. 1957లో సిపాయి తిరుగుబాటులో మంగల్‌పాండే త్యాగం కనిపిస్తుంది. బెంగాల్ నేటివ్ 34వ పదాతి దళానికి చెందిన సైనికుడు మంగల్‌పాండే. ఈ వీర సైనికుడి జీవిత చరిత్రలో నటించడం అమిర్‌ఖాన్ కల. 'మంగల్ పాండే, ద రైసింగ్' చిత్రంతో ఆ కలను ఎన్నో కష్టాలకోర్చి సాకారం చేసుకున్నాడు అమిర్‌ఖాన్. కేతన్ మెహతా దర్శకత్వం వహించిన ఈ సినిమా దేశం కోసం మన సైనికుల చేసిన సాహసాలను చూపించింది.

చిత్రసీమలో దేశభక్తి గీతాలు...


- వందేమాతరం - లతా మంగేష్కర్ (ఆనంద్ మఠ్, 1952)
- ఆయే మేరే ప్యారే వతన్ (కాబూలీవాలా - 1961)
- మేరే దేష్ కి దర్తీ సోనా ఉగ్లే (ఉప్‌కార్ - 1967)
- దిల్ దియా హై జాన్ బీ దేంగే (కర్మ - 1986)
- భారత్ హమ్కో జాన్ సే ప్యారా హై (రోజా - 1992)
- రంగేదే బసంతీ చోలా (షహీద్ - 1965)
- మా తుఝే సలామ్ - ఏఆర్ రెహ్మాన్ (వీడియో ఆల్బమ్ 1997)


అల్లూరి సీతారామరాజు


మంగళ్ పాండే, ద రైజింగ్


గాంధీ


బోస్, ద ఫర్‌గాటెన్ హీరో


ద లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్


సర్దార్

మహేష్, వంశీ పైడిపల్లి చిత్రం ప్రారంభం



ఓ వైపు స్పైడర్ చిత్రం తుదిమెరుగులు దిద్దుకుంటుండగా, మరోవైపు కొరటాల శివ దర్శకత్వంలో భరత్ అను నేను చిత్రంలో నటిస్తున్నారు మహేష్‌బాబు. కాగా ఆయన నటిస్తున్న ఇంకో చిత్రం సోమవారం ప్రారంభమైంది. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతీ మూవీస్ పతాకాలపై సి.అశ్వనీదత్, దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని అన్నపూర్ణా స్టూడియోలో మొదలైంది. దర్శకులు కె.రాఘవేంద్రరావు, వి.వి.వినాయక్‌లు దర్శకుడు వంశీ పైడిపల్లికి స్క్రిప్టును అందించారు. మహేష్‌బాబు తనయుడు ఘట్టమనేని గౌతమ్ క్లాప్ నివ్వగా, తనయురాలు ఘట్టమనేను సితార కెమెరా స్విచ్చాన్ చేశారు. వంశీ పైడిపల్లి కుమార్తె ఆద్య దేవుని పటాలపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. శిరీష్, లక్ష్మణ్, అశ్వనీదత్‌ల కుమార్తెలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సినీరంగానికి చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేసి, చిత్రబృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని అన్నారు. ఈ చిత్రానికి కథ: వంశీ పైడిపల్లి, హరి, సాల్మన్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: పి.ఎస్.వినోద్.

పాత్రకు ప్రాణం పోయాలి: అర్జున్

ఓ వైపు హీరోగా నటిస్తూనే నటనకు ఎక్కువగా అవకాశం ఉన్న ఇతర పాత్రలను చేస్తున్నానని యాక్షన్ కింగ్ అర్జున్ చెప్పుకొచ్చారు. నితిన్, మేఘాఆకాష్ నాయకానాయికలుగా హను రాఘవపూడి దర్శకత్వంలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిన లై చిత్రం ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో ప్రతినాయకుడిగా నటించిన అర్జున్ సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆయన మాటల్లో...



34 ఏళ్ల ప్రయాణం

1984వ సంవత్సరంలో మా పల్లెలో గోపాలుడు చిత్రం ద్వారా కథానాయకుడిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నేను ఈ 34 ఏళ్ల సినీ ప్రయాణంలో 151 చిత్రాలు చేశాను. నేటికీ హీరోగా నన్ను ప్రేక్షకులు ఆదరిస్తున్నప్పటికీ పాత్ర స్పందింపజేస్తే ఇతర ముఖ్యపాత్రలలో కూడా నటించదలచుకున్నాను. అందులో భాగంగానే ఈ ఏడాది హీరోగా, విలన్‌గా నటించిన నేను తాజాగా అల్లు అర్జున్ కథానాయకుడిగా రూపొందుతున్న నా పేరు సూర్య..నా ఇల్లు ఇండియా చిత్రంలో ఓ విభిన్న పాత్రను పోషిస్తున్నాను. ఇలా ఈ ఏడాది కొత్తరకమైన అనుభూతిని కలిగిస్తోంది. ఎలాంటి పాత్ర చేసినా దానికి ప్రాణం పోయాలన్న ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నాను. హాలీవుడ్ నటులైతే ఓ వైపు హీరోలుగా నటిస్తూనే విలన్‌గా, ఇతర విభిన్న పాత్రలలో నటించేందుకు మొదట్నుంచి మొగ్గుచూపడం తెలియంది కాదు. అయితే మన దక్షిణ భారత సినీరంగంలో ఆర్టిస్టులకు స్టాంపింగ్ వేయడంతో ఇమేజ్ చట్రంలో ఉండిపోతారు. అయితే దానిని బ్రేక్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నా మటుకు నేను దానిని బ్రేక్ చేసే ప్రయత్నంలో భాగంగా హీరోగానే కాకుండా ఇతర పాత్రలను చేస్తున్నాను.

చాలా కోణాలున్న విలన్ పాత్ర

దర్శకుడు హను రాఘవపూడి చెప్పిన కథతో పాటు, నటనకు అవకాశం ఉన్న విలన్ పాత్ర కావడంతో లై చిత్రంలో నటించేందుకు అంగీకరించాను. ముఖ్యంగా నేను నటించిన విలన్ పాత్రలో చాలా కోణాలున్నాయి. స్టైలిష్‌గా ఉండటంతో పాటు విభిన్నంగా ఉండటం వల్ల సినిమాను అంగీకరించే ముందు నాకు నచ్చడమే కాకుండా విడుదల తర్వాత ప్రేక్షకులకు కూడా నచ్చుతోంది. అందరి నుంచి నితిన్‌తో కలిసి లోగడ శ్రీ ఆంజనేయం చిత్రం చేశాను. అప్పుడే అతని అంకితభావం చూశాను. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత కలిసి ఈ సినిమా చేశాం. అంకితభావం విషయంలో అతను ఇప్పటికే అదేవిధంగా ఉన్నాడు.

ఫిట్‌నెస్‌కు కారణం అదీ

లక్షలాది మంది ప్రేక్షకులు మమ్మల్ని వెండితెరపై చూస్తున్నారు. మా మీద నిర్మాతలు బోలెడంత డబ్బు ఖర్చు పెడుతున్నారన్న భయం నాకు ఎప్పుడూ ఉంటుంది. దాంతో పొద్దున్నే నిద్ర లేవాలి. జిమ్ ప్రాక్టీస్ చేయాలన్న వత్తిడి సహజంగానే నాలో ఏర్పడుతుంది. అలా ప్రాక్టీస్ చేయడం వల్లే నేనెప్పుడూ ఫిట్‌నెస్‌గా ఉండటానికి కారణమవుతోంది.

మంచిచెడులు అన్నిరంగాలలో ఉంటాయి

నా కుమార్తె ఐశ్వర్యకు సినీరంగంలోకి రావాలన్న అభిరుచి ఉండటంతో ఆమె కథానాయికగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నాను. తమిళ, కన్నడ భాషలలో నా దర్శకత్వంలో ఆ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే ఐశ్వర్య తమిళంలో ఓ సినిమాలో నటించింది. సినీరంగంలోకి కుమార్తెను ఎందుకు పరిచయం చేస్తున్నావని నన్నెంతోమంది అడిగారు. 34 ఏళ్లుగా నటుడిగా ఉన్న నాకే నా పరిశ్రమపై నమ్మకం లేకపోతే ఎలా? అని వారిని ప్రశ్నించాను. మంచిచెడులు అన్నవి సినీరంగంలోనే కాదు అన్నిరంగాలలో కూడా ఉంటాయి అంటూ ముగించారు.

ప్రేమ ఎంత మధురం.. ప్రియురాలు అంత కఠినం


చంద్రకాంత్, రాధికా మెహరోత్రా

చంద్రకాంత్, రాధికా మెహరోత్రాలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ, థర్డ్ ఐ క్రియేషన్స్ పతాకంపై రఘురాం రొయ్యూరుతో కలిసి గోవర్ధన్.జి. స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం ప్రేమ ఎంత మధురం..ప్రియురాలు అంత కఠినం. కాగా ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బెక్కం వేణుగోపాల్ విడుదలచేశారు. ఈ సందర్భంగా బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ చిత్రం రషెస్ తాను చూశానని, చాలా బావుందని అన్నారు. అమెరికాలో స్థిరపడ్డ గోవర్ధన్ అక్కడ నట శిక్షణ పొందిన వారిని హీరోహీరోయిన్లుగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని చెప్పారు. దర్శకనిర్మాత గోవర్ధన్.జి. మాట్లాడుతూ, సినిమా పట్ల ఉన్న అభిరుచితో అమెరికాలో ఉద్యోగం వదులుకుని, రఘురాం సహకారంతో ఈ చిత్రాన్ని అమెరికాలోనే తెరకెక్కించానని అన్నారు. కాస్త థ్రిల్లర్ అంశాన్ని జోడించి, చక్కటి లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలిచామని చెప్పారు. నిర్మాత రఘురాం మాట్లాడుతూ, అందరికీ ఈ చిత్రం మంచి బ్రేక్‌నిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. గోవర్ధన్ ఈ చిత్రం కోసం ప్రాణం పెట్టారని హీరోహీరోయిన్లు పేర్కొన్నారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో తనికెళ్ల భరణి, తులసి, జెమిని సురేష్, పల్లవి డోర తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనోజ్‌రెడ్డి, సంగీతం: జితిన్‌రోషన్.

లై జర్నీ చాలా పెద్దది



కొత్తరకమైన కాన్సెప్ట్‌లతో సినిమాలు రావడం లేదని చాలామంది అంటుండటం మనం వింటూనే ఉంటాం. అ..ఆ చిత్రం తర్వాత కొత్తగా చేయాలన్న ఆలోచనతో నేను ఉన్నప్పుడు హను రాఘవపూడి లై సినిమా కథను చెప్పారు. మేమంతా ఏడాది పాటు కష్టపడి చేసిన లై సినిమా జర్నీ చాలా పెద్దది. దీనికి రోజురోజుకీ ప్రేక్షకుల ఆదరణ పెరుగుతుండటం ఆనందంగా ఉంది అని హీరో నితిన్ అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో లై సక్సెస్‌మీట్ జరిగింది. ఈ సందర్భంగా నితిన్ స్పందిస్తూ, యు.ఎస్.లో పాజిటివ్ టాక్ వస్తే..ఇండియాలో తొలిరోజు డివైడ్ టాక్ వచ్చింది. ఆ తర్వాత నెమ్మదిగా ప్రేక్షకుల ఆదరణతో పాటు రెవిన్యూ కూడా బాగా పెరిగింది. కొత్త కాన్సెప్ట్ ప్రేక్షకులకు ఎంతగానో నచ్చింది. అర్జున్ లేకుంటే సినిమా లేదు. సినిమాను ఊహించుకోలేం అని అన్నారు. దర్శకుడు హను రాఘవపూడి మాట్లాడుతూ, అ..ఆ తర్వాత నితిన్ స్థానంలో వేరెవరైనా ఉంటే సేఫ్ గేమ్ ఆడటానికే ప్రయత్నించేవారు. కానీ తను కొత్తగా కనిపించాలని అనుకున్నారు. అదే సమయంలో నేను కలిశాను. ఇకనేను ఈసినిమా కోసం ముందుగా రాసుకున్నది విలన్ పాత్రనే. దానిని అర్జున్ చేయడం వల్లే ఎంతో బలం చేకూరినట్లయింది అని అన్నారు. ఈ సమావేశంలో నిర్మాత రామ్ ఆచంట, నటుడు అర్జున్, హీరోయిన్ మేఘాఆకాష్, సినిమాటోగ్రాఫర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.